S & D

మంగళవారం 2-1-2018

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 282



'ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



నష్టాలతో బోణీ

చివరి గంటలో అమ్మకాలు.. స్టాక్ సూచీల రికార్డ్ హై నేపథ్యంలో లాభాలు - 15లో



రంజీ విజేత విదర్భ

ప్రతిష్టాత్మక టోర్నీ ఫైనల్లో ఢిల్లీపై 9 వికెట్లతో ఘన విజయం - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పాక్‌కు ట్రంప్ షాక్

ఆర్థిక సాయం నిలిపివేస్తున్నట్లు ప్రకటన.. పాక్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపాటు

- మా సాయం తీసుకుంటూ మమ్మల్నే మోసగిస్తారా?
- అమెరికా నేతలను మూర్ఖులనుకుంటున్నారా?
- అబద్ధాలు చెబుతూనే ఉన్నారు
- ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ట్రంప్ ధ్వజం
- ఉగ్రవాదంపై ప్రపంచానికి వాస్తవాలు చెబుతాం: పాక్
- ఇది మోదీ దౌత్యనీతి ఫలితమేనన్న బీజేపీ

11 లో

గత 15 ఏళ్లలో అమెరికా పాక్‌కు ఇచ్చిన ఆర్థిక సాయం

2.1 లక్షల కోట్లు (సుమారుగా)

ఈ ఏడాది ఇవ్వాలనుకున్న ఆర్థికసాయం

14.3 వేల కోట్లు (సుమారుగా)

"గత 15 ఏళ్లుగా అమెరికా పిచ్చిగా పాకిస్తాన్‌కు రూ. లక్షల కోట్ల సాయాన్ని అందించింది. కానీ.. పాక్ మమ్మల్ని మోసం చేసింది. దొంగలెక్కలు, అబద్ధాలు చెప్పింది. పాకిస్తాన్ ఉగ్రవాద స్వర్గధామంగా మారింది. మేమింత సాయం చేస్తున్నా.. అమెరికన్లను చంపాలని ప్రతినిత్యం ప్రయత్నించే ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ఆశ్రయం కల్పిస్తోంది. ఈ పరిస్థితి తక్షణమే మారాలి. – ట్వీటర్‌లో ట్రంప్

శాస్త్ర సాంకేతికాలు.. ప్రాంతీయ భాషలోనే!

సత్యేంద్రనాథ్ బోస్ జయంత్యుత్సవాల్లో మోదీ పిలుపు



"మన యువతలో సైన్స్‌పై ఆసక్తిని, అభిరుచిని పెంచేందుకు సైన్స్ కమ్యూనికేషన్‌ను మరింత విస్తృతపరచాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం భాష అడ్డంకి కారాదు. కొత్త విషయం నేర్చుకునేందుకు భాష వారధిలా మాత్రమే ఉండాలి. 2018లో ప్రతి భారతీయుడు మన పూర్వీకులు కన్న నవభారత స్వప్నాన్ని నెరవేర్చేందుకు ప్రతినబూనాలి.

– ప్రధాని మోదీ

- వివరాలు 11లో

ఒక్కరోజు కిక్కు రూ. 200 కోట్లు



నూతన సంవత్సర వేడుకల్లో పొంగిపొర్లిన మద్యం

- 'గ్రేటర్', శివారు ప్రాంతాల్లోనే రూ. 125 కోట్ల మద్యం స్వాహా
- టీఎస్‌బీసీఎల్ ఏర్పాటయ్యాక తొలిసారి 1,700 కోట్ల విక్రయాలు
- మద్యం తాగి కారు నడుపుతూ చిక్కిన యాంకర్ ప్రదీప్

సాక్షి, హైదరాబాద్

కొత్త సంవత్సర వేడుకల్లో రాష్ట్రవ్యాప్తంగా మద్యం ఏరులైపారింది. మందుబాబులు ఇప్పటివరకు ఎన్నడూ లేనంతగా ఏకంగా రూ.200 కోట్లకుపైగా విలువైన మద్యాన్ని తాగేశారు. ఎక్సైజ్ శాఖ ప్రాథమిక లెక్కల ప్రకారం డిసెంబర్ 31 ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా రూ.207.7 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇక డిసెంబర్ నెలలో మద్యం అమ్మకాలు కూడా రికార్డు స్థాయిలో పెరిగాయి. ఈ ఒక్క నెలలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా రూ.1,700 కోట్లకుపైగా మద్యం విక్రయాలు జరిగాయి. ఇందులో

మిగతా 2వ పేజీలో ▶

నా టేబుల్‌పైనే న్యూక్లియర్ బటన్

కొత్త ఏడాది సందేశంలో అమెరికాకు కిమ్ హెచ్చరిక



"మనం ఇప్పటికే అణ్వస్త్ర రాజ్యంగా అవతరించాం. కానీ భవిష్యత్తు అవసరాల కోసం ఇంకా ఎక్కువ సంఖ్యలో అణు వార్‌హెడ్లను, క్షిపణులను తయారు చేయాలి. న్యూక్లియర్ బటన్ నా టేబుల్‌పైనే ఉంటుంది. అమెరికా దీన్ని గుర్తించాలి. ఇది వాస్తవమే తప్ప బ్లాక్‌మెయిల్ చేయడం కోసం చెబుతున్న మాట కాదు.

– ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్‌ఉన్

- వివరాలు 11లో



'టీఎస్ కాప్' యాప్‌ను ఆవిష్కరిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి. చిత్రంలో అదనపు డీజీపీలు గోపీకృష్ణ, అంజనీకుమార్ తదితరులు

పోలీసు చేతికి వజ్రాయుధం!

54 సర్వీసులతో 'టీఎస్ కాప్' యాప్ ఆవిష్కరణ

- దేశంలోనే తొలిసారిగా ఇంటిగ్రేటెడ్ పోలీస్ యాప్
- ఘటనా స్థలి నుంచే పూర్తిస్థాయిలో దర్యాప్తునకు వీలు
- డయల్ 100 నుంచి నేరస్తుడికి పడిన శిక్ష వరకు వివరాలన్నీ నిక్షిప్తం
- సిబ్బందికి 2,500 ట్యాబ్‌లు సమకూర్చిన పోలీస్ శాఖ
- నేర విచారణ, పోలీసింగ్‌లో కీలకం కాబోతున్న 'టీఎస్ కాప్'

5 లో



రజనీకాంత్ వెబ్‌సైట్ ప్రారంభం

- మరో అడుగు ముందుకేసిన తలైవా
- వెబ్‌సైట్, ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ ప్రారంభం

- వివరాలు 11లో



రూ. 2 వేల దాకా డెబిట్ కార్డు చెల్లింపులపై చార్జీలు నిల్

- వివరాలు 14లో

తెలంగాణ డయాగ్నస్టిక్స్

ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు • ఆరోగ్య శాఖ కొత్త పథకం



- ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభం
- సంక్రాంతిలోపు రాష్ట్రవ్యాప్తంగా సేవలు
- ఆన్‌లైన్‌లో నివేదికలు.. పథకం కోసం రూ. 10 కోట్ల నిధుల విడుదల
- ప్రైవేటు డయాగ్నస్టిక్స్‌కు దీటుగా సేవలు

సాక్షి, హైదరాబాద్

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని ప్రారంభిస్తోంది. వైద్య సేవలు, చికిత్సలో కీలకమైన రోగ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ డయాగ్నస్టిక్స్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. తొలుత ఈ వారంలోనే నగరంలో ప్రయోగాత్మకంగా ఉచిత రోగ నిర్ధారణ పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేసింది. ప్రయోగాత్మక కార్యక్రమంలో వచ్చే ఇబ్బందులను సరి చేసి సంక్రాంతిలోపు పూర్తి స్థాయిలో ఈ సేవలను ప్రారంభించనున్నారు. మొదట పాత జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులు, ఆ తర్వాత కొత్త జిల్లాల కేంద్రాలకు విస్తరిస్తారు. ఆ తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఈ సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులను విడుదల చేసింది. కార్పొరేట్, ప్రైవేట్ డయాగ్నస్టిక్స్‌కు దీటుగా ప్రభుత్వ పరంగా ఈ సేవలను అందించేలా అధునాతన సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) ఆవరణలోని ల్యాబ్‌కు అదనంగా మరో అత్యాధునిక డయాగ్నస్టిక్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న వారు ఎక్కడైనా నివేదికలు తీసుకునేలా ఎప్పటికప్పుడు వీటిని ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు.

రోగనిర్ధారణ పరీక్షలే కీలకం..

వైద్య సేవలలో డయాగ్నస్టిక్స్ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. రోగ నిర్ధారణలో

మిగతా 2వ పేజీలో ▶



మనల్ని కాపీ కొడితే ఊరుకునేది లేదని చెప్పండి సార్!!

ఎయిర్‌పోర్ట్ దాకా..

పీవీ ఎక్స్‌ప్రెస్ వే పొడిగించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం

400

అంచనా వ్యయం (రూ. కోట్లలో)

- ఫ్లై ఓవర్ విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక
- ఎన్‌హెచ్ఏఐకు నిర్మాణ బాధ్యతలు
- మరింత సులువుకానున్న ప్రయాణం



సాక్షి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి


హైదరాబాద్ నగరం నుంచి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సులువుగా రాకపోకలు సాగించేందుకు పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేను పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఫ్లై ఓవర్‌ను ఎయిర్‌పోర్ట్ వరకు విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం మాసబ్‌ట్యాంక్‌లోని సరోజినీదేవి కంటి ఆస్పత్రి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు ఉన్న ఈ ఫ్లై ఓవర్‌ను బెంగళూరు జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే మార్గంతో అనుసంధానం చేయాలని ప్రతిపాదించింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పీవీ ఎక్స్‌ప్రెస్ వేకు అంకురార్పణ జరిగింది. సుమారు రూ.600 కోట్ల వ్యయంతో, 11.06 కిలోమీటర్ల పొడవున నిర్మితమైన ఈ ఫ్లైఓవర్ దేశంలోనే అతి పెద్దది. ఈ వంతెనతో బెంగళూరు జాతీయ రహదారి, ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే వాహనదారులకు కొంత ఊరట కలుగుతోంది. ఈ నేపథ్యంలో ఆరాంఘర్ వద్ద ముగుస్తున్న ఈ ఫ్లై ఓవర్‌ను విమానాశ్రయం వరకు పొడిగిస్తే ప్రయాణం మరింత సులువుగా ఉంటుందనే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న సర్కారు ఆ దిశగా

మిగతా 2వ పేజీలో ▶

తప్పుల పుట్ట.. భూ రికార్డుల చిట్టా

రాష్ట్రంలో 2.4 కోట్ల ఎకరాలకుగాను 74 లక్షల ఎకరాల రికార్డుల్లో తప్పులే

- ఇప్పటిదాకా 66 లక్షల ఎకరాల రికార్డులను సరిచేసిన రెవెన్యూ యంత్రాంగం
- ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే ఏకంగా 8 లక్షల ఎకరాల రికార్డుల్లో తప్పులు
- కామారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో 5 లక్షల ఎకరాల రికార్డుల్లో తప్పులే
- గడువు ముగిసినా ఇంకా 8 జిల్లాల్లో కొనసాగుతున్న ప్రక్రియ



సాక్షి, హైదరాబాద్

ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా 74 లక్షల తప్పులు. ఏళ్ల తరబడి దిద్దుబాటుకు నోచుకోని భూ రికార్డుల్లో ఉన్న లోపాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళనలో వెలుగులోకి వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1.7 కోట్ల సర్వే నంబర్లలో 2.4 కోట్ల ఎకరాల భూ విస్తీర్ణం ఉంటే అందులో దాదాపు మూడో వంతు.. అంటే 74 లక్షల ఎకరాలకు సంబంధించిన రికార్డుల్లో తప్పులు నమోదయ్యాయనే గణాంకాలు ఇన్నాళ్లూ తప్పులతడకగా సాగిన రెవెన్యూ వ్యవహారాలను ఎత్తిపొడుస్తున్నాయి. చిన్నదైనా, పెద్దదైనా తప్పులను సరిచేయకపోవడం, దశాబ్దాల తరబడి ఆ తప్పులు అలాగే కొనసాగడం రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.

లక్షల ఎకరాల రికార్డుల్లో తప్పులు

గత ఏడాది సెప్టెంబర్ 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టింది. ఎప్పుడో నిజాం కాలంలో సరిచేసిన రికార్డులను పూర్తిగా సవరించి రైతులకు

మిగతా 2వ పేజీలో ▶



గవర్నర్ నరసింహన్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం కేసీఆర్

గవర్నర్‌కు సీఎం శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ నరసింహన్‌కు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం సాయంత్రం రాజ్ భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో భేటీ అయ్యా రు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించటంతో పాటు పలు అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాజ్‌భవన్‌లో ఉదయం 11 గంటలకు దర్బార్ హాల్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ వేడుకలకు అధికారులతో పాటు వివిధ రంగాల ప్రముఖులు తరలివచ్చి గవర్నర్ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, కౌన్సిల్ చైర్మన్ స్వామిగౌడ్, సీఎస్ ఎస్పీ సింగ్, డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఇన్‌చార్జి వీవీ శ్రీనివాసరావు, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు సందీప్ శాండిల్య, మహేశ్ భగవత్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలుచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీల వరకు పెరిగాయి. గత 24 గంటల్లో నల్లగొండ, నిజామాబాద్ మినహా మిగిలిన ప్రాంతాల్లో పెరిగాయి. ఖమ్మంలో 4 డిగ్రీలు, భద్రాచలంలో 3 డిగ్రీలు ఎక్కువగా 32 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హన్మకొండ, హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, రామగుండంలలో 1 నుంచి 3 డిగ్రీలు ఎక్కువగా 31 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. ఆదిలాబాద్, హకీంపేట్, నల్లగొండ, నిజామాబాద్‌లలో 29 డిగ్రీల చొప్పున పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలావుంటే పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆదిలాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీలు నమోదుకాగా, మెదక్‌లో 12, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్, రామగుండంలలో 14 డిగ్రీల చొప్పున రికార్డు అయ్యాయి.

నేడు ఆలస్యంగా తెలంగాణ ఎక్స్‌ప్రెస్

సాక్షి, హైదరాబాద్: నాంపల్లి నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్(12723) మంగళవారం(2న) ఆలస్యంగా బయలుదేరనుందని దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఉదయం 6.25కు బదులు మధ్యాహ్నం 1.55కు బయలుదేరుతుందని తెలిపింది. ఢిల్లీ నుంచి నగరానికి రావాల్సిన రైలు మంచు కారణంగా ఆలస్యంగా రానున్న నేపథ్యంలో ఈ జాప్యం చోటుచేసుకుందని వెల్లడించింది.

ఆలస్యంగా స్పైస్ జెట్

శంషాబాద్: ఢిల్లీ విమానాశ్రయంలో పొగమంచు కారణంగా హైదరాబాద్ నుంచి బయలుదేరాల్సిన స్పైస్‌జెట్ విమానం ఐదు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం 5.50కు బయలుదేరాల్సిన ఎస్‌జీ–471 విమానం 11.12కు బయలుదేరినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

గోవాలో తల్లి సోనియాతో రాహుల్ గాంధీ న్యూ ఇయర్ వేడుకలు

పణజీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన తల్లి సోనియాతో కలసి గోవాలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. దక్షిణ గోవాలో మొబొర్ ప్రాంతంలోని ఫైవ్‌స్టార్ హోటల్‌లో సోనియాగాంధీని శనివారం రాహుల్ కలిశారు. వారు ఆ హోటల్‌లోనే న్యూ ఇయర్ వేడుకలను జరుపుకున్నారని పార్టీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. ఇది ఓ ప్రైవేట్ పార్టీ అని.. ఇందులో ఇతరులెవరికి పాల్గొనేందుకు అనుమతి లేదని ఆయన తెలిపారు. వేడుకలకు వారం రోజుల ముందుగానే సోనియా గోవాకు వెళ్లారు.

ఎయిర్‌పోర్ట్ దాకా..

► మొదటి పేజీ తరువాయి

కసరత్తు మొదలు పెట్టింది. వంతెన ముగిసిన తర్వాత వెంటనే గగన్ పహాడ్ ‘వై’జంక్షన్ ఉండటం, శంషాబాద్ పట్టణంలో విపరీతమైన ట్రాఫిక్ పెరిగిన నేపథ్యంలో ఈ ఫ్లై ఓవర్‌ను ఎయిర్‌పోర్టు వరకు కొనసాగిస్తే బాగుంటుందనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఈ మేరకు ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ బాధ్యతను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు అప్పగించింది. సుమారు 10 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ మార్గం డిజైన్‌ను ఎన్‌హెచ్ఏఐ రూపొందిస్తోంది. రూ.400 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్న ఇంజనీరింగ్ విభాగం.. మార్గమధ్యంలో రెండు చోట్ల దిగేలా ర్యాంపులు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం కొన్ని చోట్ల భూ సేకరణ చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

విశ్వసనీయతకు పాతరేసిన పాలనిది

49వ రోజు

01-01-2018, సోమవారం

చిన్నతిప్పసముద్రం, చిత్తూరు జిల్లా



ఈరోజు ఉదయం శిబిరం చెంతకు వచ్చిన వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు. క్రైస్తవ, ముస్లిం మతపెద్దలు కూడా వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేసి దీవెనలు అందించారు. ఈ నూతన సంవత్సరంలో, ప్రజల ప్రతికష్టంలోనూ ఎల్లవేళలా తోడుగా నిలిచే శక్తిని ప్రసాదించమని దేవుణ్ని ప్రార్థిస్తూ శిబిరం నుంచి బయటకు వచ్చాను. ప్రజలు, కార్యకర్తలు, అభిమానుల ఆత్మీయ శుభాకాంక్షలతో.. 2018 సంవత్సరం స్వాగతం పలుకుతున్నట్టనిపించింది.

కొత్త సంవత్సరం మొదటిరోజు పాదయాత్ర రుణమాఫీ బాధిత రైతుల ఆవేదనతో మొదలైంది.

పరదేశిపల్లెకు చెందిన డేగల వెంకటరెడ్డి నాతో మాట్లాడుతూ ‘‘సార్, 2013లో నేను రూ. 50 వేలు, మా తండ్రి రూ. 43 వేలు పంటరుణం తీసుకున్నాం. కానీ మాది పంట రుణం కాదంటూ రుణమాఫీ చెయ్యడం లేదు. బ్యాంకు వారు, వ్యవసాయాధికారులు మాది పంట రుణమేనని, మాఫీకి అర్హులేనని ధ్రువీకరణ పత్రాలు కూడా ఇచ్చారు. రుణమాఫీ కోసం మా వివరాలను బ్యాంకు వారు ఆన్‌లైన్‌లో కూడా పెట్టారు. కానీ రైతు సాధికార సంస్థ, ఇతర అధికారుల దగ్గర మేం అర్హులమేనంటూ ఎంతగా మొరపెట్టుకున్నా స్పందనే లేదు’’ అంటూ ఆక్రోశించాడు. రుణమాఫీ బూటకమని ఎప్పుడో స్పష్టమైపోయింది. వడ్డీలకు కూడా సరిపోని అరకొర మాఫీని కూడా ఎగ్గొట్టడానికి ఈ పాలకులకు కుంటిసాకులు కరువా?

కొంతసేపటికి మదనపల్లి నియోజకవర్గంలో అడుగుపెట్టాను. వేలాది మంది ప్రజలు స్వాగతం పలకడానికి, నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చారు. ఆ భారీ జనసందోహం మధ్య, వారి ప్రేమాభిమానాల నడుమ యాత్ర బాగా ఆలస్యంగా సాగింది. భోజన విరామ సమయం లేకుండానే ముందుకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. బాబుగారి పాలనలో సంవత్సరాలు గడచిపోతున్నా సమస్యలు తీరని అభాగ్యులెందరో దారిద్ర్య రేఖకు దిగువన అలమటిస్తున్నారు. వారిగోడు వినే నాథుడే లేడు. అందుకే, వేలాదిగా తరలి వచ్చి, నాపై అపార నమ్మకంతో తమ సమస్యలు చెప్పుకొంటూ, నా అడుగులో అడుగు వేస్తూ, నాకు అండగా ఉంటున్న వీరి కోసం ఎంత మంచి చేసినా తక్కువే అని నా మనసులో అనుకుంటూ ముందుకు సాగాను.

ఆలంనూర్ బాషా అనే ఆటోడ్రైవర్ ఒకమాట చెప్పాడు. ‘‘అన్నా, మాకు వైఎస్సార్‌గారు ఇచ్చిన ఇళ్లకు వైఎస్ జగన్ కాలనీ అని పేరు పెట్టుకున్నాం. ఆ పేరు పెట్టుకున్నందుకు మాకు మౌలిక సదుపాయాలేవీ కల్పించలేదు’’ అని బాధపడ్డాడు. నామీద కోపంతో పేదవారిపై కక్ష కట్టడం ఎంతవరకు న్యాయం? నాన్నగారి హయాంలో ఎలాంటి వివక్ష చూపలేదు. ఎన్టీఆర్ నగర్ అని, చంద్రబాబు కాలనీ అని పేర్లు పెట్టుకున్నప్పటికీ, పేదరికమే ప్రామాణికంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. అన్ని సంక్షేమ పథకాలు అందించారు. పాలనలో వివక్ష నిజంగా సిగ్గుచేటైన విషయం కాదా?



చిత్తూరు జిల్లా నడింపల్లె వద్ద చిన్నారులను ఎత్తుకుని పలకరిస్తున్న జగన్

చిన్నతిప్పసముద్రంలో చేనేత కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. నేటి పాలకుల నిర్లక్ష్యంతో, మోసపూరిత హామీలతో దగాపడ్డ చేనేతల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఆ సదస్సులో చేనేతల సమస్యలు వింటుంటే మనసుకు చాలా బాధ కలిగింది. చేనేత వృత్తి చాలా పురాతనమైనది. మిల్లు వస్త్రాల వ్యవస్థ రాకముందు భారతీయులందరూ చేనేతపైనే ప్రధానంగా ఆధారపడ్డారు. మన సాంస్కృతిక గొప్పదనాన్ని ప్రతిబింబించే ఈ వృత్తిని నిలబెట్టాలని, ఆ నేతన్నలను కాపాడుకోవాలనే తపన నాకు ప్రగాఢంగా ఉంది. చివరగా ముఖ్యమంత్రిగారికి నాదొక ప్రశ్న. ప్రజలకు సంబంధించిన ఏ సమస్య విషయంలోనూ కనీస మానవత్వంతో స్పందించకపోవడం మీకేమైనా న్యాయంగా అనిపిస్తోందా? చేనేతలకు సంబంధించి మీ ఎన్నికల ప్రణాళికలో ఎన్నో హామీలిచ్చారు. అందులో ఏ ఒక్కటీ అమలు చేయకపోవడం నిజం కాదా? విశ్వసనీయతకు పాతరేసిన మీపాలనలో నేతన్నలకు సమాధానం చెప్పేదెవరు?

వై.యస్. జగన్.

ఒక్కరోజు కిక్కు 200 కోట్లు

► మొదటి పేజీ తరువాయి

పాత హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల వాటాయే 600 కోట్లు దాటడం గమనార్హం.

‘గ్రేటర్’ పరిధిలోనే రూ.125 కోట్లు

నూతన సంవత్సర వేడుకల్లో గ్రేటర్ హైదరాబాద్, శివారు ప్రాంతాల పరిధిలోనే ఏకంగా రూ. 125 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు అంచనా. పాత రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు గ్రేటర్‌లోకి వచ్చే ఇతర జిల్లాల ప్రాంతాల్లో కలిపి ఈ విక్రయాల అంచనా వేశారు. ఇక వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో రూ.20 కోట్లకుపైగా అమ్మకాలు జరిగాయి. ఇక డిసెంబర్ నెల మొత్తంగా చూసినా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు రికార్డు సృష్టించాయి. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్‌బీసీఎల్) ఏర్పాటైన తర్వాత తొలిసారిగా ఒక్క నెలలోనే రూ.1,700 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇందులో పాత రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోనే రూ.602 కోట్ల అమ్మకాలు ఉండటం గమనార్హం.

రాత్రి 2.45 గంటల వరకు మెట్రో జర్నీ

హైదరాబాద్ వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నవారికి సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేందుకు ఆదివారం రాత్రి 2.45 గంటల వరకు మెట్రో రైళ్లను నడిపారు. రోజు మొత్తంగా 1.07 లక్షల మంది మెట్రో ప్రయాణం చేయగా.. అందులో అర్ధరాత్రి దాటిన ప్రయాణించినవారు 6 వేల మందికిపైగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆర్టీసీ కూడా ప్రధాన మార్గాల్లో అర్ధరాత్రి ఒంటిగంట వరకు బస్సులు నడిపింది.



జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 వద్ద యాంకర్ ప్రదీప్‌కు బ్రీత్ అనలైజర్‌తో పరీక్ష చేస్తున్న పోలీసు

భాగ్యనగరంలో ఫుల్ జోష్

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈసారి నూతన సంవత్సర వేడుకలు ‘ఫుల్’జోష్‌తో జరిగాయి. హైదరాబాద్ పరిధిలోని 542 బార్లు, పబ్‌లు, 300 మద్యం దుకాణాలు, 134 ఈవెంట్లలో మద్యం పొంగిపొర్లింది. కొత్త ఏడాది వేడుకల్లో గతసారి రూ. 100 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరగగా.. ఈసారి రూ.125 కోట్లకుపైగా నమోదయ్యాయి. నగరవ్యాప్తంగా సుమారు 7 లక్షల కాటన్ల (ఒక్కో కాటన్‌లో 12 సీసాలు) బీర్లు, మరో ఐదు లక్షల కాటన్ల మేర ఐఎంఎల్ మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి మద్యం ధరలు పెరిగినా కూడా అమ్మకాలు పెరగడం గమనార్హం.

2,499 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

పోలీసులు ఆదివారం రాత్రి హైదరాబాద్ వ్యాప్తంగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 2,499 మంది పట్టుబడ్డారు. టోలిచౌకి పరిధిలో ఉన్న బాపూఘాట్ వద్ద, నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంతంలో జరిగిన తనిఖీల్లో అత్యధికంగా 145 మంది చొప్పున ‘డ్రంకెన్’డ్రైవర్లు చిక్కారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ట్రైడెంట్ ఆస్పత్రి వద్ద ఓ ఫార్చునర్ కారు డ్రైవర్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా.. బ్లడ్ ఆల్కహాల్ కౌంట్ 347 నమోదవడం గమనార్హం. ఇక మద్యం తాగి వాహనం నడుపుతూ చిక్కినవారిలో బుల్లితెర యాంకర్ ప్రదీప్ కూడా ఉన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో అర్ధరాత్రి 2.50 గంటల సమయంలో పోలీసులు ప్రదీప్ కారును ఆపారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా.. బ్లడ్ ఆల్కాహాల్ కంటెంట్ (బీఏసీ) 178గా నమోదైంది. సాధారణంగా 35 బీఏసీ దాటితేనే పరిమితికి మించి మద్యం తాగినట్లు పరిగణిస్తారు. దీంతో పోలీసులు ప్రదీప్ బీఎండబ్ల్యూ కారును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. కాగా మద్యం తాగి వాహనాలు నడిపినవారి నుంచి 1,310 బైక్‌లు, 276 కార్లు, ఇతర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారికి మంగళ–బుధవారాల్లో కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి.. న్యాయ స్థానంలో హాజరుపర్చనున్నారు. సాధారణంగా బీఏసీ స్థాయి 35 నుంచి 150 పాయింట్ల వరకు ఉంటే కేసులు, జరిమానాలతో సరిపెడతారు. 150 పాయింట్లు దాటితే మాత్రం రెండు రోజుల నుంచి 10 రోజుల వరకు జైలుశిక్ష విధించే అవకాశముంది.

డిసెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా మద్యం అమ్మకాలు (రూ.కోట్లలో)

జిల్లా	అమ్మకాలు
రంగారెడ్డి	302
హైదరాబాద్	300
నల్లగొండ	180
కరీంనగర్	170
వరంగల్	160
ఖమ్మం	150
మెదక్	150
మహబూబ్‌నగర్	130
నిజామాబాద్	85
ఆదిలాబాద్	75
మొత్తం	1,702

డిసెంబర్ 31న అమ్మకాలు (రూ.కోట్లలో)

జిల్లా	అమ్మకాలు
రంగారెడ్డి	34.5
హైదరాబాద్	32.2
వరంగల్	23.5
కరీంనగర్	23
నల్లగొండ	20.5
ఖమ్మం	19
మహబూబ్‌నగర్	16
మెదక్	15
నిజామాబాద్	13
ఆదిలాబాద్	11
మొత్తం	207.7

(వివరాలు ఉమ్మడి జిల్లాల వారీగా..)

తెలంగాణ డయాగ్నస్టిక్స్

► మొదటి పేజీ తరువాయి

ఎంత స్పష్టత ఉంటే అంత మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులలో ఇన్‌పేషెంట్లకే ఉచితంగా ఈ సేవలు అందుతున్నాయి. అయితే ఔట్ పేషెంట్లుగా వచ్చే పేద వర్గాలకు ఇది ఇబ్బందిగా ఉంటోంది. బీపీ, మధుమేహం, మూత్ర పరీక్షలకు సైతం ప్రైవేటు డయాగ్నస్టిక్స్ కేంద్రాలకే వెళ్లాల్సి వస్తోంది. రోగ నిర్ధారణకు వైద్యులు సిఫారసు చేసినా డబ్బులు లేక పరీక్షలు చేయించుకోలేని పరిస్థితి ఉంటోంది. దీంతో వారు సరైన చికిత్స తీసుకోలేకపోతున్నారు. ఫలితంగా మరింత అనారోగ్యానికి గురవుతున్నారు. ఇదిలా ఉండగా అధికశాతం ప్రభుత్వ ఆస్పత్రులలో పరికరాలు, సిబ్బంది సరిగాలేక సాధారణ పరీక్షలు సైతం నిర్వహించడంలేదు. ఈ నేపథ్యంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కొత్తగా ప్రారంభిస్తున్న పథకంతో ఈ పరిస్థితులు మారనున్నాయి.

ఔట్ పేషెంట్లకూ ఉచితం..

ఇకపై ఔట్ పేషెంట్లకు కూడా ఉచిత పరీక్షల సేవలు అందిస్తారు. అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలకు అవసరమైన పరికరాలను సిద్ధం చేస్తున్నారు. పరీక్షలకు అవసరమైన సాంకేతిక సిబ్బందిని కూడా నియమిస్తున్నారు. కాగా, ఆయా ఆస్పత్రుల స్థాయి ఆధారంగా ఉచిత రోగ నిర్ధారణ పరీక్షల సేవలను అందించనున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో 39 రకాల సేవలు అందుబాటులో ఉంటాయి. అన్ని స్థాయిల ఆస్పత్రుల్లోనూ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు రక్తం, మూత్ర, మల పరీక్షలకు సంబంధించిన నమూనాలు సేకరిస్తారు. ఆయా ఆస్పత్రుల నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు ఐపీఎంలోని రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రానికి వాటిని చేరుస్తారు. మరుసటి రోజు ఉదయం నమూనాలను పరీక్షించి, మధ్యాహ్నం రెండు గంటలలోపు పరీక్ష నివేదికలను ఆన్‌లైన్‌లో సంబంధిత ఆస్పత్రికి పంపిస్తారు. ఆస్పత్రి నుంచి రోగికి ఆన్‌లైన్‌లో చేరవేస్తారు. అవసరమైతే రోగికి నేరుగా నివేదికలను ఇస్తారు. కాగా, తీవ్రమైన వ్యాధులకు సంబంధించిన పరీక్షలను ఐపీఎంలో నిర్వహించగా, ఇతర సాధారణ పరీక్షలను స్థానికంగా నిర్వహిస్తారు.

వైద్య సేవల్లో మార్పులు

తెలంగాణ డయాగ్నస్టిక్స్‌తో రాష్ట్రంలోని వైద్య సేవలలో ఎన్నో మార్పులు వస్తాయి. వైద్య సేవలలో కీలకమైన రోగ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా అందించేందుకు ఏర్పాట్లు చేశాం. వారంలోనే ప్రయోగాత్మకంగా హైదరాబాద్‌లో ఈ సేవలు మొదలవుతాయి. రెండోవారంలో అధికారికంగా పూర్తి స్థాయిలో సేవలను అందిస్తాం.

– వాకాటి కరుణ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

రైతు సమన్వయ సమితుల జాడెక్కడ?

- ఇంకా పూర్తికాని జిల్లా, రాష్ట్ర సమితులు
- గ్రామ, మండల సమితులతోనే సరి..
- బాధ్యతలు అప్పగించడంలోనూ వైఫల్యం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు సమన్వయ సమితుల ఏర్పాటు ప్రక్రియ అసంపూర్తిగానే నిలిచిపోయింది. ఇప్పటివరకు కేవలం గ్రామ, మండల రైతు సమన్వయ సమితులనే ఏర్పాటు చేసింది. జిల్లా, రాష్ట్ర సమన్వయ సమితుల జాడే లేకుండా పోయింది. వాస్తవంగా గ్రామ, మండల, జిల్లా రైతు సమన్వయ సమితులను గతేడాది సెప్టెంబర్ 9 నాటికి ఏర్పాటు చేయాలని అప్పట్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ కేవలం గ్రామ, మండల రైతు సమన్వయ సమితుల ఏర్పాటు, వాటికి సభ్యుల నియామకమే పూర్తయింది. జిల్లా, రాష్ట్ర సమన్వయ సమితుల ఏర్పాటు ఇప్పటికీ పూర్తికాలేదు. వాటి ఏర్పాటు ప్రక్రియ ఎప్పుడు జరుగుతుందో కూడా వ్యవసాయశాఖ వర్గాలు చెప్పలేకపోతున్నాయి.

రైతులకు అందుబాటులో ఉండాలని...

రైతులకు అన్నివేళలా అందుబాటులో ఉండేలా సమన్వయ సమితులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు ఎకరానికి రూ. 4 వేలు ఇవ్వడంలో సహకరించాలని, విత్తనం వేసే దగ్గరి నుంచి గిట్టుబాటు ధర వరకు సమితులు కీలక పాత్ర పోషించాలన్నది సర్కారు ఆలోచన. ఆ ప్రకారం గ్రామ రైతు సమితిలో 15 మంది, మండల, జిల్లా సమితుల్లో 24 మంది, రాష్ట్రస్థాయిలో 42 మందిని నియమించాలని నిర్ణయించింది. రాష్ట్ర సమితి సభ్యులను సీఎం, మిగిలిన స్థాయి సమితి సభ్యులను మంత్రులు నియమించేలా ఉత్తర్వులిచ్చింది. కానీ ఇప్పటివరకు గ్రామ, మండల సమితుల ఏర్పాటే జరిగింది. జిల్లా సమితులకు సభ్యుల ఎంపికలో సర్కారు తాత్సారం చేస్తోంది.

ఏంచేయాలో అర్థం కాని సభ్యులు...

గ్రామ, మండల సమన్వయ సమితి సభ్యుల నియామకం పూర్తయి 3 నెలలు దాటినా బాధ్యతలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఏం చేయాలో అర్థం కాక సభ్యులు గందరగోళంలో ఉండిపోయారు. ఖరీఫ్‌లో పండిన పత్తి, కంది తదితర పంటలకు సరైన ధర వచ్చేలా కృషి చేయాలని, మార్కెట్‌కు వచ్చే రైతులకు సమితి సభ్యులు సూచనలిచ్చేలా కలెక్టర్లకు వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆ ఆదేశాలు పెద్దగా అమల వలేదు. మరోవైపు సమన్వయ సమితులను కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినా.. దాని ఏర్పాటు ఎప్పుడు జరుగుతుందో స్పష్టత కరువైంది.

తప్పుల పుట్ట.. భూ రికార్డుల చిట్టా

► మొదటి పేజీ తరువాయి

పెట్టుబడి సాయం అందిస్తామంటూ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రక్రియలో మొదటి నుంచీ విస్మయకర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. డిసెంబర్ 31, 2017 నాటికే ఈ ప్రక్షాళన కార్యక్రమం గడువు అధికారికంగా ముగిసినా అక్కడక్కడా ఇంకా జరుగుతూనే ఉంది. అయితే, సోమవారం వరకు అందిన లెక్కల ప్రకారం మొత్తం 74,42,910 ఎకరాల రికార్డుల్లో తప్పులున్నాయని తేలింది. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో అయితే ఈ తప్పులు లక్షల సంఖ్యలో నమోదయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో 9,44,290 ఎకరాల భూ విస్తీర్ణం ఉంటే అది కాస్తా భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత ఏకంగా 13,86,943 ఎకరాలకు పెరిగింది. ఇందులో 8,09,827 ఎకరాల రికార్డుల్లో తప్పులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మేడ్చల్–మల్కాజ్‌గిరి మినహా అన్ని జిల్లాల్లో లక్ష ఎకరాలకు పైగానే తప్పులు కనిపించాయి. ఖమ్మం, కామారెడ్డి జిల్లాల్లో ఇలా నమోదయిన తప్పుల సంఖ్య 5 లక్షలు దాటింది. మంచిర్యాలలో 4.38 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3.46 లక్షల ఎకరాల రికార్డుల్లో తప్పులు నమోదయ్యాయని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ పరిశీలిస్తే అత్యల్పంగా మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా రికార్డుల్లో తప్పులు తక్కువగా ఉన్నాయని తేలింది. ఇక్కడ మొత్తం భూ విస్తీర్ణం 2,63,582 ఎకరాలుంటే, రికార్డుల పరిశీలన తర్వాత అది 2,92,788 ఎకరాలకు చేరగా, అందులో 2,75,171 ఎకరాల రికార్డులు సరిగా ఉన్నాయని తేలింది. అంటే ఆ జిల్లాలో కేవలం 17,617 ఎకరాల రికార్డుల్లోనే తప్పులు తేలాయి. అందులోనూ 10,935 ఎకరాల రికార్డులను సరిచేయగా, ఇంకా 6,681 ఎకరాల రికార్డులను సరిచేయాల్సి ఉంది. ఇలా లక్షల సంఖ్యలో నమోదయిన తప్పుల్లో ఇప్పటివరకు 66,52,986 ఎకరాల విస్తీర్ణంలోని రికార్డులను సరిచేశారు. మరో 28 లక్షల ఎకరాల్లో రికార్డులను సరిచేసే ప్రక్రియలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమై ఉంది.

మరో వారం ఆగితేనే..

వాస్తవానికి, గత ఏడాది డిసెంబర్ 31తోనే భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ముగియాల్సి ఉన్నా ఇప్పటి వరకు 22 జిల్లాల్లోనే ఈ ప్రక్రియ పూర్తయిందని గణాంకాలు చెబుతున్నాయి. సంగారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ రూరల్, పెద్దపల్లి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో కొంత మేర పూర్తి కావాల్సి ఉంది. మిగిలిన అన్ని జిల్లాల్లో పాత సేత్వార్‌లు, ఖాస్రా పహాణీలలో ఉన్న సర్వే నంబర్ల కన్నా ఎక్కువ సర్వే నంబర్లలోనే పరిశీలన పూర్తయింది. ఈ ఎనిమిది జిల్లాల్లోనూ నేడో, రేపో ప్రక్రియ పూర్తి కానుంది. అయితే, తప్పులను సరిచేయడంతో పాటు ఆన్‌లైన్ రికార్డులను కేటగిరీల వారీగా తయారు చేసేందుకు మరో వారంరోజులు పడుతుందని అధికారులంటున్నారు. ఈ వారం ఆగితేనే రాష్ట్రంలోని భూ కమతాలకు సంబంధించిన పక్కా లెక్కలు తేలుతాయని వారంటున్నారు.

పాత జిల్లాల వారీగా తప్పులు సరిచేసిన విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	సరిచేసిన విస్తీర్ణం
నల్లగొండ	8,17,981
మహబూబ్‌నగర్	9,23,493
రంగారెడ్డి	8,11,840
మెదక్	3,07,001
ఖమ్మం	3,12,158
వరంగల్	9,87,145
కరీంనగర్	13,44,424
ఆదిలాబాద్	6,74,974
నిజామాబాద్	5,00,023

S & D


రూ.1,618 కోట్లు ఆదా!

- పౌర సరఫరాల శాఖలో సంస్కరణలతో సత్ఫలితాలు
- కఠిన నిర్ణయాలతోనే...: కమిషనర్ సీవీ ఆనంద్



సాక్షి, హైదరాబాద్: పౌర సరఫరాల శాఖలో చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలిచ్చాయి. కఠిన నిర్ణయాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో 14 నెలల్లో రూ.1,618 కోట్లు ఆదా అయ్యాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వల్ల అక్రమాలు తగ్గాయి. రైస్ మిల్లర్లు, ఎఫ్‌సీఐ, కిరోసిన్ డీలర్ల వద్ద ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలు వసూలయ్యాయి. మిల్లర్ల నుంచి కస్టమ్ మిల్లింగ్‌కు సంబంధించి రూ.575 కోట్ల బకాయిలు రాబట్టగా.. ఈ–పాస్ విధానంతో రూ.479 కోట్లు ఆదా అయ్యాయి. ఆర్థిక విభాగం ఏర్పాటైన తర్వాత ఖాతాలను పునరుద్ధరించుకోవడంతో రూ.75 కోట్ల వడ్డీ భారం తగ్గించగలిగారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, టెక్నికల్ విభాగం ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెంచడంతో మరో రూ.30 కోట్లు ఆదా చేయగలిగారు. ప్రభుత్వ వసతి గృహాలు, మధ్యాహ్న భోజన పథకానికి 1.20 లక్షల టన్నుల సన్న బియ్యం కొనుగోలు కోసం రైస్ మిల్లర్లతో కమిషనర్ చర్చలు జరపడం వల్ల రూ.30.18 కోట్లు, పీడీఎస్ బియ్యం ద్వారా రూ.80 కోట్లు ఆదా అయింది. 2008–09 నుంచి 2014–15 వరకు మిల్లర్ల వద్ద ఉన్న గోనె సంచుల రికవరీతో రూ.84.58 కోట్లు వసూలయ్యాయి. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియామకాలు జరపడంతో రూ.10 కోట్లు.. కమాండ్ కంట్రోల్ సెంటర్, జీపీఎస్, సాంకేతిక విభాగాల ఏర్పాటు, పౌర సరఫరాలపై నిరంతర పర్యవేక్షణతో రూ.25 కోట్లు ఆదా చేయగలిగారు. అలాగే కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.249.72 కోట్ల బకాయిలూ రాబట్టగలిగారు.

పారదర్శకత, జవాబుదారీతనం..



ఆర్థిక నిర్వహణలో లోపాలు, 2011 నుంచి ఖాతాల ఆడిటింగ్ జరగకపోవడం, సిబ్బంది కొరత, జవాబుదారీతనం లేకపోవడం, ఆర్థిక లావాదేవీలను పర్యవేక్షించే సాఫ్ట్‌వేర్ లేకపోవడం సంస్థకు అవరోధంగా నిలిచాయి. ఆర్థిక వ్యవహారాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా లేకపోవడంతో అధికారులు, సిబ్బందిలో భయం లేకుండాపోయింది. అయితే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా శాఖలోని అన్ని విభాగాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించాం. సంస్థకు బకాయిపడిన వారి నుంచి సొమ్ము రాబట్టేందుకు కఠిన నిర్ణయాలు తీసుకున్నాం. 2011 నుంచి పెండింగ్‌లో ఉన్న అకౌంట్లను ఆడిట్ చేయించాం. రోజువారీ లావాదేవీలపై నిఘాకు అకౌంటింగ్ ఏజెన్సీ నియమించాం. ప్రతి లావాదేవీని సంబంధిత సిబ్బంది చూసేందుకు వీలుగా ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టంను రూపొందించాం.
– సీవీ ఆనంద్, పౌర సరఫరాల శాఖ కమిషనర్

13 నుంచి అంతర్జాతీయ పతంగుల పండుగ

సన్నద్ధమవుతున్న పర్యాటక శాఖ



సాక్షి, హైదరాబాద్: మరో అంతర్జాతీయస్థాయి వేడుకకు నగరం సన్నద్ధమవుతోంది. ఈ నెల 13, 14, 15 తేదీల్లో నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ కైట్ ఫెస్టివల్ నిర్వహించేందుకు పర్యాటక శాఖ సన్నద్ధమవుతోంది. సాహిత్య అకాడమీతో కలసి ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతంగా నిర్వహించిన పర్యాటక – భాషా సాంస్కృతిక శాఖలు తాజాగా కైట్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు చేస్తున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నా రు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూడు రోజులపాటు కార్యక్రమాలు ఉంటాయి. రాత్రి సమయంలో నిర్వహించే పతంగుల ఎగురవేత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నది. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వీట్ ఫెస్టివల్, మధ్యాహ్నం 2 గంటలకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. వీటితో పాటు పతంగుల తయారీ, కళాబృందాల నృత్యాలు వంటి కార్యక్రమాలుంటాయి. దేశంలోని వివిధ నగరాల నుండి కైట్ ప్లేయర్స్ వచ్చి పతంగులు ఎగురవేస్తూ సందడి చేయనున్నారు. గతేడాది 16 దేశాల నుంచి 70 మంది వరకు ప్రతినిధులు పాల్గొనగా ఈసారి మరింత ఎక్కువ దేశాల నుంచి 100 మంది ప్రతినిధులను ఆహ్వానించనున్నారు. పతంగుల పండుగను యాదాద్రితోపాటు, వరంగల్‌లోనూ నిర్వహించనున్నారు. నగరంలోని పీపుల్స్‌ప్లాజా, శిల్పారామం, ఆగాఖాన్ అకాడమీ, నెక్లెస్‌రోడ్‌లో పతంగుల ఉత్సవాలు జరగనున్నాయి.

సీఎంకు ఉద్యోగ సంఘాల శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వివిధ ఉద్యోగ సంఘాల నేతలు సోమవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రాభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా కేసీఆర్ వ్యాఖ్యానించారు., సీఎంను కలసిన వారిలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, గ్రూపు–1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షురాలు వి. మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

ఉపాధ్యాయ సంఘాల డైరీల ఆవిష్కరణ

రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయ సంఘాల పాత్ర కీలకం: సీఎం

సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వివిధ ఉపాధ్యాయ సంఘాలు తమ డైరీలు ఆవిష్కరించాయి. సోమవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) డైరీని ఆవిష్కరించారు. రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయ సంఘాల పాత్ర మరువలేనిదని కేసీఆర్ పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, సదానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పీఆర్టీయూ–తెలంగాణ డైరీని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తన నివాసంలో ఆవిష్కరించారు. విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని కోరారు. వచ్చే వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టి, బదిలీలు చేస్తామన్నారు. శాసనమండలి చీఫ్ విప్ సుధాకర్‌రెడ్డి, పీఆర్టీయూ–తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజిరెడ్డి, చెన్నయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓయూలో నిర్వహించేలా ఆదేశాలివ్వండి

- ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలపై హైకోర్టులో పీహెచ్‌డీ విద్యార్థుల పిల్
- ప్రభుత్వ తప్పుడు నివేదికల వల్ల గొప్ప అవకాశం కోల్పోయాం



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక 'ఇండియన్ సైన్స్ కాంగ్రెస్' సమావేశాలను ముందుగా నిర్ణయించిన విధంగా ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)లో నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వడంతోపాటు, ఈ సమావేశాలకు పూర్తి సహాయ సహకారాలు అందించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఈ సమావేశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, నిధులు విడుదల చేయడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇచ్చిందని, దీనివల్ల ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు మరో చోటుకు తరలిపోయాయంటూ పీహెచ్‌డీ విద్యార్థులు కిరణ్‌కుమార్, విజయకుమార్‌లు హైకోర్టులో ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, ఓయూ వీసీ, డీజీపీ, నగర పోలీస్ కమిషనర్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. రూ.50 కోట్లు వెచ్చించి ఓయూలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలకు యూనివర్సిటీ అన్ని ఏర్పాట్లు చేసిందని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ తీరు వల్ల ఆ డబ్బు, శ్రమ, విద్యార్థుల ప్రయోజనాలు అన్నీ బూడిదలో పోసిన పన్నీరు అయ్యాయని పిటిషనర్లు తెలిపారు. ప్రభుత్వ వ్యవహారశైలితో యూనివర్సిటీ ప్రతిష్ట కూడా దెబ్బతిన్నదని వివరించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులపై చర్చించేందుకు గత 70 సంవత్సరాలుగా ప్రతి ఏడాదీ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 3 నుంచి 7 వరకు ఓయూలో జరగాల్సి ఉందన్నారు. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు దాదాపు 13వేల మంది శాస్త్రవేత్తలు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఈ సమావేశాల వల్ల యూనివర్సిటీకి దాదాపు రూ.300 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం ఉండేదని, ప్రభుత్వ తీరు వల్ల ఈ గొప్ప అవకాశం చేజారిపోయిందని పిటిషనర్లు వ్యాజ్యంలో పేర్కొన్నారు.

మేడారంను జాతీయ పండుగగా గుర్తించాలి

కేంద్రాన్ని కోరనున్న రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్: గిరిజన కుంభమేళాగా పేరొందిన మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీ వెళ్లనున్న దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి.. రాష్ట్ర ఎంపీలతో కలసి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరమ్‌ను కలవనున్నారు. కోట్లాది మంది సందర్శించే మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కోరనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ విషయమై అసెంబ్లీలో ఇప్పటికే తీర్మానం చేసినట్లు గుర్తు చేశారు.

నేటి నుంచి బీఎస్ఎన్ఎల్ మెగామేళా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 2 నుంచి 6 వరకు బీఎస్ఎన్ఎల్ మెగామేళా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ టెలికం సర్కిల్ సీజీఎం వి.సుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్, రిటైల్ ఔట్‌లెట్, రోడ్‌షోల్లో ఉచితంగా 3జీ స్మార్ట్ సిమ్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త కనెక్షన్‌దారులకు 351 ఎంబీ డేటా ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బాండ్, ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్లు కూడా బుక్ చేయవచ్చన్నారు.

ఓయూలో రేపటి నుంచి పీజీ తరగతులు

హైదరాబాద్: ఓయూ పరిధిలో బుధవారం (3న) నుంచి పీజీ తరగతులు ప్రారంభంకానున్నాయి. అలాగే మంగళవారం (2న) నుంచి హాస్టళ్లు, మెస్‌లను ప్రారంభించనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 1, 3 పీజీ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 22 నుంచి జరగనున్నట్లు పేర్కొన్నారు. సైన్స్ కాంగ్రెస్ నిర్వహణ బాధ్యతలు మణిపూర్ వర్సిటీ చేపట్టడంతో ఓయూలో సెలవులను రద్దు చేసిన విషయం విదితమే.

'ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆత్మహత్యలు'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే తెలంగాణలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) విమర్శించింది. ఉద్యోగాలు భర్తీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఈ కారణంగానే నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో శ్రీనివాస్‌రెడ్డి అనే నిరుద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.విప్లవ్‌కుమార్, ఎ.విజయ్‌కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో ధ్వజమెత్తారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే సీఎం కేసీఆర్ కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

S & D

సాక్షి
మంగళవారం, జనవరి, 2

రాజకీయ తెరపై రజని

'వస్తానొస్తాన'ంటూ రెండు దశాబ్దాలుగా తన అభిమాన జనసందోహాన్ని ఊరిస్తున్న సూపర్ స్టార్ రజనీకాంత్ ఎట్టకేలకు రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి కొత్త రాజకీయ పార్టీని స్థాపించి తమిళనాడు అసెంబ్లీలోని మొత్తం 234 స్థానాలకూ అభ్యర్థుల్ని బరిలో దించుతామని కూడా చెప్పారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత 2016 డిసెంబర్‌లో కన్నుమూశాక అక్కడి రాజకీయ యవనికపై వరసబెట్టి కొనసాగుతున్న పరిణామాలను గమనిస్తున్నవారికి సమర్థులైన నాయకులొస్తే జనంలో ఆదరణ లభిస్తుందన్న అభిప్రాయం కలగడంలో ఆశ్చర్యం లేదు. ఇప్పటికీ అన్నాడీఎంకే పార్టీయే పాలకపక్షంగా ఉన్నా... సీఎం పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం వెనకే మెజారిటీ ఎమ్మెల్యేలున్నా ఆ ప్రభుత్వం దినదినగండంగానే బతుకీడుస్తోంది. ప్రధాన ప్రతిపక్షం డీఎంకే మాత్రమే రాష్ట్రంలో బలమైన, పటిష్టమైన పార్టీ. అన్నా డీఎంకే దుస్థితి చూస్తూ ఎప్పుడు ఎన్నికలొచ్చినా తమదే అధికారమని ధీమాతో ఉన్న ఆ పార్టీ మొన్నటి ఆర్‌కే నగర్ ఉప ఎన్నికలో డిపాజిట్ కోల్పోయింది. దాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియక అది అయోమయంలో పడింది.

సినిమా అనేది ఒక బలమైన, ప్రభావవంతమైన మాధ్యమం కనుక ఆ రంగంలో మన్ననలందుకునేవారికి సహజంగానే జనాకర్షణ ఉంటుంది. ఎక్కడికెళ్లినా వారిని చూసేందుకు జనం విరగబడతారు. కానీ ఇలాంటివన్నీ రాజకీయ రంగంలో ఆ నటుల అఖండ విజయానికి గ్యారెంటీనివ్వలేవు. వారేం చెబుతున్నారో, ఏం చేస్తున్నారో... వారి పార్టీ ఆశయాలేమిటో, సిద్ధాంతాలేమిటో జనం గమనిస్తారు. తమ రాక వెనకున్న అవసరమేమిటో, అందులోని ఔచిత్యమేమిటో... వర్తమాన రాజకీయాలపైనా, పాలనపైనా తమ అభిప్రాయాలేమిటో ఆ నటులు విస్పష్టంగా వివరించగలగాలి. తమవల్ల మెరుగైన మార్పు సాధ్యమేనన్న అభిప్రాయం కలిగించగలగాలి. అన్నిటికీమించి అప్పటికి పాలకులుగా ఉంటున్నవారిపై జనంలో అసంతృప్తి ఉండాలి. ఒక నిరాశామయ వాతావరణం అప్పటికే అలుముకుని ఉండాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్వర్గీయ ఎన్టీ రామారావు 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించేనాటికి కాంగ్రెస్ అన్నివిధాలా భ్రష్టుపట్టి ఉంది. ఆ పార్టీ పాలనపై జనం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అలాంటి సమయంలో పార్టీని స్థాపించబట్టే ఎన్టీ రామారావు కేవలం తొమ్మిది నెలల వ్యవధిలోనే అధికారంలోకి రాగలిగారు. కానీ అనేకానేక సంక్షేమ పథకాలతో, సమర్థవంతమైన పాలనతో స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి తిరుగులేని జనాదరణను పొందుతున్న సమయంలో 2009 ఎన్నికల ముందు ప్రజారాజ్యం పార్టీ స్థాపించిన మెగాస్టార్ చిరంజీవి చివరికెలా వైఫల్యం మూటగట్టుకున్నారో అందరూ చూశారు.

తమిళనాడులో సినీ ప్రముఖులు రాజకీయ రంగ ప్రవేశం చేయడం కొత్తగాదు. డీఎంకే స్థాపించి ముఖ్యమంత్రిగా ఎదిగిన అన్నాదురై, ఆయన తర్వాత అధికారంలోకొచ్చిన కరుణానిధి సినీ రంగానికి చెందినవారే. అన్నా డీఎంకే పార్టీని స్థాపించిన సినీ హీరో ఎంజీ రామచంద్రన్ పదేళ్లపాటు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజకీయాలపై చెరగని ముద్ర వేశారు. ఆయన ఆశీస్సులతో రాజకీయాల్లోకొచ్చిన జయలలిత సైతం రాణించారు. కానీ శివాజీ గణేశన్, విజయకాంత్, శరత్‌కుమార్‌లాంటివారు విఫలమయ్యారు. పొరుగునున్న కర్ణాటకలో అగ్రశ్రేణి హీరోగా వెలుగొందిన రాజ్‌కుమార్‌పై రాజకీయ రంగప్రవేశం చేయమని ఎన్నో ఒత్తిళ్లు వచ్చినా ఆయన దూరంగానే ఉండిపోయారు. కన్నడ భాషా, సంస్కృతి పరిరక్షణ ఉద్యమాలకే పరిమితమయ్యారు. ఉత్తరాదిలో అమితాబ్‌బచ్చన్ మొదలుకొని అనేకులు రాజకీయ రంగ ప్రవేశం చేసినా వారు ఏదో ఒక జాతీయ పార్టీనో, ప్రాంతీయ పార్టీనో ఆశ్రయించి ఎన్నికల్లో గెలుపొందారు తప్ప సొంతంగా పార్టీ పెట్టే సాహసం చేయలేదు.

వర్తమాన తమిళనాడులో రాజకీయ శూన్యత అలుముకున్నదని, మొన్నటి ఆర్‌కే నగర్ ఉప ఎన్నిక ఫలితం దీనినే ప్రతిబింబిస్తున్నదని భావిస్తున్నవారు రజనీకాంత్ ఆగమనానికి ఇదే సరైన సమయమని విశ్వసిస్తున్నారు. బహుశా రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించిన రజనీకాంత్‌కు కూడా అలాంటి అభిప్రాయమే ఉండొచ్చు. అయితే రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఉండటం నిజమైనా... దానికదే రజనీకాంత్‌నైనా, మరెవరినైనా అందలం ఎక్కించలేదు. అందులోనూ తమిళనాడు మిగిలిన రాష్ట్రాల్లాంటిది కాదు. స్వాతంత్య్రానికి ముందే అక్కడ వేళ్లూనుకున్న ద్రవిడ ఉద్యమం సామాజిక, సాంస్కృతిక రంగాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. ఆ రంగాల్లో ఆ ఉద్యమం సాధించిన ఘన విజయాలను సుస్థిరం చేసుకునేందుకు తొలుత డీకే, తర్వాత డీఎంకే ఆవిర్భవించాయి. అన్నాదురై, కరుణానిధి చలనచిత్ర రంగ దిగ్గజాలు కావొచ్చుగానీ రాజకీయరంగంలో వారి విజయానికి మూలాలు ద్రవిడ ఉద్యమంలో ఉన్నాయి. అలాంటి గడ్డపై తన రాజకీయ రంగ ప్రవేశం గురించిన ప్రకటనలో రజనీకాంత్ భగవద్గీత శ్లోకాన్ని పఠించారు. నీతి, నిజాయితీలున్న, మతసామరస్యంతో కూడిన 'ఆధ్యాత్మిక రాజకీయాలను' ప్రజల వద్దకు తీసుకెళ్తానన్నారు. ఇవి బీజేపీ అనుకూలతను ధ్వనిస్తున్నాయని కొందరు భాష్యం చెబుతున్నా... మొత్తం అన్ని సీట్లకూ పోటీ చేస్తాననడం ద్వారా ఎవరితోనూ పొత్తు ఉండబోదన్న అభిప్రాయం కలిగించేందుకు రజని ప్రయత్నించారు. వాటి సంగతలా ఉంచి మాటల్లోనూ, ఆచరణలోనూ స్పష్టత, నిజాయితీ ఉంటేనే ప్రజలు ఆదరిస్తారు. మరో మూడేళ్ల వ్యవధి ఉంది కదా అని మౌనంగా ఉండక అన్ని అంశాల్లోనూ తానేమిటో, తన వైఖరేమిటో తేటతెల్లం చేసినప్పుడే... వాటికి అనుగుణమైన ఆచరణ ఉన్నప్పుడే రజనీకాంత్ ప్రజలకు చేరువ కాగలరు. రాజకీయాల్లో అస్పష్టతకూ, ఊగిసలాటకూ, లాలూచీలకూ, ప్యాకేజీలకూ తావుండదు. అలా చూస్తే రాగల మూడేళ్లకాలం రజనీకాంత్‌కు పరీక్షా కాలమే. అందులో నెగ్గి రాజకీయరంగంలో సైతం సూపర్‌స్టార్‌నని ఆయన నిరూపించుకోగలరో లేదో వేచిచూడాలి.



నాయకత్వం అంటే ప్రభావం చూపడం. రాజకీయ రంగంలో దీని విలువను మరి దేనితోనూ కొలవలేం.


– జాన్ సి మాక్స్‌వెల్
అమెరికన్ రచయిత, వక్త

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి పౌర్ణమి ఉ.9.02 వరకు, తదుపరి బ.పాడ్యమి, నక్షత్రం ఆరుద్ర ప.1.34 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం రా.12.43 నుంచి 2.14 వరకు దుర్ముహూర్తం ఉ.8.44 నుంచి 9.28 వరకు, తదుపరి రా.10.44 నుంచి 11.36 వరకు, అమృతఘడియలు తె.4.13 నుంచి 5.44 వరకు (తెల్లవారితే బుధవారం).


సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం : 5.33
రాహుకాలం : ప 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

నమాజ్ వేళలు



ఫజర్	5.29	మగ్రీబ్	5.54
జొహర్	12.20	ఇషా	7.11
అసర్	4.18		

రాజ్యాంగాన్ని కాల'రాస్తారు!'



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

రాజ్యాంగాన్ని బీజేపీ విధానాలకు అనుగుణంగా, తొల్లింటి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మార్చే ప్రయత్నం వాజ్‌పేయి కాలంలోనే ఒకసారి జరిగిందన్న సంగతినీ విస్మరించలేం. సోలీ సొరాబ్జీ కేంద్ర ప్రభుత్వ అటార్నీ జనరల్‌గా ఉండగానే రాజ్యాంగంలోని 'సెక్యులర్, సోషలిస్ట్' పదాలను తొలగించాలన్న ప్రతిపాదన వచ్చింది. అప్పటికి పార్లమెంటులో బీజేపీకి ఇప్పుడున్నంత 'మూక కొలువు' లేనందున చొరవ చేయలేదు. కానీ నేడు అదుపు చేసుకోలేనంత మంది బలం (కాంగ్రెస్ తప్పిదాల ఫలితంగా) లోక్‌సభలో ఉంది.

'రాజ్యాంగాన్ని మార్చడం కోసమే మేము (భారతీయ జనతా పార్టీ) అధికారంలోకి వచ్చాం. ఎందుకంటే, తాము సెక్యులరిస్టులమనీ, అభ్యుదయ వాదులమనీ ప్రగల్భించే వారికి తమ ఉనికినీ, వ్యక్తిత్వాన్నీ చాటుకునేటట్టు చేయగల తల్లిదండ్రులు గానీ, రక్త సంబంధం ఉన్నవాళ్లు గానీ ఉండరు. తల్లీ తండ్రీ ఉన్న రక్త సంబంధీకులకు మాత్రమే ఆత్మ గౌరవం ఉంటుంది!'

– *కేంద్రమంత్రి అనంత్‌కుమార్ హెగ్డే (కర్ణాటకలో 24–12–17న జరిగిన సభలో అన్నమాట)*

'డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో సెక్యులర్ అనే పదాన్నే చేర్చలేదు.'

– *సుబ్రహ్మణ్యంస్వామి (బీజేపీ నాయకుడు)*

నరేంద్ర మోదీ శ్రీకృష్ణుని అవతారమే. 2019 లోక్‌సభ ఎన్నికలు అవగానే రాబోయే పదేళ్లకు పైగా మోదీయే దేశాన్ని ఏలుతారు. మాకు ఆవులంటే గౌరవం, ప్రేమ.'

– *జ్ఞాన్‌దేవ్ అహూజా (రాజస్తాన్ బీజేపీ ఎమ్మెల్యే)*

రెండో మాట



అశేష త్యాగాలతో భారతీయులు సాధించుకున్న రాజకీయ స్వాతంత్య్రాన్ని న్యూన పరచడం, అనేక అవాంతరాల మధ్య డాక్టర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని మార్చడం కోసమే అధికార పగ్గాలు చేపట్టామని సాక్షాత్తు అధికార పార్టీ బాహాటంగా ప్రకటించడం రానున్న గడ్డురోజులకు సంకేతాలే. రహస్యంగా తీసుకునే నిర్ణయాలకు అధికార ముద్ర వేయించుకునేందుకు ముందుగా టమ్రీలు వదలడం కమలనాథులకు కూసువిద్యే. ఈ క్రమంలోనే రాజ్యాంగాన్ని, దాని విస్పష్ట లక్ష్యం ప్రకటన (ప్రియాంబిల్)ను మార్చివేయడమే తమ లక్ష్యమని ఆ పార్టీ నాయకులు ఉపన్యాసాలలో గతం నుంచి చెబుతున్నారు. ప్రకటనలు ఇస్తున్నారు. ఇది గణతంత్ర వ్యవస్థా సంకల్పానికి పూర్తి విరుద్ధం.

మూకబలంతో విజృంభణ

ఇప్పుడు లోక్‌సభలో బలాన్ని చూసుకుని మరింత తెగువతో ఆ పార్టీ సభ్యులు నిజరూపాలను ప్రదర్శిస్తున్నారు. ఏ సంశయం పీడిస్తున్నదో తెలియదు గానీ; ఈ ఉన్మాదపూరిత ప్రకటనలను ప్రధాని స్థాయిలో ఉన్న నరేంద్ర మోదీ గానీ, అధికార పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా గానీ ఖండించకపోవడం మరీ విచిత్రం. మోదీతో సహా, ద్వితీయ తృతీయ స్థానాలలో ఉన్న అరుణ్ జైట్లీ వంటి నేతలు కూడా ఇలాంటి ప్రకటనలను అటు పార్లమెంటులోగానీ, ఇటు మరొక వేదిక మీద గానీ నిరాకరించే ప్రయత్నం చేయలేదు. అందుకే బీజేపీ రహస్య ఎజెండా నిజమేనని ప్రజలు భావించవలసిన పరిస్థితి ఏర్పడింది.

అసలు కాంగ్రెస్ పార్టీయే అంబేడ్కర్‌ను అవమానిస్తున్నదని కొందరు బీజేపీ నేతలు, మంత్రులు ఎదురుదాడికి దిగుతున్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తున్న నాయకుడు మోదీయేనని ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి ధోరణిని ప్రజలు గమనిస్తున్నారు. మరికొందరైతే, డాక్టర్ అంబేడ్కర్ అంటే తమకు ఎంతో గౌరవమని చెప్పుకుంటూనే అనంత్‌కుమార్ హెగ్డే ప్రకటనను ప్రతిపక్ష నేతలు వక్రీకరించారని అబద్ధం ఆడేశారు కూడా. మహా భారత యుద్ధ కాండలో శకుని పాత్ర గురించి తెలిసినదే. ఇప్పుడు అభినవ శకుని పాత్రను నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యంస్వామి రాజ్యాంగంలో సెక్యులర్ అనే పదాన్ని అంబేడ్కర్ ప్రయోగించలేదని కోతకోశారు.

దీనికేమంటారు?

కానీ, ఒకసారి విఖ్యాత భారతీయాంగ్ల రచయిత ముల్క్‌రాజ్ ఆనంద్, డాక్టర్ అంబేడ్కర్ మధ్య జరిగిన చర్చలో (కఫే పరేడ్, కొలాబా బొంబాయి, మే, 1950) రాజ్యాంగం గురించి ప్రస్తావన వచ్చింది. అప్పుడే, 'రాజ్యాంగ నిర్ణయ సభ సభ్యునిగా వ్యక్తి స్వేచ్ఛ హక్కు గురించి మీరు పట్టుదలతో వాదించగలరా? పౌరుడి ప్రాథమిక హక్కులను మీ కమిటీ గుర్తించింది, వ్యక్తి స్వేచ్ఛ హక్కును గుర్తించింది. కానీ మీరు ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుగా ఆమోదించారు గదా! ఈ ఆస్తిహక్కు అనేది– సంపదను వారసత్వంగా అనుభవించే వారు పరిస్థితులను అనుకూలంగా మార్చుకోరా మరి! అలాంటప్పుడు పేదలు, దళితులు, అస్పృశ్యులు నిరంతరం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనవలసిందే కదా!' అని ముల్క్‌రాజ్ అడిగారు. దీనికి స్పందిస్తూ అంబేడ్కర్, 'అందుకే కదా, రాజ్యాంగ ముసాయిదా రచనా సంఘం రాజ్యాంగంలో సెక్యులర్, సోషలిస్ట్, ప్రజాస్వామ్య వ్యవస్థను ఆదర్శంగా ముందుకు నెట్టవలసి వచ్చింది' అని అన్నారు. అప్పుడే మరొక అంశాన్ని కూడా అంబేడ్కర్ స్పష్టం చేశారు– 'ప్రభుత్వ కాల్దారీ హక్కుల ప్రకారం భూమిని దున్నుకుని బతికే హక్కు ప్రతివారికి దక్కే పక్షంలో సమానత్వం సాధ్యమవుతుంది. అప్పుడు దోపిడీకి అవకాశం ఉండదు. ఇప్పటివరకు అస్పృశ్యులైన దళితులకు, చివరికి హిందువులలోని, ముస్లింలలోని పెక్కు వర్గాలకు కౌలు హక్కులు లేవు. కనుక భూమి లేని రైతులు ఉత్తి చేతులతోనే మిగిలిపోయారు'. ఇందుకు ముల్క్‌రాజ్ ప్రత్యుత్తరం ఇది– 'అయినప్పుడు పని చేసుకు బతికే హక్కును రాజ్యాంగంలో పౌరుని ప్రాథమిక హక్కుగా గుర్తించి ఉండాల్సింది గదా!' అంబేడ్కర్ ఈ మాటకు స్పందిస్తూ, 'ముసాయిదా రచనా సంఘం సభ్యులలో నేను ఒకడిని మాత్రమే గదా!' అన్నారు. అప్పుడు ముల్క్‌రాజ్, 'అయితే సింహం ముందు గొర్రెపిల్లయిపోయారా!' అని ప్రశ్నించారు. దానికి అంబేడ్కర్ 'అప్పటికీ నేను చేయగలిగినంత చేశాను. రాయితీలు గుంజగలిగాను. నేనిప్పుడు గర్జిస్తున్నాను' అన్నారు. యువతరాలు పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లాలి, అప్పుడు ఈ ముసాయిదా రాజ్యాంగాన్ని వారు తమకు అనుకూలంగా మార్చుకోగలుగుతారని కూడా ఆయన చెప్పారు. ఆఖరిమాటగా ముల్క్‌రాజ్, 'కానీ, 1789 విప్లవం లాగా పెను తిరుగుబాటు రాకుండా మీరనుకుంటున్న పరివర్తన సాధ్యపడకపోవచ్చు' అన్నారు. దీని మీదే అంబేడ్కర్ ఒక చెణుకు విసిరారు, 'ఆనంద్‌గారూ! ఈ మాట (విప్లవం) మీ నోటి నుంచి వినడం ఆశ్చర్యంగా ఉంది! మీ నవలలో గాంధీజీని అస్పృశ్యుల (దళితుల) విమోచన ప్రదాతగా చిత్రించి మీరు అహింసావాదిగా మారిపోయారు కదా!' అని.

కాషాయీకరణ దిశగా..

అంబేడ్కర్, ముల్క్‌రాజ్‌ల విషయం అలా ఉంచితే, రాజ్యాంగాన్ని బీజేపీ విధానాలకు అనుగుణంగా, తొల్లింటి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మార్చే ప్రయత్నం వాజ్‌పేయి కాలంలోనే ఒకసారి జరిగిందన్న సంగతినీ విస్మరించలేం. సోలీ సొరాబ్జీ కేంద్ర ప్రభుత్వ అటార్నీ జనరల్‌గా ఉండగానే రాజ్యాంగంలోని 'సెక్యులర్, సోషలిస్ట్' పదాలను తొలగించాలన్న ప్రతిపాదన వచ్చింది. అప్పటికి పార్లమెంటులో బీజేపీకి ఇప్పుడున్నంత 'మూక కొలువు' (బ్రూట్ మెజారిటీ) లేనందున చొరవ చేయలేదు. కానీ నేడు అదుపు చేసుకోలేనంత మంది బలం (కాంగ్రెస్ తప్పిదాల ఫలితంగా) లోక్‌సభలో ఉంది. కాబట్టి 'రాజ్యాంగాన్ని తారుమారు చేయడానికే బీజేపీ అధికారంలోకి వచ్చింద'ని కొందరు ఎంపీలు, మంత్రులు ప్రకటించగలుగుతున్నారు.

వక్రీకరణల రాజ్యం

ఈ ప్రకటనలు బాహాటంగా వెలువడకముందే పౌరుల వాక్, సభా స్వాతంత్ర్యాలకు, అభిప్రాయ వ్యక్తీకరణకు, న్యాయ వ్యవస్థ భాష్య స్వేచ్ఛకు, సమావేశ స్వేచ్ఛకు, సెమినార్‌లు, చలనచిత్ర నిర్మాణాలపైన, కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘాల ఎన్నికలు, విద్వద్గోష్టుల స్వేచ్ఛపైన– గత మూడేళ్లుగా పాలక 'డేగకళ్లు' పహారా కాస్తూనే ఉన్నాయి. ఆ యజ్ఞంలో ప్రజా విశ్వాసం చూరగొన్న హేతువాద శక్తులను, వారి నాయకులను రహస్యంగా హతమారుస్తూ వారి హత్యాకాండ జరిగిన చోట హంతకుల్ని వెతికి పట్టుకోకుండా మరెక్కడో వెతికి, 'ఎవరూ దొరక్కపోతే పాత కేడీనే పట్టుకురమ్మన్న' పోలీసు కేసుల్లాగా విచారణ తంతులు ముగిస్తున్నారు. రాజ్యాంగ నిబంధనలకు, అది రూపొందించిన కొన్ని చట్టాలకు కూడా విరుద్ధంగానూ, ప్రభుత్వమూ, పౌరులూ విధిగా పాటించాలని నిర్దేశిస్తున్న 'బాధ్యతల అధ్యాయాన్ని' పాలకులు అటకెక్కించారు. చివరికి 'శాస్త్రీయ దృక్పథాన్ని పౌరులలో పెంచి', మూఢ విశ్వాసాల నుంచి దూరం చేసి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాలన్న లిఖితపూర్వక ఆదేశాన్ని బీజేపీ పాలకులు మరింతగా చిత్తుకాగితం స్థాయికి దిగజారుస్తున్నారు. కేంద్ర, విద్యా, సాంస్కృతిక, శాస్త్ర, చారిత్రక పరిశోధనా సంస్థలన్నిటిలోనూ ఆధునిక పరిశోధనల స్థానంలో 'ధాత నామ సంవత్సరం' నాటి ఆలోచనలతో 'పరిశోధన'లు జరిపే ప్రక్రియకు అంకురార్పణలు చేస్తున్నారు. నిజానికి వీటన్నిటికీ కాంగ్రెస్ హయాంలోనే తూట్లు పడినాయి. యజ్ఞ, యాగ, యోగాదులన్నింటినీ 'నవీన విశ్వవిద్యాలయాల్లో పురాణ కవిత్వం' లాగా, మానసిక, శారీరక, విజ్ఞానశాస్త్ర వ్యాయామ కళలను పెంపొందించకుండా ప్రస్తుత నేతలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆధునిక శస్త్ర చికిత్సలకు ప్రాధాన్యమివ్వవలసిన చోట వినాయకుడికి జరిగిన 'సర్జరీయే' నేడు మనం చూస్తున్న తొండం అమరిక అని చెప్పే పాలకులున్న చోట వైజ్ఞానిక దృష్టి వర్ధిల్లదు. చరిత్ర పాఠాలు కూలంకషంగా మార్చి, వాస్తవ ఘటనలను మభ్యపెట్టే యత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మతాతీత లౌకిక వ్యవస్థకు, సర్వమత, సర్వ ధర్మ సమన్వయ భారతీయ వ్యవస్థకు భిన్నంగా– ముక్కూ ముఖం లేని 'హిందూత్వ' నిర్వచనంలో సుందర భారతాన్ని ఇమడ్చడం సంకుచిత రాజకీయం.

ఆ వాస్తవాన్ని గుర్తించాలి

మనది 'సింధు' నాగరికత. రాజ్య విస్తరణ కోసం పర్షియన్లు (పారశీకులు) సింధులోయలో ప్రవేశించినప్పుడు వారికి 'హ'కారం తప్ప 'స'కారం పలకదు కాబట్టి, 'సింధు'ను 'హిందు'గా మార్చుకున్నారు. ఈ సత్యాన్ని మహా పండిత రాహుల్ సాంకృత్యాయన్ ఎనభై ఏళ్ల క్రితమే చెప్పారు. ఆమాటకొస్తే కంచి కామకోటి జగద్గురు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ శంకరాచార్య 'జగద్గురు బోధలు' గ్రంథంలో 'హిందూ' పుట్టు పూర్వోత్తరాలను వివరిస్తూ చెప్పిన మాటలు వినండి: 'మన మతాన్ని హిందూ మతం అనడం సరికాదు. సింధు నదీతీరంలో ఉన్నవారి మతానికి పాశ్చాత్యులు పెట్టిన పేరు హిందూ మతం. అందుచే మన మతానికి చారిత్రకంగా ఒక ప్రవక్తో, మూల గురువో లేడు' ('వేదవ్యాసులు; ఆదిశంకరులు; జగద్గురు బోధలు': పరిశోధకులు శతావధాని వేలూరి శివరామశాస్త్రి: 1967, పే. 101). కాగా, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం అయితే 'సింధుమతం' అని రావాలిగానీ దాని అపభ్రంశమైన 'హిందు మతం'గా రాకూడదు. చివరికది ఆరెస్సెస్–బీజేపీ ప్రయోజనాల కోసం 'హిందూత్వ'గా మారి భారత ప్రజల సమైక్య ఉమ్మడి వారసత్వ మనుగడకు ప్రమాదకర నినాదంగా మారడం బాధాకరం!

abkprasad2006@yahoo.co.in

డిపాజిట్లపైనా అపోహాలేనా?

డిపాజిట్‌దారుల నగదులో రూ. లక్షకు మాత్రమే బీమా చేయాలన్న నిర్ణయం కూడా బీజేపీ లేదా నరేంద్ర మోదీ ప్రభుత్వ చర్య కాదు. 1993లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం. దీనికి కూడా మోదీపైన బురద చల్లటం ఏమిటి?

అభిప్రాయం



పురిఘళ్ల రఘురాం

వరదలో కొట్టుకుపోతున్నప్పుడు తెడ్డు దొరికినా చాలనిపిస్తుంది. దాన్ని వాడుకుని ఎలాగైనా బయటపడాలనిపిస్తుంది. ఏ చిన్న అవకాశం దొరికినా ప్రమాదం నుంచి గట్టెక్కాలనే ఆతృత సహజం. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పరిస్థితి కూడా అలాగే ఉంది. నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ ఏదో ఒక తప్పును పట్టాలని, దాన్ని అడ్డం పెట్టుకుని బతకాలని ఆ పార్టీ తాపత్రయపడుతోంది.

భారీ మెజార్టీతో ఎన్నికల్లో ప్రజామోదం పొంది, నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎదురుచూపులు మొదలయ్యాయి. పెద్ద నోట్ల రద్దు వంటి సాహసోపేతమైన చారిత్రక చర్య దగ్గర్నుంచి, సరిహద్దు వెంబడి మెరుపుదాడుల వంటి సున్నితమైన చర్యల వరకు ప్రతిదాన్నీ వివాదాస్పదం చేయాలని, ప్రజల్లో అపోహలు సృష్టించి లబ్ధి పొందాలని చూసింది.

ప్రభుత్వం చేసే ప్రతి పనినీ అభినందించాలని, ఆమోదించాలని ఎవ్వరూ కోరుకోరు. కానీ, ప్రభుత్వం చేసే మంచి పనుల్ని కూడా చెడ్డగా చిత్రీకరించే ప్రతిపక్షాలు ఉండటం మాత్రం సరికాదు. నల్లధనం అదుపు చేసే క్రమంలో వ్యక్తిగత బంగారంపై పకడ్బందీ నిబంధనల్ని ప్రభుత్వం రూపొందిస్తే.. మహిళల బంగారాన్ని ప్రభుత్వం జప్తు చేస్తుందని పుకార్లు పుట్టించటం ఎంతవరకు సమంజసం? దేశంలో బ్యాంకింగ్ రంగాన్ని పటిష్టం చేసేందుకు చట్టం తీసుకురావాలని పార్లమెంటు ముందుకు వస్తే.. బ్యాంకుల్లో ప్రజలు దాచుకునే సొమ్మును వాడేసుకుంటారంటూ వదంతులు ప్రచారం చేయటం ఎంతవరకు సబబు?

వ్యక్తిగత బంగారం విషయానికొస్తే.. పెళ్లైన మహిళ అరకిలో బంగారం తన వద్ద ఉంచుకోవచ్చు. వారసత్వంగా వచ్చినదైతే ఎంతైనా అట్టిపెట్టుకోవచ్చు. వారసత్వంగా వచ్చిన బంగారాన్ని పక్కనబెడితే దేశంలో సామాన్య మహిళలు ఎంతమందికి అరకిలో బంగారం ఉంటుంది? అక్రమంగా ఆస్తులు కూడబెట్టే వాళ్లని పట్టుకునేందుకు ఉద్దేశించిన ఇలాంటి చర్యలను కూడా ప్రతిపక్షాలు దుష్ప్రచారానికి వాడుకున్నాయి. ఇప్పుడు బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు, వాటిలో దాచుకున్న నగదు విషయానికొద్దాం. ప్రతిపక్షాల పుణ్యమా అని చాలామంది ఈ అపోహల్ని నమ్మి బ్యాంకుల ఎదుట బారులుతీరి మరీ తమ నగదును వెనక్కు తీసుకున్నారని వార్తలు వచ్చాయి. అంటే కొంతవరకూ ప్రతిపక్షాలు విజయవంతమైనట్లే.

ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లులోని 'బెయిల్ ఇన్' అనే అంశం పైనే ప్రతిపక్షాలు ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. బ్యాంకుల్లో ప్రజలు దాచుకునే నగదులో రూ. లక్షకు మాత్రమే ప్రభుత్వం బీమా చేస్తుంది. ఆపై నగదుకు బీమా సదుపాయం ఉండదు. అంటే.. ఒకవేళ బ్యాంకు దివాళా తీస్తే.. రూ. లక్ష లోపు ఉన్న డిపాజిట్‌దారులందరికీ నగదు సర్దుబాటు చేసి, ఆ తర్వాత రూ. లక్షపైన మొత్తాలకు నగదును సమకూరుస్తారు. అయితే, ఈ అంశాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం కొత్తగా చేర్చలేదు. 1961లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ చట్టం చేసింది. డిపాజిట్‌దారుల నగదులో రూ. లక్షకు మాత్రమే బీమా చేయాలన్న నిర్ణయం కూడా బీజేపీ లేదా మోదీ ప్రభుత్వ చర్య కాదు. 1993లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం. దీనికి మోదీపైన బురద చల్లటం ఏమిటి? ఈ బిల్లు ప్రధాన ఉద్దేశ్యం దేశంలో బ్యాంకింగ్ రంగాన్ని మరింత బలోపేతం చేయటమే తప్ప నీరుగార్చటం కాదు. దీనికీ డిపాజిటర్ల డబ్బులకు, మరీ ముఖ్యంగా రూ. లక్ష నగదుపై బీమాకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదు.



రూ. లక్ష నగదుపైన బీమా నిమిత్తం దేశంలోని 21 ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ. 3వేల కోట్ల ప్రీమియం చెల్లిస్తున్నాయి. అసలు 1961లో చట్టం అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఒక్క ప్రభుత్వ రంగ బ్యాంకు కూడా దివాళా తీయటం కానీ, ఈ చట్టాన్ని ఉపయోగించటం కానీ జరగలేదు. అలాంటిది.. కోడిగుడ్డుకు, బోడిగుండుకు ముడిపెట్టినట్లుగా కాంగ్రెస్ హయాంలో బ్యాంకులకు టోపీ పెట్టిన మోసగాళ్ల నేరాలకు, రూపాయి.. రూపాయి కూడబెట్టుకునే సామాన్య ప్రజల డిపాజిట్లకు ముడిపెట్టి, అపోహలు సృష్టించి, ప్రజల మనోభావాలతో చెలగాటం ఆడటం క్షమించరాని నేరం కాదా?

కాంగ్రెస్ పార్టీ ఇలా ఎన్ని అపవాదుల్ని సృష్టించినా, అపోహల్ని ప్రచారం చేసినా, అమాయకుల్ని చేసి ప్రజల్ని రెచ్చగొట్టినా.. నిజం నిలకడమీద తెలుసుకుని నరేంద్ర మోదీ చర్యల్ని సమర్థిస్తోంది ఈ దేశం. నిజాయితీగా దేశం కోసం మోదీ పడుతున్న కష్టాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు కాబట్టే కాంగ్రెస్ పార్టీ కుతంత్రాలను తిప్పికొట్టి, బీజేపీకి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. కొత్త సంవత్సరంలో, కొత్త అధ్యక్షుడి నాయకత్వంలోనైనా కాంగ్రెస్ పార్టీ బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తుందని ఆశిద్దాం.


వ్యాసకర్త బీజేపీ సమన్వయకర్త, ఢిల్లీ
ఈ–మెయిల్ : raghuram.delhi@gmail.com

సవరణ : సోమవారం (01–01–2018) నాటి సాక్షి సాహిత్య పేజీలో 'అదో ప్రపంచం' శీర్షికన వచ్చిన కార్టూన్ వ్యాఖ్య పలువురి మనోభావాలను గాయపర్చినందుకు చింతిస్తున్నాం. ఇక నుంచి ఇటువంటిది జరగకుండా జాగ్రత్త వహిస్తాం.
– ఎడిటర్

ఆలయాలలో సంబరాలా?

కొత్త సంవత్సరం సందర్భంగా ఆలయాల్లోకి అర్ధరాత్రి భక్తులను అనుమతించడంపై నిషేధాన్ని న్యాయస్థానాలు సమ్మతించకపోవచ్చు.. కానీ, మన పూజా స్థలాలను మన కష్టాలు తెలుపుకునే చోటుగా మాత్రమే ఉంచాలి.

విశ్లేషణ



మహేశ్ విజాపుర్కర్

నూతన సంవత్సరానికి స్వాగతం పలికే సందర్భంగా భక్తులు ఆలయాల్లో అర్ధరాత్రిపూట చేసే పూజలను, దైవ సందర్శనలపై నిషేధించడానికి గత వారం మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. అదేవిధంగా, హైదరాబాద్‌లోని హైకోర్టు కూడా భక్తుల హక్కులను ఎత్తిపట్టింది. ఈ రెండింటి మధ్య పోలికకు ప్రాధాన్యముంది.

అంతకుముందు హైదరాబాద్ సమీపంలోని చిలుకూరు బాలాజీ ఆలయ పూజారి నూతన సంవత్సరం సందర్భంగా ఆలయం లోపల తనకు ఎవరైనా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లయితే వారిని శిక్షిస్తానని హెచ్చరించారు. ఎందుకంటే నూతన సంవత్సరం అనేది ఇంగ్లిష్ సంప్రదాయమే కానీ భారతీయ సంప్రదాయాలతో దానికి సంబంధం లేదట. ఎవరైనా తనకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపితే వారిచేత ఆరు గుంజీళ్లు తీయిస్తానని ఆయన అన్నారు. ఆలయ సందర్శనకు వచ్చేవారు గర్భగుడి చుట్టూ ప్రశాంతతకు భంగం కలిగించకూడదంటూ ఆలయ పూజారి భక్తులను హెచ్చరించడంలో తప్పేమీ లేదు. నూతన సంవత్సరాది నాడు అలాంటి భక్తుల వైఖరి ఇతర భక్తులను ఇబ్బంది పెడుతుంది.

వేడుకలను జరుపుకోరాదని చెప్పడం ఒక ఎత్తైతే , తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినవారిని శిక్షిస్తానని చెప్పడం మరొక ఎత్తు. ప్రపంచ వ్యాప్తంగా జార్జియన్ కేలండర్ ప్రకారం జరుపుకునే కొత్త సంవత్సరాదిని తోసిపుచ్చడం భావ్యం కాదు. మన విశ్వాసాలతో పాటు ఇతర విశ్వాసాలు కూడా ప్రజలపై పనిచేస్తుంటాయి. పైగా మనందరికీ చాలా సులభంగా అర్థమయ్యే కేలండర్ అది.

ఈ ప్రపంచంలో వారాంతాలను ఎలా నిర్ణయిస్తున్నారు? మన వారాంతపు సెలవు దినం ఏదో మనం ఎలా తెలుసుకోగలం? మనకు వేతనం వచ్చే రోజు ఎప్పుడని రూఢిగా చెప్పగలం? ఎందుకు ఇప్పుడు గందరగోళం సృష్టించడం?

ఇక్కడ కొన్ని కారణాలున్నాయి. ముస్లింలు తమదైన లూనార్ కేలండర్‌ని అనుసరిస్తారు. హిందువుల పర్వదినాల్లాగే ముస్లింల పర్వదినాలు కూడా జార్జియన్ కేలండర్‌కు భిన్నమైన తేదీల్లో జరుగుతుంటాయి. పంచాంగం ఒక స్వయంసిద్ధ గణకుడిలాగా సమాచారం అందిస్తుంది. ఇది జార్జియన్ కేలండర్ లాగే రోజులు, తేదీలను లెక్కిస్తుంది.

హిందువులు తమ పంచాంగానికి, ముస్లింలకు తమ సంప్రదాయాలకు కట్టుబడినట్లయితే, ఈద్ పండుగ ఏ తేదీన వస్తుందో ఎవరికి తెలుసు? బ్యాంక్ సెలవు ఎప్పుడు? పాఠశాలకు, కాలేజీకి, ఆఫీసుకు మనం ఎప్పుడు వెళ్లాల్సిన అవసరం లేదు? లేదా మన అంగడిని ఎప్పుడు తెరువకూడదు వంటివి మనకు ఎలా తెలుస్తాయి? దీపావళి ఎప్పుడు వస్తుందో, తమ పర్వదినం ఎప్పుడు వస్తుందో ముస్లింలు ఎలా తెలుసుకోగలుగుతారు?



ఇలాంటి ప్రశ్నలు సాదాసీదాగానే కనిపిస్తాయి కానీ, మన రోజువారీ జీవితాల్లో వీటికి ఎంతో ప్రాధాన్యత ఉంది. జార్జియన్ కేలండర్ మినహా మరే ఇతర కేలండర్ లేని క్రైస్తవులు వారు భారతీయులైనప్పటికీ తక్షణమే ఇంగ్లిష్ వాళ్లయిపోతారా? నిస్సందేహంగా ఇదొక అసంబద్ధ విషయం.

మన దేశం రెండు రకాల జీవితం గడుపుతున్న ఈ సందర్భంలో, మన పంచాంగం ఇస్లాం పర్వదినాలను సూచించడం లేక ఇస్లామిక్ పంచాంగం కూడా హిందూ పర్వదినాలను సూచించడం పెద్ద విషయమేమీ కాదు. కాగా, జార్జియన్ కేలండర్ రెండు మత విశ్వాసాలకు చెందిన పర్వదినాలను తనలో కలుపుకుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇది సులభంగా ఉపయోగించే కేలండర్‌గా మారింది. మరోవైపున రెండు మతాలకు చెందిన సంకుచిత నాయకులు మనకంటూ ఒక ఉమ్మడి కేలండర్‌ను అనుమతించనంతగా మనం వేరుపడిపోయాం.

నూతన సంవత్సరాదికి కాకుండా ఉగాదికి ఆలయ పూజారి ప్రాధాన్యత ఇచ్చినట్లయితే, మనం జార్జియన్ కేలండర్‌ని పాటిస్తున్నందున, ఆయనకు అలా చెప్పే హక్కు, అధికారం ఉంటాయి. అయితే చాలామంది రెండు పర్వదినాలనూ జరుపుకోవాలని భావిస్తున్నారు.

కాగా, డిసెంబర్ 31, జనవరి 1 సంబరాల పేరిట తిని, తాగి జనం పాటించే భోగాలను ఆలయంలోకి తీసుకురావడం చిలుకూరు బాలాజీ ఆలయ పూజారికి అభ్యంతరకరమైతే దాన్ని అర్థం చేసుకోవలసిందే మరి.

మన పూజా స్థలాలను మనం దేవుడిని అభ్యర్థించే చోటుగా, ప్రశాంతంగా, హుందాగా ఉంచాల్సిన అవసరం ఉంది. పూజా స్థలాల్లో మనం ఇతరులతో గట్టిగా సంభాషించం. పైగా ఆలయ ప్రశాంతతకు అంతరాయం కలిగించకూడదు. అజాన్ మనల్ని ఇబ్బంది పెడుతున్నట్లుగా మన సొంత గలాభా అనేది గర్భగుడి ప్రశాంతతను చెదరనివ్వకూడదు. మన ప్రవర్తన వాంఛనీయమైనదిగా ఉండాలి. అలాంటి ప్రవర్తనను పాటించాలి అనుకుంటున్న ఆలయ పూజారికి నా మద్దతు ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com

పోలీసు చేతికి వజ్రాయుధం!

54 సర్వీసులతో 'టీఎస్ కాప్' యాప్ ఆవిష్కరణ
దేశంలోనే తొలిసారిగా ఇంటిగ్రేటెడ్ పోలీస్ యాప్



రాష్ట్ర పోలీసుల చేతికి 'టెక్నాలజీ'వజ్రాయుధం అందింది. నేరాల నియంత్రణ నుంచి పరిశీలన, దర్యాప్తు, విచారణల తీరు దాకా అన్ని అంశాలూ అరచేతిలోనే ఇమిడిపోయేలా 'టీఎస్ కాప్'అందుబాటులోకి వచ్చింది. ప్రపంచ స్థాయి పోలీసింగ్‌కు తోడ్పడేలా రూపొందిన ఈ యాప్‌ను సోమవారం హైదరాబాద్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డి, ఐపీఎస్ అధికారులతో కలసి ఆవిష్కరించారు. దీనిని తొలుత పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లో పరిశీలించగా.. పెట్రోలింగ్ సిబ్బంది, సెక్టార్ ఎస్సైలు, బ్లూకోల్ట్స్ సిబ్బందికి చాలా ఉపయోగపడింది. మంచి ఫలితాలను సాధించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ సిబ్బందికి అందుబాటులోకి తీసుకువచ్చారు. పోలీసు శాఖలోని దాదాపు 14 ప్రధాన విభాగాలు టీఎస్ కాప్ యాప్‌ను ఉపయోగించుకునేలా రూపొందించినట్లు డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. – సాక్షి, హైదరాబాద్

సిబ్బంది హెచ్‌ఆర్ విషయాల్లోనూ..

పోలీసు అధికారులు, సిబ్బంది పే స్లిప్‌లు, లీవ్ మేనేజ్‌మెంట్, డైలీ పెర్ఫార్మెన్స్, ఆరోగ్య భద్రత స్కీమ్, సర్వీసు రికార్డులు, బదిలీ వ్యవహారాలతో పాటు శిక్షణకు సంబంధించిన అంశాలు కూడా యాప్‌లో అందుబాటులోకి రానున్నాయి.

కోర్టులు, విచారణాంశాలు

కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్లు, విచారణ ఏ దశలో ఉందన్న విషయాలను కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కోర్టు కానిస్టేబుళ్లు ప్రతి విషయాన్ని యాప్ ద్వారా అప్‌డేట్ చేస్తారు. స్టే ఆర్డర్లు, అప్పీళ్లు, పరిష్కరించిన కేసులు, నోటీసులు, సమన్లు, వారెంట్లు, రోజువారీ కేసు డైరీలు వంటివీ పరిశీలించవచ్చు.

పకడ్బందీ దర్యాప్తునకు

అప్పటికప్పుడు ఘటనా స్థలం (ఫీల్డ్)లోనే ఫిర్యాదు తీసుకోవడం, అక్కడే ఫొటోలు, వీడియోలు తీసుకోవడం, సాక్షుల వాంగ్మూలం తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేయడం, ఎఫ్ఐఆర్‌లు, ఫిర్యాదుల పరిస్థితులను పర్యవేక్షించడం, రోజూ కేసుల దర్యాప్తును పరిశీలించడం ఈ యాప్‌తో చేయవచ్చు. డీఎస్ఆర్‌లు సైతం యాప్ ద్వారా పంపించడం, స్వీకరించడం, అనాలిసిస్ చేయడం, రిపోర్ట్ అప్‌డేట్ చేయడం వంటివాటికీ తోడ్పడుతుంది.

నిఘా వేయడంలోనూ తోడ్పాటు

నేరాలు జరగకుండా ప్రతిక్షణం అప్రమత్తం చేసే ఇంటెలిజెన్స్ డ్యూటీలోనూ టీఎస్ కాప్ యాప్ కీలకం కానుంది. ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ ఇన్ఫర్మేషన్ హబ్‌గా ఉపయోగపడుతుంది. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన వ్యూహాలను సైతం ఇంటెలిజెన్స్ విభాగం ఈ యాప్ ద్వారా అధికారులకు చేరవేయనుంది.

నేర నియంత్రణకు చర్యలు

నేరం జరగకుండా చర్యలు చేపట్టేందుకు కావాల్సిన అంశాలు యాప్‌లో అందుబాటులో ఉంటాయి. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ టవర్లు, ప్రవేశ, నిష్క్రమణ దారులు, లుక్ ఔట్ నోటీసులు, పదే పదే నేరాలకు పాల్పడే వారి జాబితా, నేరస్థలంలో సేకరించాల్సిన ఆధారాలు, నిందితులకు సంబంధించి 360 డిగ్రీ ప్రొఫైల్, ఇతర రాష్ట్రాల్లోని నేరస్తుల జాబితాలు, రాష్ట్రంలోని అన్ని టోల్ ప్లాజాల సీసీ కెమెరాలు వంటి వాటిని ఈ యాప్ ద్వారా చెక్ చేయవచ్చు.

ట్రాఫిక్ మేనేజ్‌మెంట్

ఎన్‌ఫోర్స్‌మెంట్, చలానాలు, స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలు, సిబ్బంది డ్యూటీలు, ఉల్లంఘనుల జాబితా, ల్యాండ్ మార్క్‌లు, ప్రమాదాల హాట్ స్పాట్లు, వాటి గుర్తింపు, అనాలిసిస్, వాటర్ లాగింగ్ ప్రాంతాలు, పార్కింగ్ వివరాలు తదితర సమాచారాన్ని యాప్‌తో పొందవచ్చు.

అందుబాటులో విస్తృత సమాచారం

డయల్ 100కు వచ్చే ఫోన్‌కాల్ నుంచి నేరం, దర్యాప్తు, నిందితుల గుర్తింపు, చార్జిషీటు.. శిక్ష పడిన విషయం వరకు ప్రతి అంశంలో టీఎస్ కాప్ యాప్ సిబ్బందికి ఉపయోగపడుతుంది. ఈ యాప్‌లో 54 సర్వీసులను 8 విభాగాలుగా పొందుపరిచారు. యాప్ వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లకు 2,500 ట్యాబ్‌లు ఇచ్చినట్టు డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. అయితే ఈ 54 సర్వీసులను యాప్‌లో అందుబాటులో ఉన్న రూల్ ఆఫ్ డ్యూటీ ప్రకారం ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. అన్ని సర్వీసులు అందరు సిబ్బందికి ఓపెన్ కావన్నారు. క్రైమ్ సిబ్బందికి నేర నియంత్రణ, ట్రాఫిక్ వాళ్లకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్.. ఇలా ఏ విభాగం సిబ్బందికి అవసరమైన సమాచారం వారికి అందుబాటులో ఉంటుందన్నారు. సిబ్బందికి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు.



నేరస్తుల గుర్తింపు, నిర్ధారణ అంశాలు

నేరం జరిగిన ప్రాంతంలో అనుమానిత వాహనాలు, వ్యక్తుల వివరాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, పాన్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్ చిరునామా పరిశీలన వంటి వివరాలను యాప్ ద్వారా క్షణాల్లో పొందవచ్చు. నేరం చేసిన తీరును బట్టి ఏ ముఠా చేసింది, ఇంతకు ముందు ఈ తరహాలో నేరం జరిగిందా అన్నది పరిశీలించవచ్చు. ముఠాల్లోని నేరస్తులు, వారి హిస్టరీ షీట్ డేటా బేస్ అందుబాటులో ఉంటుంది. శిక్ష అనుభవించి జైల్లోంచి విడుదలైన వారి జాబితా, క్రైమ్ మ్యాపింగ్, ఆన్‌లైన్ ఫింగర్ ప్రింట్ వెరిఫికేషన్ కూడా కీలక తోడ్పాటు ఇవ్వనున్నాయి. శిక్ష పడిన నేరస్తులు, నిందితులకు సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న 16 వేల కోర్టుల నుంచి సమాచారం అందుబాటులో ఉండటం మరో ప్రత్యేకత.

అత్యవసర స్పందన (ఎమర్జెన్సీ రెస్పాన్స్)

బాధితులు డయల్ 100కు కాల్ చేయడం, కాల్ సెంటర్ నుంచి పెట్రోలింగ్ వాహనాన్ని అలర్ట్ చేయడం ఈ యాప్ సాయంతో సులువవుతుంది. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసు సిబ్బంది ఘటన తీవ్రతను బట్టి యాప్ ద్వారా దగ్గర్లో ఉన్న మిగతా పెట్రోలింగ్ వాహనాలను, దగ్గర్లోని పోలీసు అధికారులను అప్రమత్తం చేయవచ్చు. యాప్‌లోని బజర్ నొక్కడం ద్వారా అదనపు బలగాలను ఘటనా స్థలికి రప్పించుకోవచ్చు.

సీఎం కేసీఆర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పవన్ • ప్రభుత్వ పథకాల అమలుపై ప్రశంసలు

సాక్షి, హైదరాబాద్

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో జనసేన పార్టీ అధినేత, సినీ హీరో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ప్రగతి భవన్‌లోని సీఎం నివాసంలో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ కేసీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పవన్ తొలిసారిగా ప్రగతి భవన్‌కు రావటం, సీఎంతో భేటీ కావటం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపింది. ఉదయం నుంచి సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ప్రముఖులతో ప్రగతి భవన్‌లో సందడి నెలకొంది. ఈ సందడి ముగిశాక సాయంత్రం 7 గంటల సమయంలో పవన్ ముందస్తు అపాయింట్‌మెంట్ లేకుండానే ప్రగతిభవన్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో సీఎం ప్రగతి భవన్‌లో లేరు. రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వెళ్లారు. దీంతో అరగంట సేపు పవన్ నిరీక్షించారు. రాజ్‌భవన్ నుంచి వచ్చీ రాగానే పవన్‌తో సీఎం సమావేశమయ్యారు.

ప్రభుత్వ పథకాలకు కితాబు..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గొప్పగా ఉన్నాయని పవన్ కితాబిచ్చారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్, వ్యవసాయానికి రూ.8 వేల సాగు పెట్టుబడి అందించే పథకాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి దిశగా చేపట్టే కార్యక్రమాలు జనరంజకంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. దాదాపు 20 నిమిషాల పాటు చర్చ కొనసాగింది. కొద్ది రోజుల కిందటే రాష్ట్రపతి పర్యటన సందర్భంగా గవర్నర్ ఇచ్చిన ఆతిథ్య విందులో కేసీఆర్‌ను పవన్ కలిసి కాసేపు ప్రత్యేకంగా మాట్లాడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రత్యేకంగా కలుస్తానంటూ పవన్ సీఎం అపాయింట్‌మెంట్ కోరగా.. ఎప్పుడైనా రావొచ్చని సీఎం ఆహ్వానించినట్లు సమాచారం. నంద్యాల ఉపఎన్నిక సమయంలో పవన్ పార్టీకి ఒక్క శాతం ఓట్లు కూడా రావంటూ కేసీఆర్ ఎద్దేవా చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇద్దరి మధ్య సుహృద్భావ వాతావరణం కనిపించలేదు. ప్రపంచ తెలుగు మహాసభలకు సినీ నటులందరికీ పంపినట్లే పవన్‌కు కూడా ప్రభుత్వం ఆహ్వానం పంపింది. అయితే పవన్ ఈ సభలకు హాజరు కాలేదు. కానీ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించారని, ఏటా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రపతి విందు సందర్భంగానే పవన్ కేసీఆర్‌కు అభినందనలు తెలిపినట్లు సమాచారం. వారం రోజుల వ్యవధిలోనే సీఎం, పవన్ మరోసారి భేటీ కావటం చర్చనీయాంశంగా మారింది.



సోమవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

'విద్యుత్'పై ప్రభుత్వ ప్రచారం అవాస్తవం

- టీ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం
- సాగుకు 24 గంటల విద్యుత్‌లో టీఆర్ఎస్ సర్కార్ ఘనతేం లేదు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ హాస్టళ్లలో చలికి వణుకుతున్న పిల్లలకు కనీసం దుప్పట్లు ఇవ్వలేని ప్రభుత్వం.. సాగుకు 24గంటల విద్యుత్‌పై ఎందుకంత ఆసక్తి ప్రదర్శిస్తోందని తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ప్రశ్నించారు. స్కూళ్లు, హాస్టళ్లలో బాలికలకు కనీసం టాయిలెట్లను కూడా ప్రభుత్వం కట్టించ లేదని విమర్శించారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌పై వాస్తవాల పేరుతో సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా పెద్ద మొత్తంలో మిగులు విద్యుత్ ఉండటం వల్లే రాష్ట్రంలో విద్యుత్ సమస్య తీరిందని.. సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా సాధ్యమైందని వెల్లడించారు. అధికారంలోకి రాగానే విద్యుత్ సమస్య పరిష్కరించామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

19 రాష్ట్రాల్లో కరెంట్ కోతలే లేవు..

దేశవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న విద్యుత్ ప్లాంట్లు ఉత్పత్తిని ప్రారంభించడంతో ప్రస్తుతం అవసరానికి మించిన విద్యుత్ లభ్యత ఉందని కోదండరాం వెల్లడించారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) 2017–18 వార్షిక నివేదిక ప్రకారం.. ప్రస్తుతం దేశంలో 1,08,167 మిలియన్ యూనిట్ల మిగులు విద్యుత్ ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2016–17 నుంచి కరెంట్ కోతలు లేవని వెల్లడించారు. రాష్ట్ర రైతులు కూడా 9 గంటల విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయమంటున్నారే తప్ప.. 24గంటల విద్యుత్‌ను కోరడం లేదన్నారు. సాగుకి 24గంటల విద్యుత్ కోసం విద్యుత్ సంస్థలపై ఏటా రూ.10 వేల కోట్ల భారం పడనుండగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.5,500 కోట్ల మేరకే భారాన్ని భరిస్తానంటోందని గుర్తు చేశారు. అన్ని రంగాల్లో విఫలమైన ప్రభుత్వం 24 గంటల విద్యుత్‌ను ముందుకు తీసుకొచ్చి ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తోందని కోదండరాం ఆరోపించారు.

వర్గీకరణ కోరుతూ నేటి నుంచి దీక్ష

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



హైదరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం నేటి(మంగళవారం) నుంచి దీక్ష కొనసాగించనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తెలిపారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు, బాపూఘాట్ లేదా నగర పరిధిలో ఎక్కడ అనుమతి ఇచ్చినా తమ దీక్ష కొనసాగుతుందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఎమ్మార్పీఎస్‌పై లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, తమపై కక్ష సాధింపు చర్యలు జరుగుతున్నాయని అన్నారు. ఢిల్లీలో దీక్ష చేసినప్పుడు టీఆర్ఎస్ నేతలెవరూ తమకు మద్దతు ఇవ్వలేదన్నారు. తాము వేసిన 13 ప్రశ్నలకు కేసీఆర్‌గానీ, కడియంగానీ ఇంతవరకు సమాధానం చెప్పలేదన్నారు. దళిత సీఎం విషయంలో కేసీఆర్ మాట తప్పారని, దళితుల్లో సీఎం స్థాయివ్యక్తి లేరని శ్రీహరి ప్రకటన చేసి దళితులను అవమానపరిచారన్నారు. రాజయ్య బర్తరఫ్ కుట్రలో భాగమై ఉప ముఖ్యమంత్రి స్థానాన్ని కడియం దోచుకున్నారని మంద కృష్ణ ఆరోపించారు. తమపై పెట్టిన కేసుల కుట్రకు కడియం మూలకారకుడని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీహరి తన రాజకీయ భవిష్యత్ కోసం దళితులకు ద్రోహం చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ ఇంట్లో వెయ్యిమందితో మీటింగ్ పెట్టుకోవచ్చు కానీ, పదిమందితో దీక్ష చేయనీయరా.. అని ప్రశ్నించారు. 100 రోజుల్లో వర్గీకరణ చేస్తానని చెప్పిన బీజేపీ ఇంకా ఆ దిశగా ముందుకు సాగడం లేదన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన

- ఈ నెల నుంచి వర్తిస్తుందని వెల్లడి
- అన్ని వర్గాల్లో ఆనందం నింపారని విద్యుత్ ఉద్యోగులకు ప్రశంస
- అందుకే వారికి న్యూ ఇయర్ కానుకగా ఇంక్రిమెంట్
- ప్రగతి భవన్‌లో విద్యుత్ ఉన్నతాధికారులతో భేటీ
- ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావుకు ఆత్మీయ ఆలింగనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రైతాంగానికి 24 గంటలపాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ అందించడం మూడున్నరేళ్ల వయసున్న తెలంగాణ రాష్ట్రం సాధించిన అద్భుత విజయమని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అభివర్ణించారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న విద్యుత్ రంగాన్ని గట్టెక్కించి అన్ని రంగాలకు 24 గంటల నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా తీర్చిదిద్దిన ఘనత విద్యుత్ సంస్థల ఉద్యోగులకే దక్కుతుందని సీఎం కితాబునిచ్చారు. దేశమంతా తెలంగాణవైపు చూసే విధంగా విద్యుత్ రంగంలో విప్లవాత్మక విజయాలు సాధించారని అభినందించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇంత గొప్ప ఖ్యాతిని సముపార్జించి పెట్టిన విద్యుత్ ఉద్యోగులకు అభినందనపూర్వకంగా ఈ నెల నుంచి వర్తించేలా ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. తెలంగాణ ప్రజలంతా విద్యుత్‌శాఖ పనితీరుపట్ల తృప్తిగా, ఆనందంగా ఉన్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా అవుతున్న నేపథ్యంలో జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల సీఎండీ డి.ప్రభాకర్‌రావు, ఇతర విద్యుత్ అధికారులతో సీఎం కేసీఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో సమావేశమయ్యారు. ప్రభాకర్‌రావును ఆలింగనం చేసుకుని అభినందించారు. విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, సీనియర్ ఉద్యోగులను పేరు పేరునా పలకరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యుత్‌శాఖ ఉద్యోగులు రాష్ట్రంలోని రైతులతోపాటు అన్ని వర్గాల నూతన సంవత్సర ఆనందాన్ని రెట్టింపు చేశారని, అందుకోసం విద్యుత్ ఉద్యోగులకు నూతన సంవత్సర కానుకగా ఒక ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇస్తున్నట్లు విద్యుత్ అధికారుల హర్షధ్వానాల మధ్య సీఎం ప్రకటించారు. ''వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ అందిస్తున్న రాష్ట్రంగా చరిత్రలో నిలిచిపోతుంది. దశాబ్దాలపాటు రైతులు అనుభవించిన కరెంటు కష్టాలకు శాశ్వత విముక్తి కలిగించాలనే లక్ష్యంతో వ్యయ, ప్రయాసలకోర్చి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించాలని నిర్ణయించాం. టీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇవ్వలేదు. అయినా రైతులకు అత్యంత అవసరమని భావించి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించాం. 2018 ఫిబ్రవరి లేదా మార్చి నుంచి 24 గంటల సరఫరా చేయాలని మొదట భావించినా జనవరి 1 నుంచే యాసంగి పంటలు చేసుకునేలా 24 గంటల సరఫరా ప్రారంభించడం సంతోషకరం. సాగుకు 24 గంటలపాటు ఉచితంగా కరెంటు ఇచ్చే రాష్ట్రం తెలంగాణ తప్ప దేశంలో మరేదీ లేదు. పక్కా ప్రణాళికతో, పకడ్బందీ కార్యాచరణతో ముందుకుపోవడం వల్లే ఈ విజయం సాధ్యమైంది.''అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సీఎంను కలసిన వారిలో టీఎస్ఈఆర్సీ చైర్మన్ ఇస్మాయిల్ అలీఖాన్, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, జెన్‌కో డైరెక్టర్లు అశోక్ కుమార్, వెంకటరాజం, లలిత్ కుమార్, టీఎస్ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ కమాలుద్దీన్ అలీఖాన్, ట్రాన్స్‌కో డైరెక్టర్ జి.నర్సింగ్ రావు, పీజీసీఎల్ ఈడీ వి.శేఖర్, జీఎం ఎస్.రవి తదితరులున్నారు.

సీఎం కేసీఆర్‌కు ట్రాన్స్‌కో సీఎండీ కృతజ్ఞతలు



విద్యుత్‌శాఖ ఉద్యోగులందరికీ ఒక ప్రత్యేక ఇంక్రిమెంట్ ప్రకటించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డి. ప్రభాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ నిర్ణయం విద్యుత్‌శాఖ ఉద్యోగుల్లో మరింత ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని, వారంతా రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి దార్శనికత, మార్గదర్శకంలో విద్యుత్ సంస్థలు రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితిని మెరుగుపరచగలిగాయన్నారు.

✦ ఏసీజేను కలసిన సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్‌ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సాయంత్రం 3.30 గంటలకు హైదరాబాద్ తార్నాకలోని ఏసీజే నివాసానికి వెళ్లి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దాదాపు గంటన్నరపాటు ఏసీజేతో సమావేశమైన తర్వాత సీఎం ప్రగతి భవన్‌కు వెళ్లిపోయారు. సీఎం రాక గురించి స్థానిక పోలీసులకు తప్ప మరెవరికీ తెలియదు. సీఎం వచ్చిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక నాయకులు ఆయనను కలిసేందుకు అక్కడికి తరలివచ్చారు. అయితే సీఎం అప్పటికే ప్రగతి భవన్‌కు వెళ్లిపోయారు.

✦ ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించండి

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఆస్పత్రులకు పెద్ద మొత్తంలో బకాయి పడటంతో ఆరోగ్యశ్రీ పథకం నిర్వీర్యమవుతోందని బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.600 కోట్ల మేర బకాయిలు పేరుకుపోవటంతో చాలా ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందటం లేదని తెలిపారు. ఈనెల 22 నాటికల్లా బకాయిలు చెల్లించకపోతే సేవలు నిలిపేస్తామని ఆస్పత్రులు హెచ్చరించినట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. బకాయిలు చెల్లించి ఆరోగ్యశ్రీ సేవలను సరిగ్గా అందేలా చూడాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ప్రచారం కోసం రోజుకో కొత్త పథకాన్ని ప్రకటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆరోగ్యశ్రీని మాత్రం నిర్వీర్యం చేస్తోందన్నారు.

✦ ప్రభుత్వ అసమర్థతే ప్రాజెక్టులకు గండం

సీపీఎం నేత జూలకంటి విమర్శ



సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్షాలపై నిందలు మోపుతోందని సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. పునరావాస ప్యాకేజీలు లేకుండా, నిర్వాసితులను ఆదుకోకుండా ప్రాజె క్టులను పూర్తి చేయాలనుకుంటే ఎవరూ హర్షించరన్నారు. ప్రాజెక్టులు పూర్తికాకుండా ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయ ని అధికార టీఆర్ఎస్ నేతలు, మంత్రులు చేస్తున్న ప్రకటనలు సరికాదని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు నిధుల కొరతే ప్రధాన అడ్డంకి అని, ఆ ప్రాజెక్టుకు ఏ ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయని ప్రశ్నించారు. సాగర్ వరదకాల్వ, ఎస్సారెస్పీ ఫేజ్ టూ పనులకూ అరకొర నిధులు కేటాయించడం వల్లే పనులు పూర్తికావడం లేదన్నారు.

✦ కాంగ్రెస్ పాలనలోనే మత కలహాలు

బీజేపీ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ హయాంలోనే మత కలహాలు జరిగాయని, వేల మంది దుర్మరణం చెందారని బీజేపీ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. బీజేపీ పాలనలో అలా జరగలేదని సోమవారం పేర్కొన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తోందంటూ బీజేపీపై పీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా ముస్లిం మహిళల హక్కుల గురించి, వారి ఆత్మాభిమానం గురించి మాట్లాడే పరిస్థితి ఉండటం శోచనీయమన్నారు. ఇది ఎవరి నిర్వాకం వల్ల జరిగిందో తెలుసుకోవాలని ప్రశ్నించారు.

✦ కేసీఆర్‌ది నియంతృత్వ పోకడ

తెలంగాణ ద్రోహులతో కలసి పాలన: చాడ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ద్రోహులతో కలసి సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఏలుతున్నాడని సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని, నియంతృత్వంగా వ్యవహరిస్తున్న కేసీఆర్ తీరు సరికాదని అన్నారు. సోమవారం నాడిక్కడ జరిగిన సీపీఐ నగర కౌన్సిల్ సమావేశంలో చాడ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హామీలను గుప్పిస్తూ కేసీఆర్ కుల రాజకీయాలతో పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ సక్రమంగా అమలు చేయడం లేదని, అభివృద్ధి పేరిట రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

✦ 'మజ్దూర్ సంఘటన్'పై నిషేధం ఎత్తేయాలి


వరవరరావు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్‌లో మజ్దూర్ సంఘటన్ సమితిపై నిషేధం విధిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రఘువర్ దాస్ నిర్ణయం తీసుకోవడాన్ని రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ ఖండించింది. ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశం వెల్లడించాలని ఫ్రంట్ అధ్యక్షుడు వరవరరావు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్కడి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాడుతున్న వారిని అణగదొక్కాలనే కుట్ర సాగుతోందని వ్యాఖ్యానించారు. వెంటనే సంఘటన్ సమితిపై బేషరతుగా నిషేధం ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పోరాటాలపై పోలీసు చర్యలను వెంటనే నిలిపేయాలని పేర్కొన్నారు.

✦ పదెకరాల చొప్పున కేటాయించండి


సీఎం కేసీఆర్‌కు కృష్ణయ్య బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 66 బీసీ కులసంఘాల్లో ఒక్కో కులానికి 10 ఎకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేత, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ కులాలకు హాస్టళ్లు, కమ్యూనిటీ భవనాలు కట్టుకోవడానికి స్థలం, బడ్జెట్ కేటాయిస్తే అన్ని కులాలను ఆదుకున్నట్లు అవుతుందని, కొందరికి ఇచ్చి కొందరికి ఇవ్వకపోతే రాని కులాలకు అన్యాయం చేసిన వారవుతారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు బహిరంగలేఖ రాశారు. పూసల, జంగం, లింగాయత్, వీర భద్రియ, భట్రాజు, ఆరెకటిక, గాండ్ల, వంజరి, వంశీరాజ్, వాల్మీకి, పూసల, తమ్మలి, వారాల తదితర 66 కులాలకు అలాగే మాల, మాదిగ, లంబాడి, ఎరుకల, యానాది, గోండు తదితర ఈబీసీ కులాలకు 10 ఎకరాల స్థలం, రూ. 10 కోట్ల చొప్పున కేటాయించాలని కోరారు.

✦ రైతులను ఆదుకోవడంలో విఫలం

టీపీసీసీ కిసాన్‌సెల్ అధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతులను ఆదుకోవడంలో, వ్యవసాయాన్ని సంక్షోభం నుంచి కాపాడటంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విఫలమయ్యారని టీపీసీసీ కిసాన్‌సెల్ అధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు రుణమాఫీ చేయకుండా, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించకుండా వట్టి మాటలకే టీఆర్ఎస్ ప్రభుత్వం పరిమితమైందన్నారు. మెదక్ జిల్లాతో పాటు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో భూగర్భ జలాలు చాలా ప్రమాదకర స్థాయిలో ఉన్నాయన్నారు. అలాంటప్పుడు 24 గంటల కరెంటు ఇచ్చినా రైతులకు వచ్చే ప్రయోజనం ఏంటని కోదండరెడ్డి ప్రశ్నించారు. 24 గంటల కరెంటు ఇవ్వడానికి వ్యతిరేకం కాదని, భారీ ప్రచారానికే వ్యతిరేకమన్నారు. భూగర్భజలాలు లేకుండా కరెంటు ఇవ్వడం వల్ల నష్టం తప్ప ప్రయోజనం ఏమీ లేదని రైతులు చెబుతున్నారని వెల్లడించారు.

✦ మండల స్థాయిలోనూ కమిటీలు

టీపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు నేరెళ్ల శారద



సాక్షి, హైదరాబాద్: మండల స్థాయిలోనూ మహిళా కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటుచేయనున్నట్లు టీపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు నేరెళ్ల శారద తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే 31 జిల్లాలకు మహిళా కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటుచేశామన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆమోదంతోనే అన్ని జిల్లాల్లో కమిటీలను నియమించినట్టుగా చెప్పారు. ఈ నెల 8న మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం గాంధీభవన్‌లో జరగనుందని.. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియాతో పాటు ముఖ్యనేతలు హాజరవుతారని వెల్లడించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోతోందని, అకృత్యాలు ఎక్కువయ్యాయని విమర్శించారు. వీటిపై మహిళా కాంగ్రెస్ పోరాడుతుందని శారద చెప్పారు.



సోమవారం హైదరాబాద్‌లోని పోలీసు అధికారుల మెస్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఐపీఎస్ అధికారులు

కాంగ్రెస్ వల్లే నేడు నిరంతర విద్యుత్

పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్: టీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో కొత్తగా ఒక్క యూనిట్ విద్యుదుత్పత్తి కూడా జరగలేదని, కాంగ్రెస్ హయాంలో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులు నేడు పూర్తికావటం వల్లే సాగుకు నిరంతర విద్యుత్ ఇవ్వగలుగుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా జైపూర్‌లో 1,200 మెగావాట్లు, భూపాలపల్లిలో 600 మెగావాట్లు, పులిచింతల ప్రాజెక్ట్ వద్ద 90 మెగావాట్ల ప్రాజెక్ట్‌లతోపాటు జూరాల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని కాంగ్రెస్ హయాంలోనే 80 నుంచి 90 శాతం పనులు పూర్తి చేశామని, వాటికి నేడు టీఆర్‌ఎస్ ప్రారంభోత్సవాలు చేస్తూ తమ గొప్పతనంగా చెప్పుకుంటుందని విమర్శించారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో ప్రకటనలిస్తూ ప్రజలను మాయ చేస్తున్నారు తప్ప.. వాటి నిర్మాణానికి తట్టెడు మట్టిపోసే దిక్కులేదన్నారు. రాష్ట్రంలో ముస్లింలను బీసీ–ఈలుగా పరిగణిస్తూ 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామంటే తాము మద్దతు పలికామని, బీసీలకు కూడా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశామన్నారు. గడిచిన నాలుగేళ్లలో బీసీలను పట్టించుకోని సీఎం ఇటీవల వారిపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు.

✦ తుమ్మల కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం

కూసుమంచి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాన్వాయ్‌కి సోమవారం ప్రమాదం తప్పింది. ఆయన ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తుండగా కూసుమంచిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో మతిస్థిమితంలేని ఓ వ్యక్తి ఒక్కసారిగా కాన్వాయ్‌కు అడ్డుగా వచ్చాడు. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ మంత్రి కారును పక్కకు తీసుకెళ్లాడు. మంత్రి కాన్వాయ్ స్పీడుగా వస్తుండటంతో హఠాత్ పరిణామంతో భద్రతా సిబ్బంది, స్థానికులు కంగుతిన్నారు. అనంతరం మంత్రి హైదరాబాద్ వెళ్లిపోగా.. సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని అన్నం ఫౌండేషన్‌కు అప్పగించనున్నట్లు ఎస్‌ఐ రఘు తెలిపారు.



సోమవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అర్చక సమాఖ్య ప్రతినిధులు

✦ 'ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేయండి'

సాక్షి, హైదరాబాద్: ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేసి గాడితప్పిన దేవాదాయ శాఖ పనితీరును చక్కదిద్దాలని తెలంగాణ అర్చక సమాఖ్య ముఖ్యమంత్రి చంద్రశేఖరరావును కోరింది. సోమవారం ప్రగతి భవన్‌లో తెలంగాణ అర్చక సమాఖ్య నూతన సంవత్సర డైరీని సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాఖ్య ప్రతినిధులు గంగు ఉపేంద్రశర్మ, భాస్కరభట్ల రామశర్మ, శ్రీనివాసాచార్యులు, రాజేశ్వరశర్మ తదితరులు పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని సీఎంకు అందజేశారు. వేతన సవరణ అందరికి వర్తింపచేయాలని, 2005 తర్వాత నియమితులైన వారిని రెగ్యులరైజ్ చేయాలని కోరినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

✦ 'కిలిమంజారో'పై గద్వాల కుర్రాడు

ఎవరెస్ట్‌ను అధిరోహించడమే లక్ష్యం



సాక్షి, గద్వాల: ఆఫ్రికా ఖండంలోని ఎత్తయిన కిలిమంజారో పర్వతాన్ని గద్వాలకు చెందిన ఆడెం కిశోర్ కుమార్ అధిరోహించాడు. 5,895 మీటర్ల ఎత్తు గల కిలిమంజారో పర్వతాన్ని డిసెంబర్ 25న అధిరోహించి అక్కడ జాతీయ జెండాను ఎగురవేశాడు. పర్యావరణ పరిరక్షణ, మానవ రవాణా, ఉగ్రవాదం రూపుమాపాలనే అంశాలతో తాను రూపొందించిన జెండాను శిఖరంపై ఎగురవేసినట్లు ఆ యువకుడు పేర్కొన్నాడు. హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటెక్ చదువుతున్న కిశోర్ ఒకటిన్నరేళ్లు పర్వతారోహణలో శిక్షణ పొందాడు. ఎవరెస్ట్ శిఖరాన్ని పదిరోజుల వ్యవధిలో రెండుసార్లు అధిరోహించి ప్రపంచ రికార్డు నెలకొల్పి భారతదేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటడమే తన లక్ష్యమని తెలిపాడు.

✦ అప్పులబాధతో రైతు ఆత్మహత్య

పెద్దవూర: వ్యవసాయ పనులకు చేసిన అప్పును తీర్చే మార్గం లేక ఓ రైతు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం తుంగతుర్తి గ్రామ పంచాయతీ పరిధి చింతపల్లి గ్రామానికి చెందిన వెలుగు యాదగిరి (32) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న ఎకరం భూమితోపాటు మరో 5 ఎకరాలను కౌలుకు తీసుకుని మూడేళ్లుగా పత్తిని సాగు చేస్తున్నాడు. పెట్టుబడులకు రూ.5 లక్షలు అప్పు చేశాడు. దిగుబడి సరిగా లేకపోవడం, అప్పులు తీర్చే మార్గం కనపడకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

✦ ఇద్దరు రైతులను కబళించిన మృత్యువు

కోనాపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం



ఆమనగల్లు(కల్వకుర్తి): పండించిన పంటను అమ్ముకుందామని హైదరాబాద్‌కు బయలుదేరిన ఇద్దరు రైతులను మృత్యువు కబళించింది. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గుట్టలపల్లికి చెందిన చిందం ముత్తయ్య (46), తాళ్లపల్లికి చెందిన కెంచ పర్వతాలు (25) కీరదోసకాయను హైదరాబాద్ మార్కెట్‌లో విక్రయించడానికి ఆదివారం రాత్రి బొలెరో వాహనంలో నింపుకుని బయలుదేరారు. వీరి వాహనం రాత్రి 11.40 గంటల సమయంలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు సమీపంలోకి రాగానే ఆమనగల్లు వైపునకు వేగంగా వస్తున్న టాటా జీజేఎస్ వాహనం ఢీకొట్టింది. ఘటనలో రైతులు ముత్తయ్య, పర్వతాలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రమాదంలో బొలెరో డ్రైవర్ సాయి, టాటా డ్రైవర్ దేరంగుల రవి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆమనగల్లు ఆస్పత్రికి, అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బొలెరో వాహనంలో చిక్కుకున్న రైతుల మృతదేహాలను జేసీబీ సాయంతో బయటకు తీశారు.

'బంగారం'లాంటి మ్యూజియం..

భద్రత శూన్యం



హైదరాబాద్ స్టేట్ మ్యూజియానికి రక్షణ కరువు

- ప్రపంచంలోనే ప్రత్యేకమైన పురాతన సంపదకు నిలయం
- లక్షల కొద్దీ బంగారు, వెండి నాణేలు
- మొఘలులు వినియోగించిన విలువైన వస్తువులు
- శాతవాహనులు, చాళుక్యుల నాటి బంగారు విగ్రహాలు
- 18 సీసీ కెమెరాలున్నా ఒక్కటీ పనిచేయదు
- చుట్టూ సోలార్ ఫెన్సింగ్.. కానీ విద్యుత్ సరఫరా లేదు..

సాక్షి, హైదరాబాద్

అదో మ్యూజియం.. నిజాం హయాంలో నిర్మితమైన విశాల భవనం.. చుట్టూ సోలార్ ఫెన్సింగ్.. 18 సీసీ కెమెరాలతో నిఘా.. రాత్రింబవళ్లు పహారాలో సిబ్బంది.. పైకి చూస్తే ఎంతో భద్రమైన వ్యవస్థ అనిపిస్తుంది. కానీ అంతా అలంకారప్రాయమే. సోలార్ ఫెన్సింగ్ పనిచేయదు, దానికి సౌర విద్యుత్ సరఫరా చేసే వ్యవస్థ లేదు, సీసీ కెమెరాలన్నీ ఎప్పుడో పాడైపోయాయి. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించే గదిలో రెండు పెద్ద టీవీలున్నాయి. వాటి ముందు సిబ్బంది కూర్చుని ఉంటారు. కానీ ఆ టీవీలు కూడా పనిచేయవు. ఎంతో అద్భుత పురాతన సంపద ఉన్న హైదరాబాద్ స్టేట్ మ్యూజియం దుస్థితి ఇది.

ఎంతో విలువైన పురాతన సంపద

పబ్లిక్ గార్డెన్స్‌లోని మ్యూజియంలో ఎంతో చారిత్రక ప్రాధాన్యమున్న సంపద ఉంది. మౌర్యుల కంటే ముందు నుంచి అసఫ్‌జాహీల వరకు చెందిన మూడు లక్షల పురాతన నాణేలున్నాయి. అందులో 23వేలకుపైగా బంగారు నాణేలు, లక్ష వరకు వెండి నాణేలు ఉండడం గమనార్హం. ప్రపంచ వ్యాప్తంగా ఒక్క బ్రిటిష్ మ్యూజియంలో తప్ప ఎక్కడా ఇంతపెద్ద సంఖ్యలో పురాతన నాణేలు లేవు. కొన్ని నాణేల విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.కోట్లలో పలుకుతుంది కూడా. సరైన భద్రత లేకపోవడంతో ఆ నాణేలను స్టోర్‌రూమ్‌కే పరిమితం చేశారు. సందర్శకులకు అందుబాటులో ఉంచలేదు. ఇక గద్వాలలో జరిపిన తవ్వకాల్లో లభించిన పురాతన బంగారు, వెండి ఆభరణాలు.. మొఘల్ చక్రవర్తులు వినియోగించిన వందకుపైగా భోజన పాత్రలు ఇక్కడ ఉన్నాయి. మొఘల్ పాలకులు వీటిని అప్పట్లోనే చైనాలో ప్రత్యేకంగా తయారు చేయించి, తెప్పించారు. ఇక శాతవాహనులు, పద్మనాయకులు, చాళుక్యులు, కాకతీయుల కాలం నాటి బంగారు, వెండి విగ్రహాలు, ఇతర వస్తువులు కూడా స్టేట్ మ్యూజియంలో ఉన్నాయి. పోర్సలిన్ పాత్రలు, పింగాణి గిన్నెలు, ఇనుప పాత్రలపై రంగులద్ది రూపొందించిన వస్తువులు, టిప్పు సుల్తాన్ తుపాకీ ఇలా మూడు వేల వరకు పురాతన వస్తువులు.. అజంతా, ఎల్లోరాల్లో లభించిన వాటితో సహా ప్రాచీన కాలం నాటి పెయింటింగులు ఉన్నాయి. ఇంత విలువైన పురాతన సంపద ఉన్నా.. తగిన భద్రత లేకపోవడం ఆందోళనకరంగా మారింది.

ఇలాగైతే ఎలా?

స్టేట్ మ్యూజియంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు 18 మంది పురావస్తు శాఖ సిబ్బంది ఉంటారు. రాత్రి వేళ ఐదుగురు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది గస్తీ కాస్తారు. వీరి వద్ద కూడా కర్రలు తప్ప ఇతర ఆయుధాలేమీ ఉండవు. విద్యుత్ ఫెన్సింగ్, సీసీ కెమెరాలు పనిచేయవు. ఇలాంటి పరిస్థితిలో ఎవరైనా దుండగులు ప్రవేశించి.. పురాతన సంపదను దోచుకుంటే పరిస్థితి ఏమిటన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎందుకీ పరిస్థితి ?

ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం మ్యూజియం భద్రత కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. వాటితో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వెంటనే ఓ ప్రైవేటు సంస్థకు బాధ్యత అప్పగించింది. దాదాపు రూ.కోటి వరకు ఖర్చు చేసి 18 సీసీ కెమెరాలు, భవనం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించేందుకు రెండు టీవీలను ఓ గదిలో ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను ఆ సంస్థే ఒక సంవత్సరం పాటు పర్యవేక్షించి.. ఒప్పందం గడువు పూర్తికావటంతో తప్పుకుంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు రాకపోవటంతో సీసీ కెమెరాలు, సోలార్ ఫెన్సింగ్ వ్యవస్థ దెబ్బతిన్నది. అధికారులు నిధులు లేవంటూ వాటికి మరమ్మతులు చేయించకుండా వదిలేశారు.

'కేసీఆర్‌కు వ్యవసాయంపై అవగాహన లేదు'



నల్లగొండ టూటౌన్: వ్యవసాయంపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు ఏ మాత్రం అవగాహన లేదని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. 24 గంటల కరెంట్ వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోయే ప్రమాదముందని మండిపడ్డారు. సోమవారం నల్లగొండలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రైతుల కోసం ఏదో చేసినట్టుగా గొప్పలు చెబుతున్న సీఎం కేసీఆర్‌కు పోయే కాలం దగ్గరికొచ్చిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చి ఒక మోసగాడి చేతిలో మోసపోయిందని, రాష్ట్రం ఏర్పడ్డ సంతోషం లేకుండా చేశారని అన్నారు.

జాతర పనుల్లో జాప్యం

మేడారంలో 15 వరకు పూర్తి కష్టమే.. ● జాడలేని మరుగుదొడ్లు ● మొదలు కాని రోడ్డుపనులు



సాక్షి ప్రతినిధి, వరంగల్: మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు వస్తున్న భక్తుల సంఖ్య ఇప్పటికే వేలల్లోంచి లక్షల్లోకి చేరుతోంది. మరోపక్క జాతర కోసం రూ. 80 కోట్లతో చేపడుతున్న పనులు నత్తనడకన సాగుతున్నాయి. జయశంకర్ జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో ఆసియాలోనే అతిపెద్దదైన సమ్మక్క, సారలమ్మ జాతర జరగనుంది. జాతరకు కోటిమంది భక్తులు వస్తారనే అంచనా. అభివృద్ధి పనులన్నీ జనవరి 15 నాటికి పూర్తి చేయాలంటూ జిల్లా కలెక్టర్ ఆకునూరి మురళి ఆదేశాలు జారీ చేశారు. మంత్రుల ఆదేశాలు, కలెక్టర్ పర్యవేక్షణలెలా ఉన్నా పనులు ఆశించిన మేరకు వేగంతో జరగడం లేదు. జాతర భక్తుల కోసం రూ. 11.75 కోట్లతో పారిశుద్ధ్యపనులు చేపడుతున్నారు. వీటితో 4,000 సెమీ పర్మనెంట్, 1,350 తాత్కాలిక, 60 శాశ్వత, 60 వీఐపీ టాయిలెట్లు నిర్మించాల్సి ఉంది. ఇప్పటివరకు పదుల సంఖ్యలో కూడా నిర్మాణాలు పూర్తి కాలేదు.

చేతులెత్తేసిన ఇరిగేషన్ శాఖ: జాతర పనులు సకాలంలో పూర్తి చేయలేక ఇరిగేషన్ అధికారులు చేతులెత్తేశారు. జంపన్నవాగులో 4 చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు రెండేళ్ల క్రితం రూ. 14 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు కేవలం రెండు చెక్‌డ్యామ్‌లకు శంకుస్థాపన చేసి, పనులు మధ్యలో వదిలేశారు. దీంతో స్నానాలు చేసేందుకు వీలుగా తాత్కాలికంగా ఇసుకబస్తాలతో ఆనకట్టలు ఏర్పాటు చేస్తున్నారు. జంపన్నవాగు వెంట మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఐరన్‌ఫ్రేములతో గదులు ఏర్పాటు చేయాల్సి ఉంది. భక్తుల కోసం ఆర్టీసీ ఎలాంటి ఏర్పాట్లూ చేయటం లేదు. మేడారం జాతరకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ. 4 కోట్లు కేటాయించారు. విద్యుత్ పనులు వేగంగా సాగుతున్నాయి.

గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న ఉత్తమ్

ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలను పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం యాదాద్రి జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ సీటును వచ్చే ఎన్నికల్లో గెలిపించి తీరుతామన్నారు. అధిష్టానం తమకు పీసీసీ అధ్యక్షుడిగా అవకాశమిస్తే రాష్ట్రమంతా పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తామన్నారు. నా నియోజకవర్గంలో తప్పుడు అభ్యర్థులను పోటీలో పెడితే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. భువనగిరి, మునుగోడు నియోజకవర్గాల్లో ఉత్తమ్ నియమించిన నియోజకవర్గ ఇన్‌చార్జీలను కార్యకర్తలు ఒప్పుకోవద్దని అన్నారు.



జనమంతా 'జనగణమన'

నూటొక్క జెండాలు ఆవిష్కరణ

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్లలో సోమవారం నిత్య జనగణమన కార్యక్రమం సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. జాతీయరహదారి 63పై 101 మువ్వన్నెల జెండాల రెపరెపల నడుమ ఉదయం పది గంటలకు వేలాది మంది జాతీయగీతం ఆలపించారు. కోరుట్ల కిరాణ వర్తక సంఘం ఆధ్వర్యంలో నిత్య జనగణమన కార్యక్రమాన్ని నిర్వహించనుండగా..ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి ప్రారంభించారు. మైకుల్లో జాతీయ గీతం ప్రారంభం కాగానే ఎక్కడి వారు అక్కడే ఆగి.. త్రివర్ణ పతాకానికి సెల్యూట్ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిత్యజనగణమనతోపాటు ఒకేసారి నూటొక్క జాతీయ జెండాలు ఆవిష్కరించడం రికార్డుగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసినట్లుగా సంస్థ ప్రతినిధి డాక్టర్ వెంకటాచారి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్ ప్రధానవక్తగా వ్యవహరించారు.

కొలనూర్‌లో...

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూర్‌లో సోమవారం 'నిత్య జనగణమన'ప్రారంభించారు. కలెక్టర్ కృష్ణభాస్కర్ జాతీయజెండా ఎగురవేసి జనగణమన ఆలపించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

24 గంటల విద్యుత్‌తో ఒరిగేదేమీ లేదు

సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి



సాక్షి, జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాతో రైతులకు ఒరిగేదేమీ లేదని సీఎల్పీ ఉపనేత తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. జగిత్యాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పది ఎకరాలలోపు సాగు భూములున్న రైతులు 98 శాతం మంది ఉంటారని.. వారికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా సరిపోతుందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక.. చీడపీడలతో ఖరీఫ్‌లో రైతులు పంట నష్టపోయారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులందరికీ పెట్టు బడి రాయితీ లబ్ధి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బావుల్లో నీళ్ల లేవనీ.. భూగర్భ జలాలడుగంటిపోయాయని నివేదికలు సమర్పించిన విషయాన్ని గుర్తు చేశారు.

'చెప్పు' కొనలేని బాధ

సర్కారు బడుల్లో సగం మందికి చెప్పుల్లేవు



కాలినడకన బడికి వెళ్తున్న కన్నాపూర్ తండా విద్యార్థులు

సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ పాఠశాలకు వచ్చేది పేదవిద్యార్థులే. తల్లిదండ్రులు కూలీనాలీ చేస్తూ పిల్లలను సర్కారు బడికి పంపిస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజనం, యూనిఫాం.. పుస్తకాలు సరఫరా చేస్తున్న ప్రభు త్వం కాళ్లకు చెప్పులు లేవన్న విషయాన్ని గుర్తించడంలేదు. రాష్ట్రంలో 25,991 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుండగా.. దాదాపు 30 లక్షల మంది విద్యార్థులు వాటిలో చదువుతున్నారు. ఇందులో సగానికంటే ఎక్కువమంది విద్యార్థులు చెప్పుల్లేకుండానే బడికి వెళ్తున్నారని విశ్రాంత డైట్ అధ్యాపకుడొకరు 'సాక్షి' తో ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 187 మంది విద్యార్థులున్నారు. అందులో 44 మంది విద్యార్థులకు చెప్పుల్లేవు. ఇదే జిల్లా రామారెడ్డి మండలం కన్నాపూర్ తండాకు చెందిన విద్యార్థులు కాళ్లకు చెప్పుల్లేకుండానే నిత్యం కన్నాపూర్ యూపీఎస్‌కు కాలినడకన వెళుతున్నారు. జుక్కల్ మండలం చిన్న ఎడ్గి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 32 మంది విద్యార్థులు బడికి రాగా.. వారిలో నలుగురికి మాత్రమే చెప్పులున్నాయి.

మోటార్ల 'డ్రై రన్'తో అసలుకే మోసం!

24 గంటల విద్యుత్ సరఫరాపై నిపుణులు

- 5–6 గంటల సేపే బోరు బావుల నుంచి నీళ్లొచ్చే పరిస్థితి
- ఆ తర్వాత బోర్లు నడిపితే విద్యుత్ వృథా, మోటార్లు కాలిపోయే ప్రమాదం
- డ్రై రన్ ప్రొటెక్టర్ల ఏర్పాటే సమస్యకు పరిష్కారం



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభమైన నేపథ్యంలో బోర్లకు బిగించిన ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపు ఎంత ముఖ్యమో బోరు మోటార్లకు డ్రై రన్ ప్రొటెక్టర్లను అమర్చుకోవడం అంతే ముఖ్యమని రైతాంగానికి విద్యుత్‌రంగ నిపుణులు సూచిస్తున్నారు. బోరు బావుల నుంచి 5 నుంచి 6 గంటలపాటే నీళ్లు వస్తున్నాయని, ఆ తర్వాత మళ్లీ వాటిలో భూగర్భ జలాల రీచార్జికి చాలా సమయం పడుతోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో 24 గంటల విద్యుత్ సరఫరాతో నీళ్లు రాకపోయినా ఖాళీ బోర్లు నిరంతరంగా నడిచే (డ్రై రన్) అవకాశముందని, దీంతో విద్యుత్ వృథాగా ఖర్చు కావడంతోపాటు వేలాది రూపాయలు విలువ చేసే బోరు మోటార్లు కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్లో రూ. ఐదారు వందలకే డ్రై రన్ ప్రొటెక్టర్లు లభిస్తున్నాయని, రైతులందరూ వాటిని బిగించుకోవాలని సూచిస్తున్నారు. బోర్లలో నీరు ఇంకిపోతే వెంటనే డ్రై రన్ ప్రొటెక్టర్లు ఆటోమేటిక్‌గా విద్యుత్ మోటార్లను ఆఫ్ చేస్తాయని చెబుతున్నారు.

కొన్ని రోజుల తర్వాత స్థిరత్వం...

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా మొదలవడంతో రైతులతోపాటు విద్యుత్ సంస్థలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ పథకం వల్ల తొలుత కొన్ని రోజులపాటు విద్యుత్, భూగర్భ జలాల వినియోగం భారీగా పెరిగే అవకాశముందని .. ఆ తర్వాతి రోజుల్లో 24 గంటల విద్యుత్ సరఫరాపై రైతుల్లో నమ్మకం ఏర్పడుతుందని ప్రముఖ విద్యుత్‌రంగ స్వచ్ఛంద సంస్థ 'ప్రయాస్ ఎనర్జీ'ప్రతినిధి శ్రీకుమార్ 'సాక్షి'కి తెలిపారు. సాగునీరు ఎప్పుడు అవసరముంటే అప్పుడే రైతులు విద్యుత్‌ను వినియోగించుకుంటారని, దీంతో విద్యుత్‌తోపాటు భూగర్భ జలాల వృథా వినియోగం తగ్గిపోతుందన్నారు. ప్రస్తుతం రోజుకు 9 గంటలపాటే విద్యుత్ సరఫరా ఉండటం, మళ్లీ మర్నాటి వరకు విద్యుత్ సరఫరాకు అవకాశం లేకపోవడంతో విద్యుత్ ఉన్నప్పుడే నీటిని తోడుకోవాలనే ఉద్దేశంతో రైతులంతా అవసరమున్నా లేకున్నా బోర్లను అతిగా వినియోగిస్తున్నారని చెప్పారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో అవసరమున్న మేరకే బోర్లను వినియోగిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో విద్యుత్, భూగర్భ జలాల వినియోగంలో స్థిరత్వం వస్తుందన్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లలో నీటి వినియోగాన్ని నియంత్రించేందుకు రోజుకు కొంతసేపు మాత్రమే నీటిని సరఫరా చేస్తారని, దీంతో ఆ అపార్ట్‌మెంట్లలో నివసించే వారంతా అవసరానికి మించిన నీటిని ముందుగానే పట్టుకుని నిల్వ పెట్టుకుంటారని తెలిపారు. అదే నిరంతర నీటి సరఫరా ఉండే అపార్ట్‌మెంట్లలో అవసరమున్నప్పుడు మాత్రమే కుళాయిల ద్వారా నీటిని వాడుకుంటారని ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు.

విద్యుత్ లెక్కలు అవసరం...

రాష్ట్రంలో వ్యవసాయానికి సరఫరా చేస్తున్న విద్యుత్‌పై ఇప్పటివరకు లెక్కలు లేవని, 24 గంటల విద్యుత్ సరఫరా అమలవుతున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఇకపై కచ్చితమైన గణాంకాలు అవసరం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు బిగించాలని విద్యుత్ సంస్థలకు సూచించారు. అప్పుడే వ్యవసాయ విద్యుత్ వినియోగంపై స్పష్టమైన గణాంకాలు తెలుస్తాయన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 2-1-2018

గృహిణిగా ఉండడమే హాయి!




న్యూ ఇయర్‌కి విద్యాబాలన్ నిర్ణయాలేం తీసుకోరట! 'వై మేడమ్?' అంటే.. 'మొదటి రోజే వాటిని బ్రేక్ చేయడం బాగోదు కదా!' అని పెద్దగా నవ్వేశారు. జనవరి ఫస్ట్ బాలన్ బర్త్‌డే కూడా. ఆ ఒక్క రోజు తన ఇష్టం వచ్చినట్లు ఉండి, రెండో రోజు నుంచీ డిసిప్లిన్డ్‌గా ఉండేందుకు విద్య ట్రై చేస్తారట. మంచి పాలసీనే. బాలన్‌కి నిన్నటితో 38 కంప్లీట్ అయ్యాయి. రోజుంతా ఇంట్లోనే ఆత్మీయులతో గడిపారు. డైటింగ్ పాట్లు లేకుండా చక్కగా డిన్నర్ చేశారు. వచ్చిన గిఫ్టుల్ని తెరిచి చూడ్డానికే.. ఆమెకు టైమ్ సరిపోలేదు. 'ఇంతకీ మీకు మీరు ఇచ్చుకునే గిఫ్ట్ ఏమిటి?'' అని మీడియావాళ్లెవరో బాలన్‌ని అడిగారు! 'మీరెక్కడి నుంచి వచ్చారు?!' అని బాలన్ ఉలిక్కిపడి చూసి పెద్దగా నవ్వారు. 'మీ వాళ్లే ఎవరో ఇన్విటేషన్ పంపారు మేడమ్' అన్నారు ఆ వచ్చినవాళ్లు. ఏ పనైనా.. విథౌట్ గిల్టీ చెయ్యాలని అనుకున్నారట విద్యాబాలన్. అదే తనకు తను ఇచ్చుకునే గిఫ్ట్ అట! మరి న్యూ ఇయర్ రిజల్యూషన్? అలాంటిదేమీ లేదట! అయితే టూర్‌లు తగ్గించి, కుదురుగా ఒక చోట ఉండేందుకు కుదురుతుందేమో చూడాలి ఈసారి అన్నారు! 2017 విద్యాబాలన్‌కి రెండు మంచి హిట్లు ఇచ్చింది. ఒకటి 'బేగమ్ జాన్'. ఇంకోటి 'తుమ్హారీ సులు'. ఇప్పటికైతే ఇంకా కొత్త సినిమాలకు సంతకాలేం చెయ్యలేదు. 'ఈ ఏడాది మీ లైఫ్‌లో ఎలాంటి మార్పులు కోరుకుంటున్నారు?' నిన్న బర్త్‌డే పార్టీలోనే బాలన్‌ని మరో క్వొశ్చన్ వేస్తే.. 'మార్పులేం కోరుకోవడం లేదు' అన్నారు. అంటే.. మీనింగ్? ఇప్పుడున్నట్లే ఉండడం బాలన్‌కి బాగుందన్నమాట. అంటే.. సంతోషంగా.. తుమ్హారీ సులు చిత్రంలోని గృహిణిగా!

ఫైర్ అండ్ ఐస్




కంగనా రనౌత్.. డేర్ డెవిల్! కరణ్ జోహార్.. స్మూత్ గై. ఇద్దరూ ఒకప్పుడు మంచి ఫ్రెండ్స్. ఇప్పుడు ఫైర్ అండ్ ఐస్. 'కాఫీ విత్ కరణ్' షోకి వచ్చి.. కరణ్‌ని కంగనా హర్ట్ చేసినప్పటి నుంచి ఇద్దరి మధ్యా దూరం పెరిగింది. ఆ అమ్మాయి అతడినేం తిట్టలేదు. 'నీ బంధువుల్నే నువ్వు పైకి తెస్తావు కరణ్. టాలెంట్ ఉన్నవాళ్లను కన్నెత్తి కూడా చూడవు' అని షోలో అందరి ముందూ అనగానే కరణ్ ఖంగు తిన్నాడు. ఆమెతో మాట్లాడ్డం మానేశాడు. అమె వస్తుంటే తప్పుకుని తిరగడం మొదలు పెట్టాడు.




ఆమె ఊసెత్తితే చెవులు మూసుకోవడం స్టార్ట్ చేశాడు. 'ఛ.. నీతో నాకేంటి?' అని కంగన కూడా వదిలేసింది. మొన్న ముంబైలో విరాట్, అనుష్కల రిసెప్షన్‌కి ఇద్దరూ వచ్చారు. ఒకర్నొకరు చూసుకున్నారు కానీ, మాట్లాడుకోలేదు. కరణ్ లోపలికి వస్తున్నప్పుడు రేఖ, మాధురీ దీక్షిత్‌లతో కలిసి ఫొటోగ్రాఫర్‌లకు స్టిల్స్ ఇస్తూ ఉంది కంగన. అక్కడ ఆమెను చూసి, ముక్కు చిట్లించుకుని పోయాడు కరణ్. మళ్లీ ఎప్పుడు కలుస్తారు వీళ్లు?! ఇద్దరికీ బస్తాల కొద్దీ సెల్ఫ్ రెస్పెక్ట్ ఉంది. కాలమే ఆ బస్తాలను మోసి, వారికి భారాన్ని తగ్గించాలి.

సెటైరమ్మా.. సెటైరూ..!

అంతా జడ్జీలే అయితే ప్రేక్షకులు ఎవరు?



పద్మావతి రిలీజ్ కాబోతోంది! ఎప్పుడు అనేది తర్వాత. ఇప్పుడైతే సెన్సార్‌బోర్డు ఓకే చేసింది. యు.ఎ. సర్టిఫికెట్ ఇచ్చేసింది. పెద్దలు చూడొచ్చు. పిల్లలూ చూడొచ్చు. మరి ఇప్పటి వరకు గొడవ గొడవ చేసినవాళ్లు చూడొద్దా? చూడొచ్చు. వాళ్ల కోసమే బోర్డు కొన్ని సీన్స్‌ని కట్ చేయిస్తోంది. కొన్ని అంటే ఓ 26. పేరును కూడా మార్చాలట! 'పద్మావత్' అని! అంతేకాదు, సినిమా స్టార్ట్ అయ్యే ముందు, మధ్యలో కొన్ని సీన్లు వచ్చినచోట 'డిస్‌క్లెయిమర్' పెట్టమంది. అంటే.. ఇవి మా బుద్ధికి పుట్టినవి కావు. అక్కణ్ణుంచి, ఇక్కణ్ణుంచి తీసుకున్నవి మాత్రమే అని. ఇవన్నీ చేశాక, మళ్లీ సెన్సార్ టీమ్ అంతా ఒకసారి కలిసి సినిమాను చూస్తుందట. ఆ తర్వాత మాత్రమే భన్సాలీని పిలిచి, 'ఇదిగో బాబూ.. సర్టిఫికెట్. ఇక నీ సినిమా ఆడించుకో' అని చెప్తుందట. భన్సాలీ ఇవన్నీ చేస్తాడా? లేక లీగల్‌గా ఫైట్ చేసి తన 'పద్మావతి'ని చెక్కుచెదరకుండా ప్రదర్శించుకుంటాడా? అదేం తెలియడం లేదు. నిర్మాతలు కూడా కారాలు మిరియాలు నూరుతున్నారు. రిలీజ్‌కు ఓకే చెప్పి, కొన్ని షరతులు పెట్టిన సెన్సార్‌బోర్డు రోజుకో న్యాయ నిర్ణేతల టీమ్‌ని రప్పించి 'పద్మావతి' షో వేస్తోంది. అందరూ న్యాయ నిర్ణేతలే అయితే సినిమా చూసేదెవరు అని ప్రొడ్యూజర్లు పొగిలి పొగిలి దుఃఖిస్తున్నారు.



ఎవరు నడుచుకుంటూ వస్తే
సూర్యుడు గొడుగు పడతాడో...
ఎవరికి దాహం వేస్తే
మేఘం పరుగు పరుగున వస్తుందో...
ఎవరు విశ్రమిస్తే
చుక్కలు జోల పాడతాయో...
ఎవరు బొటనవేలెత్తి చూపితే
కోట్ల అభిమానులు పూలదండలౌతారో...
ఆ తమిళ సూపర్‌స్టార్
సింగిల్‌గా రాజకీయాల్లోకి వచ్చి
'తలైవా'గా రాణిస్తారా?
తెలుగు ఇండస్ట్రీ ఏమంటోంది?

ప్రేక్షక

దేవుళ్లు శాసిస్తారు తలైవా పాటిస్తాడు

రజనీకాంత్ : కలక్షన్‌లలో హిట్ అయ్యారు. ఎలక్షన్‌లలో హిట్ అవుతారా?

పొలిటికల్ ఎంట్రీ ఇస్తున్నట్లు చెన్నైలోని రాఘవేంద్ర మండపంలో డిసెంబర్ 31న రజనీకాంత్ ప్రకటించడంతో ఆయన అభిమానులకు ఈ ఏడాది ఒక రోజు ముందుగానే న్యూ ఇయర్ వచ్చేసినట్లయింది! అయితే అది యేటా రెగ్యులర్‌గా వచ్చే న్యూ ఇయర్ కాదు. ఇరవై ఏళ్లుగా కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తే వచ్చిన న్యూ ఇయర్! న్యూ ఎరా!

పాలిటిక్స్‌లోకి వచ్చేశానని రజనీ ప్రకటించగానే మండపంలోని వేలాది మంది అభిమానులు 'తలైవ.. తలైవ..' అని నినాదాలు చేశారు. అవి రణన్నినాదాలు. తమిళనాడులో ఉద్దండులైన రాజకీయ నాయకులను సైతం ఉలిక్కిపడేలా చేసిన రాజకీయ ప్రకంపనాలు.

''అవినీతిపై పోరాడదాం.. అసమానతల్ని అంతమొందిద్దాం. మార్పుని తీసుకొద్దాం'' అని రజనీ పిలుపు ఇవ్వగానే.. 'అలాగే తలైవా.. చూపిద్దా తడాఖా'' అని అభిమానుల స్వరం ప్రతిధ్వనించింది. రజనీ నిజంగానే పాలిటిక్స్‌లోకి వచ్చేశారా? ఇంకా కొంతమంది నమ్మడం లేదు. రెండు దశాబ్దాల ఎదురుచూపులు అంత వెలుగును ఒక్కసారిగా తట్టుకోగలవా? ఆ వెలుగు నిజమని నమ్మగలవా? నమ్మాలి. నిజంగానే రజనీలో ఆ రోజున రాజకీయ నాయకుడు సాక్షాత్కరించాడు. బొటనవేళ్లు పైకెత్తి తన రాజకీయ ప్రవేశానికి సంకేతం ఇచ్చారు.

''నాకు జీవితాన్ని ఇచ్చిన అభిమానులారా.. తమిళ ప్రజలారా.. మీ అందరికీ నమస్కారాలు. ధన్యవాదాలు. నా అభిమానులను ఎలా కీర్తించాలో తెలియడం లేదు. ఆర్రోజులుగా, ఆరువేల మందికి పైగా అభిమానులు నాతో ఫొటో దిగేందుకు చూపిన ఓర్పు, పాటించిన క్రమశిక్షణ చెప్పలేని అనుభూతిని కలిగించింది. ఇదే క్రమశిక్షణ, ఓర్పు భవిష్యత్తులో కూడా కొనసాగితే ఏదైనా సాధించగలమని అర్థమైంది. మనం సరైన దిశగా వెళుతున్నాం. రాజకీయాల్లోకి రావడానికి నాకు భయం లేదు'' అని తన ప్రసంగాన్ని చిన్నపాటి మోటివేషన్‌తో ప్రారంభించారు రజనీ.

''నీ బాధ్యతలు నువ్వు నెరవేర్చు. మిగతావి నేను చూసుకుంటానని కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు ఉపదేశించాడు. యుద్ధంలో జయిస్తే రాజ్యం, ఓడితే స్వర్గం ప్రాపిస్తుంది. అదే.. యుద్ధం చేయకుండా వెళ్లిపోతే పిరికిపంద అంటారు. ఇప్పటికే అన్నీ పూర్తి చేశాను. బాణాన్ని గురి చూసి వదలడమే ఇక మిగిలింది'' అని చెప్పారు. రజనీ ఒకసారి చెప్పాడు కాబట్టి.. ఇంకోసారి అడగనక్కర్లేదు. నిజమేనా అని చెయ్యి గిల్లుకోనక్కర్లేదు.

• • •

రజనీసర్.. యువార్ ది స్టార్.
రజనీసర్.. యువార్ ది వార్.
ఇదీ.. నిన్నటి, మొన్నటి వైబ్రేషన్.. సెలబ్రేషన్!

రాజకీయాల్లో రజనీ శక్తియుక్తులేమిటో బయట పడేందుకు మరికొంత సమయం పట్టొచ్చు కానీ సినిమాల్లో ఆయనకు ఉన్న ఇమేజ్ ఏ స్టార్‌కూ లేనిది.

'రజనీసర్ టైమ్ చూసుకోరు. టైమ్ ఎంత అవ్వాలో ఆయనే డిసైడ్ చేస్తారు!'.

'రజనీసర్ క్యాలెండర్‌లో మార్చి 31 తర్వాత ఏప్రిల్ 2 ఉంటుంది. అందుకే రజనీసర్‌ని ఎవరూ ఫూల్‌ని చెయ్యలేరు'.

'శాంటాక్లాస్ తనే ప్రతి సంవత్సరం రజనీసర్ దగ్గరికి గిఫ్ట్ కోసం వస్తాడు!'.

'రజనీసర్ 'కౌన్‌బనేగా...' హాట్ సీట్‌లో కూర్చున్నప్పుడు సర్‌ని క్వొశ్చన్ అడగడానికి కంప్యూటర్ గారే హెల్ప్‌లైన్ తీసుకోవలసి వచ్చింది!'.

రజనీసర్ ఆరో తరగతి నోట్సే ఇప్పుడు మనం చూస్తున్న వికీపీడియా!

సూపర్‌మేన్, బాట్స్‌మేన్ రజనీసర్ దగ్గరికి ఎందుకు వచ్చారో తెలుసా? ఆ రోజు టీచర్స్ డే.

ఇవన్నీ.. రజనీకాంత్ అభిమానుల మీద ఉన్న జోకులు. అంతగా వారికి ఆయనపై నమ్మకం. ఏదైనా చేయగలడని, ఏదైనా సాధించగలడని. అలాంటి శక్తిమంతుడు ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చాడంటే.. సమాజమే మారిపోతుంది వారు గట్టిగా నమ్ముతున్నారు. అభిమానం రాబిన్‌హుడ్‌నీ చేస్తుంది, రాఘవేంద్ర స్వామినీ చేస్తుంది. పాలిటిక్స్‌లో అంత పవర్ ఉంటుంది.

• • •

రజనీ రాజకీయ ఎంట్రీ కోసం ఆయన అభిమానులు మాత్రమే ఇంతకాలం ఎదురు చూడలేదు. ప్రత్యర్థులకు చెక్ పెట్టడం కోసం రాజకీయ నాయకులు సైతం పరోక్షంగా ఆయన్ని 'రాజకీయం'లోకి దింపేందుకు ఇరవై ఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. జయలలితకు చెక్ పెట్టడానికి కరుణానిధి వర్గం, కరుణానిధిని అదుపులో ఉంచేందుకు జయలలిత వర్గం ఎన్నోసార్లు రజనీ అనే అస్త్రాన్ని ఎక్కుపెట్టే ప్రయత్నం చేశారు. 'పోలింగ్ డేట్ దగ్గర పడింది రజనీ. నువ్వొక్క మాట చెప్పు ఈ రాష్ట్రానికి.. మేము వందసార్లు ప్రచారం చేసుకుంటాం' అనే సంకేతాలనూ డీఎంకే అనేకసార్లు రజనీకి పంపింది. ఆఖరికి 'కబాలి' ట్రైలర్‌ని కూడా ఆ పార్టీ జయలలితకు వ్యతిరేకంగా ప్రచారం చేసుకుంది!

రజనీ మాత్రం ఎప్పుడూ ఎవరి పక్షమూ నిలవలేదు. చివరి వరకు అభిమానుల పక్షాన్నే ఉండి, ఇప్పుడు తమిళ ప్రజల కోసం అభిమానుల అండతో రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. ఆయన నిలబడి గెలిచారూ అంటే ఆయనపై అభిమానులకు ఉన్న నమ్మకం గెలిచినట్లు. అభిమానంతో ఏదైనా సాధించగలం అన్న ఆయన నమ్మకం కూడా గెలిచినట్లే!

కామెంట్స్: **శివ మల్లాల**

ఎమ్జీఆర్‌లా ఉండాలి



రజనీకాంత్ వచ్చి సరిగ్గా నిలబడి చేస్తారా? ఎలక్షన్ దాకా ఉంటారా? ఊరికే మాట్లాడుతున్నారా? పవన్ కల్యాణ్ కూడా ముప్పైసార్లు చెప్పాడు. అది అంటాడు, ఇది అంటాడు. పొలిటికల్ కన్సిస్టెన్సీ ఉండాలి పవన్‌కి అయినా, రజనీకాంత్‌కు అయినా. ఎన్టీఆర్‌గారు వచ్చారంటే, యంజీఆర్ గారు వచ్చారంటే ఒక మాట అనుకున్నారంటే తప్పో ఒప్పో చేసేసేవారు. వాళ్లకున్న కాన్ఫిడెన్స్ గానీ నమ్మకం గానీ వీళ్లకు లేదు.

- తమ్మారెడ్డి భరద్వాజ

తపన ఉన్న మనిషి



తొంభైల మధ్యకాలంలో చాల సంవత్సరాలు రజనీతో సన్నిహితంగా మెలిగాను. ప్రజలకు ఎప్పుడూ ఏదో ఒకటి చేయాలని ఆలోచిస్తుంటాడు. చాలా మంచి మనిషి. గొప్ప మానవతావాది. ఆయన రాజకీయాలలోకి వస్తారని నేను అస్సలు ఊహించలేదు. కానీ ఒక్కటి మాత్రం నాకు తెలుసు. ఆయన మనస్ఫూర్తిగా తలుచుకుంటే, దానిని సాధించే దాకా వదిలిపెట్టే రకం కాదు. కచ్చితంగా రాజకీయాల్ని ఒక పట్టు పడతాడని అనుకుంటున్నాను.

- అల్లు అరవింద్

మానవతావాది



నేను రజనీకాంత్‌ని రెండు సార్లు కలిశాను. రజనీ గురించి దేశం మొత్తం మీద ఒక అభిప్రాయం ఉంది మోస్ట్ హానెస్ట్ అని. గొప్ప మానవతావాది. ఫ్రెండ్లీ నెచర్. ప్రజలందరికి ఏమని ఉంటుందంటే.. 'రాజకీయాలు బావుండాలి. రాజకీయ నాయకులు బావుండాలి. మన సొమ్ము తినకూడదు' అని. అది నిజం కావాలంటే రజనీకాంత్‌లాంటి వాళ్లు రాజకీయాల్లోకి రావాలి. అధికారంలోకి రావాలి ముఖ్యమంత్రి కావాలి. ప్రజలకు సేవ చేయాలి.

- పోసాని కృష్ణ మురళి

స్ట్రాంగ్‌గా నిలబడాలి



రజనీకాంత్ గారు రాజకీయాల్లోకి రావటం మంచిదే. పాలిటిక్స్‌లోకి ఎవరైనా రావచ్చు. ఫలానా వాళ్లే రావాలనే రూలేం లేదు. సేవ చేయలనే ఉద్దేశం ఉంటే చాలు ఎవరైనా ఎన్నికల్లో పోటీ పడొచ్చు. ఆయనకున్న ఫ్యాన్ ఫాలోయింగ్ సాధారణమైనది కాదు. ఆయన పార్టీ పెడితే బావుంటుంది. ఆయన ఎంత వరకూ స్ట్రాంగ్ నిలబడి చేస్తారో చూడాలి. లెట్స్ హోప్ ఫర్ ది బెస్ట్.

- జీవిత రాజశేఖర్

సరైన సమయం



రజనీకాంత్ తమిళనాడు ప్రజల సమస్యలను చూసి అర్థం చేసుకున్న వ్యక్తి. ఏ నటుడైనా రాజకీయల్లోకి రావాలంటే వాళ్లంత మాస్ ఫాలోయింగ్ ఉండాలి. తెలుగు నాట ఎన్టీఆర్, తమిళనాట ఎమ్జీఆర్, జయలలిత.. వీళ్లంతా కూడా మాస్ ప్రజల హృదయాల్ని గెలుచుకున్నవారే. 25 సంవత్సరాలు టైమ్ తీసుకుని శూన్యమైన తమిళ రాజకీయల్లోకి సరైన సమయంలో రజనీ వస్తున్నాడు అనిపిస్తోంది. మనస్ఫూర్తిగా ఆయన్ని ఆహ్వానిస్తున్నాను.

- జయప్రద

చెట్టు నీడ

చూసినవాళ్లే ఎక్కువ



సాధారణంగా దేవుడు కాంతి రూపంలో ప్రత్యక్షం అవుతాడని, అదే దైవ సాక్షాత్కారం అని అంటూ ఉంటారు. అయితే అది 'కాంతి' కాదు, 'భ్రాంతి' అని కొట్టిపడేసే 'అప్రత్యక్ష' వాదులూ ఉన్నారు. అప్రత్యక్షవాదులు అంటే.. దేవుడు ప్రత్యక్షం అయ్యాడంటే నమ్మనివాళ్లు. వాళ్లను అలా వదిలేస్తే.. దేవుడిని చూశామని, దేవుడితో మాట్లాడామని కొంతమంది చెబుతుంటారు. దేవుడంటే నమ్మకం లేనివాళ్లు కూడా, దేవుడిని చూశామని చెప్పినవాళ్లను నమ్మకుండా ఉండలేనంతగా గట్టిగా ఉంటాయి ఆ చెప్పేవాళ్ల అనుభవాలు. అసలు నమ్మకుండా ఉండడం ఎందుకు? ఎందుకంటే.. దేవుడు ఎక్కడా ప్రత్యక్షంగా కనిపించడు కనుక. ఎవరెస్టు శిఖరం కనిపిస్తుంది. నయాగరా జలపాతం కనిపిస్తుంది. కశ్మీర్ లోయ కనిపిస్తుంది. దేవుడు అలా కనిపించడు. అందుకే కనిపించని దేవుడిని ప్రత్యక్షంగా చూశామంటే, 'నాకు ప్రత్యక్షం అయ్యాడూ' అంటే ఎవరూ నమ్మరు. అయినా దేవుడు శిఖరంలానో, జలపాతంలానో, లోయలానో ఎందుకు కనిపించాలి? ఆయనది కనిపించని వేరే రూపం అనుకోవచ్చు కదా. అప్పుడు దేవుడిని సందేహించే పని ఉండదు. ఏ రూపమూ లేనివాడు ఏ రూపంలో కనిపించినా 'చూడ్డానికి' మనసు అంగీకరిస్తుంది.

అయితే దేవుడికి రూపం లేకుండా లేదు! 'నమ్మకం' ఆ రూపం. నమ్మకంలోంచి ఏర్పడిన రూపం! నమ్మకం ఒకటే. రూపాలు అనేకం. ఇలా ఆలోచిస్తే.. మన చుట్టూ దేవుణ్ణి చూడనివాళ్ల కంటే, దేవుణ్ణి చూసినవాళ్లే ఎక్కువగా కనిపిస్తారు. వీళ్లందరికీ ఏదో ఒక రూపంలో దేవుడు ప్రత్యక్షం అయ్యే ఉంటాడు.

గుడ్‌ఫుడ్

మజిల్‌క్రాంప్స్‌ను తగ్గించే అరటిపండు



అతి తేలిగ్గా చవకగా దొరుకుతూ అత్యంత ఎక్కవ పోషకాలు ఉండే పండ్లలో ముఖ్యమైనది అరటిపండు. దానితో ఒనగూరే ప్రయోజనాల్లో అవి కొన్ని...

• ఒంట్లో ఖనిజ లవణాలు తగ్గి మాటిమాటికీ కండరాలు పట్టేస్తున్నవారు (మజిల్ క్రాంప్స్‌తో బాధపడుతున్నవారు) అరటిపండ్లు తింటే ఆ సమస్య దూరవుతుంది • అరటిపండులో పొటాషియమ్ పాళ్లు చాలా ఎక్కువ. అందుకే అది రక్తపోటు (హైబీపీ)ని స్వాభావికంగానే నియంత్రిస్తుంది • ఇందులో ఉండే పొటాషియమ్, విటమిన్ సి, విటమిన్ బి6... గుండె ఆరోగ్యాన్ని కాపాడేందుకు తోడ్పడతాయి • విటమిస్ సితో పాటు బి6 అంశాలు రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు సైతం తోడ్పడతాయి • అరటిపండు జీర్ణశక్తిని పెంచి, ఆహారం తేలిగ్గా జీర్ణమయ్యేలా చూస్తుంది. జీర్ణకోశ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది • ఇందులోని పొటాషియమ్ మన మూత్రపిండాల ఆరోగ్య నిర్వహణకు తోడ్పడుతుంది • ఇందులోని అమైనో యాసిడ్స్ అద్భుతమైన జ్ఞాపకశక్తికి, మెదడు చురుకుగా పనిచేయడానికి ఉపయోగపడతాయి

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం
2-1-2018

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా,

నేను ఒకతన్ని చాలా లవ్ చేస్తున్నాను. అతను కూడా నన్ను లవ్ చేశాడు. ఫస్ట్ అతనే ప్రపోజ్ చేశాడు. నేనంటే చాలా ఇష్టం. నేనే కావాలి అనేవాడు కానీ.. 5 నెలల నుండి నాతో సరిగా మాట్లాడడం లేదు. నన్ను అవాయిడ్ చేస్తున్నాడు. 'నన్ను మర్చిపో, నిన్ను పెళ్లి చేసుకోను. మావాళ్లు మన పెళ్లికి ఒప్పుకోరు' అంటున్నాడు. వాళ్లది పెద్ద కులం. మాది చిన్న కులం అన్నయ్యా. నేను బీఈడి కంప్లీట్ చేశాను. 'నాకు జాబ్ వస్తేనే పెళ్లి చేసుకుంటాను... లేదంటే నన్ను మర్చిపోవాల్సిందే 'అని అనేవాడు. కానీ అతనంటే నాకు చాలా ఇష్టం అన్నయ్యా. నాకు తను కావాలి. మీరే మంచి ఐడియా చెప్పండి ప్లీజ్.

– పూజ

ప్రేమకు పెద్దకులం చిన్న కులం కాదు కదా అసలు కులమే ఉండదు కదా పూజమ్మ.

అబ్బాయి ధోరణి చూస్తుంటే వొళ్లు మండుతోంది.

వాడికి తీ... తీ... తీ.. తీ.. తీట ఎక్కువ అనిపిస్తుంది..

ప్రేమించే ముందు కనబడని కులం, సడెన్‌గా ఎలా కనబడి చచ్చిందటా?

డ్యూయెట్ పట్టినంతసేపూ బాగానే ఉన్నాడు కదా..

ఇప్పుడేమి మాయరోగం వచ్చిందట తీటగాడికి?

ఆ దరిదాపుల్లో నేను ఉంటే పిలిచి మరీ క్లాస్ పీకేవాడిని.

డర్టీ ఫెలో.

వాణ్ణి డోర్‌మ్యాట్‌లా కింద పడేసి డర్టీ చెప్పులు తుడుచుకోవాలి.

'సార్ ఏంటి సార్ ఈ భాష. కింద పడేయడం ఏంటి? చెప్పులు తుడుచుకోవడం ఏంటి?? ఏ డీసెంట్ లవ్ డాక్టర్ అట్లా మాట్లాడడు సార్..'

నేను డీసెంట్ కాదు... నేను అన్నయ్యను!

'సార్ మీ పేరు రామ్ నుంచి నరసింహ అని పెట్టుకోండి సార్. రాముడు ఎంత శాంతిప్రియుడు. మీరు ఇలా ప్రవర్తిస్తే మీ పేరుకే తిరకాసు సార్..'

సరే.. పూజమ్మ వాడ్ని మరిచిపో.. వాడు చాలా బ్యాడ్.. నిన్ను వాడేసుకుంటాడు.

ఆ నీచ్... కీచ్.. కి లెసన్ చెప్పురా నా బంగారం.

ప్రేమలాంటి అరటిపండు మీద వాలిన డర్టీ ఈగరా వాడు.

అన్ని డర్టీచోట్లా వాలి... నీ ప్రేమను మురికి చేస్తున్నాడు.

మస్కిటో బ్యాట్‌తో కొట్టినట్టు..

ఈ డర్టీ నీచ్.. కీచ్ ని నీ లైఫ్‌లో నుంచి.. టప అని

నీ హార్ట్‌లో నుంచి.. టప అని

నీ లవ్‌లో నుంచి.. టప అని బ్యాటుతో దోమకు షాక్ ఇచ్చినట్టు ఇచ్చెయ్యరా బంగారం.

'సార్ ఆవేశం తగ్గించుకోండి సార్... ఇంద అరటిపండు తినండి... కూల్.. కూల్.. కూల్..'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

దర్శకద్వయం

భర్త యాక్షన్ చెప్తే భార్య కట్ చెప్తుంది

భార్యాభర్తలై జంటగా పని చేసే నటులున్నారు.. కొరియోగ్రాఫర్లు ఉన్నారు... సింగర్లు ఉన్నారు... కాని భార్యాభర్తలై జంటగా పని చేసే దర్శకులు మొత్తం ఆసియా ఖండానికి ఒకే ఒకరు ఉన్నారు. వారే పుష్కర్-గాయత్రి. వారిరువురు కలిసి డైరెక్ట్ చేసి తాజా తమిళ సినిమా 'విక్రమ్ వేదా' పన్నెండు కోట్ల పెట్టుబడికి 90 కోట్లు సంపాదించి సంచలనం సృష్టిస్తోంది.


పుష్కర్–గాయత్రీ
తమిళ చిత్రం 'విక్రమ్ వేద'లో విజయ్ సేతుపతి

చెట్టు మీద ఉన్న శవాన్ని దింపి భుజాన వేసుకుని నడుస్తున్న విక్రమార్కుడితో బేతాళుడు రోజుకో కథ చెబుతాడు. చిత్ర విచిత్రమైన కథలు. గాయత్రి–పుష్కర్‌ల కథ కూడా కొంచెం విచిత్రమైనదే. దర్శకత్వం వహించే భార్యాభర్తలుగా వీళ్లు ఒక ట్రెండ్ సృష్టించారు. గతంలో మనం 'భారతి–వాసు' వంటి స్నేహితులు, అబ్బాస్– మస్తాన్ వంటి అన్నదమ్ములు కలిసి దర్శకత్వం వహించిన సందర్భాలు ఉన్నాయి. కాని భార్యాభర్తలు కలిసి దర్శకత్వం వహించడం వింత. ఎవరు యాక్షన్ చెప్తారు, ఎవరు కట్ చెప్తారు, ఎవరు స్క్రీన్ ప్లే రాస్తారు, ఎవరు డైలాగ్ ఎక్స్‌ప్లయిన్ చేస్తారు.. ఇదంతా అంత సులభం కాదు. కాని మా విషయంలో ఇది చాలా ఈజీ అంటారు గాయత్రి–పుష్కర్. పెళ్లే మాకు దర్శకత్వం లాంటిది... దర్శకత్వమే మాకు పెళ్లి లాంటిది అంటారు వాళ్లు.

మెడ్రాస్ కపుల్

పుష్కర్–గాయత్రిలు పుట్టి పెరిగిందంతా చెన్నైలోనే. అందుకే వారి నరనరాన చెన్నై ప్రవహిస్తూ ఉంటుంది. ఇద్దరూ లయోలా కాలేజ్‌లో విజువల్ కమ్యూనికేషన్స్ చదువుతూ ఉండగా ఒకరికొకరు పరిచయం ఏర్పడింది. ఆ రోజులను తలుచుకుంటూ గాయత్రి ఇలా అంది– 'ఇద్దరికీ ఒకేరకమైన ఇష్టాలు ఉండటం గమనించాం. ఇద్దరికీ ఒకే రకమైన సినిమాలు ఇష్టం. పుస్తకాలు ఇష్టం. ఇద్దరం ఒకే నాటకానికి కలిసి వెళ్లేవాళ్లం. ఇద్దరం డైరెక్షన్‌లోకి రావాలని అప్పుడే నిర్ణయించుకున్నాం' అందామె. డిగ్రీ అయ్యాక సాధారణంగా సినిమా ఇండస్ట్రీలో ఎక్కడో ఒక చోట అసిస్టెంట్స్‌గా చేరి కెరీర్ మొదలెడతారు. కాని పుష్కర్–గాయత్రీలు సినిమా నియమబద్ధంగా చదవాలని నిర్ణయించుకున్నారు. అందుకే గాయత్రి షికాగోలో, పుష్కర్ న్యూ ఓర్లెన్స్‌లో సినిమా కళను అభ్యసించారు. అక్కడి నుంచి వచ్చాక పి.సి.శ్రీరామ్, మానవ్ మీనన్ వంటి వారి దగ్గర యాడ్ రంగంలో పని చేశారు. ఇక చాలు అనుకొని 2007లో 'ఓరమ్ పో' సినిమాతో దర్శకత్వంలోకి వచ్చారు.



బ్లాక్ కామెడీ

ఇండియన్ సినిమాలో బ్లాక్ కామెడీతో వచ్చే సినిమాలు తక్కువ. అమర్యాదకరమైన, నలుగురు బహిరంగంగా చర్చించని విషయాలను వేదికగా తీసుకుని హాస్యాన్ని పండించే ఈ తరహా సినిమాలనే పుష్కర్–గాయత్రీలు సినిమాలుగా తీయాలని నిశ్చయించుకున్నారు. వాళ్ల మొదటి సినిమా 'ఓరమ్ పో' చెన్నై అర్ధరాత్రిళ్లు ఆటో రేసింగ్ పెట్టుకునే ఆటోడ్రైవర్ల మధ్య నడిచే సినిమా. ఈ సినిమాతో పుష్కర్–గాయత్రీలు కొత్త ప్రేక్షకులను సృష్టించుకున్నారని చెప్పవచ్చు. వీరి తర్వాతి సినిమా 'వా–క్వార్టర్ కట్టింగ్' కూడా కొత్తరకం కథే. ఉద్యోగం కోసం సౌదీకి వెళ్లాలనే కుర్రాడు తాను సౌదీకి వెళ్లబోయే రాత్రి ఇక సౌదీకి వెళ్లాక అక్కడ మద్యం తాగలేనని గ్రహించి జీవితంలో ఇప్పటి దాకా మద్యం ముట్టలేదు కనుక ఒక్కసారి ముట్టి వెళ్లిపోదామని అనుకుంటాడు. అయితే ఆ రోజు ఎలక్షన్లు జరుగుతుంటాయి కనుక అది డ్రై డే. ఇక అతడు, అతడి స్నేహితులు మద్యం కోసం ఎన్ని పాట్లు పడ్డారన్నది కథ. దీనికి కూడా ప్రేక్షకులు హిట్ టాక్ ఇచ్చారు.

విక్రమ్ వేదా

పుష్కర్–గాయత్రీలు చాలా ఒరిజినల్ స్క్రిప్ట్ కోసం ప్రయత్నించే దర్శకులు అని చెప్పుకోవచ్చు. అందుకే వారు పదేళ్ల కాలంలో కేవలం మూడు సినిమాలే తీశారు. మొదటి రెండు సినిమాల తర్వాత వాళ్లు ఏడేళ్ల గ్యాప్ తీసుకుని 'విక్రమ్ వేదా'కు దర్శకత్వం వహించారు. దీనికి ముందు ఒకటి రెండు స్క్రిప్ట్‌లు అనుకున్నా వారిని అవి ఉత్సాహపరచలేదు. ఆ సమయంలో వారి దృష్టి బేతాళ కథల మీద పడింది. విక్రమార్కునితో బేతాళుడు రోజుకో కథ చెప్పడం దానికి అనూహ్యమైన జవాబును విక్రమార్కుడు చెప్పడం ఇలా సాగే కథలాగా ఒక సినిమా తీయాలనుకున్నారు. అదే విక్రమ్ వేదా. ఇందులో విక్రమ్ అనే సిన్సియర్ పోలీసాఫీర్, వేదా అనే రౌడీ ఎలా ఒకే ఘటనకు తమ తమ దృక్కోణం నుంచి జవాబులు చెప్పారో ఆసక్తికరంగా ఉంటుంది. విక్రమ్ తన వాదన వినిపిస్తుంటే వేదా తన వాదన వినిపిస్తాడు. మనిషి పూర్తిగా మంచి పూర్తిగా చెడ్డ ఉండడని మధ్యలో కొన్ని గ్రే ఏరియాలు ఉంటాయని ఈ కథ చెబుతుంది. అనూహ్యమైన మలుపులతో చెన్నై ఒరిజినాలిటీతో సాగే ఈ కథకు ప్రేక్షకులు బ్రహ్మరథం పలికారు.

అద్వైతం

పుష్కర్–గాయత్రీలు ఇద్దరు కాదు. దాదాపు ఒక్కరే అన్నట్టుగా కలిసిపోయారు. 'మీకు విభేదాలు రావా?' చాలామంది వారిని ప్రశ్నించారు. 'మేము ఒకరి కళ్లలో మరొకరు కళ్లు పెట్టి చూసిన వెంటనే ఒకరి అభిప్రాయం మరొకరికి తెలిసిపోతుంది. తప్పును ఆపేస్తాం. ఒప్పును కొనసాగిస్తాం' అంటుంది గాయత్రీ. ఇంట్లో అయినా లొకేషన్‌లో అయినా వీరి మధ్య వాదన ఉండదు చర్చ ఉంటుంది. అందుకే మా జంట సక్సెస్ అయ్యింది అంటారు వాళ్లు. విక్రమ్ వేదా సూపర్ హిట్ తర్వాత రజనీకాంత్ అంతటి వ్యక్తి ప్రత్యేకంగా వీరిని అభినందించాడు. వీరికి చాలా డిమాండ్ ఏర్పడింది. ఇద్దరూ విడివిడిగా దర్శకత్వం వహించవచ్చు కదా అని అడిగితే వాళ్లు చెప్పే జవాబు 'అంత అవసరం ఏమొచ్చింది?' అని.

ఈ జంట చాలా జంటలకు ఆదర్శం అవ్వాలి.

పాశుర ప్రభాతం

18వ పాశురం

ఉందు మదకళిత్త నోడాద తోళ్ వలియన్
నందగోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్
వందెలకుమ్ కోళియళైత్తవ గాణ్, మాదవి
ప్పన్దల్ మేల్ కుల్‌కాల్ కుయిత్ నంగళ్ కూలినగాణ్
పందార్ విరవి ఉన్ మైత్తునన్ పేర్ పాడ
చ్చెందామరై క్కై యాల్ శరార్ వళై యొలిప్ప
వందు తిఱవాయ్ మగిళ్‌ందు ఏలో రెంబావాయ్



భావం: మదజలం స్రవిస్తున్నట్టి ఏనుగుల వంటి బలం కలవాడు, యుద్ధంలో శత్రువులను చూసి భయపడని, వెనకడుగు వేయని, నందగోపుని కోడలా! సుగంధాన్ని వెదజల్లునట్టి కేశపాశాలుగల ఓ నీళాదేవీ! తలుపు గడియ తెరువమ్మా! కాలాన్ని గుర్తించే కోళ్లు అంతా చేరి అరుస్తున్నాయి. మాధవీలతలు పాకినట్టి పందిరిపైన గుంపులు గుంపులుగా చేరిన కోకిలలు కూస్తున్నాయి. కనీసం దీన్నిబట్టి అయినా, తెల్లారినదని గుర్తించి మేల్కొనుము.

చేతిలో బంతిని కలిగినదానా! నీ మేనబావయైన శ్రీకృష్ణుని గుణాలను పాడటానికి సంతోషంగా వచ్చామమ్మా! ఎర్రతామర పూవును పోలిన నీ చేతితో అందమైన నీ చేతి కంకణాలు గల్లుమని ధ్వని చేయునట్లుగా తలుపు తెరువమ్మా! అని గోపికలు నీళాదేవిని ప్రార్థించారు.

- ఎస్. శ్రీప్రియ

కాసుకో సుడోకు

2	9		7	4	3	5		
		3	1	2				
	7	4					3	
	1		5			8		7
	3	5	4		1	6	9	
6		8			2		1	
	2					7	8	
				1	8	4		
		6	2	9	7		5	3

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3 X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు


2	9	4	5	6	1	8	7	3
5	6	8	4	3	7	2	1	9
1	3	7	9	8	2	5	6	4
8	7	9	2	4	3	1	5	6
4	5	2	6	1	8	3	9	7
3	1	6	7	5	9	4	2	8
9	4	5	8	2	6	7	3	1
7	2	3	1	9	4	6	8	5
6	8	1	3	7	5	9	4	2

పీడియాట్రిక్ కౌన్సెలింగ్ | ఫ్యామిలీ డాక్టర్

పాప నోట్లో పుండ్లు... తగ్గేదెలా?

మా పాప వయసు ఆరేళ్లు. మొన్నీమధ్య గొంతునొప్పి ఉందని అంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాం. పాప నోటిలోన, నాలుక మీద, గొంతు లోపలి భాగంలో రెండు మూడుసార్లు పుండ్లలాగా వచ్చాయి. పాపకు గొంతులో ఇన్ఫెక్షన్‌లా కొంచెం ఎర్రబారింది. ఏమీ తినడానికి వీలుగాక విపరీతంగా ఏడుస్తోంది. మా పాప సమస్యకు మంచి సలహా ఇవ్వండి.

– వైదేహి, ఖమ్మం



మీరు చెప్పిన లక్షణాలను బట్టి చూస్తే మీ పాపకు పదే పదే నోటిలో పుండ్లు (మౌత్ అల్సర్స్) వస్తున్నాయని తెలుస్తోంది. ఈ సమస్యను చాలా సాధారణంగా చూస్తుంటాం. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. అవి...

● ఉద్వేగాల పరమైన ఒత్తిడి (ఎమోషనల్ స్ట్రెస్), ● బాగా నీరసంగా అయిపోవడం (ఫెటీగ్), ● విటమిన్‌లు, పోషకాల లోపం... (ముఖ్యం విటమిన్ బి12, ఐరన్, ఫోలిక్ యాసిడ్, జింక్ ల వంటి పోషకాలు లోపించడం) ● వైరల్ ఇన్ఫెక్షన్‌లు (ప్రధానంగా హెర్పిస్ వంటివి) ● గాయాలు కావడం (బ్రషింగ్‌లో గాయాలు, బాగా ఘాటైన పేస్టులు, కొన్ని ఆహారపదార్థాల వల్ల అయ్యే అనేక గాయాల కారణంగా)

● పేగుకు సంబంధించిన సమస్యలు, రక్తంలో మార్పులు, గ్లూటిన్ అనే పదార్థం పడకపోవడం, తరచూ జ్వరాలు రావడం... వంటి అనేకరకాల ఆరోగ్య సమస్యల వల్ల పిల్లలకు తరచూ నోటిలో పుండ్లు (మౌత్ అల్సర్స్) వస్తుంటాయి. మీరు లెటర్‌లో చెప్పిన కొద్దిపాటి వివరాలతో నిర్దిష్టంగా ఇదీ కారణం అని చెప్పలేకపోయినా... మీ పాపకు విటమిన్‌ల వంటి పోషకాల లోపం లేదా తరచూ వచ్చే ఇన్ఫెక్షన్స్‌తో ఈ సమస్య వస్తున్నట్లు భావించవచ్చు.

ఇలాంటి పిల్లలకు నోటిలో బాధ తెలియకుండా ఉండేందుకు పైపూతగా వాడే మందులు, యాంటిసెప్టిక్ మౌత్ వాష్‌లు, విటమిన్ సప్లిమెంట్స్ వాడాల్సి ఉంటుంది. ఇలాంటి వారిలో చాలా అరుదుగా స్టెరాయిడ్ క్రీమ్స్ వాడటం వల్ల ప్రయోజనం ఉంటుంది. మీరు పైన పేర్కొన్న అంశాల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ మరోసారి మీ పిల్లల వైద్య నిపుణుడినిగానీ లేదా దంత వైద్య నిపుణుడినిగాని సంప్రదించి వారి ఆధ్వర్యంలో తగిన చికిత్స తీసుకోండి.

గోడకున్న సున్నం తింటున్నాడు



మా బాబు వయసు ఎనిమిదేళ్లు. ఇంట్లో పెచ్చుల్లా లేచిన సున్నాన్ని తింటున్నాడు. క్లాస్‌లో చాక్‌పీసులు కూడా తింటున్నాడని వాడి టీచర్ చెబుతున్నారు. వాడు తెల్లగా పాలిపోయినట్లుగా కనిపిస్తున్నాడు. ఆ వయసులో ఉండాల్సినంత బరువు లేదు. మందులు వాడినా బరువు పెరగడం లేదు. మా అబ్బాయి విషయంలో ఏం చేయాలో తెలియజేయండి.

– సుధారాణి, టెక్కలి

మీ అబ్బాయికి ఉన్న కండిషన్‌ను వైద్యపరిభాషలో పైకా అంటారు. అంటే... ఆహారంగా పరిగణించని నాన్–న్యూట్రిటివ్ వస్తువులను పదే పదే తినడం, ఆ అలవాటును దీర్ఘకాలం కొనసాగించడం అన్నమాట. ఈ కండిషన్ ఉన్న పిల్లలు ప్లాస్టర్, బొగ్గు (చార్‌కోల్), మట్టి, బూడిద, పెయింట్, బలపాలు, చాక్‌పీసులు లాంటివి తింటుంటారు.

చిన్నపిల్లలు ముఖ్యంగా రెండేళ్లలోపువారు తమ పరిసరాలను తెలుసుకోవాలనే ఆసక్తితో నాన్–న్యూట్రిటివ్ వస్తువులను నోట్లో పెట్టుకుంటూ ఉంటారు. అయితే పెద్ద పిల్లల్లోనూ ఇదే లక్షణం ఉంటే... అలాంటి కండిషన్‌ను తేలికగా తీసుకోకూడదు. ఈ కండిషన్ ఉన్నపిల్లల్లో చాలా సాధారణమైన సమస్యలు మొదలుకొని కొన్ని తీవ్రమైన మానసిక రుగ్మతల వరకు ఉండే అవకాశం ఉందని గుర్తుంచుకోవాలి. నిర్దిష్టంగా ఇదే కారణమని చెప్పలేకపోయినప్పటికీ సాధారణంగా... కుటుంబంలో సంబంధాలు సవ్యంగా లేకపోవడం, పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, కొన్ని మానసిక సమస్యలు, ఐరన్ లోపం, కడుపులో నులిపురుగుల వంటివి ఈ సమస్యకు కొన్ని కారణాలుగా చెప్పవచ్చు.

ఇలాంటి పిల్లల్లో రక్తహీనత కూడా చాలా సాధారణంగా చూస్తుంటాం. మీ అబ్బాయికి రక్తహీనత కూడా ఉందంటున్నారు కాబట్టి ఒకసారి కంప్లీట్ బ్లడ్‌పిక్చర్‌తో పరీక్షతో పాటు, రక్తంలో లెడ్ పాళ్లు ఉన్నాయేమో అని పరీక్ష చేయించడం చాలా ప్రధానం.

ఆహారం విషయానికి వస్తే మాంసాహారంలో కాలేయం, కోడిగుడ్లు, కూరగాయల్లో బీన్స్, సోయాబీన్, పప్పుధాన్యాలు, బ్రకోలీ, మస్టర్డ్, పాలకూర, రాగి వంటి వాటిల్లో ఐరన్ పాళ్లు ఎక్కువ. మీరు మీ అబ్బాయికి పైన పేర్కొన్న ఆహార పదార్థాలతో పాటు కొద్దిగా కొవ్వుపాళ్లు ఎక్కువగా ఉండే ఆహారం ఇవ్వడం మంచిది. అదేవిధంగా విటమిన్–సి ఎక్కువగా ఉన్న తాజా పండ్లు ఎక్కువగా తినిపించాలి.

మీరు ఒకసారి మీ అబ్బాయికి కడుపులోని నులిపురుగులు పోవడానికి మందులు వాడటం కూడా అవసరం. మీరు మీ పిల్లల వైద్యనిపుణుణ్ణి సంప్రదించి తగు సలహా, చికిత్స తీసుకోండి.

బాబుకు పాస్ పోసేటప్పుడు నొప్పి...

మా బాబుకి పదేళ్లు. యూరిన్ పోసేటప్పుడు ఫ్రీగా కాకుండా కొంచెం, కొంచెంగా పోస్తుంటాడు. కొన్నిసార్లు పాస్ పోసేటప్పుడు నొప్పిగా ఉందంటాడు. డాక్టర్‌ను సంప్రదిస్తే ఇన్‌ఫెక్షన్ ఉందని టాబ్లెట్స్ రాసిచ్చారు. అవి వాడినన్ని రోజులు తగ్గి, మళ్లీ మొదలవుతోంది. ఈ మధ్య సమస్య మరీ ఎక్కువగా ఉన్నప్పుడు మంచినీళ్లు ఎక్కువగా తాగిస్తే తగ్గినట్టే తగ్గి మళ్లీ మొదలైంది. దయచేసి మా బాబు సమస్యకి పరిష్కారం తెలియజేయండి.

– రియాజుద్దిన్, గుంటూరు

మీరు చెప్పిన దాన్ని బట్టి మీ బాబుకి యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ ఉందని చెప్పవచ్చు. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ పిల్లల్లో కూడా తరుచుగా చూస్తుంటాం. ఇది అబ్బాయిల్లో ఒక శాతం ఉంటే అమ్మాయిల్లో 3–5 శాతం ఉంటుంది. అనేక కారణాల వల్ల యూరినరీ ఇన్ఫెక్షన్లు వస్తు ఉండవచ్చు. ఉదా. సరైన విసర్జన అలవాట్లు లేకపోవడం (ఇంప్రాపర్ టాయిలెట్ ట్రెయినింగ్), బిగుతు దుస్తులు వంటి సాధారణ అంశాలు కాక.... యూరినరీ ట్రాక్ట్‌లో అబ్‌నార్మాలిటీస్, వాయిడింగ్ డిస్ ఫంక్షన్, వియురిఫ్లక్స్, బ్లాడర్‌కు ఉండే న్యూరలాజికల్ సమస్యలు, యూరెత్రల్ అబ్‌స్ట్రక్షన్, మలబద్ధకం వంటి రిస్క్ ఫ్యాక్టర్ల వల్ల పిల్లల్లో కూడా యూరిన్ ఇన్ఫెక్షన్‌లు వస్తుండవచ్చు. యూరినరీ ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు యూరిన్ పరీక్షలతో పాటు కెయుబి, అల్ట్రాసౌండ్, ఎంసీయూజీ అనే టెస్ట్‌లు చేయించడం చాలా ప్రధానం. ఈ పరీక్షలు చెయ్యడం వల్ల ఎనటమికల్ సమస్యలేమయినా ఉన్నాయేమో తెలుసుకోవచ్చు. మీరు ఒకసారి యూరాలజిస్టును కలిసి తగిన సలహా, చికిత్స తీసుకోండి.



డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్, రోహన్ హాస్పిటల్స్,
విజయనగర్ కాలనీ, హైదరాబాద్

S & D

సినిమా
హైదరాబాద్
మంగళవారం
2-1-2018
సాక్షి ఫ్యామిలీ

పరి పరిశోధన

నక్షత్రం లేకున్నా... గ్రహాలపై జీవం?

సూర్యుడనే నక్షత్రం లేకుండా భూమి మీద ప్రాణులను ఊహించగలమా? అస్సలు సాధ్యం కాదు. అయితే ఈ విశాల విశ్వంలో నక్షత్రమన్నది లేకపోయినా... జీవం ఉండేందుకు అవకాశమున్న గ్రహాలు అనేకమున్నాయని న్యూయార్క్‌కు



చెందిన కార్నెల్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ రకమైన వాటికి గ్రహవ్యవస్థ నుంచి బయటకు వెళ్లిపోయిన ఉపగ్రహాలు ఉదాహరణలు అంటున్నారు యూకాన్ హాంగ్. గురుత్వాకర్షణ శక్తి కారణంగా భూమి చుట్టూ చంద్రుడు తిరుగుతున్న విషయం తెలిసిందే కదా.. అలాగే కొన్ని చిన్న స్థాయి ఖగోళ వస్తువులు పరిసరాల్లోని గ్రహాల ప్రభావంలో ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ఇవి ఆ ప్రభావాన్ని తప్పించుకుని దూరంగా జరుగుతాయి. మన పాలపుంతలోని ఒక్కో నక్షత్రానికి ఇలాంటి ‘మాజీ చంద్రుళ్లు’ ఒకటి నుంచి వంద వరకు ఉంటాయని, అగ్ని పర్వతాల కారణంగా ఇలాంటి వాటిల్లో జీవం ఉండేందుకు అవకాశాలు ఎక్కువని హాంగ్ వివరించారు. అందుబాటులో ఉన్న సమాచారాన్ని కంప్యూటర్ సిమ్యులేషన్ ద్వారా పరిశీలించి తాము ఈ అంచనాకు వచ్చామని.. మరిన్ని పరిశోధనల ద్వారా ఈ విషయాన్ని రూఢీ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. సౌర కుటుంబంలోని గురుగ్రహపు ఉపగ్రహం ఎన్‌సెలెడస్‌ను ఉపగ్రహాల సాయంతో పరిశీలించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ పరిశోధనకు ప్రాధాన్యమేర్పడిందని చెప్పారు.

క్యాల్షియం, విటమిన్ డీ లతో ప్రయోజనం సున్నా?

అంచనాలు తారుమారు అవడం సైన్స్‌లో సహజం. తాజా పరిశోధన చెబుతున్న విషయం ఇలాంటిదే మరి. క్యాల్షియం, ‘విటమిన్ –డీ’లతో ఎముకలు గట్టిపడతాయని... యాభై ఏళ్ల వయసు పైబడ్డ వారు తరచూ వీటిని తీసుకోవాలన్న సూచనలు వింటూ ఉంటాం. అయితే వీటిల్లో నిజం కొంచెమే అంటున్నారు టియాన్‌జిన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు.



ఈ రెండు సప్లిమెంట్ల విషయంలో చాలాకాలంగా శషభిషలు కొనసాగుతున్న నేపథ్యంలో వీరు తాజాగా ఒక అధ్యయనం చేపట్టారు. క్యాల్షియం, విటమిన్ డీల మోతాదు ఎముకల దృఢత్వాలపై ఇప్పటికే జరిగిన దాదాపు 33 అధ్యయనాలను మళ్లీ నిశితంగా పరిశీలించారు. వీటన్నింటిలో కలిసి దాదాపు 51 వేల మంది పాల్గొన్నారు. ఈ రెండింటిని ఇచ్చినా.. విడిగా అందించినా వయోవృద్ధుల్లో ఎముక సంబంధిత సమస్యల్లో పెద్దగా తేడా లేదని ఈ అధ్యయనాలు తెలిపాయి. అయితే ఈ అధ్యయనాలు వృద్ధాశ్రమాల వంటి వాటిల్లో ఉండేవారిపై జరిగాయని, క్యాల్షియం, విటమిన్ డీలను మాత్రల రూపంలో తీసుకున్న వారి ఎముకలు, తుంటి ఎముకలు విరిగిపోయిన సంఘటనల ఆధారంగా చేసిన అధ్యయనం మాత్రమేనని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.


కొవ్వు కరిగించే కొత్త బ్యాండేజీ!

గాయమైన చోట బ్యాండెయిడ్ ప్యాచ్ వేస్తాం. మందు పని చేస్తుంది. గాయం మానుతుంది. ఇదే పద్ధతిలో శరీరంలోని కొవ్వు కూడా కరిగిపోతే ఎలా ఉంటుందంటారా? భేషుగ్గా ఉంటుంది కదూ. ఇంకొన్నేళ్లు ఆగండి... ఎంచక్కా మెడికల్ షాపుకెళ్లి ‘కొవ్వు కరిగించే బ్యాండెయిడ్ ఇవ్వండి’ అని అడిగేద్దురుగానీ. సింగపూర్‌కు చెందిన నాన్‌యాంగ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఈ సరికొత్త బ్యాండేజి శరీరంలో నిల్వ ఉండే తెల్ల కొవ్వును కాస్తా..



ఖర్చయిపోయే బ్రౌన్ కొవ్వుగా మారుస్తుంది. ఈ ప్యాచ్‌లో వందలాది సూక్ష్మస్థాయి సూదులు ఉంటాయి. వెంట్రుక కంటే తక్కువ మందం ఉండే ఈ సూదుల లోపల కొవ్వును కరిగించగలవని నిరూపితమైన మందు ఉంటుంది. రెండు నిమిషాల పాటు ఈ ప్యాచ్‌ను చర్మంపై ఒత్తి పట్టుకుంటే సూదులన్నీ చర్మంలోకి చొచ్చుకుపోతాయి. మందు శరీరంలోకి.. కచ్చితంగా చెప్పాలంటే చర్మం అడుగున నిల్వ ఉండే తెల్లకొవ్వు నిల్వ ఉండే స్థానాల్లోకి చేరుతుంది. కొంత సమయం తరువాత తెల్ల కొవ్వు స్థానంలో బ్రౌన్ కొవ్వు ఏర్పడుతుంది. చిన్న పిల్లల శరీరాలను వెచ్చగా ఉంచేందుకు ఈ బ్రౌన్ కొవ్వు బాగా ఉపయోగపడుతుంది. పెద్దయ్యాక తెల్ల కొవ్వు కాస్తా ఎక్కువైపోయి.. ఇంకో రకమైన కొవ్వు తగ్గిపోతుంది. ఊబకాయంతో వచ్చే సమస్యలను ఎదుర్కొనేందుకు ఈ ప్యాచ్ ఎంతో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తల అంచనా.

కొత్త లుక్



● నాగార్జున

లేటెస్ట్ సినిమా కోసం హీరో నాగార్జున లాఠీ పట్టారన్న విషయం ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అదేనండి.. రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో ఆయన హీరోగా రూపొందనున్న సినిమా గురించి చెబుతున్నాం. ఈ చిత్రంలో నాగార్జున లుక్ ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే అసక్తి అభిమానుల్లో ఉంది. కచ్చితంగా నాగ్ ఓ కొత్త మేకోవర్‌తో కనిపిస్తారనే ఊహాగానాలు ఉన్నాయి. సిక్స్ ప్యాక్‌తో కనిపిస్తారని టాక్. అందుకు తగ్గట్టుగానే నాగ్ ఫొటో ఒకటి బయటికొచ్చింది. ఆ ఫొటో మార్ఫింగా? అనే సందేహం పలువురికి కలిగింది. అయితే అది ఒరిజినల్ ఫొటోనే అని.. సోమవారం హీరో నాగార్జున సోషల్ మీడియాలో గతేడాది అక్కినేని ఫ్యామిలీ సినిమాలకు సంబంధించిన పోస్ట్ స్పష్టం చేసింది. నాగ్ పోస్ట్ చేసిన ఫొటోల్లో ఇక్కడ మీరు చూస్తున్న నాగ్ షర్ట్‌లెస్ ఫొటో కూడా ఉంది. సో.. స్టిల్ ఒరిజినల్ అని ఫిక్స్ అయిపోవచ్చా?

ఇకపై ఇద్దరిదీ ఒకటే ప్రాణం



● విష్ణు, శ్రియ

తల్లి కాబోతున్న భార్యను భర్త కాలు కింద పెట్టనివ్వకుండా అపురూపంగా చూసుకుంటే ఆ భార్య మనసు ఆనందంతో నిండిపోతుంది. ఇక్కడున్న ఫొటోలు శ్రియ కళ్లల్లో ఆ ఆనందం చూడొచ్చు. విష్ణు ఎంచక్కా జడ అల్లుతున్నారు కదా. శ్రీ లక్ష్మీప్రసన్న పిక్చర్స్ పతాకంపై అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పణలో మోహన్‌బాబు నటించి, నిర్మించిన చిత్రం ‘గాయత్రి’. మదన్ రామిగాని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మంచు విష్ణు, శ్రియ కీలక పాత్రలు చేశారు. కొత్త సంవత్సరం సందర్భంగా ‘ఇకపై ఇద్దరిదీ ఒకటే ప్రాణం’ అనే క్యాప్షన్‌తో విష్ణు–శ్రియల ఫొటోను విడుదల చేశారు. పుట్టబోయే బిడ్డ గురించి శ్రియ కలలు కంటుంటే.. విష్ణు ఆమెకు జడ వేస్తున్న ఈ ఫొటో భలే పసందుగా ఉంది కదూ. అన్నట్లు.. ఇకపై ఇద్దరిదీ ఒకటే ప్రాణం అంటే.. వారి జీవితాల్లోకి కొత్తగా రాబోయే బేబి గురించి అయ్యుండొచ్చని ఊహించవచ్చు. ‘‘ఇప్పటివరకు నేను చేసిన మోస్ట్ చాలెంజింగ్ రోల్స్‌లో ‘గాయత్రి’లో చేసిన రోల్ ఒకటి. నా కెరీర్‌లో వన్నాఫ్ మై బెస్ట్ సాంగ్ కూడా ఈ సినిమాలో ఉంది. నా ఫస్ట్ లుక్ ప్రేక్షకులకు నచ్చిందని అనుకుంటున్నాను’’ అని పేర్కొన్నారు విష్ణు. ఫిబ్రవరి 9న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: విజయ్ కుమార్. ఆర్. ఈ సంగతి ఇలా ఉంచితే.. రియల్ లైఫ్‌లో మంచు విష్ణు సతీమణి విరానిక సోమవారం బాబుకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని విష్ణు సోషల్ మీడియా ద్వారా తెలిపారు.

దీపావళికి వచ్చేస్తాం



● సూర్య, సెల్వరాఘవన్

‘‘నా గత 35 సినిమాలకు భిన్నంగా ఈ చిత్రం ఉంటుంది. సెల్వరాఘవన్ కథ చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్. సాయిపల్లవి పాత్రకీ ప్రాధాన్యత ఉంటుంది’’ అని హీరో సూర్య అన్నారు. సూర్య, ‘ఫిదా’ ఫేమ్ సాయిపల్లవి జంటగా ‘7/జి బృందావన కాలనీ’, ‘ఆడవారి మాటలకు అర్థాలే వేరులే’ ఫేమ్ సెల్వరాఘవన్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. ఇటీవల ‘ఖాకి’ వంటి హిట్ చిత్రాన్ని అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఎస్.ఆర్.ప్రభు, ఎస్.ఆర్. ప్రకాశ్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం సోమవారం ప్రారంభమైంది. నిర్మాతలు మాట్లాడుతూ– ‘‘సూర్య, సాయిపల్లవి, సెల్వ రాఘవన్ కాంబినేషన్‌లో వస్తున్న మంచి సినిమా ఇది. సూర్య కెరీర్‌లో ఓ పెద్ద హిట్‌గా నిలిచేలా సెల్వరాఘవన్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జనవరి 18న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, దీపావళికి సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం’’ అన్నారు. ‘‘సూర్యలాంటి వెర్సటైల్ హీరోతో సినిమా చేయడం ఆనందంగా ఉంది. ఈ కథకు తను మాత్రమే కరెక్ట్ అని సినిమా చూశాక మీకే (ప్రేక్షకులు) తెలుస్తుంది’’ అన్నారు సెల్వరాఘవన్. ఈ చిత్రానికి కెమెరా: శివకుమార్ విజయన్.

డబుల్ అనుష్క



న్యూ ఇయర్ సందర్భంగా ‘భాగమతి’ చిత్రబృందం అనుష్కకు సంబంధించిన ఒక ఫొటోను విడుదల చేసింది. వీరోచిత పోరాట పటిమను ప్రదర్శిస్తున్న ఓ వీర వనిత చిత్రపటం వైపు తదేకంగా చూస్తున్నారు అనుష్క. ఎప్పటి నుండో సమాధానం తెలియని ఓ ప్రశ్నను అన్వేషిస్తున్నట్టున్నాయి ఆమె చూపులు. విశేషం ఏంటంటే ఆమె చూస్తున్న ఆ చిత్రపటంలో ఉన్న వీరనారి కూడా అనుష్కే. అంటే... ‘భాగమతి’లో అనుష్క ద్విపాత్రాభినయం చేస్తున్నారా? ఇంతకీ వీళ్లిద్దరికి మధ్య ఉన్న బంధం ఏంటీ? ఆమె వెతుకుతున్న ప్రశ్నకు సమాధానం తెలిసిందా? వీరిలో భాగమతి ఎవరు? వీటన్నింటికి సమాధానం తెలియాలంటే మాత్రం ఈనెల 26 వరకు ఆగాల్సిందే. అనుష్క ప్రధాన పాత్రలో నటించిన ‘భాగమతి’ సినిమాకు జి.అశోక్ దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ పతాకం పై వంశీ–ప్రమోద్‌లు నిర్మించిన ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: మది.

సూర్య అంటే యాంగర్




● అల్లు అర్జున్



● స్నేహ, అల్లు అర్జున్

బుల్లెట్ లాంటి కళ్లు. భయం లేని చూపులు. ఉక్కులాంటి బాడీ. పిడుగుల్లాంటి దెబ్బలు.. ఇవి చాలు శత్రువును జయించడానికి... కానీ సూర్య అనుకున్నది సాధించడానికి బలహీనత ఒకటి అడ్డు తగులుతుంది. అదే అతని ఆవేశం. ఆ ఆవేశం దేశం కోసమే. కానీ అదే ఆవేశం శత్రువుకు బలం. మరి... శత్రువు బలాన్ని సూర్య ఎలా ఢీ కొన్నాడు? అంటే.. స్క్రీన్ పైనే చూడాలి. అల్లు అర్జున్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ‘నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా’. అనూ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. ఈ సినిమాలో సైనికుడు సూర్య పాత్రలో అల్లు అర్జున్ కనిపించనున్నారు. కె. నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీషా శ్రీధర్ నిర్మిస్తున్నారు. ‘బన్నీ’ వాసు సహ నిర్మాత. న్యూ ఇయర్ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ ఇంపాక్ట్‌ను రిలీజ్ చేశారు. ‘నీకు సూర్య సోల్జర్.. కానీ ప్రపంచానికి సూర్య అంటే యాంగర్’, ‘చచ్చిపోతాను.. కానీ ఇక్కడ కాదు బోర్డర్‌లో..’ అన్న డైలాగ్స్ సూపర్బ్‌గా ఉన్నాయని ఫ్యాన్స్ అంటున్నారు. చిత్ర సమర్పకుడు నాగబాబు మాట్లాడుతూ– ‘‘బన్నీ కెరీర్‌లో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. వక్కంతం వంశీ కంప్లీట్ ప్యాకేజ్‌తో తెరకెక్కిస్తున్నారు. దానికి ఉదాహరణే ఫస్ట్ ఇంపాక్ట్. హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ జరుగుతోంది’’ అన్నారు. ‘‘బన్నీగారి డెడికేషన్, వంశీ విజన్ ఏంటో ఫస్ట్ ఇంపాక్ట్‌లో తెలుస్తోంది. ముఖ్యంగా డైలాగ్స్ గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటుండడం ఆనందంగా ఉంది. ఏప్రిల్ 27న రిలీజ్ చేయాలనుకుంటున్నాం’’ అన్నారు శిరీషా శ్రీధర్. ‘‘న్యూ ఇయర్‌కు ఫస్ట్ ఇంపాక్ట్‌ను డబుల్ బొనాంజాగా ఫ్యాన్స్ భావిస్తున్నారు’’ అన్నారు ‘బన్నీ’ వాసు. ఈ సినిమాకు సంగీతం: విశాల్ –శేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబు. ఈ రీల్‌లైఫ్ విషయాలు కాస్త పక్కనపెట్టి బన్నీ పర్సనల్ లైఫ్ దగ్గరకు వస్తే..న్యూ ఇయర్‌కు ఆయన సతీమణితో కలిసి ఎంజాయ్ చేసిన ఫొటోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఇన్‌సెట్‌లో మీరు చూస్తున్న ఫొటో అదే.

భళా.. బందేవ్



● రానా

అడవిలో పక్షుల కిలకిలరావాలు, సుందర ప్రదేశాలు, జలపాతాలు, పచ్చదనంతో పాటు క్రూర మృగాలు, విష సర్పాలు, పైకి నేలలా కనిపించి అడుగువేయగానే ముంచేసే ఊబిలు కూడా ఉంటాయని తెలిసిందే. అలాంటి అడవిలో ఓ వ్యక్తి జీవించాలనుకున్నాడు. అతనికి గజరాజు అదేనండి.. ఏనుగు తోడుగా నిలిచింది. ఏనుగుతో అతనికి ఎలా సహవాసం కుదిరింది? అతనికి ఎదురయ్యే సవాళ్లు ఏంటి? అన్న అంశాల ఆధారంగా రూపొందుతున్న సినిమా ‘హాథీ మేరీ సాథీ’. రానా హీరోగా తమిళ దర్శకుడు ప్రభు సాల్మన్ రూపొందిస్తున్నారు. తమిళ, హిందీ, తెలుగు భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమాలో బందేవ్ పాత్రలో రానా కనిపించనున్నారు. 1971లో రాజేశ్ ఖన్నా హీరోగా వచ్చిన ‘హాథీ మేరే సాథీ’ సినిమాకు ఇది రీమేక్ అని సమాచారం. న్యూ ఇయర్ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రానా సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. ‘‘కొత్తవైన మంచి కథలను చెప్పడానికి కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాను. ‘హాథీ మేరే సాథీ’ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేస్తున్నాం’’ అని పేర్కొన్నారు రానా. బందేవ్ పాత్రలో రానా భళా అనిపించేలా ఉన్నారని అభిమానులు అంటున్నారు. హిందీలో ‘హాథీ మేరే సాథీ’ అనే టైటిల్‌ని ఫిక్స్ చేశారు. తెలుగులో సీనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన ‘అడవి రాముడు’ టైటిల్‌ను పరిశీలిస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమా కాకుండా ‘1945’, ‘అనిళమ్ తిరునాళ్ మార్తాండ వర్మ’ సినిమాల్లో రానా నటిస్తున్నారు.

బాద్‌షా బన్ గయా జీరో




● షారుక్ ఖాన్

షారుక్ ఖాన్ బాలీవుడ్ బాద్‌షా. కొన్ని వందల కోట్లకు అధిపతి. కానీ ఆయన సడన్‌గా జీరో అయ్యారు. అంతే కాదు.. ఈ ఆరడుగుల అందగాడు మరుగుజ్జుగా కూడా మారిపోయారు. అదెలా అని ఆశ్చర్యపోతున్నారా? మ్యాటర్ ఏంటంటే షారుక్ ఖాన్ హీరోగా ఆనంద్ ఎల్. రాయ్ దర్శకత్వంలో ఒక సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు ‘జీరో’ అనే టైటిల్‌ను ఫిక్స్ చేసి, ఒక వీడియోను న్యూ ఇయర్ సందర్భంగా రిలీజ్ చేసింది చిత్రబృందం. అందులో మరుగుజ్జు పాత్రలో హుషారైన పాటకు స్టెప్స్ వేస్తూ, కనిపించారు షారుక్. ఈ సినిమాలో షారుక్‌ను మరుగుజ్జు పాత్రలో చూపించటానికి భారీ స్థాయిలో వీఎఫ్‌ఎక్స్ వాడుతున్నారట. అనుష్క శర్మ, కత్రినా కైఫ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో సల్మాన్ ఖాన్, దీపికా పదుకోన్, శ్రీదేవి, కాజోల్, ఆలియా భట్ వంటి బాలీవుడ్ భారీ తారాగణం అతిథి పాత్రల్లో మెరవనున్నారు. రెడ్ చిల్లీస్ బ్యానర్ పై షారుక్ ఖాన్ సతీమణి గౌరీ ఖాన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సంవత్సరం డిసెంబర్ 21న విడుదల చేయటానికి ప్లాన్ చేస్తున్నారు.

ముగ్గు-ముచ్చట

25 చుక్కలు
11 వరుసలు
11 వచ్చేవరకు



జి. ధనలక్ష్మి
అప్పుఘర్, విశాఖపట్నం

19 చుక్కలు
1 వచ్చేవరకు



పాల్వంచ సువర్ణ
రామన్నపేట,
యాదాద్రి భువనగిరి



చందన నయనతారా లేఖ
జగ్గయ్యపేట, కృష్ణా జిల్లా

25 చుక్కలు
13 వరకు
మధ్య చుక్కలు

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com



2018 స్పెషల్

01. ఈ సంవత్సరం (2018) విడుదలవ్వటానికి సిద్ధంగా ఉన్న 'రజనీకాంత్' సినిమాలెన్నో తెలుసా?
ఎ) ఒకటి బి) రెండు
సి) మూడు డి) నాలుగు



02. 'భరత్ అనే నేను', 'రంగస్థలం-1985'... ఈ రెండు చిత్రాలకు సంగీత దర్శకుడు ఒక్కరే? ఎవరై ఉంటారో కనుక్కోండి చూద్దాం?
ఎ) అనిరుధ్ బి) యస్.యస్. తమన్
సి) గోపీసుందర్ డి) దేవిశ్రీ ప్రసాద్

03. 2018 జనవరిలో 'భాగమతి' అనే సినిమా రిలీజు కానుంది. ఈ చిత్రంలో 'అనుష్క' హీరోయిన్‌గా నటించింది? ఏ నిర్మాణ సంస్థ నిర్మించిందో తెలుసా? (ఎ)
ఎ) యువీ క్రియేషన్స్ బి) గీతా ఆర్ట్స్
సి) వైజయంతి మూవీస్ డి) 14 రీల్స్



04. ఈ 'సంక్రాంతి'కి వస్తున్న సినిమాలలో రెండు పెద్ద సినిమాలలో నటించిన హీరోయిన్ ఎవరు?
ఎ) అనూ ఇమ్మాన్యుయేల్
బి) రాయ్ లక్ష్మీ
సి) కీర్తి సురేశ్
డి) అనుపమా పరమేశ్వరన్

05. 'స్కెచ్' అనే సినిమా తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సినిమాలో హీరో విక్రమ్. హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) సమంత బి) రకుల్ ప్రీత్‌సింగ్
సి) రెజీనా డి) తమన్నా



06. ఆయనొక రైటర్. 2017లో మెగా ఫోన్ పట్టాడు. 2018లో దర్శకుడిగా తన మొదటి సినిమా రిలీజవుతుంది? ఎవరా రచయిత-దర్శకుడు?
ఎ) విజయేంద్ర ప్రసాద్ బి) శివా నిర్వాణ
సి) వక్కంతం వంశీ డి) ఐవీ ఆనంద్

07. 2018లో సాయిపల్లవి నటించే మొదటి సినిమాలో హీరో ఎవరో కనుక్కోండి?
ఎ) శర్వానంద్ బి) నాని
సి) కల్యాణ్‌రామ్ డి) వరుణ్‌తేజ్

08. మంచు విష్ణు నటించిన 'ఆచారి అమెరికా యాత్ర' చిత్రం ఈ నెలలో రిలీజవుతోంది. ఆయన ప్రక్కన ఫుల్ లెంగ్త్ పాత్ర చేసిన హాస్య నటుడెవరో తెలుసా?
ఎ) పృథ్వీ బి) పోసాని కృష్ణమురళి సి) సప్తగిరి డి) బ్రహ్మానందం



09. ఈ నెలలో షూటింగ్ ప్రారంభించనున్న బోయపాటి. శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో నటించనున్న హీరో ఎవరు?
ఎ) బాలకృష్ణ
బి) మహేశ్‌బాబు
సి) రామ్‌చరణ్
డి) యన్టీఆర్

10. చాలా కాలం గ్యాప్ తర్వాత ఈ సంవత్సరం 'దిల్' రాజుతో కలిసి ఓ అగ్రనిర్మాత ఓ సినిమా నిర్మించనున్నారు. ఎవరా నిర్మాత? చిన్న క్లూ (ఈ చిత్రంలో మహేశ్‌బాబు హీరోగా నటిస్తారు.
ఎ) బీవియస్‌యన్ ప్రసాద్
బి) చలసాని అశ్వనీదత్
సి) సురేశ్‌బాబు
డి) కేయస్ రామారావు

11. పాటల రచయిత కృష్ణ చైతన్య రెండోసారి దర్శకత్వం వహిస్తున్న సినిమాలో హీరో ఎవరు?
ఎ) అల్లు శిరీష్
బి) నితిన్
సి) మంచు మనోజ్
డి) అఖిల్

12. ఈ క్రింద ఉన్న నాలుగు సినిమాలలో ఫిబ్రవరి 9న విడుదల కాని చిత్రం ఏంటో తెలుసా?
ఎ) కిరాక్ పార్టీ
బి) గాయత్రి
సి) తొలిప్రేమ
డి) ఛలో

13. 2018లో రాబోతున్న పూరి జగన్నాథ్ సినిమా పేరు 'మెహబూబా'. అందులో హీరో ఎవరు? సి)
ఎ)సుమంత్ అశ్విన్
బి) శ్రీ విష్ణు
సి) ఆకాష్ పూరి
డి) అడవి శేష్



14. రవితేజ కొత్త సినిమా 'టచ్ చేసి చూడు'లో హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) రకుల్ ప్రీత్‌సింగ్ బి) రాశీ ఖన్నా
సి) శ్రుతీహాసన్ డి) మెహరీన్

16. చిరంజీవి చేస్తున్న 'సైరా' నరసింహా రెడ్డి సినిమాలో నరసింహా రెడ్డికి ఎంత మంది భార్యలు?
ఎ)ముగ్గురు బి) ఇద్దరు
సి) ఒక్కరు డి) నలుగురు

17. ఈ సంవత్సరం బాలీవుడ్ మూవీని డైరెక్ట్ చేస్తున్న టాలీవుడ్ దర్శకుడు ఎవరు?
ఎ) పూరీ జగన్నాథ్ బి) వీవీ వినాయక్
సి) కృష్ణవంశీ డి) క్రిష్

19. నాగార్జున-రామ్‌గోపాల్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త సినిమా వీరి కాంబినేషన్‌లో ఎన్నో చిత్రం?
ఎ) 2 బి) 5 సి) 4 డి) 6

20. 2017లో 'ఘాజీ' సినిమా ద్వారా సంచలనం సృష్టించిన దర్శకుడు సంకల్ప్ రెడ్డి తదుపరి సినిమాలో హీరో ఎవరు?
ఎ) రాజ్ తరుణ్ బి) నాగ శౌర్య
సి) వరుణ్ తేజ్ డి) విజయ్ దేవరకొండ



18. విశాల్ హీరోగా నటిస్తున్న 'అభిమన్యుడు' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న టాప్ హీరోయిన్ ఎవరు?
ఎ) నయనతార
బి) కాజల్
సి) తమన్నా
డి) సమంత



15. 2018 ప్రథమార్థంలో ద్విపాత్రాభినయం చేస్తున్న యంగ్ హీరో ఎవరు ?
ఎ) నాగచైతన్య
బి) రామ్
సి) నాని
డి) నిఖిల్

సమాధానాలు

1.బి, 2.డి, 3.ఎ, 4.సి, 5.డి, 6.సి, 7.ఎ, 8.డి, 9.సి, 10.బి, 11.బి, 12.డి, 13.సి, 14.బి, 15.ఎ, 16.ఎ, 17.డి, 18.డి, 19.సి, 20.సి

దండా చేస్తాడా?


ప్రభాస్

'బాహుబలి' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుని ప్యాన్ ఇండియా స్టార్ అయ్యారు ప్రభాస్. ఈ యంగ్ రెబల్ స్టార్‌తో సినిమా చేయాలని ప్రతి దర్శకుడు, తన కాల్షీట్లు పొందాలని ప్రతి నిర్మాత ఉత్సాహం చూపిస్తున్నారు. కానీ, ప్రభాస్ మాత్రం కొత్త సినిమాల ఎంపిక విషయంలో ఆచి తూచి అడుగులేస్తున్నారు. 'బాహుబలి' సినిమా చేస్తున్నప్పుడు ఒప్పుకున్న రెండు సినిమాలు తప్పితే వేరే ఏ సినిమానూ సైన్ చేయలేదు ప్రభాస్. ప్రస్తుతం సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న హై బడ్జెట్ యాక్షన్ మూవీ 'సాహో' సినిమాతో బిజీ బిజీగా గడుపుతున్నారు. ఆ తర్వాత 'జిల్' సినిమా దర్శకుడు రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. ఈ రెండు సినిమాలను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ-ప్రమోద్‌లు నిర్మించనున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాత సొంత బేనర్ గోపీకృష్ణ మూవీస్‌పై ప్రభాస్ హీరోగా స్వీయదర్శకత్వంలో కృష్ణంరాజు ఓ సినిమా తెరకెక్కిస్తారని టాక్. ఆ వార్తలకు తగ్గట్టుగానే ఫిల్మ్ చాంబర్‌లో గోపీకృష్ణ మూవీస్ బ్యానర్ 'దండా' అనే టైటిల్‌ను రిజిస్టర్ చేసింది. ఇదివరకు గోపీకృష్ణ మూవీస్ నిర్మించిన 'బిల్లా'లో కృష్ణంరాజుతో కలిసి నటించారు ప్రభాస్. ఇప్పుడు కూడా ప్రభాస్ తన పెదనాన్నతో కలిసి నటిస్తారా? లేదా కృష్ణంరాజు డైరెక్షన్ మాత్రమే చేస్తారా? అనేది చూడాలి.

ఫుల్ మీల్స్ నవ్వులు


నరేశ్ సునీల్

'అల్లరి' నరేశ్ సినిమా అంటే ప్రేక్షకులకు నవ్వుల కితకితలే. ఆయన కామెడీకి నవ్వని ప్రేక్షకులుండ రేమో. ఇక సునీల్ అయితే.. కమెడియన్‌గా అయినా, హీరోగా అయినా ప్రేక్షకులను నవ్వించగలరు. వీళ్లిద్దరూ కలిసి సినిమా చేస్తే, ప్రేక్షకులకు డబుల్ ధమాకానే. ఇంకా చెప్పాలంటే ఈ కాంబినేషన్ అంటే ఫుల్‌మీల్స్ నవ్వులే. 'తొట్టిగ్యాంగ్' సినిమాలో స్నేహితులుగా నవ్వులు పంచిన వీరిద్దరూ పదిహేనేళ్ల తర్వాత మరోసారి కలిసి నటించనున్నారు. ఈ చిత్రానికి భీమనేని శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తారట. ఈ చిత్రంలో హీరోకి సమానంగా ఉండే పూర్తి స్థాయి పాత్ర చేయనున్నారు సునీల్. సంక్రాంతి తర్వాత ఈ సినిమా షూటింగ్ ఆరంభమవుతుంది. 'నేనే రాజు నేనే మంత్రి' సినిమా నిర్మించిన బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందనుంది. 'అల్లరి' నరేశ్-భీమనేని శ్రీనివాసరావు కాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'సుడిగాడు'కి సంగీతం అందించిన శ్రీ వసంత్ ఈ సినిమాకి స్వరకర్త అని సమాచారం.

విక్రమ్‌కి పితృవియోగం

ప్రముఖ హీరో విక్రమ్ ఇంట కొత్త సంవత్సరం వేళ విషాదం నెలకొంది. ఆయన తండ్రి వినోద్‌రాజ్ (80) అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ సైనికుడైన వినోద్‌రాజ్ పలు తమిళ, కన్నడ సినిమాల్లోనూ, సీరియల్స్‌లోనూ నటించారు. విజయ్ నటించిన 'తిరుప్పాచ్చి', 'గిల్లి' చిత్రాల్లో మంచి పాత్రల్లో నటించారాయన. నృత్య రంగంలోనూ మంచి గుర్తింపు పొందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నై కోడంబాక్కమ్‌లోని మహాలింగపురమ్‌లో గల స్వగృహంలో ఆదివారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. పలువురు సినీ పెద్దలు, ప్రముఖులు వినోద్‌రాజ్ భౌతికకాయానికి అంజలి ఘటించి, ఆయన కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలిపారు.


తండ్రి వినోద్‌రాజ్‌తో విక్రమ్


అహ్మదాబాద్‌లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సోమవారం భారీ స్థాయిలో బెలూన్లను గాలిలోకి ఎగరేస్తున్న ప్రజలు

నేడు ఆస్పత్రుల్లో ఓపీ సేవలకు ఆటంకం

జాతీయ వైద్య కమిషన్ బిల్లుకు వ్యతిరేకంగా..

న్యూఢిల్లీ: జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) బిల్లుకు వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) 12 గంటల పాటు రోజువారీ విధుల బహిష్కరణకు పిలుపునిచ్చింది. ఆందోళనలో భాగంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఆస్పత్రుల్లో ఔట్‌పేషంట్ సేవల్ని నిలిపివేయనున్నారు. అత్యవసర వైద్య సేవలు కొనసాగుతాయి. ఐఎంఏ పిలుపుతో దేశవ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో నేడు ఔట్‌పేషంట్ సేవలు నిలిచిపోనున్నాయి. ఐఎంఏ స్థానంలో జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటుకు కేంద్రం పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశపెట్టింది. హోమియో, ఆయుర్వేద కోర్సులు చేసిన డాక్టర్లను ఓ బ్రిడ్జి కోర్సు చేశాక ఆధునిక వైద్యం చేపట్టేందుకు అనుమతించాలన్న నిబంధన చేర్చారు. బిల్లు కారణంగా వైద్యరంగంతో సంబంధం లేనివారికి వైద్యులు జవాబుదారీగా ఉండాల్సి వస్తోందని ఐఎంఏ ఆరోపించింది.

వర్సిటీల్లో ఆందోళనలపై చర్యలేం లేవు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ఆందోళనలతో పాటు చెలరేగిన హింసపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని కేంద్రం పార్లమెంటుకు తెలిపింది. 'విశ్వవిద్యాలయాలు స్వతంత్ర సంస్థలు. ధర్నాలు, ఆందోళనలు చెలరేగినప్పుడు వాటి నియంత్రణకు స్థానిక అధికారుల సాయంతో చర్యలు తీసుకునే పూర్తి అధికారం వారికుంది' అని కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ సహాయమంత్రి సత్యపాల్ సింగ్ లోక్‌సభకు రాతపూర్వకంగా తెలియజేశారు. ఈ విషయాన్ని లోక్‌సభ అధికారిక వెబ్‌సైట్‌లో సోమవారం అప్‌లోడ్ చేశారు.

నేడు రాజ్యసభకు ట్రిపుల్ తలాక్ బిల్లు: ఉన్నపళంగా ముమ్మారు తలాక్ చెప్పి ముస్లిం భర్తలు తమ భార్యలకు విడాకులిచ్చే పద్ధతిని నేరంగా పరిగణిస్తూ కేంద్రం తీసుకొచ్చిన బిల్లును మంగళవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

ఉపగ్రహాలకు రోబోలతో రిపేరు!



వాషింగ్టన్: అంతరిక్షంలో చక్కర్లు కొట్టే ఉపగ్రహాలకు ఇంధనాన్ని నింపడం, మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైతే శత్రుదేశాల ఉపగ్రహాలను ధ్వంసం చేసేందుకు వీలుగా రోబో శాటిలైట్ల తయారీకి అమెరికా సిద్ధమైంది. ఇందుకోసం అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ(నాసా), అమెరికా రక్షణ పరిశోధనా విభాగం 'డార్పా' జట్టుకట్టాయి. 'సర్వీస్ స్టేషన్స్ ఇన్ ఆర్బిట్స్'గా వ్యవహరించే వీటివల్ల కక్ష్యల్లోని ఉపగ్రహాల జీవితకాలం బాగా పెరగనుంది. ప్రస్తుతం ఉపగ్రహాల్లో తలెత్తే లోపాలు సరిచేసేందుకు చాలా ఖర్చవుతోంది. కానీ ఈ సర్వీస్ స్టేషన్ల ద్వారా ఖర్చు బాగా తగ్గే వీలుంది. అంతరిక్ష యుద్ధం తలెత్తితే శత్రుదేశాల ఉపగ్రహాలను నాశనం చేయగల సత్తా వీటికి ఉంటుంది.

హార్వర్డ్ సదస్సుకు కేటీఆర్, అమరీందర్



వాషింగ్టన్: ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో హార్వర్డ్ యూనివర్సిటీలో జరగనున్న 15వ భారత వార్షిక సదస్సుకు కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు, పంజాబ్ సీఎం అమరీందర్, సినీ నటుడు కమల్ హాసన్ సహా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ సదస్సులో 'భారత్ – అద్భుత ఆవిష్కరణలు' అనే అంశంపై చర్చ జరగనుంది. సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి తారక రామారావు, బీజేపీ ఎంపీ పూనమ్ మహాజన్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి, నటి దివ్య స్పందన, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ ఆదిల్ జైనుల్‌బాయ్ తదితరులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

'మీసం, తోక వెంట్రుకలకు ఉన్నంత తేడా'

శివ్‌పురి: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కాంగ్రెస్ నేతలకు మధ్య...మీసాల్లో ఉండే వెంట్రుకలకు, తోకలో ఉండే వెంట్రుకలకు ఉన్నంత తేడా ఉందంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గనుల శాఖల మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ వివాదాస్పదంగా వ్యాఖ్యానించారు. మూడు రోజుల క్రితం మధ్యప్రదేశ్‌లో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో హార్దిక్ పటేల్, జిగ్నేశ్ మేవానీ, అల్పేశ్ ఠాకూర్‌ల మద్దతుతో కాంగ్రెస్ బీజేపీపై పోరాడటాన్ని ప్రస్తావిస్తూ తోమర్ ఈ మాటలన్నారు. ఈ విషయంపై పీటీఐ సోమవారం మంత్రిని వివరణ కోరగా 'నేను ఏ కాంగ్రెస్ నేత పేరునూ ప్రస్తావించలేదు. కాంగ్రెస్ నేతలు, మోదీ వ్యక్తిత్వాల మధ్య తేడాను మాత్రమే ప్రస్తావించాను' అని చెప్పారు.

బీజేపీలో చేరిన ట్రిపుల్ తలాక్ పిటిషనర్

న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్‌ను రద్దుచేయాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన ఐదుగురు పిటిషనర్లలో ఒకరైన ఇష్రత్ జహాన్ బీజేపీలో చేరారు. సుప్రీం తీర్పుతో తన పోరాటం ముగిసిపోలేదని ఆమె అన్నారు. 'నేను బెంగాల్‌కు చెందినదాన్ని. ఈ రాష్ట్రానికి ఓ మహిళే ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ముస్లిం మహిళల విషయంలో లింగ సమానత్వం కోసం ఆమె ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇందుకోసం నేనొక్కదాన్నే పోరాడాను. ఏ రాజకీయ పార్టీ కూడా నాకు సాయం చేయలేదు. కొందరు మహిళలు నాకు సాయం చేయాలనుకున్నప్పటికీ ఇంట్లో పరిస్థితుల నేపథ్యంలో ముందుకురాలేకపోయారు' అని జహాన్ పేర్కొన్నారు.

'విమానాశ్రయాల్లో బాడీస్కానర్లకు ఓకే'

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని పౌర విమానాశ్రయాల్లో బాడీ స్కానర్లను అమర్చేందుకు తాము అనుకూలంగా ఉన్నట్లు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్‌ఎఫ్) తెలిపింది. ప్రస్తుతం 27 విమానాశ్రయాల్లో అమలుచేస్తున్న ట్యాగ్‌లెస్ హ్యాండ్ బ్యాగేజ్ విధానాన్ని త్వరలోనే మొత్తం 59 ఎయిర్‌పోర్టులకు విస్తరిస్తామని సీఐఎస్‌ఎఫ్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ హేమేంద్ర సింగ్ వెల్లడించారు. బాడీ స్కానర్ యంత్రాల వల్ల చేతులతో తనిఖీచేసే అవసరం ఉండదన్నారు. ఓ బాడీ స్కానర్ యంత్రాన్ని ఇటీవల ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పరీక్షించినట్లు తెలిపారు. గతేడాది దేశవ్యాప్తంగా నకిలీ టికెట్లతో ప్రయాణిస్తున్న 96 మంది స్వదేశీ, విదేశీ ప్రయాణికుల్ని అదుపులోకి తీసుకున్నట్లు సింగ్ వెల్లడించారు.


త్వరలో సంక్రాంతి సందర్భంగా అనుష్క శర్మ, విరాట్ కోహ్లీల కటౌట్‌ల ఆకారంలో గాలిపటాలు తయారు చేస్తున్న జైపూర్‌కు చెందిన అబ్దుల్ గఫూర్. ప్రధాని మోదీ సహా పలువురు రాజకీయ నేతల కటౌట్-గాలిపటాలను ఫొటోలో చూడొచ్చు.

పాక్‌కు ట్రంప్ షాక్

- సాయం ఉండబోదని హెచ్చరిక
- మా సాయం తీసుకుంటూ మమ్మల్నే మోసగిస్తారా?
- ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ట్రంప్ మండిపాటు
- ఈ ఏడాది రూ.14.3 వేల కోట్ల సాయం లేనట్లే!
- ఉగ్రవాదంపై ప్రపంచానికి వాస్తవాలు చెబుతాం: పాక్



వాషింగ్టన్/ఇస్లామాబాద్: ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తూ.. బయటకు కపట నాటకాలాడుతున్న పాకిస్తాన్ నెత్తిన భారీ పిడుగు పడింది. ఇన్నాళ్లూ తమకు అండగా ఉండేందుకు పాక్‌కు ఆర్థికసాయం చేస్తున్నప్పటికీ.. పాక్ మాత్రం పచ్చి అబద్ధాలతో మోసం చేస్తూవస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. ఇన్నాళ్లుగా అందిస్తున్న సాయం ఇకపై ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. 'సాయం కొనసాగిస్తున్నందుకు అమెరికా నేతలను మూర్ఖులనుకుంటున్నారా?' అని ట్వీటర్‌లో సోమవారం ఘాటుగా విమర్శించారు. సాయం రూపంలో అమెరికా నుంచి భారీ మొత్తం అందుతున్నప్పటికీ.. పాక్ అవాస్తవాలతో తమను మోసం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటివరకు 33 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.1 లక్షల కోట్లు) సాయం అందిస్తే.. ప్రతిగా పాకిస్తాన్ మాత్రం ఉగ్రవాద కేంద్రాలకు రక్షణ కల్పిస్తోందని మండిపడ్డారు. ట్రంప్ ట్వీట్‌కు సరైన సమాధానమిస్తామని పాక్ ప్రతిస్పందించింది. ఉగ్రవాదంపై ప్రపంచానికి వాస్తవాలు చెబుతామని పేర్కొంది. ట్రంప్ పాక్‌ను హెచ్చరిస్తూ చేసిన ట్వీట్.. ప్రధాని మోదీ దౌత్యనీతి ఫలితమేనని బీజేపీ పేర్కొంది.

ఇదా మీరిచ్చే ప్రతిఫలం!

'గత 15 ఏళ్లుగా అమెరికా మూర్ఖంగా పాక్‌కు 33 బిలియన్ డాలర్ల సాయాన్నందించింది. కానీ.. దీని ప్రతిగా పాక్ మమ్మల్ని మోసం చేసింది. దొంగలెక్కలు, అబద్ధాలు చెప్పింది. మా నేతలను వాళ్లు మూర్ఖులనుకుంటున్నారు' అని ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. 'పాకిస్తాన్ ఉగ్రవాదుల స్వర్గధామంగా మారింది. అతితక్కువ సాయంతో అఫ్గానిస్తాన్‌లో వేట కొనసాగిస్తున్నాం. ఇకపై ఇలాం టివి సాగవు' అని ట్రంప్ తొలి ట్వీట్‌లో విమర్శించారు. ఓ అమెరికా అధ్యక్షుడు మిత్రదేశంగా ఉంటూ వస్తున్న పాక్‌పై ఇలాంటి ఘాటు విమర్శలు చేయటం ఇదే తొలిసారి. తన గడ్డపైనుంచి ఉగ్రవాదాన్ని తరిమేసేందుకు పాకిస్తాన్ సుముఖంగా లేని కారణంగా వారికి ఇవ్వాలనుకున్న 225 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.14.3 వేల కోట్లు) సాయాన్ని నిలిపేయాలని అమెరికా భావిస్తోందంటూ వార్తలొస్తున్నాయి.

సయీద్ విషయంలో సీరియస్

ముంబై దాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్‌ను పాకిస్తాన్ రెండు నెలల క్రితం విడుదల చేసినప్పుడూ అమెరికా బహిరంగంగానే విమర్శించింది. సయీద్‌ను వెంటనే అరెస్టు చేసి పునర్విచారణ జరపాలని సూచించింది. ఒకవేళపాక్ ఈ అంశంపై స్పందించకుంటే అమెరికా–పాక్ ద్వైపాక్షిక సంబంధాలకు విఘాతం తప్పదని హెచ్చరించింది. తన దక్షిణాసియా పాలసీని ప్రకటించిన ట్రంప్.. ఉగ్రవాదంపై పాక్ తన తీరును మార్చుకోని పక్షంలో కఠిన నిర్ణయాలు తప్పవని హెచ్చరించారు. 'మేమింత సాయం చేస్తున్నా.. అమెరికన్లను చంపాలని ప్రతినిత్యం ప్రయత్నించే ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ఆశ్రయం కల్పిస్తోంది. ఈ పరిస్థితి తక్షణమే మారాలి' అని నాడు ట్రంప్ స్పష్టం చేశారు.

రెండు దశాబ్దాలుగా హెచ్చరికలు

పాక్ ఉగ్రస్థావరాలకు స్వర్గధామంగా మారిందనే అంశాన్ని భారత్ పలుమార్లు అంతర్జాతీయ సమాజానికి ఆధారాలతో సహా వెల్లడించింది. అమెరికా కూడా పాక్ ఉగ్ర స్వర్గధామంగా మారిందని ధ్రువీకరించింది. రెండు దశాబ్దాలుగా ఉగ్రకేంద్రాలను నిర్వీర్యం చేయాలని అమెరికా సూచిస్తోంది. కానీ పాకిస్తాన్ మాత్రం అలాంటిదేమీ లేదని బుకాయిస్తూ వచ్చింది. ట్రంప్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఇదే అంశంపై పాక్‌కు పలుమార్లు సూచించారు. సుతిమెత్తని హెచ్చరికలు చేశారు. అయినా పాక్ తీరులో మార్పు రాకపోవటంతో అమెరికా అధ్యక్షుడు నేరుగా తుపాకీ ఎక్కుపెట్టారు. క్రిస్మస్‌కు ముందు అఫ్గానిస్తాన్‌లో పర్యటించిన అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ కూడా.. పాకిస్తాన్ ఉగ్రవాదుల సాయంతో అఫ్గానిస్తాన్, భారత్‌ల అంతర్గత భద్రతకు విఘాతం కల్గిస్తోందని విమర్శించారు.

సరైన సమాధానమిస్తాం: పాక్

ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో పాక్ విదేశాంగ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆ దేశ ప్రధాని షాహిద్ అబ్బాసీతో అత్యవసరంగా సమావేశమయ్యారు. 'ట్రంప్ ట్వీట్‌కు మేం వీలైనంత త్వరగా సమాధానమిస్తాం. ప్రపంచానికి అసలు నిజాలు తెలియాలి. వాస్తవాలు–కల్పితాల మధ్య తేడాను మేం వివరిస్తాం' అని సమావేశం అనంతరం ఆసిఫ్ చెప్పారు. అమెరికా సాయం అందుతుందా లేదా అనే అంశాన్ని పక్కనపెట్టి దేశ ప్రయోజనాలకు అనుగుణంగానే పాక్ ముందుకెళ్లాలని పాక్ మాజీ విదేశాంగ మంత్రి షా ఖురేషీ పేర్కొన్నారు. అంతర్జాతీయంగా పాకిస్తాన్ దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటోందని.. దీనికి అనుగుణంగా పాక్ విదేశాంగ విధానంలోని లోపాలను సవరించుకోవాల్సిన అవసరం ఉందని విపక్ష పీపీపీ సెనెటర్ షెర్రీ రెహమాన్ పేర్కొన్నారు.

భారత్–పాక్ ఎన్‌ఎస్‌ఏల రహస్య భేటీ!

- డిసెంబర్ 27న థాయ్‌లాండ్‌లో చర్చలు
- 'ద డాన్' పత్రికలో కథనం
- ధ్రువీకరించని భారత వర్గాలు



ఇస్లామాబాద్/న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ ఉన్నతాధికారుల మధ్య థాయ్‌లాండ్‌లో రహస్య భేటీ జరిగిందన్న వార్త చర్చనీయాంశంగా మారింది. భారత్, పాక్‌ల జాతీయ భద్రతా సలహాదారుల(ఎన్‌ఎస్‌ఏ) మధ్య ఈ భేటీ సానుకూలంగా సాగిందని పాకిస్తాన్ జాతీయ భద్రతా విభాగం అధికారి ఒకరు వెల్లడించారు. ఆ అధికారి వెల్లడించిన వివరాల్ని ఉటంకిస్తూ 'ద డాన్' అనే పాక్ వార్తాపత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. భారత్ ఎన్‌ఎస్‌ఏ అజిత్ దోవల్, పాక్ ఎన్‌ఎస్‌ఏ నాజర్ ఖాన్‌లు డిసెంబర్ 27న రహస్యంగా కలుసుకున్నారని, భేటీలో దోవల్ సానుకూలంగా వ్యవహరించారని ఆ అధికారి చెప్పారు. భారత్–పాక్‌ల మధ్య ద్వైపాక్షిక స్థాయి చర్చలు ప్రారంభించేందుకు ఈ సమావేశం కొంత మేర సాయపడవచ్చని పాక్ అధికారి పేర్కొన్నట్లు డాన్ తన కథనంలో పేర్కొంది. భేటీ గురించి భారత్ వైపు నుంచి మాత్రం ఎలాంటి అధికారిక, అనధికారిక స్పందన వెలువడలేదు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకే భేటీ జరిగినట్లు భావిస్తున్నారు. అయితే పాకిస్తాన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న కుల్‌భూషణ్ జాధవ్‌ను ఆయన కుటుంబ సభ్యులు కలిసిన రెండు రోజుల అనంతరం ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. జాధవ్ కుటుంబ సభ్యుల్ని పాకిస్తాన్ అవమానించడంతో.. భారత్, పాక్‌ల మధ్య సంబంధాలు ఇటీవల మరింత దిగజారిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్ జైల్లో ఉన్న జాధవ్‌ను చూసేందుకు వెళ్లిన ఆయన భార్య, తల్లితో బొట్టు, తాళి తీయించడంపై భారత్ తీవ్ర నిరసన తెలిపింది.

అణు కేంద్రాల సమాచార మార్పిడి

ఇరుదేశాల్లోని అణు కేంద్రాలు, వాటికి సంబంధించిన అంశాలపై భారత్, పాక్‌లు దౌత్య మార్గాల ద్వారా సమాచారాన్ని మార్పిడి చేసుకున్నాయి. మూడు దశాబ్దాల క్రితం నాటి ద్వైపాక్షిక ఒప్పందం మేరకు ఢిల్లీ, ఇస్లామాబాద్ రాయబార కార్యాలయాలు సోమవారం అణు కేంద్రాల జాబితాల్ని ఇచ్చి పుచ్చుకున్నాయి. భారత్, పాకిస్తాన్‌ల్లోని అణు కేంద్రాలపై పరస్పర దాడుల నిషేధ ఒప్పందం డిసెంబర్ 31, 1988న జరగగా.. జనవరి 27, 1991 నుంచి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ప్రతీ ఏడాది జనవరి 1న అణు కేంద్రాలు, సంబంధిత అంశాల సమాచారాన్ని మార్చుకుంటారు.


పాక్‌తో క్రికెట్ సిరీస్‌కు అవకాశం లేదు

న్యూఢిల్లీ: సీమాంతర ఉగ్రవాదం, కాల్పుల్ని ఆపేంత వరకూ పాకిస్తాన్‌తో ఎలాంటి ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ జరగక పోవచ్చని భారత విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ స్పష్టం చేశారు. విదేశాంగ వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంట్ సంప్రదింపుల కమిటీకి



ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. సరిహద్దుల్లో ఉగ్ర వాదం, కాల్పులు ఆపనంత వరకూ మ్యాచ్‌లకు అవకాశం ఉండదని, ఉగ్రవాదం, క్రికెట్‌లు కలిసికట్టుగా సాగలేవని సుష్మా స్వరాజ్ స్పష్టం చేశారు. ఖైదీలుగా ఉన్న 70 ఏళ్లు దాటిన వారు, మహిళలు, మానసిక స్థితి సరిగా లేని వారిని మానవతా దృక్పథంలో ఇరు దేశాలు విడుదల చేయాలని భారత్‌లోని పాకిస్తాన్ రాయబారికి ప్రతిపాదించినట్లు ఆమె చెప్పారు.

రజనీకాంత్ వెబ్‌సైట్ ప్రారంభం




సాక్షి, చెన్నై: కొత్త రాజకీయ పార్టీ స్థాపిస్తానని ఆదివారం ప్రకటించి ఉత్కంఠకు తెరదించిన సూపర్‌స్టార్ రజనీకాంత్ సోమవారం ఆ దిశగా మరో అడుగు ముందుకేశారు. తన పార్టీకి మద్దతు కూడగట్టడంలో భాగంగా ఓ వెబ్‌సైట్, ఆండ్రాయిడ్ మొబైల్ యాప్‌ను ఆయన ప్రారంభించారు. ప్రజలు, అభిమానులు తమ పేరు, ఓటర్ కార్డు నంబర్‌ను వెబ్‌సైట్, యాప్‌లో నమోదు చేసుకోవడం ద్వారా రజనీ అభిమాన సంఘంలో సభ్యులు కావొచ్చు. ఆ తర్వాత పార్టీ కార్యకర్తలుగా, నాయకులుగా కూడా మారొచ్చు. www. rajinimandram.org వెబ్‌సైట్, అదే పేరుతో ఆండ్రాయిడ్ యాప్ సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. స్వాగత సందేశంగా ఒక నిమిషం నిడివి ఉన్న ఓ వీడియోను సైట్‌లో పెట్టారు. వెబ్‌సైట్, యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా అభిమాన సంఘంలో చేరాలని రజనీ ఆ వీడియోలో చెప్పారు. తమ పార్టీ ఆధ్యాత్మిక బాటలో ఉంటుందని ఇప్పటికే ప్రకటించిన సూపర్‌స్టార్, అందుకు తగ్గట్లుగానే వెబ్‌సైట్‌కు లోగోగా బాబా ముద్రను ఎంపికచేశారు. రజనీ స్థాపించే కొత్త పార్టీ పేరును సంక్రాంతి నాటికి ఖరారు చేసే అవకాశాలున్నాయని ఆయన సోదరుడు సత్యనారాయణ బెంగళూరులో చెప్పారు. రజనీకాంత్ రాజకీయ పార్టీ ప్రకటనను తమిళనాడులో స్వాగతించేవారితోపాటు వ్యతిరేకించే వారు కూడా బాగానే ఉన్నారు. అయితే డీఎంకే, ఏఐఏడీఎంకే సహా ప్రధాన రాజకీయ పార్టీలేవీ రజనీ కొత్త పార్టీని వ్యతిరేకిస్తూ ప్రకటనలు చేయలేదు.

నా టేబుల్‌పైనే న్యూక్లియర్ బటన్



సియోల్: అణ్వాయుధాలను ప్రయోగించేందుకు అవసరమైన న్యూక్లియర్ బటన్ ఎప్పుడూ తన టేబుల్ మీదనే ఉంటుందంటూ ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగించే విషయం చెప్పారు. కొత్త ఏడాది సందర్భంగా తన దేశ ప్రజలకు ఆయన సందేశమిచ్చారు. 'మనం ఇప్పటికే అణ్వస్త్ర రాజ్యంగా అవతరించాం. భవిష్యత్తు అవసరాల కోసం ఇంకా ఎక్కువ అణు వార్‌హెడ్లను, క్షిపణులను తయారు చేయాలి. న్యూక్లియర్ బటన్ నా టేబుల్‌పైనే ఉంటుంది. అమెరికా దీన్ని గుర్తించాలి. బ్లాక్‌మెయిల్ చేయడం కోసం చెబుతున్న మాట కాదు' అని అన్నారు. ఉత్తర కొరియాతో అణుయుద్ధానికి అమెరికా మరింత చేరువగా వెళ్తున్నట్లు తనకు అనిపిస్తోందంటూ అమెరికా మిలిటరీ మాజీ అధికారి మైక్ ముల్లెన్ ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో కిమ్ సోమవారం 'న్యూక్లియర్ బటన్ హెచ్చరికలు' చేయడం గమనార్హం.

ఉగ్ర సయీద్ ఆస్తులు పాక్ చేతికి!



ఇస్లామాబాద్: అంతర్జాతీయ ఉగ్రవాది హఫీజ్ సయీద్ ఆస్తులు, అతడి అధీనంలోని స్వచ్ఛంద సంస్థలను స్వాధీనం చేసుకోడానికి పాకిస్తాన్ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు వార్తా సంస్థ రాయిటర్స్ పేర్కొంది. హఫీజ్ ఆధ్వర్యంలో నడుస్తున్న జమాత్–ఉద్–దవా (జేయూడీ), ఫలాహ్–ఎ–ఇన్సానియత్ ఫౌండేషన్ (ఎఫ్ఐఎఫ్)లను అధీనంలోకి తీసుకోవాలని ఐదు ప్రావిన్సులు, లా ఎన్‌ఫోర్స్‌ మెంట్ విభాగాలకు ఆర్థిక శాఖ రహస్య ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. సంబంధించిన రహస్య పత్రాలను రాయిటర్స్ సంపాదించింది. 1987లో ఏర్పాటు చేసిన ఈ రెండు సంస్థలు లష్కరే తోయిబాకు సంబంధించిన ఉగ్రవాద సంస్థలని, 2008 ముంబై మారణహోమం వెనుక హఫీజ్ హస్తముందని భారత్ ఆరోపిస్తోంది. హఫీజ్ ఆధ్వర్యంలో 300 పాఠశాలలు, ఆస్పత్రులు, ఓ ప్రచురణ సంస్థ, అంబులెన్స్ సర్వీసులు పని చేస్తున్నాయి. అలాగే జేయూడీ, ఎఫ్ఐఎఫ్ సంస్థల్లో 50,000 వరకు వలంటీర్లు, వందల్లో పెయిడ్ వర్కర్లు పని చేస్తున్నారని ఉగ్రవాద నిరోధక సంస్థలు చెబుతున్నాయి. కాగా, హఫీజ్ సంస్థలను స్వాధీనం చేసుకుం టున్నట్లు వస్తున్న వార్తలపై పాక్ మంత్రి ఇక్బాల్ స్పందిస్తూ.. బాధ్యత గల దేశంగా నిషేధిత సంస్థలకు నిధులు అందకుండా కట్టడి చేస్తున్నామని, అమెరికా ఒత్తిడి మేరకు తాము చర్యలు తీసుకోవడం లేదని వెల్లడించారు.

విరాళాలపై నిషేధం

జేయూడీ, ఎఫ్ఐఎఫ్‌లకు ఎవరూ విరాళాలు ఇవ్వకుండా పాకిస్తాన్ ప్రభుత్వం సోమవారం నిషేధాజ్ఞలు జారీ చేసింది. జేయూడీ, ఎఫ్ఐఎఫ్‌లతోపాటు సయీద్‌కు చెందిన మరికొన్ని సంస్థలకు ఎవరూ విరాళాలు ఇవ్వకుండదంటూ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఆఫ్ పాకిస్తాన్ (ఎస్ఈసీపీ) ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రాంతీయ భాషలోనే సైన్స్

- అప్పుడే యువతకు శాస్త్ర ప్రయోగాలపై ఆసక్తి పెరుగుతుంది
- సత్యేంద్రనాథ్ బోస్ జయంత్యుత్సవాల సందర్భంగా మోదీ పిలుపు


ఢిల్లీలో రాష్ట్రపతి కోవింద్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మోదీ

కోల్‌కతా: శాస్త్ర సాంకేతికాంశాలను విస్తృతపరిచేందుకు వ్యవహారిక భాష వినియోగం పెరగాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువతలోనూ సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుందన్నారు. భాష ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకునేందుకు అడ్డంకి కారాదన్నారు. ప్రతి శాస్త్రవేత్త, పరిశోధనకారుడు నవభారత నిర్మాణం దిశగా తన సృజనాత్మకతకు పదునుపెట్టాలన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ సత్యేంద్రనాథ్ బోస్ 125వ జయంతి స్మారక ఉత్సవాల ప్రారంభం సందర్భంగా కోల్‌కతాలో ఏర్పాటుచేసిన కార్యక్రమం కోసం ఢిల్లీ నుంచి ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. భారత శాస్త్రవేత్తలు, పరిశోధనకారులు తమ మేధస్సును దేశ ప్రజలకోసం, వారి సామాజిక–ఆర్థిక అవసరాల కోసం వినియోగించాలని పిలుపునిచ్చారు. ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 'మన యువతలో సైన్స్‌పై ఆసక్తిని, అభిరుచిని పెంచేందుకు సైన్స్ కమ్యూనికేషన్‌ను మరింత విస్తృతపరచాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం భాష అడ్డంకి కారాదు' అని అన్నారు. '2018లో ప్రతి భారతీయుడు మన పూర్వీకులు కన్న నవభారత స్వప్నాన్ని నెరవేర్చేందుకు ప్రతినబూనాలి. 2018 సంవత్సరాన్ని వాటర్‌షెడ్ సంవత్సరంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినందున శాస్త్రవేత్తలు ఈ దిశగా సృజనాత్మక అంశాలపై దృష్టిపెట్టాలి. విద్యాసంస్థలు, పరిశోధన–అభివృద్ధి సంస్థలు ఒకే వేదికపైకి రావటం ద్వారా పరిశోధన మరింత విజయవంతమయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. భారత శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు దేశానికి గర్వకారణమన్న ప్రధాని.. ఇస్రో 100 శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపినప్పుడు ప్రపంచమంతా ఆసక్తిగా గమనించిందన్నారు. నీరు, విద్యుత్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో కొత్త ఆవిష్కరణలకోసం ఎదురుచూస్తున్నామన్నారు. బెంగాల్ పవిత్రమైన గడ్డపై వివిధ రంగాల ప్రముఖులు పుట్టారని మోదీ ప్రశంసించారు. ఆచార్య జేసీ బోస్, మేఘనాథ్ సాహా, ఎస్ఎన్ బోస్ వంటి మహామహులు జన్మించారని.. ఇప్పటికీ వీరి ప్రయోగాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. 1894, జనవరి 1న జన్మించిన భౌతిక శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్ 1920ల్లో క్వాంటమ్ మెకానిక్స్‌లో విశేషమైన ప్రయోగాలు చేశారు. రెండు ఉప కణాలను నిర్వచించే విషయంలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో కలిసి విస్తృత పరిశోధనలు చేశారు. ఈ ప్రయోగంలో కనుగొన్న కణాలకు బోస్ పేరుతో 'బోసాన్స్'గా పిలుస్తున్నారు.

మన సైంటిస్టులే బెస్ట్: హర్షవర్ధన్

భారత శాస్త్రపరిశోధన సంస్థలు అందులో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు ప్రపంచంలోని ఉత్తమ జాబితాలో ఉన్నారని.. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రి హర్షవర్ధన్ వెల్లడించారు. సత్యేంద్రనాథ్ బోస్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి.. ప్రపంచ నానో టెక్నాలజీలో భారత్ మూడో స్థానంలో ఉన్న విషయాన్ని గుర్తుచేశారు.

S & D



పర్వతంపై ఏఎస్పీ (ఇన్‌సెట్‌లో) రాధిక

అకాంకాగ్వా పర్వతాన్ని అధిరోహించిన ఏఎస్పీ

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ఏఎస్పీ రాధిక దక్షిణ అమెరికాలోని ఎత్తైన పర్వతం మౌంట్ అకాంకాగ్వాను విజయవంతంగా అధిరోహించారు. ఈ పర్వతం అర్జెంటీనాలో ఉంది. దీని ఎత్తు 6,962 మీటర్లు. ఈ పర్వతాన్ని అధిరోహించడానికి శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా దృఢత్వం అవసరం. గతంలో ఈమె అనేక పర్వతాలను అధిరోహించి పోలీసు శాఖ కీర్తి ప్రతిష్టలను పెంచారు. ఈమె జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబులతో పాటు పలువురు ప్రముఖుల నుంచి అభినందనలు అందుకున్నారు. ఏఎస్పీ అక్కడి నుంచి స్వదేశానికి ఈ నెల 6వ తేదిన తిరిగిరానున్నారు.

✦ ఆర్గానిక్ వ్యవసాయంతో ప్రమాదం

ప్రకృతి శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్



సాక్షి, అమరావతి బ్యూరో: ఆర్గానిక్ వ్యవసాయంతో ప్రమాదాలు ఉన్నాయని ప్రకృతి శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ తెలిపారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ వద్ద 'పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం'పై రైతులకు ఇస్తున్న రాష్ట్ర శిక్షణ సదస్సులో సోమవారం రెండో రోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ విదేశీ వానపాములు, వర్మికంపోస్టు దుష్ఫలితాల గురించి, స్వదేశీ వానపాముల వలన లాభాలను వివరించారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం గురించి నాలుగు అంశాలు వివరించారు. ముఖ్యంగా పంటకయ్యే ఖర్చు అంతర్ పంటల ఆదాయంతో భర్తీ చేయవచ్చని తెలిపారు. మొక్కల పెంపుదలకు కావాల్సిన ఏ ముడిపదార్థాలు కొనుగోలు చేయకుండానే తయారు చేసుకోవచ్చని వివరించారు. యోగ వ్యవసాయ గురించి, దీనివల్ల కలిగే మోసాలు, అగ్నిహోత్ర గురించి ప్రత్యేకంగా తెలిపారు. రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు విజయకుమార్, జాయింట్ కలెక్టర్ –2 ముంగా వెంకటేశ్వరరావు, జేడీ విజయభారతితోపాటు రైతులు పాల్గొన్నారు.

✦ మార్చిలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడతాం

ఆర్థిక మంత్రి యనమల

తుని: 2018–19కి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను మార్చిలో ప్రవేశపెట్టనున్నామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా తునిలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్ ముసాయిదా రూపకల్పన కోసం త్వరలో మంత్రులు, ఆయా శాఖల కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. సీఎం దృష్టికి వచ్చిన ప్రధాన సమస్యలకు నిధులు కేటాయిస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు ఇచ్చి, 13 జిల్లాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు.

✦ కర్నూలు పెద్దాస్పత్రిలో దారుణం

- రోగుల కేస్‌షీట్లు తారుమారు చేసిన వైద్యులు
- దీంతో కోలుకోలేక రోగి మృతి



కర్నూలు(హాస్పిటల్): వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ రోగి మృతి చెందిన సంఘటన కర్నూలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చోటు చేసుకుంది. రోగుల కేస్‌షీట్లు తారుమారు కావడంతో ఒకరికి ఇవ్వాల్సిన వైద్యం మరొకరికి అందించారు. దీంతో రోగి కోలుకోలేక మృతి చెందాడు. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం రాజపురానికి చెందిన భీమన్న గత నెల 24న కర్నూలు సర్వజన వైద్యశాలలోని న్యూరో సర్జరీ వార్డులో చేరి చికిత్స పొందాడు. అదే రోజున అనంతపురం జిల్లాకు చెందిన భీమప్ప రోడ్డు ప్రమాదానికి గురై అదే వార్డులో చేరాడు. పేర్లు దాదాపు ఒకేలా ఉండటంతోపాటు వైద్యుల నిర్లక్ష్యంతో కేస్‌షీట్లు తారుమారయ్యాయి. భీమప్పకు అందించాల్సిన వైద్యాన్ని భీమన్నకు అందించారు. దీంతో భీమన్న కోలుకోలేక ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం చేయాలని వైద్యులు చెప్పడంతో అతని కుటుంబీకులకు అనుమానం వచ్చింది. అనారోగ్యంతో చనిపోతే పోస్టుమార్టం చేస్తారా అని ఆరా తీశారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సోమవారం ఆస్పత్రిలోని క్యాజువాలిటీ వద్ద భీమన్న కుటుంబసభ్యులు ఆందోళన చేశారు. తన భర్త మరణానికి కారణం వైద్యులేనని భార్య తెలుగు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ వివరణ ఇస్తూ.. భీమప్ప ఆస్పత్రిలో చేరిన మాట వాస్తవమేనని, కానీ ఆయన వార్డులో చేరి చికిత్స తీసుకోలేదని చెప్పారు. భీమన్న పేరును పొరపాటున భీమప్పగా నమోదు చేశారన్నారు. భీమన్నకు ఇచ్చిన వైద్యంలో ఎలాంటి లోపమూ లేదన్నారు.

సవరణ

ఈ నెల 1వ తేదీ సోమవారం మెయిన్ ఎడిషన్ 8వ పేజీలో 'మరీ ఇంత దారుణమా..?' శీర్షికన వచ్చిన వార్తలో 'హెరిటేజ్‌లో కిలో టమాట రూ.50.. రైతు వద్ద రూ.6 'అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ చెప్పినట్లుగా ప్రచురితమైంది. చిత్తూరు జిల్లాలో ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా టమాటా రైతుల కష్టాలు వింటూ.. జగన్ ఈ మాటలన్నట్లు ఉంది. వాస్తవంగా జగన్ 'హెరిటేజ్‌లో కిలో టమాట రూ.50.. రైతు వద్ద రూ.3' అన్నారు. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాం. 'రైతు వద్ద రూ.3' అని చదువుకోగలరు.

వైఎస్సార్ బీమాతో

చేనేతలకు చేయూత

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ

- ఒక్క హామీ నెరవేర్చకుండా చంద్రబాబు నేతన్నలను మోసం చేశారు
- సబ్సిడీలు అందక, రుణ మాఫీ కాక తీవ్ర ఇక్కట్లు
- మనందరి ప్రభుత్వం రాగానే రైతుల తరహాలో బీమా అమలు చేస్తాం

ప్రజా సంకల్ప యాత్ర నుంచి
సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'రాష్ట్రంలో చేనేత కార్మికుల పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయి. వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. మీ అందరి ఆశీస్సులతో మనందరి ప్రభుత్వం వచ్చాక చేనేతలను అన్ని విధాలుగా ఆదుకుంటాం. చేనేత కార్మికులు అనుకోని విధంగా ఎవరైనా చనిపోతే రైతుల మాదిరిగానే వైఎస్సార్ బీమాను ప్రవేశపెడతా'మని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 49వ రోజు సోమవారం చిత్తూరు జిల్లా మదనపల్లె నియోజకవర్గంలోని చిన్న తిప్ప సముద్రం వద్ద చేనేత కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వల్ల చేనేతలకు ఒరిగిందేమీ లేదని, వారికి ప్రతి నెలా ఇచ్చే సబ్సిడీ కూడా ఇవ్వకుండా మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. దేవుడు ఆశీర్వదించి మన ప్రభుత్వం వస్తే ఎంతో గొప్ప పరిపాలన అందించాలని ఉందన్నారు. ప్రతి చేనేత కార్మికుడి ఇంట్లో దివంగత రాజశేఖరరెడ్డి ఫొటో పక్కన తన ఫొటో కూడా ఉండేలా పరిపాలన ఉంటుందని చెప్పారు. ఈ సమ్మేళనంలో జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే..

చంద్రబాబు ఏం చెప్పారు? ఏం చేశారు?

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగేళ్ల పాలనను మనమంతా చూశాం. మరో ఏడాదిలో ఎన్నికలు జరుగబోతున్నాయని ఆ పెద్ద మనిషే చెబుతున్నారు. ఈ నాలుగేళ్ల ఆయన పాలనలో మనం సంతోషంగా ఉన్నామా? ఇవాళ రైతులు, చేనేత కార్మికులు, అక్క చెల్లెమ్మలు, చదువుకుంటున్న విద్యార్థులు, వృద్ధాప్యంలో ఉన్న అవ్వా తాతలు... ఇలా ఎవరూ సంతోషంగా లేరు. ఎన్నికలప్పుడు చేనేత వర్గాలకు ఏం హామీలు ఇచ్చారనేది ఆయన విడుదల చేసిన మేనిఫెస్టో చూస్తే తెలుస్తుంది. అందులో ప్రతి కులాన్ని ఎన్ని రకాలుగా మోసం చేయాలో అన్ని రకాలుగా మోసం చేసిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. ఆ మేనిఫెస్టో ఇపుడు టీడీపీ వెబ్‌సైట్‌లో కనిపిస్తే ప్రజలు కొడతారేమోనని చంద్రబాబు దానిని వెబ్‌సైట్ నుంచి తీసేశారు. చేనేత కార్మికులకు సంబంధించి ఆ మేనిఫెస్టోలో ఆయనేం చెప్పారో నేనొకసారి ఇక్కడ చదువుతాను. (టీడీపీ వెబ్‌సైట్‌లో తీసేయక ముందు అందులోంచి తీసుకున్న మేనిఫెస్టో ప్రతిని చూపిస్తూ..) చంద్రబాబు ఎన్నికలపుడు మాత్రం ఇలా ఫోజులు పెడతారు. మగ్గం మీద కూర్చొని చేనేత కార్మికులతో మమేకం అయినట్లుగా ఎంతో కష్ట పడుతున్నట్లుగా ఫోజు పెడతారు. కానీ వాస్తవానికి ఆయన మేనిఫెస్టోలో చెప్పింది అమలు చేయరు. ఈ నాలుగేళ్లలో చేనేత కార్మికులకు ఏమైనా మేలు జరిగిందేమో మీరే చెప్పండి. చేనేత కార్మికుల బ్యాంకు రుణాలు మాఫీ చేస్తామన్నారు. పవర్‌లూంపై ఉన్న రుణాలను కూడా రద్దు చేస్తామన్నారు. చేనేత కార్మికుల రుణాలన్నీ మాఫీ అయ్యాయా? (చేనేతల నుంచి కాలేదు.. కాలేదు.. అని కేకలు) ఒక్కొక్క చేనేత కుటుంబానికి తక్కువ వడ్డీకి రూ.లక్ష సంస్థాగత రుణం ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ రుణం ఇచ్చారా? చేనేత కార్మికులకు రూ.1000 కోట్లతో ప్రత్యేక నిధి ఇస్తానన్నారు. బడ్జెట్‌లో ఏటా రూ.1000 కోట్లు కేటాయిస్తానన్నారు. ఇవెక్కడైనా కనిపించాయా? జిల్లాకొక చేనేత పార్కు ఏర్పాటు చేస్తానన్నారు. మీ జిల్లాలో ఎక్కడైనా చేనేత పార్కు కనిపించిందా? రూ.1.5 లక్షలతో ఉచితంగా ఇల్లు కట్టిస్తానన్నాడు. మగ్గం షెడ్డును కూడా ఏర్పాటు చేసి ఇస్తానన్నాడు. మరి ఇవి కట్టించారా? (లేదు.. లేదు.. అని జనం నుంచి ప్రతి స్పందన) అలాగే గౌడ సోదరులు ఎక్కడైనా కనబడితే వారి వద్ద ఉన్న పరికరాలు తీసుకుని తన భుజాన వేసుకుని వారి భుజాలపై చేయి వేసి.. వారిపై ఎంతో సానుభూతి ఉన్నట్లు మాట్లాడతారు. ఆపైన రోడ్డు పక్కన బుట్టలల్లుకునే వారిని చూస్తే వారి పక్కన కూర్చుని ఈయన (చంద్రబాబు) కూడా బుట్టలు తీసుకుని అల్లడం ప్రారంభిస్తారు. ఇలా ఫోజులు మాత్రం పెడతారు.



చిన్న తిప్ప సముద్రంలో సోమవారం చేనేత కార్మికుల ముఖాముఖిలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

బీసీలు, చేనేతలకు అండగా ఉంటాం..

బీసీల సంక్షేమానికి కృషి చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారా.. అంటే అది తన తండ్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే. బీసీల అభ్యున్నతి కోసం వైఎస్ ఓ అడుగు ముందుకు వేశారు.. ఆయన కుమారుడిగా నేను వారి కోసం రెండడుగులు ముందుకేస్తా. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో ప్రతి పేద వాడికి ఆరోగ్యం గురించి భరోసా ఉండేది. ఎవరికైనా అనారోగ్యం చేస్తే 108కి ఫోన్ చేయగానే కుయ్.. కుయ్.. అంటూ అంబులెన్స్ వచ్చి ఆ రోగిని ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించే పరిస్థితి ఉండేది. ఇపుడు ఆ సర్వీసు కుంటుపడింది. ఆరోగ్యశ్రీ కింద మంచి వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స చేయించుకునే వీలు లేకుండా చేశారు. కానీ మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1000 ఖర్చు దాటే వైద్యాన్ని ఆరోగ్యశ్రీలో చేరుస్తాం. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ఎక్కడ వైద్యం చేయించుకున్నా ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తాం. రోగి విశ్రాంతి సమయంలో కూడా వారు బాగయ్యేదాకా డబ్బు చెల్లిస్తాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేదలకు రూ.10 వేలు పింఛను ఇస్తాం. ఇవన్నీ కూడా ప్రతి బీసీ సోదరునికి తోడుగా ఉండేందుకే చేస్తున్నాం. దేవుడి దీవెనలు, మీ అందరి ఆశీస్సులతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులతో పాటు చేనేత వర్గాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చి వారికి అండగా నిలబడతా''నని జగన్ చెప్పారు.

అమరావతిలో తెలుగుకు ప్రాధాన్యమివ్వాలి

- ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆకాంక్ష
- విజయవాడలో పుస్తకమహోత్సవం ప్రారంభం



పుస్తకమహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో సీఎం చంద్రబాబు

సాక్షి, విజయవాడ: అమరావతిలో తెలుగు భాషకు ప్రాధాన్యం ఇవ్వాలని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో 29వ పుస్తకమహోత్సవాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సభలో వెంకయ్యనాయుడు మాట్లాడారు. అమరావతి రహదార్లపై రాకపోకలు తెలియజేసే సూచికలు తెలుగులోనే ఉండాలని చెప్పారు. బతుకుదెరువుకు ముందు మాతృ భాషపై పట్టుసాధించి, తర్వాత హిందీ, ఇంగ్లీషు అదనంగా నేర్చుకోవాలన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు వెళతారనుకుంటే పొరపాటన్నారు. నిత్యజీవితంలో పుస్తకానికి ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. విజయవాడలో గత 29 ఏళ్లుగా పుస్తక మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. నేడు కొన్ని సినిమాల్లో వాడే పదాలు ఏమాత్రం గౌరవప్రదంగా ఉండటం లేదన్నారు. అటువంటి పదాలు వాడకుండానే శంకరాభరణం, సీతారామయ్యగారి మనమరాలు వంటి మంచి చిత్రాలు కూడా వచ్చాయన్నారు.

భాషా పరిరక్షణ సంవత్సరంగా 2018: సీఎం

కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగుభాష పరిరక్షణ సంవత్సరంగా 2018ని ప్రకటించారు. రాష్ట్రంలో సాంస్కృతిక, గ్రంథాలయశాఖలను కలిపి భాషను పరిపుష్టంచేస్తామని చెప్పారు. అన్ని జిల్లాల్లోనూ పుస్తకమహోత్సవాలు నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తిసహకారం అందిస్తుందన్నారు.

నాకు ఓటేయకపోతే ప్రజలే సిగ్గుపడాలి: సీఎం

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేయకపోతే ప్రజలే సిగ్గుపడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. తాము చేసిన పనులకు ప్రజలు ఆటోమేటిక్‌గా అన్ని సీట్లు గెలిపించాలన్నారు. ఒకవేళ ఒకటి, రెండు సీట్లు గెలిపించకపోతే ఎందుకు గెలిపించలేదో వాళ్లే ఆలోచించుకోవాలన్నారు. తాము తప్పుచేశామని ప్రజలు సిగ్గుపడే పరిస్థితి రావాలన్నారు. ఆయన సోమవారం వెలగపూడి సచివాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... అన్నీ చేసిన తర్వాత తనకు ఎందుకు ఓటేయరని, ఇంకా ఏం కావాలని ప్రజలను ప్రశ్నించారు. ఇదంతా తన కష్టమని, తన కష్టానికి కూలి ఇవ్వాలన్నారు. వంశధార దగ్గర నుంచి సోమశిల వరకూ నదుల అనుసంధానానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

రాళ్ల దాడులతో

దద్దరిల్లిన పెదగొట్టిపాడు

నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతి

- ఇరువర్గాల మధ్య రాజుకున్న వివాదం
- పరస్పరం కర్రలతో దాడులు
- గ్రామంలో అదుపు తప్పిన పరిస్థితి..



కర్రలతో దాడులు చేసుకుంటున్న ఇరువర్గాలు

ప్రత్తిపాడు/గుంటూరు ఈస్ట్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గుంటూరు జిల్లాలో రెండు వర్గాల మధ్య రాజుకున్న వివాదం ఘర్షణకు, రాళ్ల దాడులకు దారితీసింది. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో ఇరు వర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకుని కర్రలతో దాడులకు దిగడంతో గ్రామంలో అదనపు బలగాలను మోహరించి 144 సెక్షన్ విధించారు. అదనపు ఎస్పీ వైటీ నాయుడు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి...

గొట్టిపాడు దళితవాడకు చెందిన ఇద్దరు యువకులు కొత్త ఏడాది సంబరాల్లో భాగంగా ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై గ్రామంలో వెళ్తున్నారు. అదే సమయంలో అగ్రవర్ణానికి చెందిన ఓ తల్లి, కుమార్తె తమ ఇంటి ముంగిట రంగవల్లులు వేస్తున్నారు. యువకులు నడుపుతున్న ద్విచక్రవాహనం దూసుకురావడంతో తప్పించుకునే క్రమంలో మహిళలు పక్కనే ఉన్న సైడు కాలువలో పడిపోయారు. మరోవైపు బైక్ జారటంతో యువకులు కూడా కిందపడ్డారు. ఆగ్రహించిన మహిళలు వారిని నిలదీయడంతో వివాదం మొదలైంది. అనంతరం ఓ వర్గానికి చెందినవారు ఒక వ్యక్తిపై దాడి చేయడంతో గ్రామంలో పరిస్థితి అదుపు తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ భార్గవ్ అర్ధరాత్రి గ్రామానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి పంపించేశారు.

ఉదయం మళ్లీ రాజుకున్న వివాదం

దళితవాడకు చెందిన ఇద్దరు యువకులు సోమవారం ఉదయం క్షవరం చేయించుకునేందుకు ప్రధాన రహదారిపైకి రాగా మరో వర్గానికి చెందినవారు దాడికి యత్నించారు. ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో పరస్పరం దాడులకు దిగటంతో ఒక్కసారిగా పరిస్థితి అదుపు తప్పింది. పోలీసుల ఎదుటే ఇరువర్గాలకు చెందినవారు రాళ్లు రువ్వుకోవడంతోపాటు కర్రలతో దాడులకు దిగటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇరువర్గాలను శాంతింపజేసేందుకు పోలీసులు చేసిన ప్రయత్నం విఫలం కావటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామానికి సుమారు వందమందికి పైగా స్పెషల్ పార్టీ పోలీసులను తరలించారు.

తెలంగాణ

బడి నుంచి డ్రాప్‘ఔట్’



ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3 శాతం..

- ఉన్నత పాఠశాలల్లో ఒక్క శాతం డ్రాపౌట్స్
- ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థులు
- రాష్ట్రంలో గత ఐదేళ్లలో తగ్గిపోయిన విద్యార్థులు
- ఆధార్ అనుసంధానంతో బోగస్ ఎన్‌రోల్‌మెంట్‌కు చెక్
- తేల్చిన విద్యాశాఖ తాజా లెక్కలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ఆధార్ అనుసంధానంతో బోగస్ ఎన్‌రోల్‌మెంట్‌కు చెక్ పడింది. ఫలితంగా ప్రభుత్వ బడులతోపాటు ప్రైవేటు స్కూళ్లలోనూ ఎన్‌రోల్‌మెంట్ తగ్గిపోయింది. దీంతో ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి కూడా తగ్గింది. అయితే డ్రాపౌట్ రేటు పెరగడం కొంత ఆందోళన కలిగిస్తోంది. 2015–16 విద్యా సంవత్సరం కంటే 2016–17 నాటికి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలన్నింటిలోనూ డ్రాపౌట్స్ పెరిగారు. బోగస్ ఎన్‌రోల్‌మెంట్‌కు కొంత మేర చెక్ పెట్టగలిగినా డ్రాపౌట్ రేటు తగ్గించడం విద్యాశాఖకు సవాల్‌గా మారింది. తెలంగాణ ఎడ్యుకేషనల్ స్టాటిస్టిక్స్ పేరుతో విద్యాశాఖనే ఈ లెక్కలను తేల్చింది. బడికి దూరమవుతున్న వారిలో ఎస్టీ విద్యార్థులు ఎక్కువగా ఉండగా, అదే స్థాయిలో ఎస్సీ విద్యార్థులూ ఉన్నారు.

తగ్గిన విద్యార్థులు 1.58 లక్షలు..

రాష్ట్రంలోని పాఠశాలల్లో 1,58,586 మంది విద్యార్థులు తగ్గిపోయారు. 2015–16లో పాఠశాలల్లో 61,91,782 మంది ఉండగా, 2016–17 నాటికి ఆ సంఖ్య 60,33,196కు పడిపోయింది. వారిలో 29,26,608 మంది బాలికలు, 31,06,588 మంది బాలురు ఉన్నారు. విద్యార్థుల్లో ఎస్సీలు 10,24,646 మంది, బీసీలు 30,29,205 మంది, ఎస్టీలు 6,78,030 మంది ఉన్నారు. మొత్తంగా 2015–16 విద్యాసంవత్సరంతో పోలిస్తే 1,58,586 మంది విద్యార్థులు తగ్గారు. ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం, ప్రైవేటు పాఠశాలల్లో పెరగడం సర్వసాధారణం. కానీ ఈసారి రెండింటిలోనూ విద్యార్థులు తగ్గిపోయారు.

ఎన్ని చర్యలు చేపడుతున్నా..

విద్యాశాఖ అనేక కార్యక్రమాలు చేపడుతున్నా డ్రాపౌట్స్‌ను నివారించలేకపోతోంది. ముఖ్యంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3 శాతం వరకు విద్యార్థులు డ్రాపౌట్స్ కాగా, ఉన్నత పాఠశాలల్లో ఒక్క శాతం బడికి దూరమై డ్రాపౌట్స్‌గా మిగిలారు. ఇక 2007–08లో 8,40,933 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో చేరితే, 2016–17లో పదో తరగతికి వచ్చిన వారు కేవలం 5,22,027 మంది మాత్రమే.

ఎస్సీ, ఎస్టీల్లో అత్యధికం...

రాష్ట్రంలో 2015–16 విద్యా సంవత్సరంలో డ్రాపౌట్ రేటు 36.99 శాతం ఉంటే, 2016–17 విద్యా సంవత్సరంలో 37.92 శాతానికి పెరిగింది. ఎస్సీల్లో 38.90 శాతం, ఎస్టీల్లో 61.09 శాతం విద్యార్థులు డ్రాపౌట్స్‌గా మిగిలిపోతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 18.48 శాతం, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 32.33 శాతం, ఉన్నత పాఠశాలల్లో 37.92 శాతం మంది మధ్యలోనే బడి మానేశారు. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా కొమురం భీం జిల్లాలో 65.66 శాతం మంది డ్రాపౌట్స్‌గా ఉన్నారు. జయశంకర్ జిల్లాలో 60.77 శాతం, మహబూబాబాద్‌లో 60.36 శాతం, నాగర్ కర్నూల్‌లో 57.51 శాతం ఉండగా, తక్కువగా వరంగల్ అర్బన్‌లో 14.09 శాతం, మేడ్చల్‌లో 16.57 శాతం మంది మధ్యలోనే బడి మానేశారు. బడికి దూరమవుతున్న వారిలో బాలురే అత్యధికంగా ఉండటం గమనార్హం.

తగ్గిన ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి

రాష్ట్రంలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి తగ్గిపోయింది. బోగస్ ఎన్‌రోల్‌మెంట్‌కు చెక్ పెట్టడంతో ఇది తగ్గిందని అధికారులు చెబుతున్నారు. 2015–16లో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:25 ఉండగా, 2016–17లో అది 1:23కి చేరుకుంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1:22 నుంచి 1:19కు తగ్గింది. ఉన్నత పాఠశాలల్లో మాత్రం ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి యథాతథంగానే 1:30 ఉంది.

డ్రాపౌట్స్ వివరాలు (శాతాల్లో)

సంవత్సరం	2015-16	2016-17
ప్రాథమిక	16.33	18.48
ప్రాథమికోన్నత	29.42	32.33
ఉన్నత	36.09	37.92

గడిచిన ఐదేళ్లలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి

సంవత్సరం	2012-13	2013-14	2014-15	2015-16	2016-17
ప్రాథమిక	1:31	1:29	1:28	1:25	1:23
ప్రాథమికోన్నత	1:25	1:24	1:23	1:22	1:19
ఉన్నత	1:26	1:26	1:25	1:30	1:30

ఉపాధ్యాయుల సంఖ్య

కేంద్ర ప్రభుత్వం	1,031
రాష్ట్ర ప్రభుత్వం	20,649
ఎంపీపీ,జెడ్పీపీ	98,207
ఎయిడెడ్	3,202
ప్రైవేటు	96,580
గుర్తింపులేని, మదర్సాలు ఇతర	1,780
మొత్తం	2,21,449

యాజమాన్యాల వారీగా విద్యార్థులు...

సంవత్సరం	కేంద్ర	రాష్ట్ర ప్రభుత్వ	ఎంపీ/జెడ్పీ	ఎయిడెడ్	ప్రైవేటు	ఇతర	మొత్తం
2015–16	29,603	6,52,363	21,43,672	1,43,586	31,40,957	81,601	61,91,782
2016–17	30,820	6,74,748	20,41,025	1,26,032	31,19625	40,946	60,33,196

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మంగళవారం 2-1-2018

బులెటిన్ బోర్డ్

ఇంటర్న్‌షిప్స్

ఎన్ఐఎస్‌సీఏఐఆర్‌లో 11 రీసెర్చ్ ఇంటర్న్స్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ రీసోర్సెస్ (ఎన్ఐఎస్‌సీఏఐఆర్)... 11 రీసెర్చ్ ఇంటర్న్‌లకు దరఖాస్తులు కోరుతోంది.

స్టైపెండ్: రూ.24,000.
అర్హతలు: బీఈ/బీటెక్ (ఐటీ)/ఎంఎస్సీ (ఫిజిక్స్/కెమిస్ట్రీ/బోటనీ/జువాలజీ/లైఫ్ సైన్సెస్)/ఎం.లైబ్రరీ సైన్స్ ప్రథమశ్రేణిలో/తత్సమాన గ్రేడ్‌లో ఉత్తీర్ణత.
వయసు: 25 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/దివ్యాంగ/మహిళా అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
ఎంపిక: వాకిన్ ఇంటర్వ్యూ.
దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకొని, అందులో వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి నేరుగా వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
వాకిన్ ఇంటర్వ్యూ వేదిక: ఎన్ఐఎస్‌సీఏఐఆర్, డాక్టర్ కె.ఎస్.కృష్ణన్ మార్గ్, నియర్ రాజేంద్ర మెట్రో స్టేషన్, పూసా గేట్, న్యూఢిల్లీ-110012.
వాకిన్ తేదీ: జనవరి 8, 2018 (ఉదయం 9గంటలకు).
వెబ్‌సైట్: www.niscair.res.in

ఫెలోషిప్స్

ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలో 24 పీఏలు

బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ).. 24 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏడీఏ.. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి వ్యవస్థ.

పోస్టు: ప్రాజెక్ట్ అసిస్టెంట్.
స్టైపెండ్: రూ.25,000+హెచ్ఆర్ఏ.
అర్హతలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్/మెటలర్జికల్‌లో కనీసం 60 శాతం మార్కులు/తత్సమాన గ్రేడ్‌తో బీఈ/బీటెక్/తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత. అలాగే గేట్ 2016/2017 క్వాలిఫై స్కోర్ కార్డ్.
వయసు: 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక: ఇంటర్వ్యూ.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
చివరి తేదీ: జనవరి 10, 2018.
వెబ్‌సైట్: www.ada.gov.in

ఉద్యోగాలు

న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో 26 ఖాళీలు

న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్.. స్కేల్-1 పరిధిలోని 26 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (మెడికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది ప్రభుత్వ రంగ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ.

పోస్టు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (మెడికల్).
వేతనం: రూ.32,795+ఇతర అలవెన్సులు.
మొత్తం ఖాళీలు: 26 (అన్‌రిజర్వుడ్: 14 + ఓబీసీ: 7 + ఎస్సీ: 3 + ఎస్టీ: 2).
అర్హతలు: కనీసం 60 శాతం (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీలకు 55 శాతం) మార్కులతో ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్/పీజీ-మెడికల్ డిగ్రీ/తత్సమాన విదేశీ మెడికల్ డిగ్రీ ఉత్తీర్ణత. అలాగే మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/స్టేట్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు ఉండాలి. హోమియోపతి, ఆయుర్వేద, యునానీ సంబంధ కోర్సుల్లో ఉత్తీర్ణతను పరిగణించరు. **వయసు:** 2018, జనవరి 1 నాటికి 21-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. **ఎంపిక:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ. **దరఖాస్తు రుసుం:** రూ.200; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
దరఖాస్తుల ప్రారంభం: జనవరి 2, 2018.
చివరి తేదీ: జనవరి 17, 2018.
వెబ్‌సైట్: www.newindia.co.in



గ్రాడ్యుయేట్స్ స్పెషల్

టీఎస్‌పీఎస్సీ.. ఉమ్మడి పరీక్షల దిశగా

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ).. మార్పుల దిశగా వేగంగా కదులుతోందా? తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ పేరుతో సరికొత్త ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టనుందా? అంటే... అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇప్పటికే నిపుణుల కమిటీ సిఫార్సులను ప్రభుత్వ ఆమోదం కోసం కమిషన్ పంపింది! వీటికి అనుమతి లభిస్తే గ్రూప్స్ పరీక్షల నియామకాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ విధానాన్ని అమలు చేస్తారనే వార్తల నేపథ్యంలో సంబంధిత అంశాలపై విశ్లేషణ..

జాతీయ స్థాయిలో సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ఎంత ప్రతిష్టాత్మకమైందో.. రాష్ట్ర స్థాయిలో గ్రూప్స్ పరీక్షలకూ అంతే ప్రాధాన్యం ఉంది. అధిక శాతం మంది అభ్యర్థులు రెండు పరీక్షలకూ సన్నద్ధమవుతుంటారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో 'తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ (టీఎస్‌సీఎస్)' పేరుతో కొత్త తరహా నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని టీఎస్‌పీఎస్సీ ఆలోచిస్తున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఎంపిక ప్రక్రియ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ నియామక ప్రక్రియ తరహాలో ఉంటుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

ప్రతిపాదనలు

తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ ప్రక్రియ, సిలబస్‌కు సంబంధించిన ప్రతిపాదనలను టీఎస్‌పీఎస్సీ వర్గాలు ఇప్పటికే ప్రభుత్వానికి పంపాయి. ఉస్మానియా యూనివర్సిటీ మాజీ ఉపకులపతి, ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.రామకృష్ణయ్య నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ వీటిని రూపొందించింది. ఈ సిఫార్సులకు ఆమోదం లభిస్తే.. టీఎస్‌సీఎస్ విధానం వచ్చే ఏడాది నుంచే అమలయ్యే అవకాశముంది.

గ్రూప్-1, 2 లకు ఉమ్మడి పరీక్ష

ప్రతిపాదిత టీఎస్‌సీఎస్ ఎంపిక ప్రక్రియలో రాష్ట్ర స్థాయిలో స్టేట్ కేడర్, గెజిటెడ్ పోస్టులకు ఉమ్మడి పరీక్ష నిర్వహించనున్నారు. అంటే గ్రూప్-1, 2 పోస్టుల భర్తీకి ఒకే పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు హాజరైన అభ్యర్థుల మెరిట్, వారు ఎంపిక చేసుకున్న పోస్టు ప్రాధాన్యం, సదరు పోస్టుల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని నియామకాలు ఖరారు చేస్తారు.

మూడంచెల ప్రక్రియ

యూపీఎస్సీ సివిల్స్ తరహాలో ప్రతిపాదిత తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియ కూడా మూడంచెలుగా ఉండనుంది. తొలుత ప్రిలిమ్స్/స్క్రీనింగ్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే తదుపరి దశలో డిస్క్రిప్టివ్ విధానంలో మెయిన్ ఎగ్జామినేషన్ జరుగుతుంది. ఇందులోనూ విజయం సాధిస్తే నిర్దిష్ట నిష్పత్తి(1:2గా ఉండే అవకాశం)లో అభ్యర్థులను ఎంపిక చేసి, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. మెయిన్స్, ఇంటర్వ్యూ మార్కులను కలిపి తుది జాబితా రూపొందించే అవకాశముంది. అంటే స్టేట్ సివిల్ సర్వీసెస్‌లోనూ ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఉండనున్నాయి. ప్రస్తుతం గ్రూప్-2 పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తున్నారు. కొత్త విధానం (గ్రూప్-1, గ్రూప్-2 ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఉమ్మడి పరీక్ష) అమలైతే.. గ్రూప్-1 ఔత్సాహికులందరూ గ్రూప్-2కూ హాజరవుతారు. అయితే కేవలం గ్రూప్-2ను లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులందరూ గ్రూప్-1కు హాజరవుతారనుకోలేం. ఇలాంటి అభ్యర్థులు టీఎస్‌సీఎస్ విధానంలోని మూడంచెల ఎంపిక ప్రక్రియలో.. ముఖ్యంగా మెయిన్ ఎగ్జామినేషన్ కోణంలో ఇబ్బంది ఎదుర్కొంటారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఉమ్మడి సిలబస్ విధానం

యూపీఎస్సీ, టీఎస్‌సీఎస్ పరీక్షల విషయంలో ఉమ్మడి సిలబస్‌ను అమలుచేసే దిశగా అడుగులు సాగుతున్నాయి. వాస్తవానికి ఇప్పటికే జరిగిన యూపీఎస్సీ స్టాండింగ్ కమిటీ సమావేశంలోనే జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల సర్వీస్ కమిషన్లు ఉమ్మడి సిలబస్ విధానాన్ని అమలు చేయాలని తీర్మానించారు. దీనికి అన్ని కమిషన్లు ఆమోదం తెలిపాయి. 70 నుంచి 80 శాతం మేరకు సివిల్స్, స్టేట్ సివిల్ సర్వీసెస్‌కు ఉమ్మడి సిలబస్, మిగిలిన సిలబస్‌లో రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన నైపుణ్యాలను పరిశీలించే అంశాలను చేర్చనున్నారు.

గ్రూప్-3, 4లకూ ప్రత్యేక వ్యవస్థ!

గ్రూప్స్ పరిధిలో ఎక్కువ మంది అభ్యర్థులు రాసే గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాల నియామకానికి కూడా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. జాతీయ స్థాయిలోని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తరహాలో రాష్ట్ర స్థాయిలోనూ ఇలాంటి ప్రత్యేక వ్యవస్థ (తెలంగాణ స్టాఫ్ సెలక్షన్ కమిషన్)ను ఏర్పాటు చేసే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి పరీక్షలే

టీఎస్‌పీఎస్సీ నియామక ప్రక్రియల్లో చేస్తున్న మార్పుల్లోని మరో ప్రధాన అంశం.. అకడమిక్‌గా ఒకే అర్హతగా ఉండే వివిధ స్పెషలైజ్డ్ పోస్టులకు ఇక నుంచి ఉమ్మడి పరీక్షలు నిర్వహించడం. ఉదాహరణకు బీటెక్ అర్హతగా వివిధ శాఖల్లోని ఇంజనీరింగ్ ఉద్యోగాల భర్తీకి ప్రస్తుతం వేర్వేరు నోటిఫికేషన్లు, ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. అయితే, ఇలాంటి ఉద్యోగాలకు ఇకపై ఉమ్మడి పరీక్ష నిర్వహించి.. అభ్యర్థులు పేర్కొన్న శాఖ ప్రాధాన్యం ఆధారంగా నియామకాలు చేపట్టే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని కూడా యూపీఎస్సీ విధానాన్ని పరిగణనలోకి తీసుకొనే చేపడుతున్నట్లు సమాచారం. యూపీఎస్సీ ఐఈఎస్ పేరుతో జాతీయ స్థాయిలో వివిధ విభాగాల్లో ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ చేపడుతున్న విషయం తెలిసిందే.

'స్టాండింగ్ కమిటీ'లో తుది నిర్ణయం?

త్వరలో అన్ని రాష్ట్రాల కమిషన్లతో యూపీఎస్సీ మరోసారి నిర్వహించనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో తుది విధి విధానాలు ఖరారు కానున్నాయి. ఆ సమావేశంలోనే ఉమ్మడి సిలబస్, స్థానిక సిలబస్‌ల నిష్పత్తిపై స్పష్టత లభించనుంది.

అభ్యర్థులకు కలిసొచ్చే అంశం

ఉమ్మడి సిలబస్‌తో పాటు తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ విధానం అమలైతే.. అది అభ్యర్థులకు కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. సివిల్స్ ఔత్సాహికులందరూ గ్రూప్-1, 2లకు కూడా పోటీపడతారు. ఇలాంటి అభ్యర్థులు ఉమ్మడి సిలబస్ విధానం ఆధారంగా ఏకకాలంలో జాతీయ స్థాయిలోని సివిల్స్‌కు, రాష్ట్ర స్థాయిలోని స్టేట్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌కు సన్నద్ధత సాధించే అవకాశం లభిస్తుంది. గ్రూప్-2ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులు మాత్రం ప్రతిపాదిత మూడంచెల ఎంపిక ప్రక్రియలోని రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్ కోసం డిస్క్రిప్టివ్ విధానంలో అధ్యయనం కొనసాగించడాన్ని అలవరచుకోవాలి.

వేగంగా ఫలితాలు

టీఎస్‌సీఎస్‌కు ఆమోదం లభిస్తే ఎంపిక ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశముంది. ఇప్పటివరకు గ్రూప్-1, గ్రూప్-2లకు వేర్వేరుగా పరీక్షలు, మూల్యాంకనం, ఫలితాల విడుదల ప్రక్రియ చేపడుతున్న సంగతి తెలిసిందే. తాజా విధానం అమలైతే పరీక్షల నుంచి ఫలితాల వరకు ఒకే విధానం కారణంగా వేగంగా ప్రక్రియ పూర్తయ్యే అవకాశముంది.

ఆ మూడు సబ్జెక్టుల్లో మార్పులు!

యూపీఎస్సీ సివిల్స్, టీఎస్‌సీఎస్‌కు ఉమ్మడి సిలబస్ ప్రతిపాదనల నేపథ్యంలో స్థానిక అంశాలకు 20 నుంచి 30 శాతం ప్రాధాన్యమిచ్చే అవకాశముంది. గ్రూప్-1, 2 ఉమ్మడి పరీక్షకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, రాష్ట్ర చరిత్ర, రాష్ట్ర భౌగోళిక శాస్త్రం విభాగాల్లో మార్పులు జరిగే వీలుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఉమ్మడి సిలబస్ విధానంతో పోలిస్తే ప్రస్తుత టీఎస్‌పీఎస్సీ గ్రూప్స్ సిలబస్‌లోని ఇండియన్ హిస్టరీ, ఇండియన్ ఎకానమీ, ఇండియన్ పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ పేపర్ల విషయంలో మార్పులు ఉండకపోవచ్చంటున్నారు. ఎకానమీ, జాగ్రఫీ, హిస్టరీ సబ్జెక్టుల్లో మాత్రం రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేయాల్సిన ఆవశ్యకత ఉంటుందని చెబుతున్నారు.

ఉమ్మడి సిలబస్‌తో ఉపయోగం..

యూపీఎస్సీ ఉమ్మడి సిలబస్ నిబంధన అభ్యర్థులకు కలిసొచ్చే అంశమే. సివిల్స్, గ్రూప్స్ ఔత్సాహికులకు ఒకే సమయంలో రెండు పరీక్షలకు సన్నద్ధత పొందే అవకాశం లభిస్తుంది. అలాగే ప్రతిపాదిత స్టేట్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ప్రక్రియకు ఆమోదం లభిస్తే.. అభ్యర్థులకు ఎంతో మేలు జరుగుతుంది. వాస్తవానికి ఇప్పటికే పంజాబ్, గోవా, యూపీ తదితర ఐదు రాష్ట్రాల్లో ఉమ్మడి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సబార్డినేట్ సర్వీస్‌లకు, గెజిటెడ్ సర్వీసులకు వేర్వేరుగా ఉమ్మడి పరీక్షల విధానం అమలవుతోంది.

– **ప్రొఫెసర్ వి.రామకృష్ణయ్య,**
మాజీ వీసీ-ఉస్మానియా యూనివర్సిటీ,
ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్.

ఆతిథ్య కోర్సులకు ఆహ్వానం..

దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీల్లో బ్యాచిలర్ డిగ్రీ (బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్‌ఎంసీటీ).. తాజాగా 2018కు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పరీక్ష తీరుతెన్నులు, భవిష్యత్తు అవకాశాలపై విశ్లేషణ..

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ- 2018 నోటిఫికేషన్ విడుదల



కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్‌ఎంసీటీ).. హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ కోర్సులు నిర్వహిస్తోంది. దీని నియంత్రణలో దేశవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలున్నాయి. వీటిలో 21 సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్స్, 22 స్టేట్ గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్స్; మరో 14 ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్స్ ఉన్నాయి. ఒక ప్రభుత్వ రంగ సంస్థ కూడా ఉంది. వీటిలో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ.

- **అర్హత:** ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా ఇంటర్మీడియట్/తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత.
- **వయోపరిమితి:** 2018, జూలై 1 నాటికి గరిష్ట వయసు 22 ఏళ్లు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** nchm.nic.in

పరీక్ష విధానం

మొత్తం అయిదు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. అందుబాటులో ఉన్న సమయం 3 గంటలు.

విభాగం	ప్రశ్నలు
న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్	30
రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్	30
జీకే అండ్ కరెంట్ అఫైర్స్	30
ఇంగ్లిష్ లాంగ్వేజ్	60
ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్	50
మొత్తం	200

సన్నద్ధత

- **న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్:** అభ్యర్థుల్లోని గణిత నైపుణ్యాలు, విశ్లేషణ దక్షతను పరీక్షించే ఈ విభాగంలో రాణించాలంటే హైస్కూల్ స్థాయిలోని మ్యాథమెటిక్స్ అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి. ప్రధానంగా కసాగు, గసాభా, శాతాలు, లాభ-నష్టాలు, సంఖ్యా వ్యవస్థ, సగటు, కాలం-పని, వడ్డీ, కాలం-వేగం-దూరం, నిష్పత్తులు, జామెట్రీ తదితర అంశాలపై పట్టు సాధించాలి. అనలిటికల్ ఆప్టిట్యూడ్‌లో డేటాను విశ్లేషించే సామర్థ్యం పెంపొందించుకోవాలి. డేటాలో పేర్కొన్న ముఖ్య సమాచారాన్ని క్రోడీకరించి ఇచ్చిన ప్రశ్నకు తగిన సమాధానాన్ని గుర్తించే నైపుణ్యాన్ని అలవరచుకోవాలి. ఇందుకోసం గ్రాఫ్‌లు, పై చార్ట్‌లు, ఫ్లో చార్ట్‌లు తదితరాలను ప్రాక్టీస్ చేయాలి.
- **రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్:** సునిశిత పరిశీలన, తార్కిక విశ్లేషణతో రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ విభాగంలో రాణించొచ్చు. ఇందులో గరిష్ట మార్కుల సాధన కోసం మ్యాథమెటికల్ ఆపరేషన్స్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ సిరీస్, బ్లడ్ రిలేషన్స్ తదితర అంశాలకు సంబంధించి ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు డేటా సఫీషియన్సీ, వెన్ డయాగ్రమ్స్‌ను సాధన చేయడం మంచిది.
- **జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్:**

ఎగ్జామ్ ఇన్ఫో

ఈ విభాగంలో అధిక మార్కుల సాధనకు హైస్కూల్ స్థాయిలోని పుస్తకాల్లో ఉండే చరిత్ర, రాజ్యాంగం, భౌగోళిక, ఆర్థిక అంశాలను అధ్యయనం చేయాలి. చరిత్రకు సంబంధించి ముఖ్య యుద్ధాలు-పరిణామాలు; భారత జాతీయ ఉద్యమంపై దృష్టిసారించాలి. జాగ్రఫీలో భాగంగా దేశంలోని ముఖ్య ప్రదేశాలు, ఖనిజ వనరులు-అవి ఎక్కువగా లభించే ప్రాంతాలు, నదులు, సరస్సులు, పర్వతాలకు సంబంధించి స్టాక్ జీకే అంశాలను పరిశీలించాలి. వీటితోపాటు ముఖ్య పంటలు-అవి ఎక్కువగా పండే ప్రదేశాలు, జనాభా తదితర అంశాలపై పట్టు సాధించాలి. కరెంట్ అఫైర్స్‌లో ఇతర పోటీ పరీక్షల తరహాలోనే ముఖ్యమైన సదస్సులు, సమావేశాలు, వార్తల్లోని వ్యక్తులు, అంతర్జాతీయ ప్రాధాన్యమున్న అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

అభ్యర్థులు బేసిక్ గ్రామర్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ఇంగ్లిష్ న్యూస్‌పేపర్ చదువుతూ కొత్త పదాలపై పట్టు సాధించాలి. ఆయా పదాలను ఉపయోగించే తీరుపైనా అవగాహన పెంపొందించుకోవాలి. పదో తరగతి స్థాయి ఇంగ్లిష్ పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా ఈ విభాగంలో అధిక మార్కులు సంపాదించొచ్చు.

సేవారంగ ఆప్టిట్యూడ్

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈలో ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ సెక్షన్ ప్రత్యేకమైనది. ఇందులో ప్రధానంగా ఆతిథ్య, పర్యాటక రంగాలపై ఉన్న ఆసక్తి, దృక్పథాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఎదురవుతాయి. వాస్తవ సంఘటన లేదా అంశం ఇచ్చి దానికి ఎలా స్పందిస్తారు? అనే తరహా ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగంలో మార్కుల కేటాయింపు విధానం కూడా భిన్నంగా ఉంటుంది.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2018, ఏప్రిల్ 11.
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** 2018, ఏప్రిల్ 20.
- **పరీక్ష తేదీ:** 2018, ఏప్రిల్ 28.
- **ఫలితాల వెల్లడి:** 2018, మే మూడో వారంలో.
- **వెబ్‌సైట్:** www.nchm.nic.in

తెలుగు రాష్ట్రాల్లోని సంస్థలు

- **ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్:** హైదరాబాద్ (230 సీట్లు) (సెంట్రల్ ఐహెచ్‌ఎం).
- **డాక్టర్ వైఎస్సార్ ఎన్ఐటీహెచ్‌ఎం:** హైదరాబాద్ (60 సీట్లు) (స్టేట్ ఐహెచ్‌ఎం).
- **ఎస్ఐహెచ్‌ఎంసీటీ:** తిరుపతి (60 సీట్లు) (స్టేట్ ఐహెచ్‌ఎం).

ఆతిథ్యంలో అపార అవకాశాలు

బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులు పూర్తిచేసిన వారికి అపార ఉద్యోగావకాశాలుంటాయి. ఫైనలియర్ మొదటి సెమిస్టర్‌లోనే ప్లేస్‌మెంట్స్ ప్రారంభమవుతాయి. మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నవారు నెలకు రూ.30 వేలకు పైగా వేతనంతో కెరీర్ ప్రారంభించొచ్చు. కోర్సు సమయంలో ఇంటర్న్‌షిప్ ద్వారా క్షేత్రస్థాయి నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చు. మేనేజ్‌మెంట్ ట్రైనీగా కెరీర్ ప్రారంభించి, నైపుణ్యాలను పెంపొందించుకుంటే కొద్ది కాలంలోనే ఉన్నత వేతనాలు, పదోన్నతులు సాధించొచ్చు. గల్ఫ్, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాలు ఉన్నత అవకాశాలకు కేరాఫ్ ఉన్నాయి. రిటైల్ రంగంలోనూ విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల్లోనూ అవకాశాలుంటాయి. ఆసక్తి ఉన్నవారు ఉన్నతవిద్య దిశగా వెళ్లొచ్చు.

– **వి.నరేంద్ర కుమార్,** ప్రిన్సిపల్,
డాక్టర్ వైఎస్సార్ ఎన్ఐటీహెచ్‌ఎం,
హైదరాబాద్.

సాక్షి బిజినెస్
మంగళవారం 2-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
244 ▼	95 ▼
33,813	10,436

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	6,903	▽ 47
డోజోన్స్	24,719	▽ 118
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,688	△ 65
డాక్స్	12,918	▽ 62
షాంఘై	3,308	△ 12
నికాయ్	22,765	▽ 19

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.61	64.74
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.55	87.72
€	యూరో	ఎస్‌బీఐ	77.86	78.01
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.56	57.67
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	50.72	50.82
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.49	48.59
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.42	18.31
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.81	18.48
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.94	11.26

ఎస్‌బీఐ రుణ రేట్లు తగ్గాయ్!

బేస్‌రేటు, బీపీఎల్‌ఆర్ 0.3 శాతం తగ్గింపు ● 80 లక్షల మంది ఖాతాదారులకు ప్రయోజనం ● కొత్త సంవత్సర కానుకగా జనవరి 1 నుంచే అమల్లోకి



ముంబై: ఖాతాదారులకు కొత్త సంవత్సర కానుకగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బేస్ రేటు, బీపీఎల్‌ఆర్‌ను 0.3 శాతం మేర తగ్గించింది. దీంతో పాత వడ్డీ రేట్ల విధానంలో రుణాలు తీసుకున్న 80 లక్షల మంది ఖాతాదారులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుత కస్టమర్లకు బేస్ రేటును 8.95 శాతం నుంచి 8.65 శాతానికి తగ్గిస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. అలాగే బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటును (బీపీఎల్‌ఆర్) 13.70% నుంచి 13.40%కి తగ్గించింది. అయితే, మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత వడ్డీ రేటును (ఎంసీఎల్‌ఆర్) మాత్రం యథాతథంగా ఉంచింది. ప్రస్తుతం ఏడాది వ్యవధి ఎంసీఎల్‌ఆర్ 7.95%గా ఉంది. దీన్ని గానీ మరింతగా తగ్గించి ఉంటే రుణగ్రహీతలందరికీ ప్రయోజనం చేకూరేది. కొత్త రేట్లు జనవరి 1 నుంచే వర్తింపచేస్తున్నట్లు ఎస్‌బీఐ వివరించింది. 'డిసెంబర్ ఆఖరు వారంలో వడ్డీ రేట్లను సమీక్షించాం. మా డిపాజిట్ రేట్లను బట్టి .. బేస్ రేటును 30 బేసిస్ పాయింట్ల మేర తగ్గించి 8.65 శాతానికి కుదించాం. బేస్‌రేటుతో వ్యత్యాసం భారీగా ఉన్న నేపథ్యంలో ఎంసీఎల్‌ఆర్‌ను గతంలోనే తగ్గించాం. ఇది మా ఖాతాదారులకు కొత్త సంవత్సరం కానుక' అని రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ ఎండీ పి.కె. గుప్తా తెలిపారు. ఇటీవల తగ్గిన పాలసీ రేట్ల ప్రయోజనాలను ఖాతాదారులకు బదలాయించేందుకు తాజా సమీక్ష తోడ్పడగలదని వివరించారు. గృహ, విద్యా రుణాలు తీసుకున్న పలువురు ఖాతాదారులకు ఇది ఉపయోగపడనుంది.

ప్రాసెసింగ్ ఫీజు మినహాయింపు మార్చి దాకా ..

గృహ రుణం ప్రాసెసింగ్ ఫీజు మినహాయింపు ఆఫర్‌ను ఈ ఏడాది మార్చి దాకా పొడిగిస్తున్నట్లు బ్యాంకు తెలిపింది. కొత్తగా గృహ రుణం తీసుకునే వారు, వేరే బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ఎస్‌బీఐకి బదలాయించుకోవాలని అనుకుంటున్న వారు ఈ ప్రయోజనాలు అందుకోవచ్చు. సుమారు 80 లక్షల మంది ఖాతాదారులు కొత్తగా ప్రవేశపెట్టిన ఎంసీఎల్ ఆర్ విధానానికి మళ్లకుండా ఇంకా పాత వడ్డీ రేట్ల విధానంలోనే కొనసాగుతున్నారు. వీరికి తాజా బేస్ రేటు తగ్గింపు ప్రయోజనం చేకూర్చనుంది.

ఏప్రిల్ కల్లా బంధన్ బ్యాంక్ ఐపీఓ

సెబీకి ఐపీఓ పత్రాల దాఖలు

● ఇష్యూ పరిమాణం రూ.2,500 కోట్లు!



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని బంధన్ బ్యాంక్ త్వరలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌కు వస్తోంది. కోల్‌కతా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ బ్యాంక్ ఐపీఓ పత్రాలను మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీకి సోమవారం సమర్పించింది. ఐపీఓ ద్వారా ఈ బ్యాంక్ రూ.2,500 కోట్లు సమీకరిస్తుందని అంచనా. బ్యాంకింగ్ రంగంలో ఇప్పటివరకూ ఇదే అతి పెద్ద ఐపీఓ అని మర్చంట్ బ్యాంకర్లు చెబుతున్నారు. ఈ ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో ఐపీఓ ఆరంభమయ్యే అవకాశాలున్నాయి.

11.92 కోట్ల షేర్ల విక్రయం

ఐపీఓలో భాగంగా రూ.10 ముఖ విలువ గల 11.92 కోట్ల షేర్లను జారీ చేయనున్నట్లు బంధన్ బ్యాంక్ తెలియజేసింది. వీటిల్లో 9.76 కోట్ల షేర్లు తాజా ఈక్విటీ షేర్లు కాగా, 2.1 కోట్ల షేర్లు ప్రస్తుత వాటాదారులవని వివరించింది. వీటిల్లో 1.40 కోట్ల షేర్లను ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ), 75 లక్షల షేర్లను ఐఎఫ్‌సీ ఎఫ్ఐజీ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయిస్తాయని పేర్కొంది. ఈ రెండు సంస్థలకు బంధన్ బ్యాంక్‌లో 4.94 శాతం వాటా ఉంది. మొత్తం మీద ఈ ఐపీఓ ద్వారా ఈ బ్యాంక్ పది శాతం వాటాను విక్రయించనుంది.

కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, యాక్సిస్ క్యాపిటల్, గోల్డ్‌మన్ శాక్స్ (ఇండియా) సెక్యూరిటీస్, జేఎమ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషనల్ సెక్యూరిటీస్, జేపీ మోర్గాన్ ఇండియా సంస్థలు ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తాయి. మైక్రోఫైనాన్స్ సేవలందిస్తున్న బంధన్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు ఆర్‌బీఐ 2014లో బ్యాంకింగ్ లైసెన్స్ ఇచ్చిన విషయం తెలిసిందే.

రూ. 2వేల దాకా డెబిట్ కార్డు చెల్లింపులపై చార్జీలు నిల్




న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపులను మరింత ప్రోత్సహించే దిశగా కేంద్రం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా డెబిట్ కార్డులు, భీమ్ యాప్ ద్వారా రూ.2,000 దాకా చెల్లింపులపై లావాదేవీల చార్జీలను రద్దు చేసింది. ఇటు కొనుగోలుదారులకు అటు వ్యాపారస్తులకు ప్రయోజనకరంగా ఉండేలా సదరు మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీల భారాన్ని ప్రభుత్వమే రెండేళ్ల పాటు భరించనున్నట్లు ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి రాజీవ్ కుమార్.. మైక్రోబ్లాగింగ్ సైటు ట్వీటర్‌లో పోస్ట్ చేశారు. 'డిజిటల్ చెల్లింపులకు ఊతమిచ్చే దిశగా రూ.2,000 దాకా డెబిట్ కార్డులు/భీమ్ యాప్ లేదా ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టమ్స్ ద్వారా చేసే చెల్లింపులపై లావాదేవీల చార్జీలను ప్రభుత్వమే బ్యాంకులకు రీయింబర్స్ చేస్తుంది. దీనితో వ్యాపారస్తులపై కూడా ఎలాంటి భారమూ ఉండదు' అని ఆయన పేర్కొన్నారు. జనవరి 1 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. తాజా నిర్ణయంతో ఖజానాపై రూ. 2,512 కోట్ల మేర ప్రభావం పడనుంది.

హెచ్-1బీ వీసా షరతులు ఆందోళనకరం

నాస్కామ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ: అమెరికన్ల ఉద్యోగాలను కాపాడే పేరిట.. ప్రతిపాదిత హెచ్-1బీ వీసా బిల్లులో అమెరికా అసాధ్యమైన షరతులను పొందుపర్చిందని దేశీ ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ తెలిపారు. ఇటు భారతీయ ఐటీ కంపెనీలతో పాటు అటు హెచ్-1బీ వీసాలు ఉపయోగించే క్లయింట్లకు కూడా కఠినతరమైన నిబంధనలు ఇందులో ఉన్నాయని ఆయన చెప్పారు. దీనిపై తమ ఆందోళనను అమెరికా సెనేటర్లు, అధికారులకు తెలియజేశామని, ప్రతిపాదిత చట్టంపై రాబోయే రోజుల్లో మరిన్ని చర్చలు జరపనున్నామని చంద్రశేఖర్ వివరించారు. 'అమెరికన్ ఉద్యోగాలను కాపాడే పేరుతో.. ఈ నిబంధనలను వీసాలపై ఎక్కువగా ఆధారపడే కంపెనీలకు.. అంటే భారతీయ కంపెనీలకు మాత్రమే వర్తింపచేసేలా ఉండటం మరింత ఆందోళన కలిగించే విషయం' అని ఆయన పేర్కొన్నారు. సదరు నిబంధనల ప్రకారం హెచ్-1బీ వీసాలపై నియమించుకున్న వారికి అధిక వేతనాలు ఇవ్వడంతో పాటు వారి రాక వల్ల ప్రస్తుతం ఉన్న ఉద్యోగి ఉద్యోగానికి అయిదారేళ్ల పాటు ఎలాంటి ధోకా ఉండబోదంటూ క్లయింటు ధృవీకరించాల్సి ఉంటుంది.ఈ బిల్లును అమెరికా సెనేట్ ఆమోదించాల్సి ఉంది.



దిగ్గజాల రూటు సెపరేటు!

ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ భిన్న వ్యూహాలు

- కొత్త సంవత్సరంలో కొత్తగా పయనం
- ఈ-కామర్స్ మార్కెట్‌పై సొంత ముద్ర
- చిన్న పట్టణాలు, సొంత ఉత్పాదనలపై ఫ్లిప్‌కార్ట్
- కస్టమర్ కోరినవన్నీ అందించడమే అమెజాన్ వ్యూహం



న్యూఢిల్లీ: దేశీయ ఈ కామర్స్ మార్కెట్లో దిగ్గజాలైన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ తమ వాటా పెంచుకునేందుకు 2018లో భిన్న వ్యూహాలతో సిద్ధమవుతున్నాయి. ఇప్పటి వరకు ఈ రెండు సంస్థలు ఈ-కామర్స్ మార్కెట్లో పై చేయి సాధించేందుకు గాను తీవ్ర స్థాయిలో పోటీ పడ్డాయి. అగ్ర స్థానం కోసం మార్కెటింగ్ వ్యూహాల పరంగా ఒకదాన్ని ఇంకొకటి అనుకరించేవి. కొత్త ఏడాదిలో మాత్రం ఇవి రెండూ భిన్న మార్గాల్లో అడుగులు వేయనున్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చైనా అలీబాబా వెన్నుదన్నుతో పేటీఎం మాల్ సైతం మూడో పక్షంగా అవతరించనున్నదనేది వారి మాట.

చిన్న పట్టణాలపై ఫ్లిప్‌కార్ట్ గురి

ఈ-కామర్స్ దిగ్గజాల్లో ఒకటిగా కొనసాగుతున్న ఫ్లిప్‌కార్ట్... చిన్న పట్టణాల్లో మరింత మంది కస్టమర్లను ఆకట్టుకోవడంపై దృష్టి సారించనుంది. తన సొంత బ్రాండ్ ఉత్పత్తులతో వినియోగదారులకు చేరువ కావాలన్న వ్యూహంతో ఉంది. అమెజాన్ మాత్రం ప్రీమియం కస్టమర్లకు మరిన్ని ఉత్పత్తులను అందించడంపై దృష్టి పెట్టనుంది. మొత్తమ్మీద ఇరు కంపెనీలూ ప్రస్తుతం తాము‌న్న స్థానాలను పటిష్టంగా కాపాడుకుంటూనే కొత్త మార్కెట్లలోకి ప్రవేశించే విధానాలను అమలు చేయబోతున్నాయి.

''మొదటి సారి ఈ-కామర్స్ మార్కెట్ లీడర్లయిన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ రెండు భిన్న మార్గాలను అనుసరించడాన్ని చూడబోతున్నాం''అని హెచ్ఎస్‌బీసీ సెక్యూరిటీస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్ (ఇండియా) అనలిస్ట్ రాజీవ్ శర్మ చెప్పారు. కేవలం సరుకుల అమ్మకాల విలువపైనే (జీఎంవీ) ఈ మార్కెట్ ఎంతో కాలం కొనసాగకపోవచ్చని, ఆన్‌లైన్ కొనుగోలుదారుల్ని పెంచుకోవడం, మళ్లీ మళ్లీ కొనుగోళ్లు చేయించడం, కొత్త విభాగాలలో వృద్ధి వంటివి మార్కెట్‌ను శాసించవచ్చని 'ఇండియా ఇంటర్నెట్: ఆన్ ద వే టు ఇండియా ఈ కామర్స్ 2.0' పేరుతో విడుదల చేసిన నివేదికలో రాజీవ్ శర్మ వివరించారు. స్టోర్‌లో అన్ని ఉత్పత్తులు లభించేలా, కస్టమర్లు ఆశించేవన్నీ అందుబాటులో ఉండేలా చూడటమే తమ లక్ష్యమని అమెజాన్ ఇండియా ప్రతినిధి పేర్కొన్నారు.

- మెట్రోలకు వెలుపల విస్తరించి ఉన్న పట్టణాల్లోని కస్టమర్లకు చేరువ కావాలన్నది ఫ్లిప్‌కార్ట్ యోచన. ప్రైవేటు లేబుల్స్ ఉత్పత్తుల ద్వారా వారికి చేరువ కావాలనుకుంటోంది.
- ఫ్లిప్‌కార్ట్ మొత్తం విక్రయాల్లో దాని సొంత లేబుల్స్ ఉన్న ఉత్పత్తుల విలువ 15 నుంచి 20 శాతం వరకు ఉంది.
- వాస్తవానికి ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుత అమ్మకాల్లో 45 శాతం చిన్న పట్టణాల నుంచే వస్తోంది.
- అమెజాన్ కూడా చిన్న పట్టణాల మార్కెట్‌ను సొంతం చేసుకునే ఆలోచనతో ఉంది.
- ప్రస్తుతం అమెజాన్ విక్రయాల్లో 65 శాతం వాటా మెట్రో నగరాల నుంచే ఉంది. ఇందులోనూ 'అమెజాన్ ప్రైమ్' పాత్ర కీలకం.
- అమెజాన్ ఫ్యాషన్, కిరాణా ఉత్పత్తులపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది.

ఆన్‌లైన్ ఉత్పత్తులపై ఎక్స్‌పైరీ తేదీ తప్పనిసరి!

- ధరతో పాటు, కస్టమర్ కేర్ వివరాలూ ఉండాలి
- 1 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధన



న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరిపేవారి ప్రయోజనాలను పరిరక్షించే దిశగా కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆన్‌లైన్‌లో విక్రయించే ఉత్పత్తులపై ఈ-కామర్స్ కంపెనీలు గరిష్ట చిల్లర ధరతో (ఎంఆర్‌పీ) పాటు ఎక్స్‌పైరీ తేదీ, కస్టమర్ కేర్ వివరాలు మొదలైనవి కూడా తప్పనిసరిగా డిస్‌ప్లే చేసేలా రూపొందించిన నిబంధన జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చింది. 'వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించే విధంగా లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) నిబంధన 2011లో చేసిన సవరణలు 2018 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి' అని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. సవరించిన నిబంధనల ప్రకారం ఈ-కామర్స్ సైట్లలో విక్రేతలు ఆయా ఉత్పత్తుల ఎంఆర్‌పీ, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీ, నికర పరిమాణం, ఏ దేశ ఉత్పత్తి, కస్టమర్ కేర్ మొదలైనవి లేబుల్‌పై డిస్‌ప్లే చేయాలి. కొనుగోలుదారు చదవగలిగేలా అక్షరాలు, అంకెల పరిమాణం ఉండాలి. ఒకే ఉత్పత్తికి రెండు రకాల ధరలు (డ్యుయల్ ఎంఆర్‌పీ) ఉండకూడదు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అమ్ముడయ్యే ఉత్పత్తులపై ఎంఆర్‌పీ మాత్రమే ముద్రించి ఉంటోంది. అయితే, ఆయా ఉత్పత్తుల వివరాలు సమగ్రంగా లేకపోవడం వల్ల మోసపోయామంటూ అనేక ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వినియోగదారుల వ్యవహారాల శాఖ.. సంబంధిత చట్టానికి 2017 జూన్‌లో సవరణలు చేసింది.

కొన్నింటికే విక్రయాల పండుగ

మారుతీ, హోండా అమ్మకాల్లో రెండంకెల వృద్ధి

- హ్యుందాయ్ విక్రయాల్లో స్వల్ప పెరుగుదల
- తగ్గిన మహీంద్రా ప్యాసింజర్ వాహన అమ్మకాలు



న్యూఢిల్లీ: దేశీ ప్యాసింజర్ వాహన విక్రయాలు డిసెంబర్‌లో మిశ్రమంగా నమోదయ్యాయి. దిగ్గజ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) సహా హోండా కార్స్ ఇండియా (హెచ్‌సీఐఎల్) వాహన అమ్మకాల్లో బలమైన వృద్ధి కనిపించింది. ఇవి రెండంకెల వృద్ధితో 2017కి బై బై చెప్పాయి. మరొకవైపు హ్యుందాయ్ మోటార్ ఇండియా వాహన విక్రయాల్లో స్వల్ప వృద్ధి నమోదు కాగా, మహీంద్రా(ఎంఅండ్ ఎం) ప్యాసింజర్ అమ్మకాల్లో క్షీణత కనిపించింది.

మారుతీ దేశీ విక్రయాలు 12.1% వృద్ధితో 1,06,414 యూనిట్ల నుంచి 1,19,286 యూనిట్లకు ఎగశాయి. స్విఫ్ట్, డిజైర్, బాలెనో వంటి కార్లకు అధిక డిమాండ్ దీనికి కారణం. హెచ్‌సీఐఎల్ దేశీ అమ్మకాలు 26% మేర పెరిగాయి. 10,071 యూనిట్ల నుంచి 12,642 యూనిట్లకు చేరాయి. హ్యుందాయ్ మోటార్ ఇండియా దేశీ అమ్మకాలు 40,057 యూనిట్ల నుంచి 40,158 యూనిట్లకు స్వల్పంగా పెరిగాయి. ఏడాది మొత్తంగా చూస్తే కంపెనీ దేశీ విక్రయాల్లో 5.4 శాతం వృద్ధి నమోదయ్యింది. ఇవి 5,00,539 యూనిట్ల నుంచి 5,27,320 యూనిట్లకు ఎగశాయి. స్కార్పియో, ఎక్స్‌యూవీ 500, బొలెరో, వెరిటో, జైలో సహా మహీంద్రా ప్యాసింజర్ వాహన విక్రయాలు 7% క్షీణించాయి. 16,799 యూనిట్ల నుంచి 15,543 యూనిట్లకు తగ్గాయి. అయితే దేశీ విక్రయాలు 7% వృద్ధితో 34,411 యూనిట్లతో 36,979 యూనిట్లకు పెరిగాయి.


కంపెనీ	దేశీ వాహన విక్రయాలు 2017	2016	వృ/క్షీ
మారుతీ సుజుకీ	1,19,286	1,06,414	12
హోండా కార్స్	12,642	10,071	26
హ్యుందాయ్	40,158	40,057	--
మహీంద్రా	36,979	34,411	7

రసాయన ప్లాంట్లకు అనుమతులేవీ?

మాలిక్యూల్ అభివృద్ధి కేంద్రాలకు కంపెనీల క్యూ

వెయ్యి కోట్లకి పైగా పెట్టుబడులతో 100 సంస్థలు రెడీ ● కాలుష్య కారణాలతో టీఎస్ఐఐసీ తిరస్కరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కెమికల్ కంపెనీలదో కొత్త సమస్య. వాటికి ఆర్డర్లున్నాయి. విస్తరణ చేపడితే వాటిని పూర్తి చేయొచ్చు. విస్తరణకు తగ్గ నిధులూ ఉన్నాయి. కాకపోతే కొత్త ప్లాంట్ల కోసం అనుమతులే రావటం లేదు. ఎక్కువ కాలుష్యం విడుదలవుతుంది కనక వాటికి ప్రస్తుతం ఉన్న ప్రాంతాల్లో విస్తరించడానికి గానీ, అవి కోరుకున్న ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుకు గానీ అనుమతులు రావటం లేదు. ముచ్చర్లలో ఫార్మా సిటీని ప్రతిపాదించిన ప్రభుత్వం... అక్కడే వాటిని అనుమతించాలనుకుంటోంది. కాకపోతే... ఇంకా ఆ ఫార్మా సిటీకే అనుమతులు రాలేదు. ఫలితం... విస్తరణకు నోచుకోని పలు కంపెనీలు ఇతర రాష్ట్రాలకూ వలసపోతున్నాయి.



రసాయనాలు, మాలిక్యూల్స్ ఎక్కువగా హైదరాబాద్‌తో పాటూ బెంగళూరు, పుణె నగరాల్లో తయారవుతుంటాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో మాలిక్యూల్స్, రసాయనాల అభివృద్ధి కంపెనీలు 200 వరకూ ఉన్నాయి. ఇవన్నీ దాదాపుగా బాలానగర్, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. అయితే ప్రస్తుతమున్న కంపెనీలకు పెద్ద మొత్తంలో అంటే 25 కిలోల కంటే ఎక్కువ మాలిక్యూల్స్‌కు ఆర్డర్ వస్తే అభివృద్ధి చేసే స్థాయిలో పరిశోధన కేంద్రాలు, లేబొరేటరీలు లేవు. పోనీ, సొంతంగానైనా రీసెర్చ్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుందామంటే ప్రభుత్వం అనుమతివ్వటం లేదని బాలానగర్‌కు చెందిన హెటిరోసైక్లిక్స్ సీఈఓ డాక్టర్ జి.జగత్‌రెడ్డి 'సాక్షి బిజినెస్ బ్యూరో'కు తెలిపారు. వచ్చిన ఆర్డర్‌ను పోనివ్వకుండా ఈ సంస్థలు బల్క్ డ్రగ్ తయారీ కంపెనీల్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ''ఇక్కడేమవుతుందంటే.. మాలిక్యూల్స్ అభివృద్ధి కోసం మా టెక్నాలజీని బల్క్ డ్రగ్ తయారీ సంస్థలకు ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడవి పెద్ద మొత్తంలో మాలిక్యూల్స్‌ను అభివృద్ధి చేసేస్తాయి. టెక్నాలజీ లీక్ కావటంతో తర్వాత బల్క్ డ్రగ్ కంపెనీలే సొంతంగా మాలిక్యూల్స్‌ను అభివృద్ధి చేసి తక్కువ ధరకు విక్రయించేస్తున్నాయి'' అని జగత్‌రెడ్డి వివరించారు. మరికొన్ని కంపెనీలు మార్కెట్‌ను వదులుకోలేక ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాలకు వెళుతున్నాయి. ఇప్పటికే పలు కంపెనీలు ఏపీకి తరలిపోయినట్లు తెలియవచ్చింది.

ఫార్మాసిటీలోనే అనుమతులిస్తాం..

కొత్తగా రసాయనాలు, మాలిక్యూల్స్ అభివృద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు, ప్రస్తుతమున్న సంస్థల విస్తరణకు కూడా అనుమతించకపోవటానికి తెలంగాణ ప్రభుత్వం చెబుతున్న ప్రధాన కారణం ఆయా ప్లాంట్ల తాలూకు కాలుష్యమే. అందుకే వాటిని ముచ్చర్లలో ప్రతిపాదిత ఫార్మా సిటీలోనే ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాకపోతే ఇపుడు ముచ్చర్లలో ఏర్పాటు చేస్తామన్నా అనుమతులు దొరకటం లేదని పలు కంపెనీల ప్రతినిధులు వాపోయారు. ''14 వేల ఎకరాల్లో రానున్న ఈ సిటీలో 2,500 ఎకరాలను రసాయన ప్లాంట్లు, ఆర్అండ్‌డీ కంపెనీలకు కేటాయించాం. కాకపోతే ఫార్మా సిటీ ఏర్పాటుకు ఇంకా కేంద్ర పర్యావరణ విభాగం అనుమతులివ్వాల్సి ఉంది. మరో 3-4 నెలల్లో అనుమతులు రావచ్చని అంచనా వేస్తున్నాం'' అని టీఎస్ఐఐసీ ఎండీ ఈవీఎన్ రెడ్డి చెప్పారు.

రూ.1,000 కోట్ల పెట్టుబడులొస్తాయా?

ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న రసాయనాలు, మాలిక్యూల్స్ తయారీ కంపెనీల్లో వందకు పైగా సంస్థలు సొంత ప్లాంట్ల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాయని, ఒక్కో కంపెనీ కనీసం రూ.10 కోట్లతో మొత్తంగా రూ.1,000 కోట్లకు పైగా పెట్టుబడులకు ముందుకొచ్చిందని సమాచారం. ఆయా ప్లాంట్ల ఏర్పాటుతో కొత్తగా మరో 2,000-3,000 ఉద్యోగాలొచ్చే అవకాశముందని ఓ కంపెనీ ప్రతినిధి తెలిపారు. ఆ ప్లాంట్ల తాలూకు కాలుష్యం గురించి ఆయన వద్ద ప్రస్తావించగా ''ఫార్మా, బయో పరిశోధనలతో పోలిస్తే రసాయన పరిశోధనలతో వెలువడే కాలుష్యం 1% కంటే తక్కువే. రసాయన పరిశోధనలను ప్రోత్సహించాల్సిన అవసరమైతే ఉంది కదా? అనుమతులతో పాటు స్థలం, మౌలిక వసతుల వంటివి ఏర్పాటు చేయాలి కదా?'' అని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు వ్యాఖ్యానించారు. కాలుష్య నివారణ బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రసాయనాలు, మాలిక్యూల్స్ పరిశోధనలో ఎక్కువగా నీరు కలుషితం కావటంతో పాటు , సేంద్రీయ కాలుష్యం జరుగుతుంది. 2 వేల లీటర్ల నీటి వినియోగంలో 10% వరకు రసాయన కాలుష్యం జరుగుతుంది. ఆ నీటి శుద్ధికి అయ్యే ఖర్చును భరించేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నట్లు కూడా మరో ప్రతినిధి చెప్పారు.

ఏటా 8వేల కోట్లకు పైనే ఎగుమతి

ఒక్కో ఔషధ పరిశోధన కోసం 100 – 200 కిలోల వరకు మాలిక్యూల్స్ అవసరమవుతాయి. అయితే మాలిక్యూల్స్ అభివృద్ధి అనేది తేలికైన వ్యవహారం కాదు. సమయం, సాంకేతికత రెండూ సవాలే. 5 గ్రాముల మాలిక్యూల్ అభివృద్ధికి ఎంతలేదన్నా 20 రోజుల సమయం, రూ.25 వేల నుంచి 50 వేల వరకూ ఖర్చవుతుంది. ఇక్కడి నుంచి దేశీయ కంపెనీలతో పాటూ అమెరికా, యూకే, రష్యా, కెనడా, స్విట్జర్లాండ్, జపాన్ వంటి విదేశీ కంపెనీలు గ్రాములు, కిలోల చొప్పున వీటిని కొనుగోలు చేస్తుంటాయి. ''మన దేశంతో పోలిస్తే విదేశాల్లో రసాయనాల అభివృద్ధి ఖర్చు ఎక్కువ. అంటే ముడిపదార్థాలు, కార్మికుల పనిగంటలు, ఇతరత్రా ఖర్చులు కలిపితే సగానికంటే తక్కువ వ్యయంతోనే మన దగ్గరి నుంచి దిగుమతి చేసుకునే వీలుంటుంది. అందుకే చాలా విదేశీ ఔషధ తయారీ సంస్థలు రసాయనాలను మన దేశం నుంచి దిగుమతి చేసుకుంటాయని డాక్టర్ జగత్‌రెడ్డి తెలియజేశారు. విదేశీ కంపెనీల ఔషధ తయారీ, క్లినికల్ ట్రయల్స్‌లో 82-90% మాలిక్యూల్స్, రసాయనాల సరఫరా భారత్ నుంచే జరుగుతుంది. ఏటా రూ.8 వేల కోట్ల విలువైన మాలిక్యూల్స్ విదేశాలకు ఎగుమతవుతుందని చెప్పారు.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాలుకు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
-- / --	-- / --	-- / --	-- / --	రూ.3,700	-- (హెచ్ఎంటీ)	రూ.7,100	రూ.4,400 (టన్నుకు)	--

అనుబంధ మాల్స్‌లో వాటాలు కొన్న ప్రెస్టీజ్

ముంబై: రియల్ ఎస్టేట్ రంగంలోని ప్రెస్టీజ్ గ్రూపు తన అనుబంధ కంపెనీలతో కలిసి ఏర్పాటు చేసిన పలు స్పెషల్ పర్పస్ వెహికల్స్‌లో (ఎస్పీవీ) క్యాపిటల్ ల్యాండ్‌కు చెందిన వాటాలను రూ.342 కోట్లకు కొనుగోలు చేసినట్టు ప్రకటించింది. దేశవ్యాప్తంగా వృద్ధికి అవకాశం ఉన్న కీలక ప్రాంతాల్లో ఇవి ఉన్నాయని ఓ ప్రకటనలో తెలియజేసింది. తాజా కొనుగోలు కారణంగా ప్రెస్టీజ్ యాన్యుటీ పోర్ట్‌ఫోలియో వార్షికంగా రూ.75 కోట్ల అద్దె ఆదాయంతో బలోపేతమవుతుందని పేర్కొంది.

గాయత్రి ప్రాజెక్ట్స్ చేతికి రూ. 583 కోట్ల కాంట్రాక్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ కంపెనీ గాయత్రి ప్రాజెక్ట్స్ ఎన్‌హెచ్ఏఐ నుంచి రూ.583 కోట్ల కాంట్రాక్టు దక్కించుకుంది. ఒడిశాలోని జాతీయ రహదారి 42లో కటక్–అంగుల్ సెక్షన్ల మధ్య నాలుగు లేన్లుగా రహదారిని విస్తరిస్తారు. సోమవారం కంపెనీ షేరు క్రితం ముగింపుతో పోలిస్తే 0.20 శాతం పెరిగి రూ.226.85 వద్ద స్థిరపడింది.

వివిమెడ్‌లో ఆర్బిమెడ్ రూ. 48 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా కంపెనీ వివిమెడ్ ల్యాబ్స్‌కు చెందిన అనుబంధ కంపెనీలో హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ఆర్బిమెడ్ ఆసియా సుమారు రూ.48 కోట్లు పెట్టుబడి పెట్టింది. 2017 సెప్టెంబర్‌లో ఇదే అనుబంధ కంపెనీలో ఆర్బిమెడ్ రూ.275 కోట్ల దాకా ఇన్వెస్ట్ చేసింది. తాజా పెట్టుబడితో కంపెనీ వృద్ధి అవకాశాలకు మరింత ఊతమిస్తుందని వివిమెడ్ ఎండీ సంతోష్ వారాల్వార్ ఈ సందర్భంగా తెలిపారు.

నష్టాలతో బోణీ

చివరి గంటలో అమ్మకాలు
- స్టాక్ సూచీల రికార్డ్ హై నేపథ్యంలో లాభాల స్వీకరణ
- 244 పాయింట్లు పతనమై 33,813కు సెన్సెక్స్
- 95 పాయింట్ల నష్టంతో 10,423కు నిఫ్టీ



కొత్త ఏడాది తొలి రోజు స్టాక్ మార్కెట్ నష్టాలతో ఆరంభమైంది. బీఎస్ఈ సెన్సెక్స్ కీలకమైన 34,000, ఎన్ఎస్ఈ నిఫ్టీ 10,500 పాయింట్ల దిగువకు పడిపోయాయి. సోమవారం మధ్యాహ్నం వరకూ ట్రేడింగ్ స్తబ్దుగా సాగింది. చివరి గంటలో వాహన, బ్యాంకింగ్, ఐటీ, ఆయిల్, గ్యాస్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు క్షీణించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 244 పాయింట్లు నష్టపోయి 33,813 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 95 పాయింట్లు నష్టపోయి 10,423 పాయింట్ల వద్ద ముగిశాయి. నెల రోజుల కాలంలో సెన్సెక్స్ ఒక్క రోజులో ఇన్ని ఎక్కువ పాయింట్లు నష్టపోవడం ఇదే తొలిసారి. క్యాపిటల్ గూడ్స్, రియల్టీ, హెల్త్‌కేర్, కన్సూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్‌లలో జోరుగా కొనుగోళ్లు జరగడంతో నష్టాలు పరిమితమయ్యాయి. వాహన కంపెనీల గత నెల విక్రయ గణాంకాలు ఇన్వెస్టర్లను మెప్పించలేకపోయాయి. దీంతో మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్ తదితర షేర్లు నష్టపోయాయి.

లాభాల స్వీకరణ: స్టాక్ సూచీలు గత శుక్రవారం జీవిత కాల గరిష్ట స్థాయిలకు చేరిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు ప్రాధాన్యత ఇచ్చారని నిపుణులు పేర్కొన్నారు. కొత్త ఏడాది తొలి రోజు సెలవు సందర్భంగా ప్రపంచ మార్కెట్లు పనిచేయకపోవడం, ముడిచమురు ధరలు పెరుగుతుండటం, ద్రవ్యలోటు పెరుగుతుందనే ఆందోళనలు ఇన్వెస్టర్లను లాభాల స్వీకరణకు పురిగొల్పాయని వారంటున్నారు. ఒక దశలో సెన్సెక్స్ 291 పాయింట్లు నష్టపోగా, మరో దశలో 44 పాయింట్లు లాభపడింది. వాహన విక్రయ గణాంకాలు సానుకూలంగానే ఉన్నా, ద్రవ్యలోటు, ముడిచమురు ధరలు పెరుగుతుండటం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. మంగళవారం వచ్చే తయారీ రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ గణాంకాలు బలహీనంగా ఉంటాయనే అంచనాలు ప్రతికూల ప్రభావం చూపించాయని పేర్కొన్నారు.

లాభాల్లో బ్యాంక్ షేర్లు: రూ.7,577 కోట్ల మూలధన నిధులు అందనున్న బ్యాంక్‌లు–ఐడీబీఐ బ్యాంక్, యూకో బ్యాంక్, దేనా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తదితర బ్యాంక్ షేర్లు 6% వరకూ లాభపడ్డాయి. వీటితో పాటు నిధుల సమీకరణ వార్తల నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్ షేర్లు 3% వరకూ పెరిగాయి.

ఏడాది గరిష్టానికి సెయిల్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నష్టాలు తగ్గించుకునే దిశగా సెయిల్ ప్రయత్నాలు చేస్తోందన్న ఉక్కు కార్యదర్శి వ్యాఖ్యలతో సెయిల్ షేర్ ఏడాది గరిష్ట స్థాయి తాకి చివరకు 0.6% లాభంతో రూ.93 వద్ద ముగిసింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,899
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	28,341
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	2,94,485
ఎఫ్ఐఐ	326
డీఐఐ	-1,300

భారీ ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు కనుగొన్న ఓఎన్‌జీసీ

చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఓఎన్‌జీసీ కంపెనీ, అరేబియా సముద్రంలో భారీ ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను కనుగొంది. అరేబియా సముద్రంలోని ముంబై హై చమురు క్షేత్రాల్లో ఓఎన్‌జీసీ ఈ నిక్షేపాలను కనుగొన్నట్లు చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. ముంబై హై చమురు క్షేత్రంలో పశ్చిమ ప్రాంతంలో ఈ నిక్షేపాలను ఓఎన్‌జీసీ కనుగొన్నదని లోక్‌సభకు లిఖిత పూర్వకంగా వెల్లడించిన సమాధానంలో ప్రధాన్ పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణల్లో 29.74 మిలియన్ టన్నుల ఆయిల్, ఆయిల్ సమానమైన గ్యాస్ నిక్షేపాలున్నట్లు అంచనా వేస్తున్నారు. భారత ప్రధాన చమురు క్షేత్రమైన ముంబై హైలో రోజుకు 2,05,000 బ్యారెళ్ల చమురు ఉత్పత్తి అవుతోంది. ఈ కొత్త నిక్షేపాలు కూడా జత అయితే ఈ ఉత్పత్తి మరింతగా పెరుగుతుంది. ముంబై హైలో ఓఎన్‌జీసీ గత 50 ఏళ్ల నుంచి ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ కొత్త నిక్షేపాల కారణంగా కంపెనీ ఉత్పత్తి గతంలో అంచనా వేసినదానికంటే దీర్ఘకాలం కొనసాగనున్నది.

మెరుగుపడకపోతే మూసివేతే..


300 శాఖలకు పీఎన్‌బీ హెచ్చరిక



న్యూఢిల్లీ: బ్యాంకు శాఖల క్రమబద్ధీకరణ ప్రక్రియను పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) మరింత వేగవంతం చేసింది. ఏడాది వ్యవధిలో పనితీరు గానీ మెరుగుపర్చుకోని పక్షంలో మూసివేత లేదా మరో దానిలో విలీనం తప్పదని 300 శాఖలకు హెచ్చరించింది. 'శాఖల క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. పనితీరు మెరుగుపర్చుకోకపోతే మూసివేయడమో లేదా విలీనమో చేయాల్సి వస్తుందని నష్టాలు నమోదు చేస్తున్న బ్రాంచీలన్నింటికీ నోటీసులు పంపాము. సుమారు 300 శాఖలు ఈ జాబితాలో ఉన్నాయి' అని పీఎన్‌బీ ఎండీ సునీల్ మెహతా తెలిపారు. అయితే, ఇందులో అన్నీ నష్టాల్లో ఉన్న శాఖలే కాదని, కొన్ని ఒక మోస్తరు లాభాలు నమోదు చేస్తున్నవి కూడా ఉన్నాయని చెప్పారు. విదేశాల్లో కార్యాలయాల విషయానికొస్తే.. ఆస్ట్రేలియా, చైనాలో ఆఫీసులను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మెహతా తెలిపారు. ప్రభుత్వ రంగంలో దేశీయంగా రెండో అతి పెద్ద బ్యాంకు అయిన పీఎన్‌బీకి దేశవ్యాప్తంగా 7,000 పైచిలుకు శాఖలు ఉన్నాయి. అటు అంతర్జాతీయంగా తొమ్మిది దేశాల్లో శాఖలు, కార్యాలయాలు ఉన్నాయి.

ఐటీలో 2 లక్షల ఉద్యోగాలు!!

టీమ్‌లీజ్ అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఏడాది ఐటీ రంగం ఉద్యోగాలతో కళకళలాడనుంది. ఈ పరిశ్రమలో దాదాపు 2 లక్షల మందికి ఉపాధి లభించనుందని అంచనాలున్నాయి. 'ఫైనాన్షియల్ సర్వీసెస్, డిజిటల్ బిజినెస్‌లలో మెరుగుదల.. ప్రత్యేకించి డిజిటైజేషన్, ఆటోమేషన్‌లలో ఇన్వెస్ట్‌మెంట్ల పెరుగుదల.. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం వంటి అంశాలు వ్యాపార వృద్ధికి దోహదపడతాయి' అని టీమ్‌లీజ్ సర్వీసెస్ ఐటీ స్టాఫింగ్ జనరల్ మేనేజర్ ఆల్కా ధింగ్రా వివరించారు. కొత్త కంపెనీల వల్ల కూడా నియామకాలు పెరగొచ్చని, దాదాపు 20 శాతానికిపైగా ఎక్కువ కంపెనీలు ఈ ఏడాది నియామకాలు చేపట్టే అవకాశముందని పేర్కొన్నారు. 2018లో దేశీ ఐటీ పరిశ్రమలో దాదాపు 1.8–2 లక్షల కొత్త ఉద్యోగాలు ఉంటాయని అంచనా వేశారు. దేశం డిజిటల్ ఇండియా దిశగా పరుగులు పెడుతోన్న తరుణంలో ఈ పరిశ్రమకు డిజిటల్ నైపుణ్యాలు కలిగిన 50 శాతం ఎక్కువ మంది ఉద్యోగులు అవసరమౌతారని తెలిపారు. డిజిటల్ ఇండియా వల్ల డిజిటల్ టెక్నాలజీస్, ఏఐ, రోబోటిక్స్‌లలో ఉద్యోగాలు పెరగొచ్చన్నారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి పలు అంశాల కారణంగా ఇండియన్ జాబ్ మార్కెట్ మార్పు దిశగా పయనిస్తోంది. ఈ మార్పును అధిగమించి మనుగడ సాగించాలంటే నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ఒక్కటే మార్గం' అని నిపుణులు హెచ్చరించారు.

మౌలికం జూమ్

నవంబర్‌లో 8 కీలక విభాగాల గ్రూప్ వృద్ధి 6.8%

న్యూఢిల్లీ: రిఫైనరీ, ఉక్కు, సిమెంటు తదితర కీలక విభాగాల మౌలిక రంగం నవంబర్‌లో 6.8 శాతం మేర వృద్ధి నమోదు చేసింది. అంతక్రితం నవంబర్‌లో ఇది 3.2 శాతమే. బొగ్గు, ముడిచమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంటు, విద్యుత్ వంటి ఎనిమిది కీలక విభాగాలను మౌలిక రంగంగా పరిగణిస్తారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం నవంబర్‌లో రిఫైనరీ ఉత్పత్తుల తయారీ 8.2 శాతం మేర, ఉక్కు ఉత్పత్తి 16.6 శాతం, సిమెంటు ఉత్పత్తి 17.3 శాతం మేర పెరిగింది. అలాగే ముడిచమురు, సహజ వాయువు ఉత్పత్తి సైతం మెరుగుపడింది. అయితే, బొగ్గు మాత్రం ప్రతికూల వృద్ధి నమోదు చేసింది. మొత్తం మీద ఏప్రిల్–నవంబర్ మధ్యకాలంలో ఎనిమిది కీలక రంగాల వృద్ధి.. అంతక్రితం ఏడాది ఇదే వ్యవధితో పోలిస్తే 5.3 శాతం నుంచి 3.9 శాతానికి తగ్గింది.

ఎన్‌సీఎల్‌టీ ముందుకు మరో 24 కేసులు



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ రెండో జాబితాలోని 28 భారీ రుణ ఎగవేతదారులకు గాను 24 కేసులను దివాలా చర్యల కింద జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ)కు నివేదించాలని బ్యాంకులు నిర్ణయించాయి. ఈ 28 ఎన్‌పీఏ కేసులను పరిష్కరించుకోవాలని లేదా డిసెంబర్ 31 నాటికి ఎన్‌సీఎల్‌టీకి నివేదించాలని ఆర్‌బీఐ గడువు ఇచ్చింది. దేశ బ్యాంకింగ్ వ్యవస్థలోని మొత్తం మొండి బకాయిల్లో ఈ 28 ఖాతాదారులు ఎగవేసిన మొత్తం రూ.4 లక్షల కోట్లుగా ఉంది. వీటిలో అనక్ అల్యూమినియం, జయస్వాల్ నెకో, సోమా ఎంటర్ ప్రైజెస్, జైప్రకాశ్ అసోసియేట్స్ మినహా మిగిలిన కేసులన్నీ ఎన్‌సీఎల్‌టీ ముందుకు వెళ్లనున్నాయని ఓ బ్యాంకు అధికారి తెలిపారు. దివాలా చర్యలు ఎదుర్కోబోయే వాటిలో ఐవీఆర్‌సీఎల్, ఉత్తమ్ గాల్వా స్టీల్, విసా స్టీల్, ఎస్సార్ ప్రాజెక్ట్స్, నాగార్జున ఆయిల్, రుచి సోయా, ఉత్తమ్ గాల్వా మెటాలిక్ తదితర కేసులు ఉన్నాయి.

జీఎస్‌టీ రిటర్న్స్‌లో తప్పులు దిద్దుకోవచ్చు!

న్యూఢిల్లీ: వ్యాపారులు జీఎస్‌టీకి సంబంధించి నెలవారీ వేసే రిటర్న్స్ 'జీఎస్‌టీఆర్–3బీ'లో తప్పులు సరిదిద్దుకునేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుమతించింది. దీంతో వారు తొలుత లెక్కించిన జీఎస్టీలో గనక తప్పొప్పులుంటే వాటిని సరిదిద్దుకుని మళ్లీ రిటర్న్ దాఖలు చేయటానికి వీలవుతుంది. ఇలా దిద్దటం వల్ల పెనాల్టీ పడుతుందన్న భయం కూడా ఉండదు. ఇలా సరిదిద్దుకోవటం ద్వారా సరైన ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకునే వెసులుబాటు కూడా కలుగుతుంది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక వ్యాపారులకు పన్ను చెల్లింపులను సరిగ్గా లెక్కించటం కష్టతరమయ్యింది. దీంతో పరిశ్రమ వర్గాలు నిబంధనలను సరళం చేయాలని డిమాండ్ చేశాయి. తాజా నిబంధనల సరళీకరణ వల్ల జీఎస్‌టీ రిటర్న్ ఫామ్‌లో మార్పులు చేర్పులు కోరుకుంటున్న వ్యాపారులకు ఉపశమనం కలుగుతుందని ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ అభిషేక్ జైన్ తెలిపారు.

అసెట్ వేల్యుయర్‌కి ఐబీబీఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

న్యూఢిల్లీ: అసెట్ వేల్యుయేషన్ వృత్తి నిపుణులు ఏప్రిల్ 1 నుంచి తప్పనిసరిగా ఇన్‌సాల్వెన్సీ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ)లో నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఈ మేరకు ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది.

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	29,525
బంగారం (99.5, 10గ్రా)	29,375
వెండి (కిలో)	38,720
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	- -
బంగారం (22 క్యారెట్లు)	28,070
వెండి (కిలో)	- -
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	30,050
బంగారం (22 క్యారెట్లు)	28,100
వెండి(కిలో)	39,110
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	30,400
బంగారం (22 క్యారెట్లు)	28,200
వెండి(కిలో)	40,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	30,650
బంగారం (22 క్యారెట్లు)	28,100
వెండి(కిలో)	41,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	30,400
బంగారం (22 క్యారెట్లు)	28,200
వెండి(కిలో)	39,900
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	30,390
బంగారం (22 క్యారెట్లు)	28,070
వెండి(కిలో)	39,600

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

వడ్డీ రేట్లు

బేస్‌రేట్ రేంజ్	8.85 – 9.45
డిపాజిట్ రేట్ రేంజ్	6.00 – 6.75
డాలర్ లిబార్(6 నెలలు)	1.83

అంకెలు శాతాల్లో

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు	శుక్రవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	60.12	$59.84
బ్రెంట్	66.63	$66.16

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 2-1-2018

విశాఖ	380-00
చిత్తూరు	378-00
వరంగల్	363-00
ముంబై	405-00
చెన్నై	385-00
విజయవాడ	372-00
గోదావరి	372-00
నమక్కల్	375-00
1-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	361-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.20
బెంగళూరు	365-00
ఢిల్లీ	400-00
కోల్‌కతా	406-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	399.65	405.65
AMBUJA C	268.05	272.05
ASIAN PA	1143.65	1158.5
AXIS BAN	565.5	563.95
BAJAJ AU	3289.25	3333.6
BAJAJ FI	1725.65	1756.7
BHARTI A	527.9	529.65
[illegible]	[illegible]	[illegible]

A B C D

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
20 MICRO	58.75	58.3
3M INDIA	19264.55	19126.45
5PAISA C	357.45	376.05
63 MOONS	119.4	118.6
8K MILES	901.95	908.05
AARTI DR	634.15	641.3
AARTI IN	1141	1133.9
AARVI EN	107	104.05
ABAN OFF	201.3	202.95
ABBOTT I	5497.75	5524.95
BASF IND	2135.6	2141.85
BATA IND	755.3	747.3
BAYER CR	4455.5	4484.65
BEARDSEL	66.55	66.85
BEML LIM	1598.7	1618.25
BERGER P	268.9	273.75
BETA DRU	190	187.25
BF INVES	388.5	396.7
BF UTILI	498.8	506.15
BGR ENER	140.95	137.45
BHAGERIA	277.75	277.25
BHAGYANA	52.05	52.3
BHANSALI	196.75	187.95
DHUNSERI	424.65	438.85
DIC INDI	559.85	565.35
DILIP BU	982.05	989.8
DISH TV	81.7	82
DISHMAN	320.6	325.05
DIXON TE	4187.55	4190.95
DOLLAR I	460.15	460.05
DOLPHIN	122.1	124.85
DR. LAL	884.65	881.3
DYNACONS	61	51.2
DYNAMATI	2180.55	2178.45
[illegible]	[illegible]	[illegible]

E F G H

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
GUJ. APO	239.75	[illegible]
GUJARAT	136.55	[illegible]
GUJARAT	168	[illegible]
GUJARAT	192.6	[illegible]
GUJARAT	224.7	[illegible]
GUJARAT	749	[illegible]
GUJARAT	844.15	[illegible]
GUJARAT	897.15	[illegible]
GULF OIL	982.55	[illegible]
GULSHAN	86.7	[illegible]
HARITA S	945.55	[illegible]
HATSUN A	824.85	[illegible]
HCL INFO	60.15	[illegible]
[illegible]	[illegible]	[illegible]

I J K L

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
JHS SVEN	74.7	75.05
JIND POL	80.65	81.1
JINDAL D	170.75	173.85
JINDAL P	413.7	417.2
JINDAL S	105.75	104.3
JINDAL S	142.5	139.85
JINDAL S	206.2	205.05
JINDAL S	222.95	225.8
JINDAL W	582	578.45
JK CEMEN	1113.7	1110.7
JK LAKSH	440.15	439.9
JK PAPER	138.8	136.95
JK TYRE	146.85	147.65
[illegible]	[illegible]	[illegible]

M N O P

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
MANGALAM	209.4	217.9
MANGALAM	348.8	353.05
MANPASAN	440.65	437.95
MANUGRAP	59.15	57
MARAL OV	57.1	60.2
MARATHON	642.3	557.4
MAS FINA	625.3	626.75
MASTEK L	375.35	375.3
MATRIMON	935.2	938
MAWANA S	81.5	81.25
MAX FINA	597.05	592.5
MAX INDI	122.7	124.45
MAX VENT	92.8	94.25
PENNAR E	98.55	99.55
PENNAR I	68.35	68.75
PERSISTE	711.8	718
PETRON E	139.85	143.9
PFIZER L	2046.65	2062.95
PG ELECT	416.75	423.55
PHILIPS	966.05	975.3
PI INDUS	958.65	962.5
PIONEER	203.4	207.1
PLASTIBL	239.45	242.45
PNB HOUS	1331.85	1340.35
PNC INFR	211.5	203.6
PODDAR H	1355	1368.7
[illegible]	[illegible]	[illegible]

R S T U

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
SEQUENT	98.4	97.6
SESHASAY	893.25	893.95
SETCO AU	63.8	63.7
SHAKTI P	452.9	456.3
SHALBY L	228.2	215.25
SHALIM P	199.75	201.3
SHANKARA	1783.4	1779.2
SHANTHI	160.5	162.95
SHARDA C	447.8	449.9
SHARDA M	2535.85	2534.9
SHEELA F	1715.55	1737.3
SHEMAROO	434.25	422.25
SHILPA M	615.3	619.1
SHIPPING	94.2	94.6
THE INDI	118.5	117.8
THE INDI	180.6	183.45
THE MAND	153.75	152.65
THE NEW	610.6	601.1
THE P K	403.2	398.1
THE PHOE	633.65	626.95
THE RAMC	780.25	785.6
THE RUBY	387.9	388.2
THE TINP	263.1	264.45
THEJO EN	565	565
THEMIS M	701.9	586.75
THERMAX	1212.85	1223.75
THIRU AR	58.45	59
THIRUMAL	2161.5	2193.95
[illegible]	[illegible]	[illegible]

V W X Z

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

బీఎస్‌ఈలో ఎస్ఎమ్ఈ షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

S & D

పల్లె జ్ఞానమే దేశాభివృద్ధికి పరమావధి!
- గాంధీజీ

సాక్షి



'సాక్షి' అందిస్తున్న 'సాగుబడి' కథనాలపై స్పందించదలచారా? అయితే, ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.

పూర్వాషాఢ కార్తె : జనవరి 16 వరకు

చెరకు రైతులకు ఉపకరించే టోపీ!



పెరిగిన చెరకు మొక్కల ఆకులు మొహానికి తగిలితే కోసుకుపోయేలా చాలా పదునుగా ఉండడం రైతులకు, రైతుకూలీలకు పెద్ద సమస్య. కంటికి తగిలితే చూపును కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ సమస్యకు మహారాష్ట్రకు చెందిన చేతన్ కదమ్ అనే విద్యార్థి పరిష్కారం కనిపెట్టాడు. చెరకు రైతు బిడ్డ అయిన చేతన్ పుణెకు జిల్లా షిరూర్ తాలూకా పబల్‌లోని విజ్ఞానాశ్రమంలో డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్‌లో విద్యను అభ్యసిస్తున్నాడు. చెరకు తోటలో నడిచేటప్పుడు రక్షణగా పెట్టుకునే ముసుగు వంటి టోపీకి రూపకల్పన చేశాడు. ఈ టోపీని ధరించిన వ్యక్తి భుజాల వరకు వేలాడుతూ చెరకు ఆకుల నుంచి రక్షిస్తుంది. కూలీల కొరత వేధిస్తున్న నేపథ్యంలో చెరకు సాగును సులభతరం చేయడానికి ఈ టోపీ ఉపకరిస్తుందని విజ్ఞానాశ్రమం వర్గాలు తెలిపాయి. ఇటువంటి ఏదైనా వినూత్న ఆలోచన కలిగిన యువతీ యువకులు లోతైన సాంకేతిక జ్ఞానాన్ని పెంచుకొని, తద్వారా ప్రయోజనకరమైన ఆవిష్కరణలను వెలువరించేందుకు విజ్ఞానాశ్రమం నిర్వహిస్తున్న డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ దోహదపడుతోంది. ఇతర వివరాలకు..

http://vigyanashram.com ; Email Id: vapabal@gmail.com

జనవరి 17-19 తేదీల్లో తమిళనాడులో తాటి ఉత్పత్తులపై అంతర్జాతీయ సదస్సు



ఆరోగ్యదాయకమైన తాటి ఉత్పత్తుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కాటేజి పరిశ్రమల స్థాపన ద్వారా గ్రామీణ నిరుద్యోగాన్ని, పేదరికాన్ని పారదోలే లక్ష్యంతో తమిళనాడులో 2018 జనవరి 17,18,19 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు జరగనుంది. సేంద్రియ తాటి ఉత్పత్తుల ప్రదర్శన కూడా ఏర్పాటు చేస్తున్నారు. 'స్వదేశీ ఉద్యమం' నేతృత్వంలో జరిగే ఈ సమావేశానికి కోయంబత్తూరు దగ్గర పేరూర్ సమీపంలోని ముత్తామిజ్ అరంగంలో 'పేరూర్ ఆధీనం ఆర్ట్స్ అండ్ సైన్స్ తమిజ్ కాలేజి' వేదిక కానుంది. వివరాలకు.. 090802 50653, 094450 69900.

Email: palmyrahconference2018@gmail.com

బాధిత రైతు కుటుంబాలకు చేయూత!

రాష్ట్ర విభజన తర్వాత ఆత్మహత్యలపాలైన రైతుల సంఖ్య తెలంగాణలో 3,302, ఆంధ్రప్రదేశ్‌లో 1,598. ప్రభుత్వం గుర్తించి సాయం అందించిన కుటుంబాలు తెలంగాణలో 768, ఆంధ్రప్రదేశ్‌లో 292 మాత్రమే. మిగతా బాధిత కుటుంబాలకు కనీస సాంత్వన కూడా లభించలేదు. కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్ (సీసీసీ) సంస్థ పదేళ్లుగా అనేక జిల్లాల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నది. ఫిబ్రవరి 4వ తేదీ ఉదయం 10.30 నుండి సా.5.30 వరకు హైదరాబాద్, నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో బాధిత కుటుంబాల ఆత్మీయ కలయికను సీసీసీ నిర్వహించనుంది. ఆ సందర్భంగా.. ఒక్కో కుటుంబానికి కనీసం రూ. 10 వేల చొప్పున స్వయంగా అందించి, వారితో కలిసి ఒక పూట భోజనం చేసి, భరోసా ఇవ్వాలని మానవతావాదులైన వ్యక్తులను/ బృందాలను సీసీసీ ఆహ్వానిస్తున్నది. వివరాలకు..

సజయ – 99483 52008, ksajaya@gmail.com
ఆశాలత – 94901 19242 ashalatha.satyam@gmail.com

ట్రాక్టరు చిన్నది.. పనితనం పెద్దది!



ముచ్చటైన మినీ ట్రాక్టరుతో చిన్న రైతుకు బహుళ ప్రయోజనాలు

5 హెచ్.పి. ఇంజిన్.. 200 కిలోలలోపే బరువు

ఎత్తు: 3 అడుగులు, వెడల్పు: 27 అంగుళాలు, పొడవు: 50 అంగుళాలు

గ్రామీణ రైతు శాస్త్రవేత్త సైదాచారి అద్భుత ఆవిష్కరణ

మినీ ట్రాక్టర్‌తో కంది చేనులో అంతర సేద్యం చేస్తున్న సైదాచారి



మినీ ట్రాక్టర్‌తో అంతర సేద్యం



మినీ ట్రాక్టర్‌కు అనుసంధానించిన ట్రాలీ

రైతుల్లో చిన్న రైతులు 80% మంది ఉన్నప్పటికీ.. వీరికి అనువైనవి, అందుబాటులో ఉండే వ్యవసాయ యంత్ర పరికరాలు మాత్రం తక్కువే! ఈ కొరత తీర్చడానికి చిన్నపాటి ట్రాక్టర్‌ను ఒక గ్రామీణ రైతు శాస్త్రవేత్త తయారు చేశాడు. చదువు తక్కువే అయినా గొప్ప ప్రజ్ఞ చూపారు. పత్తి, మిరప, అపరాలు, కూరగాయ పందిరి తోటల్లో.. ఇంకా చెప్పాలంటే 40 అంగుళాల వెడల్పు సాళ్లుండే మెట్ట, ఆరుతడి పంటలు, పండ్ల తోటలన్నిటిలోనూ సేద్యపు పనులకు చక్కగా ఉపయోగపడుతుంది. దుక్కి, పైపాటు చేయటం, బోదెలు తోలటం, ఎరువులు వేయటం, కషాయాలు/జీవామృతం పిచికారీ చేయటం, 6 క్వింటాళ్ల వరకు సరుకు రవాణా.. ఈ అన్ని పనులకూ ఉపయోగపడే అతి చిన్న ట్రాక్టరు రైతులకు అందుబాటులోకి వచ్చింది. చాలా తక్కువ బరువు(200 కిలోలు) ఉండటం, ముందు - వెనక్కి వెళ్లేందుకు గేర్లు కూడా ఉండటం విశేషం. ఇటువంటి రైతు శాస్త్రవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తే చిన్న రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

జిల్లోజు సైదాచారి స్వస్థలం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలంలోని కందగట్ల గ్రామం. చదివింది ఏడో తరగతే. అయితే, చిన్న రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరికరాలను తయారు చేయటంలో దిట్ట. ఇనుప ఎడ్లబండ్లు, ఇనుప నాగళ్లు, ఎడ్లతో ఉపయోగించే రోటవేటర్‌ను తయారు చేసి ఆ ప్రాంత రైతుల అభిమానాన్ని చూరగొన్న సైదాచారి.. మరో అడుగు ముందుకేసి చిన్న రైతుకు ఉపయోగపడే చిన్నపాటి ట్రాక్టరును తయారు చేసి అందర్నీ ఆకర్షిస్తున్నారు.

కూలీల కొరతతో సాగు కనాకష్టంగా మారుతున్న తరుణంలో ఖరీదైన వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేసే స్థోమత లేని కొద్దిపాటి వ్యవసాయం ఉన్న రైతులకు సైదాచారి తయారు చేసే యంత్రపరికరాలు అక్కరకొస్తున్నాయి. మెట్ట పంటల సాగుకు అన్నివిధాలా ప్రయోజనకారిగా ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

సైదాచారి తండ్రి గ్రామంలో రైతులకు వ్యవసాయ పనిముట్లు తయారు చేయడంతో పాటు మరమ్మతులు చేసేవారు. ఏడో తరగతి వరకు చదువుకున్న సైదాచారి అప్పట్లో కుటుంబ పరిస్థితుల దృష్ట్యా కార్పెంటర్ పని నేర్చుకున్నారు. సాదాసీదా పనిముట్లతో సరిపెట్టుకోకుండా తక్కువ ఖర్చుతో చిన్న రైతులకు ఉపయోగపడే సరికొత్త యంత్రాలు తయారు చేయాలన్న తపనతో తాజాగా మినీ ట్రాక్టరును ఆవిష్కరించారు. ఆయన చేపట్టిన వినూత్న ప్రయోగాలకు భార్య జ్యోతి తోడూ నీడగా నిలుస్తున్నారు.

మినీ ట్రాక్టరును రూపొందించే క్రమంలో రెండేళ్ల క్రితం టిల్లర్‌ను రూపొందించారు. దానికి మంచిపేరే వచ్చినా రైతులు స్వయంగా వాటిని నెడుతూ బలాన్ని ప్రయోగించాల్సి ఉండడంతో.. ఆ ఇబ్బందులు లేని మినీ ట్రాక్టరును లక్ష్యంగా పెట్టుకొని, పట్టుదలతో సాధించారు.

మినీ ట్రాక్టరు తయారీ ఇలా..

5 హెచ్‌పీ సామర్థ్యం గల చైనా ఇంజిన్, రెండు టిల్లర్ టైర్లు, మరో రెండు ఆటో టైర్లను, సామిల్లులో వాడే బేరింగ్‌లను సైదాచారి మినీ ట్రాక్టరు తయారీలో వాడారు. బెల్టుల సాయంతో టైర్లు తిరిగేలా రూపకల్పన చేశారు. ఇనుప అబ్బులు, డిస్క్‌లను సొంతంగా తీర్చిదిద్దారు. ముందుకు, వెనక్కి వెళ్లేలా గేర్లను అమర్చి చిన్న ట్రాక్టరును ప్రయోజనకరంగా, అందంగా ఆవిష్కరించారు. ఈ క్రమంలో సైదాచారికి జీవిత భాగస్వామి జ్యోతి ప్రోద్బలం ఎంతో ఉంది. సైదాచారి ఒక మనిషి సహాయంతో రూ.70 వేల ఖర్చుతో 15 రోజులకు ఒక ట్రాక్టరును శ్రద్ధగా తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు మినీ ట్రాక్టర్లను రూ. 90 వేల చొప్పున విక్రయించారు. మినీ ట్రాక్టరుతో పాటు దీనికి జోడించి (20 కిలోల)ఎరువులు వేసే డబ్బా, గొర్రు, గుంటక, కూరగాయ తోటలకు బోదెలు పోసే పరికరాన్ని కూడా ఇస్తున్నారు. ట్రాలీని విడిగా కొనుక్కోవాల్సి ఉంటుంది. 6 క్వింటాళ్ల వరకు బరువు లాగే శక్తి ఈ మినీ ట్రాక్టరుకు ఉంది. మినీ ట్రాక్టరు గురించి ఆ నోటా ఈ నోటా తెలుసుకున్న రైతులు అనేక జిల్లాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

ప్రభుత్వం ప్రొత్సహిస్తే తక్కువ ధరకే మినీ ట్రాక్టరు అందిస్తా!

చిన్న రైతుల వ్యవసాయావసరాలకు అనుగుణంగా పనిముట్లను తయారు చేస్తున్నాను. అందులో భాగంగానే మినీ ట్రాక్టరును తయారు చేశాను. దీనికి రిపేర్లు రావు. చైన్లు మార్చుకోవాల్సి వస్తే, రైతులే కొత్త చైన్లు తెచ్చి మార్చుకోవచ్చు. ఇదెలాగో రైతుకు నేనే నేర్పిస్తా. ఒక వేళ బేరింగ్ పోతే మెకానిక్ దగ్గరకు వెళ్లాల్సి వస్తుంది. కేవలం 200 కిలోల బరువుండే ఇంత చిన్నదైన, ఇన్ని పనులు చేసే చిన్న ట్రాక్టరు నాకు తెలిసి దేశంలోనే మరెక్కడా లేదు. కూరగాయ పందిరి తోటల్లో కూడా నిశ్చింతగా దీన్ని ఉపయోగించవచ్చు. చిన్న, సన్నకారు రైతులు మెట్ట పొలాల్లో దీంతో సాగు చేసుకోవచ్చు. మామిడి, నిమ్మ తోటలతో పాటు పత్తి, మిర్చి, చెరుకు, పసుపు, కూరగాయల తోటల రైతులకు అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. తక్కువ ఖర్చుతో ఫలితం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ప్రొత్సహిస్తే చిన్న ట్రాక్టరును రూ. 90 వేల కన్నా తక్కువ ధరకే ఇవ్వగలుగుతా. చిన్న రైతులకు ఉపయోగపడే మరిన్ని పనిముట్లను తయారుచేసి తక్కువ ధరకు అందిస్తా.



– **జిల్లోజు సైదాచారి** (99512 52280), కందగట్ల, ఆత్మకూర్(ఎస్) మండలం, సూర్యాపేట జిల్లా



రైతు శాస్త్రవేత్త సైదాచారి కుటుంబాన్ని అభినందిస్తున్న పల్లెసృజన అధ్యక్షులు గణేశం, ఉపాధ్యక్షులు శ్రీకర్

జాతీయ స్థాయి గుర్తింపునకు కృషి

సైదాచారి గ్రామీణ ఆవిష్కర్తగా 20 ఏళ్ల నుంచి స్థానిక రైతుల అవసరాలకు అనుగుణంగా యంత్రపరికరాలు తయారు చేస్తున్నారు. మొదటి నమూనాను పాత విడి భాగాలతో తయారు చేయటం ద్వారా ఖర్చును, వనరులను ఆదా చేయటం.. తాను రూపొందించిన యంత్ర పరికరాలను మొదట తాను ఉపయోగించిన తర్వాతే ఇతరులకు ఇవ్వటం.. తక్కువ ఖర్చుతో చిన్న రైతులకు మెట్ట సేద్యంలో ఉపయోగపడే మినీ ట్రాక్టర్‌ను తయారు చేయటం ఆయన సృజనాత్మకతకు నిదర్శనాలు. పల్లెసృజన, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ద్వారా ఈయన ఆవిష్కరణలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడానికి కృషి చేస్తాం. మార్చిలో రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్‌లో సైదాచారి మినీ ట్రాక్టర్‌ను ప్రదర్శింపజేయడానికి ప్రయత్నిస్తున్నాం.

– **విశ్రాంత బ్రిగేడియర్ పోగుల గణేశం** (98660 01678), అధ్యక్షులు, పల్లెసృజన, సైనిక్‌పురి, సికింద్రాబాద్.

లీటరు డీజిల్‌తో ఎకరం దుక్కి

3 అడుగుల ఎత్తు, 27 అంగుళాల వెడల్పు, 50 అంగుళాల పొడవుతో.. కేవలం 200 కిలోల కన్నా తక్కువ బరువుండే తన మినీ ట్రాక్టర్.. మెట్ట/ఆరుతడి పంటల సాగుకు ఎంతో ప్రయోజనకారని సైదాచారి చెబుతున్నారు. 10 ఎకరాలు సాగుచేస్తున్న రైతు అవసరాలన్నింటినీ తీర్చగలదని, లీటర్ డీజిల్‌తో సుమారు ఎకరం దున్నుకునేందుకు వీలుంది. పత్తి పంట 5 అడుగుల ఎత్తు పెరిగే వరకు పాటు చేసేందుకు, మందు చల్లేందుకు సులువుగా ఉంటుంది. మిర్చి, చెరకు, పసుపు, మల్బరీ, నిమ్మ తోటలతో పాటు కూరగాయల సాగులో దున్నకానికి అనుకూలంగా ఉంటుంది. 20 కిలోల డబ్బాతో ఎరువు వేసుకోవచ్చు. స్ప్రే పంపును అనుసంధానం చేసుకుంటే 50 లీటర్ల ట్యాంకుతో పురుగుమందులను, కషాయాలను, ద్రవరూప ఎరువులను అరగంటలో ఎకరానికి పిచికారీ చేయవచ్చు. బోరులో మోటారు రిపేరు వస్తే.. ఒక్క మనిషే ఈ ట్రాక్టరు సాయంతో మోటారును బయటకు తీయవచ్చు. ఇలాంటి గ్రామీణ ఆవిష్కరణలకు ప్రభుత్వం ప్రొత్సాహం అందిస్తే తమకు తక్కువ ధరకు వ్యవసాయానుకూల ట్రాక్టరు దొరకుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– **జలగం మల్లయ్య**, సాక్షి, ఆత్మకూర్(ఎస్), సూర్యాపేట జిల్లా

సిరిధాన్యాల విత్తనాలు ఉచితం!

- రబీలో సిరిధాన్యాల సాగుకు ఇదే అదను
- ఎకరంలో సిరిధాన్యాల సాగుకు 3 కిలోల విత్తనం రైతులకు ఉచిత పంపిణీకి సిద్ధమైన రైతు శాస్త్రవేత్త విజయకుమార్
- అరికలు మినహా కొర్రలు, అండుకొర్రలు, ఊదలు, సామలు, వొరిగల రబీ సాగుకు ఇది అదును
- 90 రోజుల్లో పంట పూర్తి.. రబీలో సిరిధాన్య పంటలకు చీడపీడల బెడదే ఉండదు
- మూడు తడులు ఇవ్వగలిగితే.. ఎకరానికి రూ. 3 వేల లోపు ఖర్చుతో.. 8 క్వింటాళ్ల దిగుబడికి అవకాశం



రైతు శాస్త్రవేత్త విజయకుమార్

అరిక.. 5 నెలల పంట. దీన్ని ఖరీఫ్‌లో ఆరుద్ర కార్తెలో మాత్రమే విత్తుకోవాలి. కొర్ర, అండుకొర్ర, ఊద, సామ, బరిగలు 3 నెలల పంటలు. వీటిని ఖరీఫ్‌లోను, రబీలోనూ సాగు చేసుకోవచ్చని డా.వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన రైతు శాస్త్రవేత్త విజయకుమార్ వివరించారు. ఆయన 'సాగుబడి'కి అందించిన వివరాలు..

- ఎకరానికి 3 కిలోల విత్తనం అవసరం. పొలాన్ని మడులుగా విభజించి.. ఈ చిరుధాన్యాలన్నిటినీ ఒక ఎకరంలో సాగు చేసుకోవచ్చు. అవి కలిసిపోకుండా కందిని సరిహద్దు పంటగా వేసుకోవచ్చు.
- మూడు తడులు ఇవ్వడానికి నీటి సదుపాయం ఉంటే.. ఎకరానికి 8 క్వింటాళ్ల వరకూ సేంద్రియ సిరిధాన్యాలను పండించుకోవచ్చు. ఎకరానికి రూ. 2,300 ఖర్చు అవుతుంది.
- సాలు దున్నిన తర్వాత సిరిధాన్యాలు విత్తుకొని, విత్తనాల పైకి మట్టి పడేలా ఇరవాలు దున్నాలి. 5 సెం.మీ. లోతు దున్నితే చాలు. అంతకంటే లోతులో పడిన సిరిధాన్య విత్తనాల మొలక పైకి రాలేదు.
- విత్తిన వెంటనే తడి ఇవ్వాలి. రెండో తడి 30 రోజులకు, మూడో తడి 60 రోజులకు ఇస్తే చాలు. డ్రిప్, స్ప్రింక్లర్, పారించడం.. ఏ పద్ధతిలోనైనా తడి ఇవ్వొచ్చు.
- వరి కోసిన పొలాల్లో, వేరుశనగ పీకిన పొలాల్లో, కూరగాయలు పండించిన పొలాల్లో.. ఎటువంటి భూమి అయినా.. పంటల మార్పిడి కోసం ఈ రబీలో సిరిధాన్యాలను సాగు చేసుకోవచ్చు. కోతలు పూర్తయిన తర్వాత మోళ్లను భూమిలో కలియదున్నితే భూమి సారవంతమవుతుంది.
- సిరిధాన్యాల పంట నుంచి ఎకరానికి రెండు ట్రాక్టర్ల నాణ్యమైన, పశువులు బాగా ఇష్టపడే గడ్డి వస్తుంది.
- సిరిధాన్యాలను నూర్చే టప్పుడు ప్లాస్టిక్ బరకాలను ఉపయోగించి, ఇసుక, మట్టి కలవకుండా జాగ్రత్తపడాలి.
- అరిక, కొర్ర, అండుకొర్ర, ఊద, సామ, బరిగల ప్రత్యేకత ఏమిటంటే.. పొట్టు తీయని ధాన్యాలను రెండేళ్ల వరకు నిల్వ చేసుకోవచ్చు. పురుగు రాదు. రెండేళ్లు నిల్వ ఉన్నవి కూడా విత్తనానికి నిక్షేపంగా పనికొస్తాయి. విత్తనాలను గోనె సంచుల్లోనే గాలి, వెలుతురు తగిలే చోట నిల్వ చేయాలి. ప్లాస్టిక్ సంచుల్లో నిల్వచేస్తే.. ఉక్కిపోయి మొలక శాతం తగ్గవచ్చు.
- సిరిధాన్యాల బియ్యానికి మాత్రం రెండు, మూడు నెలల తర్వాత సన్న పురుగు వస్తుంది. మిక్సీతో అవసరం ఉన్నప్పుడు పొట్టు తీసుకునే మెలకువ తెలిసింది కాబట్టి, ఒకే సారి ఎక్కువ మొత్తంలో మిల్లు పట్టించుకొని అమ్ముకోలేక తిప్పలు పడాల్సిన అవసరం లేదు.
- సిరిధాన్యాలను రైతులు వెంటనే అమ్మేయకుండా.. నిల్వ చేసుకోవాలి. మిక్సీతో శుద్ధి చేసి తయారు చేసిన బియ్యాన్ని రైతు కుటుంబాలు ఇంటిల్లపాదీ అన్ని వయసుల వారూ తిని పూర్తి ఆరోగ్యవంతులుగా మారాలి. తమ గ్రామాలు, దగ్గర్లోని పట్టణాలు, నగరాల్లో వినియోగదారులకు ఏడాది పొడవునా నేరుగా అమ్ముకునే ఏర్పాట్లు చేసుకుంటే.. రైతులు అధిక నికరాదాయం పొందవచ్చు.
- రసాయనిక ఎరువులు వాడనవసరం లేదు. యూరియా ఎక్కువ వేస్తే పంట అతిగా పెరిగి పడిపోతుంది. పడిపోయిన పంటను కోయటం అధిక శ్రమ, ఖర్చుతో కూడిన పని. పైగా పడిపోయిన కంకుల్లో నుంచి గింజలను అన్ని రకాల పక్షులూ సులువుగా తినేస్తాయి. కాబట్టి రైతుకు చేతికి వచ్చే దిగుబడి బాగా తగ్గిపోతుంది.
- నిలబడి ఉన్న చిరుధాన్య పంట గింజలను జీనిగ, బుల్‌బుల్ వంటి అతి చిన్న పిట్టలు మాత్రమే తినగలవు. ఇవి ఎంత ఎక్కువ తిన్నా ఎకరానికి క్వింటాకు మించి తినలేవు. 7 క్వింటాళ్ల దిగుబడి మనకు వస్తుంది.
- వర్షాకాలపు పంటలో జొన్న, కొర్రలకు ఎర్రదిమ్మ తెగులు వస్తుంది. కానీ, రబీలో ఇవేవీ రావు. వరికి వచ్చే కాండం తొలిచే పురుగు, తెల్లమచ్చ(మజ్జిగ) తెగులు సిరిధాన్య పంటల జోలికి రావు.
- డ్వాక్రా మహిళా సంఘాలు, చిరు వ్యాపారులు సిరిధాన్యాలతో టిఫిన్లు, రకరకాల పిండివంటలు తయారు చేసి అమ్ముకుంటే మంచి పౌష్టికాహారాన్ని జనానికి అందించినట్టవుతుంది. మంచి ఆదాయమూ పొందవచ్చు. సిరిధాన్య వంటలకు వరిపిండి, శనగపప్పు పిండితో చేసే పిండివంటలకు ఖర్చయ్యే నూనెలో సగం సరిపోతుంది.
- రాబోయే ఖరీఫ్ కోసమైతే.. ఎకరానికి 2.5 కిలోల సిరిధాన్యాల విత్తనాలు, అరకిలో నాటు రకం కంది విత్తనాలను రైతులకు ఉచితంగా ఇప్పుడే ఇస్తాను. 2019 నాటికి తెలుగు రాష్ట్రాల్లో అన్ని ఊళ్లలో ఐదారు రకాల సిరిధాన్యాలు పండాలి. అందరూ తినాలి. ఆసుపత్రులు వద్దు.. సిరిధాన్యాలు ముద్దు..
- సిరిధాన్యాల ఉచిత విత్తనాలు, సాగు మెలకువల కోసం విజయకుమార్ (వెలమవారిపాలెం, వేంపల్లె మండలం, డా.వైఎస్సార్ కడప జిల్లా)ను సంప్రదించాల్సిన ఫోన్: 98496 48498.

సేకరణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

'మిక్సీ.. సిరిధాన్యాల మిల్లు' కథనానికి విశేష స్పందన



'మిక్సీ.. సిరిధాన్యాల మిల్లు' శీర్షికతో గత మంగళవారం 'సాగుబడి'లో ప్రచురించిన కథనానికి రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సిరిధాన్యాలను సాగు చేసినప్పటికీ తగిన ప్రాసెసింగ్ మిల్లులు అందుబాటులో లేక నానా ఇబ్బందులు పడుతున్న రైతులకు అందుబాటులో ఉండే మిక్సీ ప్రత్యామ్నాయం గొప్ప ఊరట కలిగించింది. కేవలం మిక్సీ ద్వారా సిరిధాన్యాల బియ్యాన్ని ఇంటిపట్టునే కావాలనుకున్నప్పుడు సిద్ధం చేసుకునే అవకాశం 'బుచ్చి పద్ధతి' ద్వారా అందుబాటులోకి వచ్చినందుకు చాలా మంది రైతులు సంబరపడుతున్నారు. సిరిధాన్యాలలోని విశిష్ట ఔషధ గుణాల గురించి డాక్టర్ ఖాదర్ ప్రచారం చేస్తుండడంతో వినియోగదారుల్లో వీటి పట్ల ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో సిరిధాన్యాల శుద్ధికి మిక్సీ ఉంటే చాలన్న సమాచారం రైతుల్లో పెద్ద సంచలనమే కలిగించింది. డాక్టర్ ఖాదర్, బాలన్, మహబున్నీలకు అనేక మంది ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కొర్ర తదితర ఐదు రకాల సిరిధాన్యాల విత్తనాలు కావాలని, ఈ రబీలోనే సాగు చేస్తామని రైతులు ముందుకు వస్తుండటం విశేషం. అటవీ వ్యవసాయ పద్ధతిలో సిరిధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు, బుచ్చి పద్ధతిలో సిరిధాన్యాల శుద్ధిపై సంక్రాంతి తర్వాత తెలుగునాట రైతు శిక్షణా శిబిరం నిర్వహిస్తామని, విత్తనాలను అందుబాటులోకి తెస్తామని బాలన్ తెలిపారు.

ఇదిలాఉండగా, ఎకరంలో విత్తడానికి సరిపోయే 3 కిలోల సిరిధాన్యాల విత్తనాలను రైతులకు ఉచితంగా ఇస్తానని డా. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన రైతు శాస్త్రవేత్త విజయకుమార్ ప్రకటించారు. ఎంత మంది రైతులకైనా ఎకరానికి విత్తనం ఉచితంగా ఇస్తానని, అంతకు మించి కావాలనుకుంటే కిలో రూ. 40కి ఇస్తాననటం విశేషం.





సాక్షి స్పోర్ట్స్
మంగళవారం 2-1-2018



బాలుడిపై చేయి చేసుకున్నందుకు.... షబ్బీర్‌పై తీవ్ర చర్య

అదుపు తప్పిన తమ జాతీయ క్రికెటర్ షబ్బీర్ రహ్మాన్ పట్ల బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) కఠినంగా వ్యవహరించింది. అతన్ని ఉన్నపళంగా సెంట్రల్ కాంట్రాక్టు నుంచి తప్పించి, రూ. 15.96 లక్షలు (25 వేల డాలర్లు) జరిమానా విధించింది. ఆరు నెలల పాటు ఏ దేశవాళీ టోర్నీలో ఆడకుండా సస్పెండ్ చేసింది. గత నెల 21న ఓ దేశవాళీ మ్యాచ్ సందర్భంగా షబ్బీర్ 12 ఏళ్ల బాలుడిపై దాడి చేయడాన్ని బీసీబీ తీవ్రంగా పరిగణించింది. మరోవైపు షేర్-ఎ-బంగ్లా స్టేడియం అవుట్ ఫీల్డుపై మీడియాలో బహిరంగంగా విమర్శించిన తమీమ్ ఇక్బాల్‌ను హెచ్చరించిన బీసీబీ... అతనిపై జరిమానా విధించే యోచనలో ఉంది.

అనామక జట్టు నుంచి అజేయంగా...



ఫలితాన్ని ఒంటిచేత్తో మార్చేసే స్టార్లు లేరు...!
ఒకరిద్దరు తప్ప మ్యాచ్‌ను తిప్పేసే వీరులు లేరు...!
జట్టుగా, ఆటతీరుపరంగానూ పెద్దగా పేరు లేదు...!
...అయినా విదర్భ అద్భుతం చేసింది. రంజీ గెలిచింది..!

సాక్షి క్రీడా విభాగం

ముంబై, మహారాష్ట్ర వంటి జట్లున్న మహారాష్ట్రలో మూడో జట్టుగా విదర్భ అనామక మైనదే. దీనికి తగ్గట్లే ఈ ప్రాంతం నుంచి టీమిండియాకు ఆడింది ఇద్దరే. మొదటివాడు పేసర్ ఉమేశ్ యాదవ్ కాగా రెండో వ్యక్తి ప్రస్తుత విదర్భ కెప్టెన్ ఫైజ్ ఫజల్. ఉమేశ్ గురించి చెప్పేదేమీ లేకున్నా... ఫజల్ ప్రాతినిధ్యం వహించింది మాత్రం ఒక్క వన్డేలోనే. అదీ జింబాబ్వేతో. వీరుకాక సగటు క్రికెట్ అభిమానికి చూచాయగా తెలిసిన జట్టు సభ్యుడి పేరే లేదు. కానీ సమష్టిగా ఆడిన విదర్భ పటిష్ఠ జట్లనూ మట్టి కరిపించింది. టైటిల్ ఫేవరేట్లలో ఒకటిగా కాదు కదా... కనీస పోటీదారుగానైనా పరిగణించని దశ నుంచి విజేతగా నిలిచింది.

పునాది అక్కడే...

దాదాపు పదేళ్ల నుంచి విదర్భ క్రమక్రమంగా ఎదుగుతోంది. ఇందుకు పునాది వేసింది బీసీసీఐ, ఐసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన శశాంక్ మనోహర్. ఈయన ఇక్కడివారే కావడంతో తమ ప్రధాన నగరమైన నాగ్‌పూర్‌లోని జామ్‌తాలో అత్యుత్తమ స్టేడియం నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. 2008లో స్టేడియం నిర్మాణం తర్వాత విదర్భ జట్టులో ప్రొఫెషనలిజం మరింత పెరిగింది. జూనియర్ స్థాయి క్రికెటర్లకు మంచి అవకాశాలు వచ్చాయి. వారిలో ప్రతిభ గలవారంతా రంజీ స్థాయి వరకు దూసుకొచ్చారు. ఇది జట్టుగా విదర్భకు ఎంతో మేలు చేసింది.

రాతమార్చింది వారే...

చంద్రకాత్ పండిట్, వసీం జాఫర్... భారత జట్టు మాజీ ఆటగాళ్లైన ఈ ముంబైకర్లు విదర్భ తాజా ప్రదర్శనలో కీలక పాత్ర పోషించారు. ఆటగాడిగా, కోచ్‌గా ముంబై రంజీ ట్రోఫీలు గెలవడంలో కీలక పాత్ర పోషించిన చంద్రకాంత్‌ను కొన్ని కారణాలతో గత సీజన్ తర్వాత ముంబై తప్పించింది. ఆ కసినంతా అతను విదర్భను తీర్చిదిద్దడంపై చూపాడు. ఆటగాళ్లను ప్రోత్సహించడం, జట్టులో స్ఫూర్తినింపడంతో పాటు టైటిల్ గెలవాలన్న కోరికను మొదటి రోజు నుంచే నూరిపోశాడు. ఫైనల్లో 7వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన వాడ్కర్ అద్భుత శతకం చేయడం, తమకంటే మెరుగైన కర్ణాటకను తీవ్ర ఉత్కంఠ మధ్య సెమీఫైనల్లో ఓడించిన తీరే విదర్భ మనోస్థైర్యాన్ని చాటిచెబుతోంది. ఇక ఆటగాడు-ప్రేరకుడిగా జట్టులోకి వచ్చిన వసీం జాఫర్, అయిదు శతకాలు చేసిన కెప్టెన్ ఫజల్ కీలక సమయాల్లో రాణించి తమ అనుభవానికి సార్థకత చేకూర్చారు.

గెలుపు గుర్రం గుర్బానీ...

27... క్వార్టర్స్, సెమీస్, ఫైనల్స్‌లో పేసర్ రజనీష్ గుర్బానీ తీసిన వికెట్లు. ఇదే సమయంలో జట్టులోని మిగతా బౌలర్లు తీసిన వికెట్లు 32 కావడం గమనార్హం. ముఖ్యంగా సెమీస్, ఫైనల్స్‌లో అదరగొట్టి తురుపుముక్కగా నిలిచాడు. మూడు నాకౌట్ మ్యాచ్‌ల్లోనూ ఇతడే 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' కావడం విశేషం. ఈ జోరు చూస్తే 24 ఏళ్ల గుర్బానీకి ముందుముందు మంచి అవకాశాలు తలుపుతట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

మేల్కొలుపు... ప్రేరణ

కలిసికట్టుగా ఆడితే ఏ జట్టైనా రంజీట్రోఫీని అందుకోవచ్చని విదర్భ విజయం నిరూపించింది. ఇదే సమయంలో అన్ని వనరులూ ఉండి ముందుకెళ్లలేకపోతున్న హైదరాబాద్, ఆంధ్రవంటి జట్లకు ఈ గెలుపు ఓ పాఠమే. మరోవైపు ట్రోఫీని పదులసార్లు సొంతం చేసుకుని రంజీ రారాజుగా పేరొందిన ముంబైని సవాల్ చేసే జట్లు క్రమంగా పెరుగుతున్నాయి. గత ఐదు సీజన్లలో ఒక్కసారి మాత్రమే ఆ జట్టు విజేతగా నిలవడమే ఇందుకు నిదర్శనం.



విదర్భ అద్భుతం

తొలిసారి రంజీట్రోఫీ విజేతగా నిలిచిన జట్టు ● ఫైనల్లో ఢిల్లీపై 9 వికెట్లతో గెలుపు

ఇండోర్: ప్రత్యర్థి ఢిల్లీపై అన్ని విభాగాల్లో ఆధిపత్యం చాటిన విదర్భ తొలిసారి రంజీట్రోఫీ విజేతగా నిలిచింది. ఇక్కడి హోల్కర్ స్టేడియం ఆతిథ్యం ఇచ్చిన ఫైనల్‌ను నాలుగో రోజే ముగించి... ప్రతిష్ఠాత్మక దేశవాళీ కప్‌ను సొంతం చేసుకుంది. తమ జట్టు చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో కీలకమైన 252 పరుగుల ఆధిక్యం సాధించిన విదర్భ... ఢిల్లీని రెండో ఇన్నింగ్స్‌లో 280 పరుగులకే ఆలౌట్ చేసింది. 29 పరుగుల లక్ష్యాన్ని ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది.

నాలుగో రోజు... 14 వికెట్లు

సోమవారం ఆటలో ఏకంగా 14 వికెట్లు పతనమయ్యాయి. ఓవర్‌నైట్ స్కోరు 528/7తో బరిలో దిగిన విదర్భ మరో 19 పరుగులు మాత్రమే జోడించి 547కు ఆలౌటైంది. శతక వీరుడు అక్షయ్ వాడ్కర్ (133) ముందు రోజు స్కోరు వద్దే వెనుదిరిగాడు. సిద్దేశ్ నెరల్ (79), ఆదిత్య ఠాకరే (0)లను నవదీప్ సైనీ (5/135) అవుట్ చేశాడు. అనంతరం భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ ఏమాత్రం ప్రతిఘటన చూపలేకపోయింది. ఓపెనర్ చండేలా (9) త్వరగానే నిష్క్రమించగా ఊపుమీద కనిపించిన గౌతమ్ గంభీర్ (36) అంపైర్ తప్పుడు నిర్ణయానికి బలయ్యాడు. ఈ దశలో ధ్రువ్ షోరే (62), నితీశ్ రాణా (64) మూడో వికెట్‌కు 114 పరుగులు జోడించారు. స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ అవుటయ్యాక ఢిల్లీ కోలుకోలేకపోయింది. కెప్టెన్ రిషభ్ పంత్ (32), వికాస్ మిశ్రా (34) సహా మరో 91 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. వాఖరే (4/95); ఆదిత్య సర్వతే (3/30); గుర్బానీ (2/92) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు. స్వల్ప లక్ష్యాన్ని అందుకునే క్రమంలో విదర్భ కెప్టెన్ ఫైజ్ ఫజల్ (2) త్వరగానే అవుటైనా... సీనియర్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ (17 నాటౌట్) ఒకే ఓవర్లో నాలుగు బౌండరీలు బాది తమ జట్టుకు మరుపురాని విజయాన్నందించాడు. హ్యాట్రిక్ సహా మొత్తం 8 వికెట్లు తీసిన గుర్బానీకే 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

స్కోర్లు సంక్షిప్తంగా

ఢిల్లీ తొలి ఇన్నింగ్స్ : 295; రెండో ఇన్నింగ్స్ : 280
విదర్భ తొలి ఇన్నింగ్స్ : 547; రెండో ఇన్నింగ్స్ : 32/1

18 రంజీ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకున్న 18వ జట్టు విదర్భ

61 తొలి రంజీ మ్యాచ్ (1957-58) ఆడిననాటినుంచి విజేతగా నిలిచేందుకు విదర్భకు 61 సీజన్లు పట్టింది

9 తొమ్మిదిసార్లు రంజీ నెగ్గిన జట్టులో సభ్యుడు వసీం జాఫర్. 8 సార్లు ముంబై తరఫున , ఈ సారి విదర్భ తరఫున గెలిచాడు

ప్రైజ్‌మనీ కింద విదర్భకు రూ.2 కోట్లు దక్కగా, విదర్భ క్రికెట్ అసోసియేషన్ మరో రూ.3 కోట్లను ప్రోత్సాహకంగా ప్రకటించింది.

ఆ రెండు విజయాలు...

దక్షిణాఫ్రికా గడ్డపై భారత్‌కు చిరస్మరణీయం ● జట్టును గెలిపించిన పేస్ బౌలర్లు

రెండేళ్ల క్రితం భారత పర్యటనకు వచ్చిన దక్షిణాఫ్రికా నాలుగు టెస్టుల సిరీస్‌లో 0–3తో ఓడింది. స్పిన్ పిచ్‌లపై అశ్విన్, జడేజాలను ఎదుర్కోలేక ఆ జట్టు చేతులెత్తేసింది. ఇప్పుడు తగిన రీతిలో బదులివ్వాలని భావిస్తూ పేస్, బౌన్సీ పిచ్‌లను సిద్ధం చేయడంతో పాటు తమ ఫాస్ట్ బౌలర్ల బలాన్ని నమ్ముకుంటోంది. ప్రస్తుత భారత జట్టులో కూడా ఐదుగురు నాణ్యమైన పేసర్లు ఉండటం ఆ జట్టును కొంత సంశయానికి గురి చేస్తోంది. ఎందుకంటే పూర్తిగా ఫాస్ట్ పిచ్ అంటే సీన్ రివర్స్ అయ్యే ప్రమాదం కూడా ఉంది. గతంలో రెండుసార్లు సఫారీలు ఇదే తరహాలో భారత పేసర్ల చేతిలో భంగపడ్డారు. 2006లో శ్రీశాంత్, 2010లో జహీర్ ఖాన్ పచ్చిక వికెట్లపై భారత్‌ను గెలిపించారు. సఫారీ గడ్డపై భారత్ ఆడిన 17 టెస్టుల్లో ఈ రెండింటిలోనే నెగ్గింది. తాజా పర్యటన సందర్భంగా నాటి మ్యాచ్‌లను గుర్తు చేసుకుంటే...



డిసెంబర్ 15-18, 2006 (తొలి టెస్టు - జొహన్నెస్‌బర్గ్)

123 పరుగులతో భారత్ విజయం

టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. షాన్ పొలాక్ (4/39), ఎన్తిని (3/57) చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 249 పరుగులకే ఆలౌటైంది. గంగూలీ (51 నాటౌట్) అర్ధ సెంచరీ చేయగా, సచిన్ (44) ఫర్వాలేదనిపించాడు. అనంతరం దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 84 పరుగులకే కుప్పకూలింది. ప్రిన్స్ (24) టాప్ స్కోరర్ కాగా, మరో ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. శ్రీశాంత్ (5/40) నిప్పులు చిమ్మే బౌలింగ్‌తో సఫారీల పని పట్టగా, జహీర్ 2 కీలక వికెట్లతో అండగా నిలిచాడు. ఆ తర్వాత భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 236 పరుగులే చేయగలిగింది. వీవీఎస్ లక్ష్మణ్ (73) అర్ధసెంచరీ మినహా మిగతావారంతా విఫలమయ్యారు. ఈసారి దక్షిణాఫ్రికా బౌలర్లలో పొలాక్, ఎన్తిని, ఆండ్రూ నెల్ తలా 3 వికెట్లు పంచుకున్నారు. 402 పరుగుల భారీ విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టుకు దానిని ఛేదించడం సాధ్యం కాలేదు. ఆష్వెల్ ప్రిన్స్ (97) ఒంటరి పోరాటానికి అండగా నిలిచేవారు లేకపోయారు. దాంతో టీమ్ 278 పరుగులకు ఆలౌటై పరాజయం చవి చూసింది. శ్రీశాంత్, జహీర్ చెరో 3 ప్రధాన వికెట్లతో కదం తొక్కగా, కుంబ్లే మరో 3 వికెట్లు పడగొట్టాడు. మ్యాచ్‌లో 8 వికెట్లతో సత్తా చాటిన శ్రీశాంత్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం లభించింది. ఈ పర్యటనను భారీ విజయంతో జోరుగా ప్రారంభించిన భారత్ ఆ తర్వాత దానిని కొనసాగించలేకపోయింది. రెండు, మూడు టెస్టులలో ఓడి చివరికి 1–2తో సిరీస్‌ను కోల్పోయింది.

డిసెంబర్ 26-29, 2010 (రెండో టెస్టు - డర్బన్)

87 పరుగులతో భారత్ విజయం





టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. డేల్ స్టెయిన్ (6/50) చెలరేగడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 205 పరుగులకే ఆలౌటైంది. వీవీఎస్ లక్ష్మణ్ (38)దే అత్యధిక స్కోరు. మోర్కెల్, సోట్సోబ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం దక్షిణాఫ్రికాకు మన బౌలర్ల దెబ్బ తెలిసింది. ఆ జట్టు సొంతగడ్డపై 37.2 ఓవర్లలో కేవలం 131 పరుగులకే కుప్పకూలింది. ఆమ్లా (33) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆరంభంలోనే ముగ్గురు ప్రధాన బ్యాట్స్‌మెన్‌ను అవుట్ చేసిన జహీర్ ఖాన్ దక్షిణాఫ్రికా వెన్నువిరవగా... డివిలియర్స్‌ను డకౌట్ చేసి శ్రీశాంత్ తాను ఓ చేయి వేశాడు. హర్భజన్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో కూడా దాదాపు తొలి ఇన్నింగ్స్ తరహా ప్రదర్శనే కనబర్చింది. 228 పరుగులకు జట్టు ఆలౌటైంది. లక్ష్మణ్ (96) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. మోర్కెల్, సోట్సోబ్ చెరో 3 వికెట్లు తీయగా, స్టెయిన్‌కు 2 వికెట్లు దక్కాయి. విజయం కోసం 303 పరుగుల లక్ష్యం సఫారీ ఎదురుగా నిలిచింది. అయితే మళ్లీ జహీర్ (3/57), శ్రీశాంత్ (3/45) చెలరేగి ప్రత్యర్థిని చుట్టేశారు. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 215 పరుగులకు ఆలౌటైంది. ఆష్వెల్ ప్రిన్స్ (39 నాటౌట్)దే అత్యధిక స్కోరు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ కీలక ప్రదర్శన కనబర్చిన లక్ష్మణ్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఓడిన భారత్....తాజా విజయంతో సిరీస్‌ను 1–1తో సమం చేసింది. దీని తర్వాత కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టు డ్రాగా ముగియడంతో సిరీస్ కోల్పోకుండా భారత్ సగర్వంగా తిరిగొచ్చింది.

బెంగళూర్ 6, ముంబై మైనస్ 1

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్


కిర్‌స్టీ గిల్మోర్

లక్నో: బెంగళూరు 'బ్లాస్టింగ్'కు ముంబై రాకెట్స్ తేలిపోయాయి. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో ముంబై మైనస్ పాయింట్ల తేడాతో చిత్తుచిత్తుగా ఓడింది. ఇక్కడి బాబు బనారసి దాస్ బ్యాడ్మింటన్ అకాడమీలో సోమవారం జరిగిన పోరులో బెంగళూరు బ్లాస్టర్స్ 6-(-1) తేడాతో ముంబైపై అసాధారణ విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్, పురుషుల డబుల్స్, సింగిల్స్ ఇలా ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ బెంగళూరు క్రీడాకారులే సత్తాచాటారు. ప్రత్యర్థి ఆటగాళ్లను వరుసబెట్టి ఓడించారు. మొదట జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి-కిమ్ సా రంగ్ జోడి 15–8, 10–15, 15–10తో ఎం.ఆర్. అర్జున్-గ్యాబ్రియెలా స్టొయెవా (ముంబై)పై గెలుపొందింది. మహిళల సింగిల్స్‌లో కిర్‌స్టీ గిల్మోర్ 15–14, 15–8తో బీవెన్ జంగ్ (ముంబై)ను కంగుతినిపించింది. పురుషుల సింగిల్స్‌ను బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకుంది. ఇందులో ప్రపంచ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్సన్ 15–6, 15–13తో సన్ వాన్ హో (ముంబై)పై గెలవడంతోనే బెంగళూరు బ్లాస్టర్స్ 4–0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. తర్వాత మ్యాచ్‌ల్లోనూ బెంగళూరు ప్లేయర్లు పట్టు సడలించకపోవడంతో ముంబైకి కష్టాలు తప్పలేదు. రెండో పురుషుల సింగిల్స్ ముంబైకి ట్రంప్ కాగా ఇందులోనూ సమీర్ వర్మ 15–9, 8–15, 6–15తో చోంగ్ వీ ఫెంగ్ (బెంగళూరు) చేతిలో కంగుతిన్నాడు. చివరి పురుషుల డబుల్స్‌లో మథియాస్ బోయె-కిమ్ సా రంగ్ ద్వయం 9–15, 15–10, 15–14తో లీ యంగ్ డే-బూన్ హియోంగ్ తన్ (ముంబై) జంటపై గెలిచింది. నేడు (మంగళవారం) జరిగే పోరులో అవధ్ వారియర్స్‌తో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ తలపడనుంది.

ముంబైతోనే రోహిత్, పాండ్యా

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ముగ్గురు కీలక ఆటగాళ్లను కొనసాగించడం దాదాపుగా ఖాయమైంది. మూడు టైటిల్స్ అందించిన కెప్టెన్ రోహిత్ శర్మను మరో ఆలోచన లేకుండా ముంబై అట్టి పెట్టుకోనుంది. అతనితో పాటు పాండ్యా సోదరులను కూడా రిటెయిన్ చేసుకునే అవకాశం ఉంది. స్టార్ ఆల్‌రౌండర్‌గా ఎదిగిన హార్దిక్ పాండ్యాతో పాటు 2017 ఫైనల్లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా నిలిచిన కృనాల్ పాండ్యాను కూడా ముంబై కొనసాగించనుంది. పొలార్డ్, జస్‌ప్రీత్ బుమ్రాలను 'రైట్ టు మ్యాచ్' ద్వారా జట్టులోకే తీసుకునేందుకు వ్యూహాలు రచిస్తోంది. టీమ్‌లో ఇద్దరు అంతర్జాతీయ క్రీడాకారులను రిటెయిన్ చేసుకుంటే రూ. 21 కోట్లు (12.5+ 8.5), ముగ్గురిని రిటెయిన్ చేసుకుంటే రూ. 33 కోట్లు (15+11+7) చెల్లించాల్సి ఉంటుంది. అందుకే ముంబై ఇండియన్స్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంకా అరంగేట్రం చేయని కృనాల్‌ను రూ. 3 కోట్లకే తమతో కొనసాగించుకునేందుకు సిద్ధంగా ఉందని బీసీసీఐ అధికారి ఒకరు వివరించారు.

కివీస్, విండీస్ రెండో టి20 వర్షార్పణం

మౌంట్ మాంగనీ: కివీస్ ఓపెనర్ మున్రో (23 బంతుల్లో 66; 11 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపులు చినుకుల్లో కలిసిపోయాయి. వెస్టిండీస్‌తో సోమవారం జరిగిన రెండో టి20 మ్యాచ్ వర్షంతో రద్దయింది. వర్షంతో ఆలస్యంగానే ప్రారంభమైన ఈ మ్యాచ్ ఎంతో సేపు సాగలేదు. మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ ఆట నిలిచే సమయానికి 9 ఓవర్లలో 4 వికెట్లకు 102 పరుగులు చేసింది. మున్రో 18 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. కాట్రెల్, బద్రీ, నర్స్, విలియమ్స్ తలా ఒక వికెట్ తీశారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ 1–0తో ఆధిక్యంలో ఉంది.

రామ్‌కుమార్ శుభారంభం



పుణే: టాటా ఓపెన్ ఏటీపీ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత ఆశాకిరణం రామ్‌కుమార్ రామనాథన్ శుభారంభం చేశాడు. 148వ ర్యాంకర్ రామ్‌కుమార్ తొలి రౌండ్లో 7–6 (7/4), 6–2తో తనకన్నా మెరుగైన కార్బలెస్ బయెనా (స్పెయిన్; 106వ ర్యాంకు)ను కంగుతినిపించాడు. మంగళవారం జరిగే రెండో రౌండ్లో అతనికి క్లిష్టమైన ప్రత్యర్థి ఎదురయ్యాడు. ప్రపంచ ఆరో ర్యాంకర్, టోర్నీ ఫేవరెట్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)తో రామ్‌కుమార్ తలపడనున్నాడు. డబుల్స్‌లో హైదరాబాద్ ఆటగాడు విష్ణువర్ధన్ జోడీకి తొలిరౌండ్లోనే చుక్కెదురైంది. వైల్డ్‌కార్డ్ ఎంట్రీ పొందిన విష్ణువర్ధన్-శ్రీరామ్ బాలాజీ జోడీ 6-3, 6-7 (6/8), 6–10తో అదిల్ షమస్దిన్(కెనడా)-నీల్ స్కుప్‌స్కీ (అమెరికా) జంట చేతిలో ఓడింది.

S & D

10న పీఎస్ఎల్వీ సీ40 ప్రయోగం

ఈ రాకెట్ ద్వారా 30 ఉపగ్రహాలను నింగిలోకి పంపనున్న ఇస్రో



శ్రీహరికోట (సూళ్లూరుపేట): ఈ నెల 10న పీఎస్ఎల్వీ సీ40 ప్రయోగాన్ని చేపట్టేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సన్నాహాలు చేస్తోంది. సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్‌ను రోదసీలోకి పంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గత నెల 10 నుంచి పీఎస్ఎల్వీ సీ40 క్యాంపెయిన్‌ను ప్రారంభించి నాలుగు దశల రాకెట్ అనుసంధాన పనులను పూర్తి చేసింది. డిసెంబర్ ఆఖరి వారంలో ప్రయోగించాలని తొలుత నిర్ణయించినా, రాకెట్‌కు సంబంధించిన కొన్ని విడిభాగాలు షార్‌కు చేరుకోకపోవడంతో జనవరికి వాయిదా వేశారు. ఈ రాకెట్ ద్వారా 30 ఉపగ్రహాలను రోదసీలోకి పంపుతున్నారు. ఇందులో దేశీయ అవసరాల కోసం కార్టోశాట్–2 సిరీస్‌లో ఓ ఉపగ్రహం ఉండగా, మిగిలిన 29 విదేశాలకు చెందినవే. గతేడాది ఆగస్టు 31న నిర్వహించిన పీఎస్ఎల్వీ సీ39 ప్రయోగం విఫలం కావడంతో, ఈసారి ఎలాంటి తప్పిదాలకు చోటివ్వకుండా శాస్త్రవేత్తలు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



హాహాహా.. హీహీహీ..

అచ్చం టామ్ అండ్ జెర్రీలోని జెర్రీలాగ నవ్వులు చిందిస్తున్న ఈ మూషిక చిత్రం.. 2017 కామెడీ వైల్డ్ లైఫ్ అవార్డ్సులో టాప్ ప్రైజును ఎగరేసుకుపోయింది. పూలగుత్తి మీద కూర్చున్న ఈ చిట్టెలుక చిత్రాన్ని ఇటలీకి చెందిన ఆండ్రియా తీశారు. 86 దేశాల నుంచి 3,500 ఎంట్రీలు రాగా.. ఈ ఫొటో మొదటి స్థానాన్ని దక్కించుకుంది.

బెంగళూరులో మళ్లీ కీచకపర్వం



వాగ్వాదానికి దిగిన యువకులు

సాక్షి, బెంగళూరు: బెంగళూరులో మళ్లీ కీచకపర్వం కొనసాగింది. నూతన సంవత్సర వేడుకల్లో మద్యం మత్తులో యువకులు విచక్షణ మరిచిపోయారు. గతేడాది మాదిరే ఈ సారి కూడా యువతులతో అసభ్యంగా ప్రవర్తించారు. నూతన సంవత్సరం సందర్భంగా గతేడాది బెంగళూరులో యువతులపై పెద్ద ఎత్తున లైంగిక వేధింపులు జరగడం, దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఆదివారం అర్ధరాత్రి బెంగళూరు నడిబొడ్డున ఎంజీ రోడ్, బ్రిగేడ్ రోడ్డులో పెద్ద ఎత్తున యువతీయువకులు చేరి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఇళ్లకు తిరిగి వెళ్లే సమయంలో తాగిన మత్తులో కొంతమంది యువకులు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

అమ్మాయి కాళ్లు పట్టించిన ఖాకీలు

విదేశీ వనితను అదేపనిగా తాకేందుకు యత్నించిన ఓ యువకుడిని పోలీసులు పట్టుకుని ఆ యువతికి క్షమాపణ చెప్పాలని కోరారు. మొదట నిరాకరించిన యువకుడు, అటుపై క్రిమినల్ కేసు పెడతామని పోలీసులు హెచ్చరించడంతో యువతి కాళ్లపై పడి క్షమాపణ కోరాడు. మరో ఘటనలో భర్త ఎదురుగానే అతడి భార్యతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఎలాంటి అసాంఘిక సంఘటనలు జరగలేదని రాష్ట్ర హోంశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. మద్యం మత్తులో కొంతమంది మాత్రం దురుసుగా ప్రవర్తించారని చెప్పారు.

అయిన వారికే స్పెషల్ జీవోలు

- కాని వారికి వాయిదాలు
- ప్రభుత్వాల తీరుపై పిల్ కమిటీ ఆక్షేపణ
- అత్యధికంగా తెలంగాణలో 2,003 కేసులు పెండింగ్
- ఆంధ్రప్రదేశ్‌లో 1,029 కేసులు పెండింగ్



సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రాజెక్టుల కోసం.. పరిశ్రమల కోసం పెద్ద ఎత్తున భూములు సేకరిస్తున్న తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, కావాల్సిన వారి కోసం స్పెషల్ జీవోలు జారీ చేస్తూ, మిగిలిన వారి విషయంలో వాయిదాలు కోరుతుండటాన్ని ఉమ్మడి హైకోర్టు పిల్ కమిటీ ఆక్షేపించింది. ప్రభుత్వాలు నామమాత్రంగా పరిహారం చెల్లిస్తుండటంతో బాధితులు కోర్టులను ఆశ్రయించి పరిహారం పెంపు ఉత్తర్వులు పొందుతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో బాధితులు విధిలేని పరిస్థితుల్లో మరోసారి కోర్టుల గడప తొక్కాల్సి వస్తున్న విషయాన్ని గమనించింది. ఈ నేపథ్యంలో పరిహారం పెంపు నిమిత్తం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ బాధితులు పెద్ద సంఖ్యలో ఎగ్జిక్యూషన్ పిటిషన్లు (ఈపీ) దాఖలు చేస్తుండటం, ప్రభుత్వాలు పదే పదే వాయిదాలు కోరుతుండటం.. కింది కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య పెరిగిపోవడానికి కారణంగా గుర్తించింది. ఈపీల పెండింగ్ విషయాన్ని ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.వెంకటకృష్ణయ్య ఓ లేఖ ద్వారా ఉమ్మడి హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ లేఖను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ ప్రజా ప్రయోజన వ్యాజ్య (పిల్) కమిటీకి పంపారు. ఈ లేఖను పరిశీలించిన పలువురు న్యాయమూర్తులతో కూడిన పిల్ కమిటీ, సమస్య తీవ్రతను అర్థం చేసుకుంది. అంతేకాక కావాల్సిన వారికి ప్రభుత్వాలు స్పెషల్ జీవోలు జారీ చేస్తున్న విషయాన్ని కూడా గమనించింది.

వాయిదాల వల్లే పెండింగ్ కేసులు: పిల్ కమిటీ వెంటనే ఉభయ రాష్ట్రాల్లోని అన్ని జిల్లా కోర్టుల నుంచి పెండింగ్‌లో ఉన్న ఈపీ వివరాలను తమ రిజిస్ట్రీ ద్వారా తెప్పించింది. ఈపీల విషయంలో ప్రభుత్వాలు పదే పదే వాయిదాలు కోరుతుండటం వల్లే పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయని అభిప్రాయపడింది. పరిహారం పెంపు ఉత్తర్వుల విషయంలో ప్రభుత్వాలకు విధానపరంగా ఏకరూపత లేకపోవడాన్ని కమిటీ ఎత్తిచూపింది. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మహబూబ్‌నగర్ ప్రధాన జిల్లా జడ్జి లేఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)గా పరిగణించాలని సిఫారసు చేసింది.

ఏసీజే విచారణ: అదే లేఖను పిల్‌గా పరిగణించిన ఏసీజే ఇటీవల విచారణ జరిపారు. ఉభయ రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం నిప్పులు చెరిగింది. ప్రభుత్వాల పనితీరు ఇలాగే కొనసాగితే, భూ సేకరణ ప్రక్రియను నిలిపేస్తామని స్పష్టం చేసింది. ముందు పరిహారం చెల్లించిన తరువాతే భూ సేకరణ చేయాలని ఆదేశాలు జారీ చేస్తామని కూడా హెచ్చరించింది. అసలు ఉభయ రాష్ట్రాల్లో ఎన్ని ఈపీలు పెండింగ్‌లో ఉన్నాయి.. ఎన్ని కేసుల్లో కోర్టులు నిర్ణయించిన పరిహారం చెల్లించారు.. ఎంత పరిహారం చెల్లించారు.. తదితర వివరాలను తమ ముందుంచాలని ఉభయ ప్రభుత్వాలను ఆదేశించింది. ఇందుకు నాలుగు వారాల గడువునిచ్చింది.

అత్యధిక పెండింగ్ పిటిషన్లు తెలంగాణలోనే: పరిహార పెంపు ఉత్తర్వుల అమలు కోసం బాధితులు దాఖలు చేసిన ఎగ్జిక్యూషన్ పిటిషన్లు అత్యధికంగా తెలంగాణ రాష్ట్రంలోనే పెండింగ్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు సంబంధించి 1,029 కేసులు పెండింగ్‌లో ఉంటే, తెలంగాణలోని 10 జిల్లాలకు సంబంధించి ఏకంగా 2,003 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కోర్టులో అత్యధికంగా 1204 పెండింగ్ కేసులున్నాయి.

వివాదాలకు కేరాఫ్

ఏడాది పాలనలో అనూహ్య, వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

డొనాల్డ్ ట్రంప్.. అమెరికా అధ్యక్షబరిలో నిలిచేంతవరకు సామాన్యులెవరికీ పెద్దగా తెలియని పేరు.. ఇప్పుడు అనవసర వివాదాలకు, అనూహ్య నిర్ణయాలకు, అర్థంలేని ట్వీట్లకు, ప్రమాదకర విధానాలకు మారుపేరు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ త్వరలో సంవత్సర పాలన పూర్తి చేసుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో ఏడాదిగా ఆయన పాలనా తీరు, చుట్టుముట్టిన వివాదాలు, నిర్ణయాలపై విశ్లేషణ..



కొరియాతో కొరివి



అమెరికా, మిత్రపక్షాలపై బెదిరింపులకు పాల్పడితే ఉత్తర కొరియాను ఉనికిలో లేకుండా చేస్తామని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కలకలాన్ని సృష్టించాయి. 'లిటిల్ రాకెట్ మ్యాన్' అంటూ కిమ్ జోంగ్‌ను రెచ్చగొట్టి.. ఉత్తరకొరియాతో కయ్యానికి కాలు దువ్వారు. అమెరికా ప్రధాన భూభాగంపై క్షిపణి దాడులు చేయగల సామర్థ్యం ఇప్పుడు ఉత్తర కొరియా సొంతం. ఆ దేశంతో జాగ్రత్తగా ఉండాలని గతంలో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హెచ్చరికల్ని ట్రంప్ పెడచెవిన పెట్టారు. 2018లో అమెరికాకు ఉత్తరకొరియా, ఇరాన్‌ల నుంచి ప్రమాదం పొంచి ఉందని ఉన్నతాధికారుల నివేదిక కూడా వెల్లడించింది.

ఉద్వాసనల పర్వం

ప్రభుత్వ వ్యవహారాల్లో ట్రంప్ దుందుడుకు వైఖరి, వివాదాస్పద నిర్ణయాలతో పలువురు ఉన్నతోద్యోగులు తమ దారి తాము చూసుకుంటున్నారు. ఏడాది కూడా ముగియకుండానే కీలక పదవుల్లోని పలువురు ఉద్వాసనకు గురికాగా.. మరికొందరు ట్రంప్ వ్యవహారశైలి నచ్చక రాజీనామాలు సమర్పించారు. ఎఫ్‌బీఐ డైరెక్టర్ జేమ్స్ కోమి, జాతీయ భద్రతా సలహాదారు మైక్ ఫ్లిన్ మొదలుకుని, వైట్‌హౌస్ మీడియా ప్రతినిధి షాన్ స్పైసర్ తదితరులు పదవుల నుంచి వైదొలిగారు.

మిత్రులపైనా విమర్శలు





ఇస్లామిక్ తీవ్రవాదంపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ట్వీటర్‌లో బ్రిటన్ ప్రధాని థెరెసా మే, జర్మనీ చాన్స్‌లర్ ఎంజెలా మెర్కెల్‌లపై ట్రంప్ విమర్శలు చేశారు. పొరుగున ఉన్న కెనడా, మెక్సికోలతో ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (నాఫ్టా) పనికి మాలినదని, దానిని సమీక్షిస్తామని ట్రంప్ ప్రకటించారు. మరోవైపు జెరూసలేంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం పెద్ద వివాదానికి తెరతీసింది. దాదాపు ఏడు దశాబ్దాలుగా అమెరికా అనుసరిస్తున్న శాంతియుత వైఖరికి భిన్నంగా తన నిర్ణయంతో అరబ్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేశారు.

వెంటాడుతున్న రష్యా జోక్యం..



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు అనుకూలంగా రష్యా జోక్యంపై ఆరోపణల్ని విచారించేందుకు ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్ రాబర్ట్ ముల్లర్ నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటైంది. ట్రంప్ ప్రచార బృందం మాజీ మేనేజర్ పాల్ మనఫోర్ట్ ప్రమేయంపై ఆధారాలు లభించాయి. మనఫోర్ట్, అతని సహాయకుడు రిక్ గేట్స్‌లపై దేశ వ్యతిరేక కుట్ర, మనీ ల్యాండరింగ్, ఇతర ఆర్థిక ఆరోపణల్ని నమోదుచేశారు. రష్యా అధికారులతో సంబంధాలపై ఎఫ్‌బీఐకి తప్పుడు సాక్ష్యమిచ్చినట్లు ట్రంప్ ప్రచార బృందం సభ్యుడు జార్జి పపడొపొలోస్ అంగీకరించారు. రష్యాతో తనకు ఎలాంటి రహస్య ఒప్పందం లేదని ట్రంప్ స్పందించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని పరోక్షంగా ముల్లర్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

'మీ టూ'లో లైంగిక ఆరోపణలు

రాజకీయాల్లోకి రావడానికి కొన్నేళ్ల ముందు ట్రంప్ తమను లైంగికంగా వేధించారని పలువురు మహిళలు ఆరోపించారు. అమెరికాలో ఉన్నతస్థానాల్లోని వ్యక్తులు లైంగిక వేధింపులకు పాల్పడటంపై 'మీ టూ' పేరిట సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున మహిళలు గళమెత్తారు. జెస్సికా లీడ్స్, రేచల్ క్రూక్స్, సమంతా హోల్వేలు ట్రంప్‌పై తమ ఆరోపణల చిట్టా విప్పారు. ట్రంప్ రాజీనామా చేయాలని, ఆరోపణలపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని అమెరికా కాంగ్రెస్‌లోని 58 మంది డెమొక్రటిక్ సభ్యులు డిమాండ్ చేశారు. ట్రంప్ మాత్రం ఈ ఆరోపణల్ని తోసిపుచ్చారు.

- సాక్షి నాలెడ్జ్ సెంటర్

సౌదీ, యూఏఈలో తొలిసారి వ్యాట్

దుబాయ్: ఇంతవరకూ పన్ను రహిత దేశాలుగా పేరుపడ్డ సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లు గల్ఫ్‌లో తొలిసారి విలువ ఆధారిత పన్ను(వ్యాట్)ను జనవరి 1 నుంచి అమల్లోకి తెచ్చాయి. సౌదీ అరేబియా కొత్త సంవత్సర కానుకగా.. పెట్రోల్ ధరల్ని అమాంతం 127 శాతం పెంచింది. ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రపంచ ధరల్లో మాంద్యం కారణంగా ఏర్పడ్డ బడ్జెట్ లోటును పూడ్చుకునేందుకు గత రెండేళ్లుగా గల్ఫ్‌లోని ముడిచమురు ఉత్పత్తి దేశాలు చర్యలు కొనసాగిస్తున్నాయి. అందులో భాగంగానే తాజాగా వ్యాట్‌ను అమల్లోకి తెచ్చారు. అధిక శాతం వస్తువులు, సేవలకు వర్తించే ఐదు శాతం అమ్మకం పన్నుతో రెండు ప్రభుత్వాలు 2018లో 21 బిలియన్ డాలర్లు వసూలు చేయవచ్చని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

ఐఐఎంల్లో ఇకపై డిప్లొమాలకు బదులుగా డిగ్రీలు

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లకు మరింత స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న ఐఐఎం బిల్లు–2017కు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం ఆమోదం తెలిపారు. ఈ చట్టం కింద ఐఐఎంలు ఇకపై విద్యార్థులకు డిప్లొమాలకు బదులుగా డిగ్రీలు ప్రదానం చేయవచ్చని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు. ఈ బిల్లును గతేడాది జూలైలో లోక్‌సభ, డిసెంబర్‌లో రాజ్యసభ ఆమోదించాయని వెల్లడించారు. తాజా చట్టం కింద ఐఐఎంల నిర్వహణ, బోధనా సిబ్బందితో పాటు డైరెక్టర్ల నియామకంలో సదరు సంస్థలకు మరింత స్వయం ప్రతిపత్తిని కల్పించినట్లు స్పష్టం చేశారు. ఈ చట్టం ప్రకారం ప్రతి ఐఐఎంకు 19 మంది సభ్యులతో కూడిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ (బీవోజీ) ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

కోస్టారికాలో కుప్పకూలిన విమానం

12 మంది దుర్మరణం

శాన్‌జోస్: ఒకే ఇంజిన్ ఉన్న సెస్నా విమానం కూలిపోవడంతో ఇద్దరు పైలెట్లతో పాటు 10 మంది అమెరికన్లు ప్రాణాలు కోల్పోయిన ఘటన కోస్టారికాలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. పుత్నాఇస్లిట నుంచి శాన్‌జోస్‌కు ఆదివారం సాయంత్రం బయలుదేరిన సెస్నా విమానం గ్వానక్యాస్ట్‌లోని అటవీప్రాంతంలో కూలిపోయిందని కోస్టారికా ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రమాదంలో విమానంలోని వారందరూ చనిపోయినట్లు వెల్లడించింది. మంటల్లో కాలిపోతున్న విమాన శకలాల వీడియోను, ఫొటోల్ని విడుదల చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. మృతులకు సంబంధించి 'నేచర్ ఎయిర్' విమానయాన సంస్థ అందించిన వివరాలు మాత్రమే తమవద్ద ఉన్నారనీ.. వీటి అధికారిక ధ్రువీకరణ కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడించింది. ఈ ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు కోస్టారికా ప్రభుత్వం తెలిపింది.

సొసైటీ కాలేజీలకు పూర్వ వైభవం!

- నుమాయిష్ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి కడియం
- అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేస్తామని వెల్లడి
- పరిశ్రమలకు ఉచిత విద్యుత్ యోచన: మహమూద్ అలీ
- స్టాల్స్ కోసం పది వేల దరఖాస్తులొచ్చాయ్: ఈటల



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉపముఖ్యమంత్రులు కడియం, మహమూద్ అలీ. చిత్రంలో ఈటల

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యాప్తికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందని, ఎగ్జిబిషన్ సొసైటీ కింద నడిచే కళాశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సోమవారం 78వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కడియం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ సొసైటీ కింద పని చేసే విద్యా సంస్థలను పటిష్టం చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ కింద పనిచేసే 18 కళాశాలల్లో ఒకటి, రెండు మినహా అన్నీ బ్రహ్మాండంగా కొనసాగుతున్నాయని చెప్పారు. సొసైటీ ఆదాయంతో నడిచే కళాశాలలను ప్రభుత్వం నడిపించేందుకు సిద్ధంగా ఉందన్నారు. సొసైటీ అంగీకరిస్తే ప్రభుత్వమే ఖాళీగా ఉన్న అధ్యాపకుల భర్తీ, కనీస సదుపాయాల కల్పన చేపడుతోందన్నారు. కళాశాలలను ప్రభుత్వానికి ఇచ్చేందుకు ఇష్టంగా లేకుంటే అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయడానికైనా ప్రతిపాదనలు పంపాలని కోరారు.

స్టాల్స్ సంఖ్య పెంచుతాం: ఈటల

స్టాల్స్ నిర్వహణ కోసం దరఖాస్తులు విపరీతంగా వస్తున్నాయని, ఈ సారి పది వేల దరఖాస్తులు వచ్చాయని సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో స్టాల్స్ సంఖ్యను పెంచే ప్రయత్నం చేస్తామన్నారు. 70 శాతం స్టాల్స్ నిర్వాహకులు వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించుకునేందుకు మూడు తరాలుగా వస్తున్నారని చెప్పారు. ఈ సొసైటీ కింద 18 కళాశాలలు కొనసాగుతున్నాయని, విద్యా సంస్థల నిర్వహణ కోసం పాటుపడుతున్న ఎగ్జిబిషన్ లీజు 50 సంవత్సరాల పాటు పర్మినెంట్‌గా కొనసాగించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. నుమాయిష్ హెరిటేజ్ ఈవెంట్ లాంటిదని ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఎన్‌వీఎన్ చార్యులు అన్నారు. సందర్శకులకు ఉచిత వైఫై సేవలు, ఉచిత పార్కింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నరోత్తమరెడ్డి, సంయుక్త కార్యదర్శి వంశీ తిలక్, కోశాధికారి సి.హెచ్. రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్త గుర్తింపు: మహమూద్ అలీ

అఖిల భారత ప్రదర్శన ప్రపంచవ్యాప్తం గా గుర్తింపును పొందిందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ చెప్పారు. చిన్నతనంలో తన కుటుంబ సభ్యులతో కలసి ఎగ్జిబిషన్‌కు వచ్చేవాడినని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందజేస్తోందన్నారు. పరిశ్రమలకు కూడా ఉచిత విద్యుత్‌ను ఇచ్చే యోచన చేస్తోందన్నారు.



కొత్త సంవత్సరం మొదటి దర్శనం సామాన్యులకే

సాక్షి, తిరుమల: ఆంగ్ల నూతన సంవత్సరం తొలిరోజు సోమవారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి మొదటి దర్శనం సామాన్యులకే దక్కింది. ఆ తర్వాతే వీఐపీలకు దర్శనం కల్పించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం దుర్లభమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆంగ్ల నూతన సంవత్సరంలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్ ముందస్తు చర్యలు తీసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున 1.30 గంటలకు ఆలయంలోని గర్భాలయ మూలమూర్తికి తిరుప్పావై, ధనుర్మాస పూజలు పూర్తి చేశారు. తర్వాత ఉదయం 2.30 గంటలకు సామాన్య భక్తులను శ్రీవారి దర్శనానికి అనుమతించారు. ఉదయం 5.45 గంటలకు వరకు సుమారు 20 వేల మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించారు. కొత్త సంవత్సరంలో తక్కువ సమయంలోనే శ్రీవారిని దర్శించుకుని వెలుపలకు రావటంపై భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. వీఐపీలకు ఉదయం 6గంటల నుంచి శ్రీవారి దర్శనానికి అనుమతించారు. 1,024 టికెట్లు వీరికి జారీ చేయగా గంటన్నరలో దర్శనం పూర్తి చేశారు. తర్వాత సర్వదర్శనం అమలు చేశారు.

నేటి నుంచి యథాతథంగా శ్రీవారి ఆర్జిత సేవలు

వైకుంఠ ఏకాదశి, ద్వాదశితోపాటు కొత్త సంవత్సరం నేపథ్యంలో డిసెంబరు 28 నుంచి జనవరి ఒకటోతేది వరకు రద్దు చేసిన ఆర్జిత సేవలను మంగళవారం నుంచి పునరుద్ధరిస్తున్నారు. ఇదే తరహాలోనే అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో మంగళవారం వేకువజాము 12.01 నుంచి కాలి బాటల్లో నడిచివచ్చే భక్తులకు దివ్యదర్శనం టికెట్లు ఇవ్వనున్నారు. ఇక తిరుమలలో దివ్యాంగులు, వృద్ధులు, చంటి బిడ్డ తల్లిదండ్రుల ప్రత్యేక దర్శనం కూడా పునఃప్రారంభించనున్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District.; Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.